
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00   సంపుటి: 17 సంచిక: 271

SUNDAY Special   ఆదివారం 22-12-2024



'బీడుబడిన తెలంగాణ భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ మహిళలకు ఎదురుందా?

కరీబియన్ జట్టుపై టి20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు విండీస్ అమ్మాయిల జట్టుతో వడోదరలో తొలి మ్యాచ్ ఆడనుంది.

14 లో



చలి చేతికి చిక్కొద్దు!

హౌస్ వైఫ్ డర్మటైటిస్.. ఈ చర్మవ్యాధితో గృహిణులకు పెద్ద సమస్య.. ఇంటి పనుల సందర్భంలో డిటర్జెంట్లు, రసాయనాలను వాడుతుంటారు. అవి తగిలితే చేతులు ఇరిటేషన్‌కు లోనవుతుంటాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

13 లో



బంధం బలోపేతం

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధాని మోదీ శనివారం గల్ఫ్ దేశమైన కువైట్‌కు చేరుకున్నారు.

- వివరాలు 6లో▶



ఏటీఎఫ్‌పై జీఎస్టీకి నో

విమానాల్లో వాడే ఇంధనాన్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడానికి రాష్ట్రాలు అంగీకరించడం లేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.

- వివరాలు 6లో▶



ఎన్నికలు మరింత గోప్యం!

ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు 'ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961'లోని రూల్ 93లో కేంద్ర న్యాయశాఖ సవరణ చేసింది.

- వివరాలు 6లో▶



టార్గెట్ కేజ్రీవాల్!

ఢిల్లీ మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

- వివరాలు 6లో▶

సినిమా వాళ్లు స్పెషలా?

వారిని ప్రత్యేకంగా పరిగణించే చట్టాలేమీ లేవు.. అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

పోలీసులు అనుమతి నిరాకరించినా అల్లు అర్జున్ రోడ్ షో చేశారు

తొక్కిసలాట జరిగి ఒకరు చనిపోయినా.. అభిమానులకు చేతులు ఊపుతూ వెళ్లారు

అరెస్టు కోసం వెళ్లిన పోలీసులతోనూ దురుసుగా ప్రవర్తించారు

- తల్లి చనిపోయి, కొడుకు బ్రెయిన్‌డెడ్ అయినా బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదు
- మానవత్వం లేకుండా వ్యవహరించిన వారిని ఏమనాలి?.. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. కానీ ప్రాణాలు పోతుంటే ఊరుకోవాలా?
- అల్లు అర్జున్‌కు ఏమైనా కాలుపోయిందా, కన్ను పోయిందా?.. ఒక్కరోజు జైలుకెళితేనే అంత మంది పరామర్శించారు
- చావుబతుకుల్లో ఉన్న పిల్లాడిని ఎవరూ పరామర్శించలేదని మండిపాటు
- తొక్కిసలాట ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిని విడిచిపెట్టబోమన్న సీఎం



సాక్షి, హైదరాబాద్: సినిమా వాళ్లకు మానవత్వం లేకపోవడాన్ని ఏమనాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సినీ పరిశ్రమ తీరు అమానవీయమని.. ఎవరి ప్రాణాలైనా పోయిన తర్వాత ప్రత్యేక హక్కు కావాలంటే దొరకదని పేర్కొన్నారు. కేవలం ఒక్కరోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన హీరోను పరామర్శించిన సినీ పరిశ్రమ పెద్దలు... బాధిత కుటుంబీకులను కనీసం పరామర్శించలేదని మండిపడ్డారు. సాధారణ ప్రజల ప్రాణాలు

మిగతా 12వ పేజీలో ▶

> సినీ పరిశ్రమకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అమానవీయంగా వ్యవహరించొద్దు. మీరు సినిమా తీయండి. వ్యాపారం చేసుకోండి. డబ్బులు సంపాదించండి. ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అన్నీ తీసుకోండి. షూటింగ్స్ కోసం ఏమేం కావాలో అదీ తీసుకోండి. అయితే ఎవరిదైనా హత్య జరిగాక, ఎవరిదైనా ప్రాణం పోయాక మాత్రం స్పెషల్ ప్రివిలేజెస్ కోరితే.. అవి ఎట్టిపరిస్థితుల్లోనూ దొరకవు. నేను సీఎం సీట్లో ఉన్నంత వరకూ అది జరగదు. - సీఎం రేవంత్

నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు

థియేటర్ వద్ద ఘటనలో నాపై ఆరోపణలన్నీ నూరు శాతం అబద్ధాలే

మానవత్వంలేని మనిషిగా నన్ను చిత్రీకరించడం బాధించింది

రోడ్ షో, ర్యాలీగా వెళ్లాననడం దారుణం.. అనుమతి లేకుంటే పోలీసులు వెనక్కి పంపేవారుగా?



చిరంజీవి, ఇతర హీరోల అభిమానులు మరణించినప్పుడు పరామర్శించా

నా అభిమాని మరణిస్తే పరామర్శించాలని నాకు ఉండదా?

లీగల్‌గా ఇబ్బంది అవుతుందనే శ్రీతేజ్‌ను పరామర్శించలేకపోయా..

15 రోజులుగా బాధలో ఉన్నా.. పుష్ప–2 విజయోత్సవాలు రద్దు చేసుకున్నా

సీఎం విమర్శల నేపథ్యంలో విలేకరుల సమావేశంలో హీరో అల్లు అర్జున్

బంజారాహిల్స్: పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తాను నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు వస్తున్న ఆరోపణలను హీరో అల్లు అర్జున్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ నూటికి నూరు శాతం అబద్ధాలేనని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సాగుతున్న దుష్ప్రచారంగా అభివర్ణించారు. పోలీసుల అనుమతి లేకుండానే తాను థియేటర్‌కు వెళ్లినట్లు, తొక్కిసలాట అనంతరం పోలీసుల సూచనలు పెడచెవిన పెట్టినట్లు కొంత మంది చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తనను మానవత్వంలేని మనిషిగా చిత్రీకరించడం బాధించిందన్నారు. సమాచార లోపం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. అసెంబ్లీలో

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 28 వరకు ఘోష్ కమిషన్ గడువు



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఫిబ్రవరి 28లోగా విచారణ ముగించి నివేదిక సమర్పించాలని కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. కాగా కమిషన్ గడువును పొడిగించడం ఇది నాలుగోసారి.

- వివరాలు 16లో▶

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.4 వేల కోట్లు



ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యోగ జేఏసీ కార్యాచరణ రూపొందిస్తోందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆర్థికపరమైనవి కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించామన్నారు.

- వివరాలు 16లో▶



రుణమాఫీపై చర్చిద్దాం.. రెడీనా?

సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లిలోనైనా, సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనైనా సరే..
- రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపనకే కమిటీ

2 లో

ఇకపై నో బెనిఫిట్ షోస్

సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

12 లో



◀ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను కేక్ కట్ చేసి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో బిషప్ ఎంఏ డేనియల్, పొన్నం ప్రభాకర్, షబ్బీర్‌అలీ, మహేశ్ గౌడ్ తదితరులు

3లో

ఇందిరమ్మ ఇళ్లలో దళిత క్రైస్తవులకు ప్రాధాన్యత



ధ్యానంతో ఆరోగ్యం, ఆనందం

మానసిక ప్రశాంతతకు చక్కని మార్గం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడి

- గచ్చిబౌలి స్టేడియంలో తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాలు
- ధ్యానంతో ప్రపంచ శాంతి: మంత్రి జూపల్లి

- వివరాలు 16లో▶



దేశానికి మన విత్తన పాదు

రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విత్తన సాగు

7.5 లక్షల ఎకరాల్లో సాగు

3.5 లక్షల మంది రైతుల కృషి

దేశ అవసరాల్లో 55 శాతం విత్తనాలు ఇక్కడి నుంచే..

- వివరాలు 15లో▶

క్లుప్తంగా...

ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్సీలను ఆహ్వానించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు మండలి చైర్మన్ గుత్తా సూచన



సాక్షి, హైదరాబాద్: ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. శనివారం శాసనమండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ మాట్లాడుతూ.. ప్రొటోకాల్, శాసన నియమావళి ప్రకారం సభ్యులను ఎందుకు ఆహ్వానించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాలకు తప్పనిసరిగా ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని శాసన సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రొటోకాల్ నిబంధనల అమలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధి నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

మేం 6 గంటలు... వారు 5 గంటలు

అధికార, విపక్ష సభ్యుల ప్రసంగాలపై మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ప్రజల అవసరాలకు అనుగుణంగా శీతాకాల అసెంబ్లీ సమావేశాలను నిర్వహించామని, ఈ సమావేశాల్లో స్వల్పకాలిక చర్చలు, బిల్లులు, ప్రకటనల ద్వారా పలు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపామని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. గత ఏడాది కాలంగా ఒక్క సస్పెన్షన్ కూడా లేకుండా సభను నిర్వహించడమే తమ చిత్తశుద్ధికి నిదర్శమని, అధికార పార్టీ సభ్యులు ఆరు గంటలపాటు మాట్లాడితే బీఆర్ఎస్ సభ్యులకు ఐదు గంటలు మాట్లాడే అవకాశమిచ్చామని చెప్పారు. శనివారం అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన అనంతరం ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గురుకులాల్లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ అప్పులు, టూరిజం పాలసీ, రైతు భరోసా అంశాలను చర్చించామని, తెలంగాణ తల్లి విగ్రహంపై ముఖ్యమంత్రి ప్రకటన చేశారని చెప్పారు. ఈ సమావేశాల్లోనే మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరుతో చట్ట బద్ధత కల్పించామన్నారు. హైడ్రాపై ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని వివరించామని, ప్రతిపక్షాల అనుమానాలకు సభలో సమాధానమిచ్చామని తెలిపారు. స్పీకర్ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సభను అడ్డుకునే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామని, స్పీకర్‌పై దాడికి యత్నించడం, కాగితాలు చించి విసరడంతో మార్షల్స్‌ను సభలో మోహరించాల్సి వచ్చిందని చెప్పారు. అసెంబ్లీలో సమాధానం చెప్పకుండా తాము పారిపోలేదని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల శిక్షణా తరగతులకు హాజరు కాకుండా బీఆర్ఎస్ పారిపోయిందన్నారు. సభ నిర్వహణపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని, తెల్లవారుజామున మూడు గంటల వరకు కూడా తాము సభ నిర్వహించామని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

రైతు భరోసాపై చర్చించకుండా మండలి వాయిదా

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది సంక్రాంతి నుంచి ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తున్న 'రైతు భరోసా'పై చర్చ జరగకుండానే శాసనమండలి వాయిదా పడింది. శనివారం ఉదయం నుంచి మండలిలో నాలుగు బిల్లులపై సుదీర్ఘ చర్చ జరిగింది. చివరగా రైతుభరోసాపై చర్చ జరపాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి భావించారు. కానీ.. అప్పటికే రాత్రి కావడం, శాసనసభ వాయిదా పడడంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతుభరోసాపై స్వల్పకాలిక చర్చకు ఆసక్తి చూపలేదు. సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ రైతుభరోసాపై సభ్యులకున్న సందేహాలు, అభ్యంతరాలను తనకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

ఇదం జగత్



మళ్లీ ఎలక్షన్ల ముందు వరకూ అధ్యయనం చేసి సిఫారసులు పంపుతాం సార్!!

నేను తొక్కుకుంటూ వచ్చా..

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగం

- నల్లమల నుంచి క్రూరమృగాల మధ్య పెరుగుకుంటూ వచ్చా..
- అయ్య పేరు మీదనో, మామ పేరు మీదనో వచ్చినవాడిని కాదు
- వ్యక్తిగత కోపతాపాలు చూపవద్దని ఇంతకాలం ఓపికతో ఉన్నా..
- నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతూ తప్పుదారి పట్టిస్తున్నారు



అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: "నేను నల్లమల నుంచి వచ్చా. క్రూరమృగాల మధ్య పెరుగుకుంటూ వచ్చా. తొక్కుకుంటూ వచ్చా. ఇక్కడున్నోళ్లను తొక్కితే అక్కడ తేలిన్రు. నేను అయ్య పేరుమీదనో, మామ పేరుమీదనో వచ్చినోడిని కాదు. స్వశక్తిని నమ్ముకొని పైకొచ్చినవాడ్ని. అమెరికాలోనో, గుంటూరులోనో చదువుకున్న చావు తెలివితేటలు వాళ్లకుంటే ఉండొచ్చు. నాకు సామాన్యుడి తెలివితేటలు ఉన్నాయి. నా వ్యక్తిగత కోపతాపాలు చూపవద్దని ఇంతకాలం ఓపికతో ఉన్నా. ఈ ఆర్థిక విధ్వంసకారులను నియంత్రించే శక్తి, క్రూరమృగాలను కూడా బోనులో బంధించే శక్తి నా సభకు, సభ్యులకు ఉంది"అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శాసనసభలో రైతు భరోసాపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. అందులో ముఖ్యాంశాలు రేవంత్ మాటల్లోనే...

"తెలంగాణపై కమిట్‌మెంట్ ఉన్నోళ్లు కూడా కొందరు అటువైపు ఉన్నారు. వారికి చెప్తున్నా.. దొంగలకు సద్దులు మోసేవాళ్ల సావాసం మంచిది కాదు. వాళ్లు ఇదే నగరంలో పుట్టినవారు. హైదరాబాద్ కూడా ఢిల్లీలా కాలుష్యం కోరల్లో చిక్కుకోవాలా? నల్లగొండకు ఫ్లోరైడ్ నుంచి మోక్షం వద్దా? బావాబామ్మర్దులిద్దరూ రండి. నల్లగొండకో, రంగారెడ్డికో, భువనగిరికో, మునుగోడుకో, ఎల్బీనగర్‌కో, సూర్యాపేటకో పోదాం. మూసీ పునరుజ్జీవం చేయాలా? వద్దా? ప్రజలను అడుగుదాం. నేను, రాజగోపాల్‌రెడ్డి గన్‌మన్ లేకుండా వస్తాం.



మీరూ రండి. జనం మధ్యనే తేల్చుకుందాం.

వాళ్లలా ఇస్తే ప్రతిపక్షాల సీట్లలోనే ఉంటాం..

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతు భరోసాకు శ్రీకారం చుట్టింది. దీనిపై ఎవరికీ అనుమానాలు అవసరం లేదు. గత ప్రభుత్వం గొప్పగా చెప్పుకొనే రైతుబంధు కేవలం పెట్టుబడి సహాయ పథకం మాత్రమే. ఆ రూపంలో రూ.72,816 కోట్లు ఇస్తే.. అందులో రూ.22,606 కోట్లు సాగులోనే లేని రాళ్లురప్పలకు, గుట్టలకు, రోడ్లు, రియల్ ఎస్టేట్ భూములు, పరిశ్రమల స్థలాలకు ఆయాచితంగా చెల్లించారు. గిరిజనులకు అందించిన పోడు భూములకు బీఆర్ఎస్ నేతలు నకిలీ పట్టాలు రూపొందించి రైతుబంధు పొందారు. ఇప్పుడు మేం కూడా అలా చెల్లించాలంటూ బీఆర్ఎస్ నేతలు నీతులు చెప్తున్నారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటే మేం ఇక్కడ ఎందుకు కూర్చుంటాం, ప్రతిపక్షాల సీట్లలోనే ఉంటాం కదా. ఇక వారి నేత ఆయన చేసిన అద్భుతాలపై ప్రశ్నిస్తారన్న భయంతో సభకే రావడం లేదు. నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు ఆయన. ఉపాధ్యక్షుడు.. అదే వర్కింగ్ ప్రెసిడెంట్ వచ్చి రైతు ఆత్మహత్యలపై అబద్ధాలు చెప్పారు. ఇక వారు చేసిన రుణమాఫీ వడ్డీలకే మాత్రమే సరిపోయింది. అది కూడా ఔటర్ రింగురోడ్డును తెగనమ్మి రూ.7,500 కోట్లు తెచ్చి రుణమాఫీకి వాడేశారు. మేం కేవలం 27 రోజుల్లో రూ.17,869.21 కోట్లు రుణమాఫీ చేశాం. సాంకేతిక కారణాలతో మాఫీ కాని వారి కోసం నవంబర్‌లో రూ.2,747 కోట్లు విడుదల చేశాం. మొత్తం 25,35,963 మందికి రూ.20,616 కోట్లు మాఫీ చేసి వారి రుణం తీర్చుకున్నాం.

స్విస్ బ్యాంకు కూడా అప్పులిస్తారు..

రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేయలేం. రూ.8 వేల కోట్లు కావాలి. మా దగ్గర నల్లధనం లేదు అని నాటి సీఎం అన్నారు. నల్లధనం ప్రభుత్వం వద్ద లేదేమోగానీ వారి వద్ద ఎందుకుండదు? అంతా అక్కడికే కదా చేరింది. స్విస్ బ్యాంకుకు కూడా అప్పు ఇచ్చే సామర్థ్యం వాళ్లది.

ఆయన కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నా..

గత ప్రభుత్వం చేసిన అప్పులు రూ.7,11,807 కోట్లు. మేం అధికారంలోకి వచ్చాక రూ.1,27,208 కోట్లు అప్పు చేశామంటున్నారు. రెండూ కలిపితే దాదాపు 8.39 లక్షల కోట్లు కావాలి. రెండు రోజుల క్రితం తీసుకున్న లెక్కల ప్రకారం రాష్ట్ర అప్పులు మొత్తం రూ.7,22,788 కోట్లే. 58 ఏళ్లలో 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.72 వేల కోట్లే. గత ప్రభుత్వం చేసిన అప్పులు, బకాయిల భారం లేకపోతే.. మేం అద్భుతాలు సృష్టించి ఉండేవాళ్లం. గత పదేళ్లలో కనీసం హాస్టళ్లకు భవనాలు కూడా కట్టలేకపోయారు. దీనిపై ముక్కు నేలకు రాసి దళిత, గిరిజన, మైనారిటీ పిల్లలకు క్షమాపణ చెప్పాలి. ముఖం చాటేస్తున్న ఆయన సభకు వస్తే అడిగి, కడుగుదామని సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్నా.

అన్నీ అడ్డుకుంటే అభివృద్ధి ఎలా?

నా ప్రాంతం కాకున్నా కొడంగల్‌లో ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు. అక్కడే మళ్లీ గెలిచి సీఎం అయ్యా. ఆ వెనకబడ్డ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవాలనుకున్నా. పరిశ్రమలు తేవాలని నిర్ణయించా. ఓ 50 వేల మందికి ఉద్యోగాలు రావటంతోపాటు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయనుకున్నా. దీన్ని సహించలేని కొందరు డబ్బు, మద్యం పంచి అధికారులపై దాడులు చేయించారు. మూసీ వద్దంటారు, మెట్రో పొడిగిస్తామంటే వద్దంటారు, ఫ్యూచర్ సిటీ అంటే వద్దంటారు, పరిశ్రమలు వద్దంటారు.. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించడం ఎలా సాధ్యం. తెలంగాణ పురోగతిని అడ్డుకునే వాళ్లను ఏం చేయాలో ప్రజలే చెప్పాలి.."అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో భూ భారతియే.. రెఫరెండం

ధరణి పేరిట రాష్ట్రంలో విధ్వంసం జరిగింది: మంత్రి పొంగులేటి

- ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్నంతా జీహెచ్ఎంసీ చేయాలనే ఆలోచన లేదు: దుద్దిళ్ల
- బీసీలకు 42% కోటా అమలుకు కట్టుబడి ఉన్నాం: పొన్నం
- జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీరాజ్, భూ భారతి బిల్లులకు మండలి ఆమోదం



సాక్షి, హైదరాబాద్: ధరణి పేరుతో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే ధరణిని సమూలంగా మార్చి భూ భారతిని తీసుకొస్తున్నట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూ భారతి చట్టం తమకు రెఫరెండమేనని అన్నారు. శనివారం శాసనమండలిలో భూ భారతి బిల్లుపై ఆయన ప్రసంగిస్తూ 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, సంస్కరణలు, చట్టాలు రైతులకు ఎంతో మేలు చేశాయన్నారు. తెలంగాణ ప్రజానీకం తమ భూముల విషయంలో పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలను పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమాధి చేసిందన్నారు. గత పదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, తమది దోచుకునే ప్రభుత్వం కాదని, రైతు ఇంట్లో పండగను తెచ్చే ఇందిరమ్మ రాజ్యమని పొంగులేటి పేర్కొన్నారు. మండలిలో జీహెచ్ఎంసీ, తెలంగాణ మునిసిపాలిటీలు, పంచాయతీరాజ్ సవరణ బిల్లులతో పాటు భూభారతి బిల్లులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ బిల్లులను మండలిలో ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం ఆమోదించారు. అలాగే పంచాయతీరాజ్ సవరణ బిల్లును మంత్రి సీతక్క తరపున పొన్నం ప్రభాకర్, భూ భారతి బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు.

ఒకే కార్పొరేషన్ ఆలోచన లేదు: శ్రీధర్‌బాబు

ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాన్నంతా ఒకే కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) చేయాలనే ఆలోచన ఏదీ ప్రభుత్వానికి లేదని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, మునిసిపాలిటీల సవరణల బిల్లులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలోని చెరువులు, కుంటలను సంరక్షించే ఉద్దేశంతో 'హైడ్రా'ను తీసుకొచ్చామని, చెరువులను ఆక్రమించి, అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను మాత్రమే హైడ్రా కూల్చివేస్తుందని చెప్పారు. హైడ్రా ఒక ప్రత్యేక ఏజెన్సీ అని, జీహెచ్ఎంసీ చేయలేని పనిని ఈ సంస్థ చేస్తుందన్నారు.

50% కోటా పరిమితిని మార్చాలి: పొన్నం

రిజర్వేషన్లు 50 శాతం మించరాదనే నిబంధనలను మార్చాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చిందని, ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉందని అన్నారు. అయితే రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలనే డిమాండ్ తమదని, అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు 50 శాతం అనే పరిమితిని ఎత్తేయాల్సిన అవసరం ఉందన్నారు. కాగా ఈ మూడు బిల్లులపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత, వాణిదేవి, ఎల్.రమణ, ప్రకాశ్ ముదిరాజ్, టి. జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, భాను ప్రకాశ్ రావు, తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై పేటెంట్ వైఎస్ఆర్‌దే

అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- పాలమూరులో ప్రాజెక్టులు కట్టింది వైఎస్ఆరే: జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రైతులకు ఉచిత విద్యుత్ అందించటంపై పేటెంట్ హక్కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రైతు భరోసాపై శాసనసభలో శనివారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. 'ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికల ముందు ఉచిత విద్యుత్ హామీ ఇస్తామంటే సోనియాగాంధీ అభ్యంతరం తెలిపారు. అమలు సాధ్యం కాదన్నారు. వైఎస్ఆర్ ఆమెతో కొట్లాడి మరీ ఉచిత విద్యుత్ పథకం తీసుకొచ్చారు'అని చెప్పారు. ఉచిత విద్యుత్ అంశంపై సభలో కోమటిరెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ మధ్య శనివారం తీవ్ర వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్ పాలనలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చినట్టు కే తారకరామారావు అన్నారు. ఈ పథకాన్ని తెచ్చిందే తాము అని తెలిపారు. రోజూ 19.2 గంటల విద్యుత్ ఇచ్చినట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తున్నట్టు నిరూపిస్తే తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో కోమటిరెడ్డి తీవ్రంగా విభేదించారు. బీఆర్ఎస్ హయాంలో రోజుకు 11 గంటల కరెంట్ కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ప్రాజెక్టులను కట్టింది వైఎస్ఆర్: జూపల్లి

పాలమూరు జిల్లాలో వైఎస్ఆర్ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా కు ప్రాజెక్టులకు ఆయనే నిధులు మంజూరు చేశారన్నారు. ఆ తర్వాత ప్రభుత్వాలు చేసిందేమీ లేదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే రైతుబంధు సకాలంలో ఇవ్వలేకపోయామన్నారు.

రేవంత్ అబద్ధాల నుంచి ప్రజలను దేవుడే కాపాడాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- రుణమాఫీ, రాష్ట్ర అప్పులపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు



సాక్షి, హైదరాబాద్: 'అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన రేవంత్.. వాటితోనే పాలన చేస్తూ, అసెంబ్లీలోనూ అవే కొనసాగిస్తున్నారు. సీఎం రేవంత్ అబద్ధాల నుంచి రాష్ట్ర ప్రజలను దేవుడే కాపాడాలి. రుణమాఫీ, రాష్ట్ర అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు చెప్పిన ప్రభుత్వం.. రైతుభరోసా ఎప్పటి నుంచి అమలు చేస్తుందో చెప్పలేదు. దేవాలయంలా పరిగణించే అసెంబ్లీలో అబద్ధాలు వల్లె వేస్తూ, మొసలి కన్నీరు కారుస్తూ, పూటకో మాటాతో పాలన డ్రామాలా చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలను గాంధీభవన్‌లో కాంగ్రెస్ సమావేశాల తరహాలో నడిపించారు. అసెంబ్లీ వేదికగా మాపై రంకెలు వేసి, మాకు మైక్ ఇవ్వవద్దని చెప్పి పారిపోయారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కడుపులో ఉన్నదంతా కక్కి వెళ్లారు' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు.. ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. శనివారం శాసనసభ వాయిదా అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తాం..

'మూసీ కాలుష్యం, లగచర్ల అంశం, రైతుబంధు, రైతుబీమా.. ప్రతీ అంశంలోనూ సీఎం పచ్చి అబద్ధాలు చెప్తే.. మాకు మాత్రం స్పీకర్ మైక్ ఇవ్వలేదు. కాంగ్రెస్, సీఎం రేవంత్ చేస్తున్న గోబెల్స్ ప్రచారాలను ప్రజల ముందు విప్పి చెప్తాం. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే కాగా కాంగ్రెస్ నుంచి వచ్చిన వారసత్వ అప్పులకు కూడా మేము వడ్డీలు చెల్లించాం'అని హరీశ్‌రావు అన్నారు. 'రేవంత్ నియంతలా వ్యవహరిస్తూ.. కాళేశ్వరం సహా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, పథకాల అమలుపై విషం కక్కుతున్నారు. రైతుబంధు, వృద్ధాప్య పింఛన్లు, బతుకమ్మ చీరలు.. తదితర పథకాలన్నీ ఎగవేసిన చరిత్ర రేవంత్ ప్రభుత్వానిది'అని విమర్శించారు.

మహిళ మరణం బాధాకరం

'సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మరణించడం బాధాకరం. కానీ సీఎం సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో రేవంత్‌రెడ్డి తమ్ముళ్ల వేధింపులతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. వాంకిడి హాస్టల్లో శైలజ అనే గిరిజన విద్యార్థిని విషాహారం తిని నిమ్స్‌లో మరణించినా సీఎం, మంత్రులకు పరామర్శించే తీరిక దొరకలేదు'అని హరీశ్‌రావు అన్నారు.

సభ రోజూ ఆలస్యమేనా?: హరీశ్

ఇదిలా ఉండగా, శాసనసభ రోజూ ఆలస్యంగా మొదలవుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఆయన శనివారం శాసన సభలో మాట్లాడుతూ.. తమ పాలనలో ఎప్పుడూ ఇలా జరగలేదని స్పష్టం చేశారు. సమయ పాలన పాటించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనిపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ, తాను 9.30 గంటలకే అసెంబ్లీకి వచ్చానని చెప్పారు. జీరో అవర్ నిర్వహించాలా? వద్దా? అన్న అంశంపై చర్చించడం వల్లే కొద్ది నిమిషాలు ఆలస్యమైందని తెలిపారు.

కొత్త ఏడాదిలో రైతుభరోసా

అమలుకు చర్యలు తీసుకుంటున్నాం: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి తర్వాత రైతుభరోసా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సబ్ కమిటీ నివేదిక సమర్పించాక దానిపై కేబినెట్‌లో చర్చించి అమలుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రైతు భరోసా అమలుకు ఎలాంటి విధివిధానాలు ఉండాలనే అంశంపైనే చర్చ చేపట్టామని, అంతే తప్ప భరోసా పేరుతో రైతు సాయానికి కోత పెడతామని చెప్పలేదన్నారు. ఇప్పటికే రైతు భరోసా అమలుకు మంత్రివర్గ ఉపసంఘం వేశామని, రాష్ట్రవ్యాప్తంగా అందరి అభిప్రాయాలు తీసుకున్నామని, శాసనసభలో చర్చించి, ఆ మేరకు మార్గదర్శకాలు రూపొందిస్తామన్నారు. శనివారం రైతుభరోసాపై స్వల్పకాలిక చర్చకు మంత్రి సమాధానమిస్తూ...రాబోయే రోజుల్లో పంట బీమా పథకాన్ని కూడా పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతుభరోసా అందించాలని కోరారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ...పంటల బీమాపథకాన్ని పునరుద్ధరించాలని, రైతుల ప్రీమియం మొత్తం ప్రభుత్వమే భరించాలని సూచించారు.

సంక్రాంతి కల్లా తుది నిర్ణయం: సీఎం

శాశ్వత ప్రాతిపదికన పండ్ల మార్కెట్ నిర్మాణమయ్యే దాకా ప్రస్తుతమున్న చోటే (కొత్తపేటలోనే) దానిని కొనసాగించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ కోరారు. మాజీ సీఎం కేసీఆర్ గతంలో సభలో దీనిపై సానుకూలంగా స్పందిస్తూనే ఆచరణలో ఎలాంటి చర్యలు తీసుకోకపోగా దానిపై స్టే వచ్చేలా సహకరించారని వ్యాఖ్యానించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ... ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉన్నందున, అడ్వొకేట్ జనరల్‌తో మాట్లాడి పరిష్కారానికి ఏదైనా మార్గం ఉందేమో చూస్తామని చెప్పారు.

ఆదివాసీ బిడ్డలను ఐఏఎస్, ఐపీఎస్‌లు చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివాసీ ఎమ్మెల్యేల వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ ఎమ్మెల్యేలు. చిత్రంలో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ వర్గాల విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్రంలోని ఆదివాసీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో శనివారం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో రేవంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 70 ఏళ్లలో ఆదివాసీ వర్గాలకు చెందిన ఆల్ ఇండియా అధికారి తెలంగాణ కేడర్లో పనిచేయలేదని, కనీసం గ్రూప్ వన్‌కు కూడా ఎంపిక కాలేదని ఈ సందర్భంగా సీఎం దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. ప్రత్యేకంగా ఆదివాసీ వర్గాల విద్యార్థులు చదువుకునేందుకు హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, అందులో 500 మంది చదువుకునేలా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా అమ్మాయిలకు నాలుగు, అబ్బాయిలకు నాలుగు హాస్టళ్లను, రాష్ట్రంలోని ఆదివాసీ జిల్లాల్లో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ కోర్సులకు ఎంపికైన విద్యార్థులకు.. ఐటీడీఏల ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.10 కోట్ల ప్రత్యేక నిధి కేటాయించాలని కోరారు. తమ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యేలు వెల్లడించారు.

రైతు సాయానికి కోతలు పెట్టే కుట్ర

ఉద్దేశపూర్వకంగానే రైతుబంధుపై దుష్ప్రచారం.. అసెంబ్లీలో కేటీఆర్ ఫైర్

- ఎలాంటి ఆంక్షలు లేకుండా పెట్టుబడి సాయం అందించాల్సిందే
- ఎన్ని పంటలకు భరోసా ఇస్తారు? కౌలు రైతుకు పథకం అమలు చేస్తారా?
- సర్కారు పూర్తి రుణమాఫీ చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయంలో కోతలు పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రైతు బంధుపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎలాంటి ఆంక్షలు, కత్తిరింపులు లేకుండా రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభలో శనివారం రైతు భరోసా అంశంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చను ప్రారంభిస్తూ.. ఈ పథకంపై సభ్యులు సూచనలు చేయాలని, దీని ఆధారంగా విధివిధానాలు రూపొందిస్తామని తెలిపారు. కేటీఆర్ ఈ చర్చలో మాట్లాడారు. "రైతు భరోసాకు రూ.23 వేల కోట్లు అవసరమైతే రూ.15 వేల కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించడం కోత విధించడానికే. రైతు భరోసాపై మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదికను ప్రజల ముందుంచాలి. ఎన్నికల హామీ ప్రకారం రాష్ట్రంలో ఉన్న 22 లక్షల మంది కౌలుదార్లకు కూడా రైతు భరోసా ఇస్తారా?"అని ప్రశ్నించారు. ప్రభుత్వం యాసంగి, వానాకాలం కలిపి ఒక్కో రైతుకు రూ.17,500 చొప్పున... రైతులందరికీ కలిపి రూ.26,775 కోట్లు బాకీ పడిందని చెప్పారు. గెలిచిన వెంటనే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

ఆంక్షలు లేకుండా పెట్టుబడి సాయం ఇవ్వాలి

రైతులు పచ్చగా ఉంటే కొంతమంది కళ్లు మండుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు తీసుకుంటున్న వారిలో 98 శాతం సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని తెలిపారు. 91.33 శాతం లబ్ధిదారులు ఐదెకరాల కంటే తక్కువ ఉన్నవారేనని.. 5 నుంచి 10 ఎకరాలు 7.28 శాతం మందికే ఉన్నాయని, 10 ఎకరాలు పైబడి ఉన్నవాళ్లు 1.39 శాతమేనని పేర్కొన్నారు. 25 ఎకరాలపైన ఉన్న పెద్ద రైతులు కేవలం 0.09 శాతం మాత్రమేనని చెప్పారు. రైతు బంధు నిధుల్లో 70 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతుల ఖాతాల్లోనే పడ్డాయని వివరించారు. గిరిజనులకు చెందిన 4.5 లక్షల ఆర్వోఎఫ్ఆర్ భూములకు, పత్తి, కంది ఉద్యానవనాలకు రైతు భరోసా ఇస్తారా? లేదా? చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరిగే వరకు కూడా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు బంధు ఇవ్వాలన్నదే తమ ఉద్దేశమని తెలిపారు.

రుణమాఫీ నిరూపిస్తే రాజీనామా..

"రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగినట్టు కాంగ్రెస్ సర్కారు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా. రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమని లెక్క తేల్చారు. రూ.40 వేల కోట్లు అవుతుందని సీఎం అన్నారు. కేబినెట్‌లో రూ.31 వేల కోట్లు అన్నారు. తీరా బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించారు. ఆఖరుకు రూ.17,934 కోట్లే మాఫీ చేశారు.."అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడన్నా 24 గంటల ఉచిత విద్యుత్ అందించినట్టు లాక్‌బుక్కుల్లో చూపిస్తే తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. నల్లగొండకు నీళ్ల ఇచ్చిన అంశంపై ఆ జిల్లాలోనే తేల్చేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులు చేపట్టి వలసలు ఆపామని చెప్పారు. తెలంగాణలో ఎవరైనా చనిపోతే స్నానానికి కూడా నీళ్ల లేని పరిస్థితి ఉందని గతంలో కాంగ్రెస్ పార్టీపై సీఎం రేవంత్ చేసిన విమర్శలను కేటీఆర్ గుర్తు చేశారు. రైతుబంధు వల్ల రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి పెరిగిందని కేటీఆర్ తెలిపారు.

రుణమాఫీపై చర్చిద్దాం.. రెడీనా?

- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- ఇచ్చిన మాట మేరకు పెట్టుబడి సాయం పెంచి ఇవ్వాల్సిందే

సాక్షి, హైదరాబాద్: మొత్తం రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని... దీనిపై ఆయన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో అయినా, సొంత నియోజకవర్గం కొడంగల్‌లోనైనా రైతుల ముందు చర్చిద్దామా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారక రామారావు సవాల్ చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

"రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి బండారం బయటపడటంతో అసెంబ్లీలో ఆగమయ్యారు. ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేయడం చేతకాదని చెప్పకనే చెప్పారు. రూ.49,500 కోట్ల రుణమాఫీ రూ.26 వేల కోట్లతో ఎలా అయిందో రేవంత్ చెప్పలేకపోయారు. కేవలం 25శాతం రుణమాఫీ చేసి 100శాతం అయిందని చెబుతున్నారు. రైతుబంధులో రూ.22 వేల కోట్లు ఎవరికి ఇచ్చారో అడిగితే ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదు. కంది, పత్తి, మొక్కజొన్నల రెండో పంటకు రైతుబంధు ఇవ్వకుండా కుట్ర చేస్తున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో రూ.28 వేల కోట్ల రుణమాఫీ చేస్తే.. కాంగ్రెస్ రూ.12 వేల కోట్లు మాత్రమే చేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీయండి

రైతుబంధుకు పాన్‌కార్డు ఆప్షన్ పెడితే 1.30 కోట్ల మంది నష్టపోతారు. ఐటీ ఉన్న వారందరికీ రైతుబంధు కట్ చేస్తే ఇక మిగిలేదెవరు? మాజీ సీఎం కేసీఆర్ చెప్పినట్టుగా కాంగ్రెస్ వస్తే రైతుబంధు బంద్ అయింది. రుణమాఫీ, రైతుబంధు ఏమైందని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రజలంతా నిలదీయాలి. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలయ్యేదాకా కాంగ్రెస్ పార్టీని వదిలేది లేదు. రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని నీడలా వెంటాడుతూనే ఉంటాం.

రైతు ఆత్మహత్యలపై అన్నీ అబద్ధాలే..

తెలంగాణలో రైతుల ఆత్మహత్యలపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పే దుస్థితికి దిగజారింది. కేంద్ర నేర గణాంక సంస్థ (ఎన్సీఆర్బీ) లెక్కల ప్రకారం... 2014లో 1,348 రైతు ఆత్మహత్యలు జరిగితే... రైతు బంధు పథకం ప్రారంభమైన తర్వాత 2022 నాటికి కేవలం 178 మందికే తగ్గింది. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం ఇవ్వడంతోనే ఆత్మహత్యలు తగ్గాయి. రాష్ట్రం ఏర్పడక ముందు దేశంలోనే తెలంగాణ ప్రాంతం రైతు ఆత్మహత్యల్లో తొలి రెండు స్థానాల్లో ఉండేది. ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి చెప్పే ప్రతీ మాటా నమ్మాల్సిన అవసరం లేదు.

రైతు భరోసా ఇచ్చేదెప్పుడో!

సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తామంటున్న ప్రభుత్వం ఏ సంక్రాంతికో చెప్పడం లేదు. రైతు భరోసాపై కాలయాపన కోసమే కమిటీ వేశారు. ప్రజలు కోరుకున్నది పేర్ల మార్పిడి కాదు, గుణాత్మకమైన మార్పు. మేం సీఎం రేవంత్‌రెడ్డి కేసులకు, ఈడీ, మోదీలకు భయపడబోం"అని కేటీఆర్ పేర్కొన్నారు.



శనివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం, పొంగులేటి... షబ్బీర్ అలీ, క్రైస్తవ మత పెద్దలు

ఇందిరమ్మ ఇళ్లలో దళిత క్రైస్తవులకు ప్రాధాన్యత

కాంగ్రెస్ పార్టీ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పిస్తాం ● ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దళిత క్రైస్తవులకు ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ పదవుల్లోనూ వారికి తగిన స్థానం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మతాలను సమానంగా చూడడమే తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. ఎల్బీస్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు సీఎం ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ కేకు కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రజలకు డిసెంబర్ ఒక అద్భుతమైన మాసం. ఇదే నెలలో ఏసుక్రీస్తు పుట్టారు. ప్రత్యేక రాష్ట్ర ప్రకటన ఈ నెలలోనే వచ్చింది. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఎంతో ఉత్సాహాన్నిచ్చే నెల కూడా ఇదే. ఎందుకంటే పార్టీ నేత సోనియాగాంధీ పుట్టిన రోజు కూడా ఈ నెలలో ఉంది. మా ప్రభుత్వం ఏర్పాటైంది కూడా డిసెంబర్‌లోనే'అని గుర్తుచేశారు.

క్రిష్టియన్ మిషనరీల సేవలు అద్భుతం


నిన్ను నువ్వు ప్రేమించుకో, పొరుగువారిని ప్రేమించు అన్న ఏసుక్రీస్తు బోధనలు అనుసరిస్తే జీవితం ప్రశాంతంగా గడిచిపోతుందని సీఎం అన్నారు. మానవ సమాజానికి అత్యంత ప్రధానమైన విద్య, వైద్యం అందించటంలో క్రైస్తవ మిషనరీలు ప్రభుత్వాలతో పోటీ పడుతున్నాయని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పదవుల్లోనూ దళిత క్రైస్తవులకు అవకాశం కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవాళ్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వివరాలు ఇవ్వాలని సూచించారు. సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, వారిలో దళిత క్రైస్తవులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గ్రామ, మండల, జిల్లా కమిటీల్లో వారి కోటా తప్పకుండా వారితోనే భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం, పొంగులేటి పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూళ్ల డిజైన్లను పరిశీలించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. విద్యా శాఖ అధికారులు, ఆర్కిటెక్ట్ పలు డిజైన్లను సీఎంకు చూపించారు. వాటిని పరిశీలించిన సీఎం.. అకాడమీ బ్లాకులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్స్, మల్టీపర్పస్ హాళ్లు, సిబ్బంది నివాసాలు తదితర ఆకృతులు, అవి ఎంత విస్తీర్ణంలో ఉండాలో పలు సూచనలు చేశారు. ఈ క్యాంపస్‌లు అన్ని రకాలుగా విద్యార్థులకు సురక్షితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందుగా కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న ఈ స్కూళ్లు పూర్తి నాణ్యత ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు. ఇతర నియోజకవర్గాల్లోనూ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. సీఎంను కలిసిన వారిలో సీఎస్ శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, టీజీఈడబ్ల్యూడీసీ ఎండీ గణపతిరెడ్డి తదితరులున్నారు.

పరీక్షలకు ఫాతిమాను అనుమతించండి

- కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశం
- పేద వైద్య విద్యార్థినికి ఊరట



సాక్షి, హైదరాబాద్: ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫీజు కట్టలేక గత పరీక్షలకు హాజరుకాలేకపోయిన వైద్య విద్యార్థిని అర్షియా ఫాతిమా (పిటిషనర్)ను.. 2025, జనవరిలో జరిగే బీడీఎస్ చివరి సంవత్సరం పరీక్షలకు అనుమతించాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ ఒక్కసారికి అవకాశం ఇవ్వాలని స్పష్టం చేసింది. మాజీ సైనికుడి కూతురైన ఫాతిమా 2016లో నిజామాబాద్‌లోని మేఘన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో బీడీఎస్‌లో చేరారు. 2017, 2018లో పరీక్షలకు హాజరయ్యారు. 2020లో మూడో ఏడాది పూర్తి చేశారు. 2021 నుంచి ఆర్థిక పరిస్థితుల కారణంగా నాలుగో ఏడాది ఫీజు కట్టలేక పరీక్షలకు హాజరుకాలేదు. 2024లో బీడీఎస్ చివరి సంవత్సరం పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ఫాతిమా వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నారు. అయితే అక్టోబర్ 28న వర్సిటీ దీన్ని తిరస్కరించింది. తనను బీడీఎస్ చివరి సంవత్సరం పరీక్షలకు అనుమతించకపోవడాన్ని, ఇంటర్న్‌షిప్ పూర్తి చేయకుండా అడ్డుకోవడాన్ని సవాల్ చేస్తూ ఫాతిమా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2025, జనవరిలో జరిగే పరీక్షలకు అనుమతి ఇచ్చేలా వర్సిటీకి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ ఒక్కసారికి అనుమతించాలని వర్సిటీని ఆదేశిస్తూ, విచారణ ముగించింది.

తయారీరంగం వృద్ధిలో ఎగుమతిదారులే కీలకం

ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రాణా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సురేందర్ రాణా

సాక్షి, హైదరాబాద్: తయారీ రంగం అభివృద్ధి చెందడంలో ఎగుమతిదారుల పాత్ర అత్యంత కీలకమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రాణా అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడంలో తయారీ రంగం ముందువరుసలో ఉందని, 2030 నాటికి భారత ఎగుమతులు 2 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో శనివారం ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ కమర్షియల్ క్లయింట్స్ గ్రూప్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సురేందర్ రాణా ఖాతాదారులకు పలురకాల సూచనలు చేశారు. అనంతరం ఎస్‌బీఐ గ్లోబల్ మార్కెట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రవిరంజన్ మాట్లాడుతూ.. గుమతుల్లో తెలంగాణ కీలకంగా పనిచేస్తోందని ప్రశంసించారు.

4 ఏళ్లలో 26 మంది ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

సాక్షి, హైదరాబాద్: చదువుల ఒత్తిడితో ఇంటర్మీడియెట్ విద్యార్థులు సమిధలవుతున్నారు. 2020 నుంచి 2024 నవంబర్ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలల్లో 26 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడినట్టు తెలిసింది. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి సమాచార హక్కుచట్టం కింద చేసిన దరఖాస్తుకు సమాధానంగా ఈ వివరాలను ఇంటర్మీడియెట్ బోర్డు వెల్లడించింది. అందులో పేర్కొన్న ప్రకారం..2020 నుంచి 2024 నవంబర్ వరకు తమ వద్ద అందుబాటులో ఉన్న వివరాల మేరకు 26 మంది విద్యార్థుల బలవన్మరణాలు జరిగినట్టు తెలిపింది. అయితే విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువ సంఖ్యలో ఉన్నా..ఇంటర్మీడియెట్ బోర్డు అధికారుల వద్ద కనీసం సమాచారం లేదని రాజేంద్ర పల్నాటి ఆరోపించారు. బోర్డు ఆత్మహత్యలపై పూర్తి సమాచారం ఇవ్వలేదని, అందుబాటులో ఉన్న సమాచారం అంటూ సరిపెట్టడం వారికి విద్యార్థుల ప్రాణాలపై ఉన్న విలువ అర్థం అవుతోందని ఆయన 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు.



బుద్ధి నిన్ను కాపాడును.
వివేచన నీకు కావలి కాయును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం,హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.సప్తమి ప.3.18 వరకు తదుపరి అష్టమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.7.47 వరకు తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.3.41 నుండి 5.25 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.04 నుండి 4.52 వరకు, **అమృతఘడియలు:** రా.2.10 నుండి 3.51 వరకు.

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం : 5.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నరేంద్ర మోదీ (ప్రధాని)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"తప్పైపోయింది మోదీజీ..." అన్నారు అమిత్‌షా, దించిన తల ఎత్తకుండానే.

"మీరన్న మాటలో తప్పేమీ లేదు అమిత్‌జీ. కానీ, మీరసలు 'ఆయన' మాటే ఎత్తకుండా ఉండాల్సింది కదా...!" అన్నాను.

"నిజమే మోదీజీ. 'ఆయన' మాట ఎత్తినా తప్పే, ఎత్తకపోయినా తప్పేనన్న కాలమాన పరిస్థితులను కాంగ్రెస్ పార్టీ సృష్టిస్తున్నప్పుడు 'ఆయన' మాట ఎత్తి తప్పు చేయటం కంటే, ఎత్తకుండా తప్పు చేయటమే కొంతైనా నయంగా ఉండేది..." అన్నారు అమిత్‌షా.

పక్కనే జేపీ నడ్డా, కిరణ్ రిజుజు, అశ్వినీ వైష్ణవ్, పీయుష్ గోయల్ ఉన్నారు.

"అప్పటికీ ప్రెస్ మీట్ పెట్టి, 'ఆయనంటే' మనకెంత గౌరవమో చెప్పాం మోదీజీ..." అన్నారు జేపీ నడ్డా.

"అవును మోదీజీ... 'ఆయనకు' రెస్పెక్ట్ ఇవ్వటంలో కాంగ్రెస్ కన్నా మన పార్టీనే ఎప్పుడూ ముందుంటుందని కూడా చెప్పాం..." అన్నారు కిరణ్ రిజుజు.

"నిజానికి కాంగ్రెస్సే 'ఆయన'కు యాంటీ అని : 'ఆయన'కు మాత్రమే కాదు... రాజ్యాంగానికి, రిజర్వేషన్‌లకు కూడా కాంగ్రెస్ యాంటీనే అని కూడా చెప్పాం మోదీజీ..."



అన్నారు అశ్వినీ వైష్ణవ్, పీయుష్ గోయల్.

మంటల్ని ఆర్పేందుకు శతవిధాల ప్రయత్నించి వచ్చి, అలసట తీర్చుకుంటున్న ఫైర్ ఇంజన్‌లలా కనిపిస్తున్నారు మంత్రులు నలుగురూ.

"మనం 'ఆయన' మాటెత్తటం వల్ల సడన్‌గా ఇప్పుడాయన మన పార్టీ ఇమేజ్‌కి సెంటర్ పాయింట్ అయ్యారు కనుక ఇకపై మనలో ఎవరు ఏం మాట్లాడినా 'ఆయన్ని' సెంటర్ పాయింట్‌గా చేసుకునే మాట్లాడాలి..." అన్నాను అమిత్‌షా వైపు చూస్తూ.

వెంటనే రిజుజు స్పందించారు.

"నా వంతు ప్రయత్నం నేను చేస్తున్నాను మోదీజీ! 'దేశంలో 'ఆయన' తర్వాత లా మినిస్టర్ అయిన తొలి బుద్ధిస్టును నేనే...' అనే సంగతిని ఇప్పటికే ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగాను..." అన్నారు రిజుజు.

"నేనేతై, మోదీజీ పాలనలో 'ఆయన్ని' ఇన్‌సల్ట్ చేయడమన్నదే జరగదు..." అని గట్టిగానే జవాబిచ్చాను..." అన్నారు నడ్డా.

"కాంగ్రెస్ 'ఆయన' విషయంలో అమిత్‌జీ మాటల్ని మెలితిప్పి, బీజేపీపై దుష్ప్రచారం చేస్తోందని ప్రజలకు చాటి చెబుతున్నాం మోదీజీ..." అన్నారు వైష్ణవ్, పీయుష్ గోయల్.

పార్టీలో ఒక నాయకుడిపై బయటి నుంచి విమర్శలు వచ్చినప్పుడు పార్టీలోని అందరూ ఆ విమర్శలు చేసిన వారిపై వరుసపెట్టి విరుచుకుపడటం బీజేపీలోని ఒక సత్సంప్రదాయం. ఆ సంప్రదాయం క్రమంగా బలహీనపడుతోందా? అందుకే... 'ఆయన' మాటెత్తినందుకు అమిత్‌షాను మంత్రిగా తొలగించమని డిమాండ్ చేసేంతగా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు బలపడుతున్నాయా?

అమిత్ షా వైపు చూశాను.

"అమిత్‌జీ... కనీసం మీరు – 'కాంగ్రెస్ పార్టీ పదే పదే 'ఆయన' జపం చేస్తోంది' – అన్నంత వరకే ఆగి పోవలసింది. మధ్యలోకి దేవుడిని తెచ్చి... 'ఆ జపమేదో దేవుడికి చేస్తే పుణ్యమైనా దక్కేది...' అని అనటం వల్లనే.. 'ఆయన వేరు, దేవుడు వేరా!' అని కాంగ్రెస్ రెచ్చగొడుతోంది..." అన్నాను.

"నేనలా అనుకోవటం లేదు మోదీజీ..." అన్నారు అమిత్‌షా!

"మరి?!" అన్నాను.

"ఆయన వేరు, దేవుడు వేరా – అని కాదు మోదీజీ... కాంగ్రెస్ రెచ్చకొడుతోంది, అసలు 'ఆయన'కు వేరొకరితో పోలికేమిటని 'ఊక'పొయ్యిని రాజేస్తోంది..." అన్నారు అమిత్‌షా!!

నా నోట మాట లేదు! అవతారమూర్తి అయిన శ్రీకృష్ణుడు అశ్వత్థామకు పెట్టిన శాపం విని అప్రతిభుడై, శిలా ప్రతిమలా నిలుచుండి పోయిన వ్యాసమహర్షి నాకు – అదాటున – గుర్తొచ్చారు.

మంటలు, కాల్చి బూడిద చేస్తాయి. మాటలు బూడిద నుంచి కూడా మంటల్ని రేపుతాయి!

అరేబియా అద్భుతం

చాలామంది దుబాయికి వెళ్తారు. కానీ దాని పొరుగునే ఉండే అబూ ధాబీని ఎక్కువమంది పట్టించుకోరు. దుబాయిని న్యూయార్క్‌తోనూ, అబూ ధాబీని ప్యారిస్‌తోనూ పోల్చవచ్చు. రాజసం ఉట్టిపడే బంగళాలు, విశాలమైన రహదారులు, సజావుగా సాగిపోయే ట్రాఫిక్... ఒక్కమాటలో అబూ ధాబీకి వెళ్తే అరేబియా అద్భుత ప్రపంచంలో కాలు పెట్టినట్లే ఉంటుంది!

కామెంట్



కరణ్ థాపర్

మీకు దుబాయి తెలుసుగా? బంధుమిత్రుల్లో చాలామంది వెళ్లి ఉంటారు కూడా. అయితే దుబాయి నుంచి ఓ గంటన్నర ప్రయాణం దూరంలో ఉండే ఎమిరేట్స్ రాజధాని అబూ ధాబీ గురించి మాత్రం చాలామందికి తెలియకపోవచ్చు. వెళ్లి ఉండరు కూడా. ఇవ్వాళ మీతో కొన్ని దేదీప్యమానమైన విషయాలను పంచుకుంటాను. పోయిన వారం నేను అక్కడికి వెళ్లాను. చూడముచ్చటగా ఉందని చెప్పాలి. చూసి వచ్చినందుకు మనసులో ఓ సంతృప్తి మిగిలిపోయింది. దుబాయి మాదిరి తళుకుబెళుకుల్లేవు. గ్లామర్, హడావిడి అంతకంటే లేవు!

అబూ ధాబీలో ప్రపంచం పరుగులు పెట్టదు. నెమ్మదిగా ఓ నదిలా హొయలు పోతూ సాగుతూంటుంది. పోలిక కావాలంటే... దుబాయ్‌ని న్యూయార్క్‌తోనూ, అబూ ధాబీని ప్యారిస్‌తోనూ పోల్చవచ్చు. రాజసం ఉట్టిపడే బంగళాలు, విశాలమైన రహదారులు, సజావుగా సాగిపోయే ట్రాఫిక్... వీటన్నింటి మధ్య అక్కడక్కడా లెక్కలేనన్ని ఆడంబరాలు, హోటళ్లు, రెస్టారెంట్లు! ఇదీ అబూ ధాబీ వర్ణన!

ఎమిరాతీ జనాలు తమ నగరాన్ని బాగా ఆస్వాదిస్తూంటారు. షాపింగ్, డైనింగ్ ఏదైనా కానీ దుబాయి కంటే బాగా ఎంజాయ్ చేస్తూంటారు. విదేశీయులు ఎక్కువగానే ఉన్నా... వారు దుబాయిలో మాదిరిగా స్థానికులను బెదరగొట్టేంత స్థాయిలో లేరనే చెప్పాలి.



అబూ ధాబీలోని షేక్ జయేద్ నేషనల్ మ్యూజియం

అబూ ధాబీలో ఉన్న సాంస్కృతిక అద్భుతాల గురించి చెప్పాలంటే 'ది లూవ్', 'షేక్ జాయెద్ మ్యూజియం'లను ప్రస్తావించాలి. ఈ రెండు ఉదాహరణలు కచ్చితంగా ఇచ్చి తీరాల్సినవే. షేక్ జాయెద్ సంగ్రహాలయంలో నేను కొన్ని గంటల సమయం గడిపాను. అందులో ఉన్న వస్తువులు మాత్రమే కాదు... ఎంతో అద్భుతమైన ఊహతో వాటిని ప్రదర్శించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. చరిత్ర గర్భంలో కలిసిపోయిన ఒక్కో కాలానికి ప్రతిరూపంగా ఈ సంగ్రహాలయ గదులను తీర్చిదిద్దారు. అలాగే చాలా తెలివిగా వేర్వేరు నాగరికతలకు సంబంధించిన వస్తువులను ప్రదర్శించారు. ఫలితంగా వీటిని వేర్వేరు వస్తువులుగా కాకుండా... ఒకే కాలంలో మానవ నాగరికతలు సాధించిన విజయాలను చూసినట్టుగా ఉంటుంది. చైనా నుంచి మెసపటోమియా వరకూ... అలాగే మెక్సికో నుంచి ఫ్రాన్స్ వరకూ వేర్వేరు నాగరికతలకు సంబంధించిన చారిత్రక అవశేషాలను ఇక్కడ భద్రపరిచారు. ఇంకోలా చెప్పాలంటే చోళుల కాలం నాటి విగ్రహాలు మొదలుకొని పర్షియన్ల కుండలు, బెల్జియం నేతపనుల నుంచి టర్కీ విగ్రహాలను ఒకే గదిలో చూడవచ్చు! ఏ శతాబ్దంలోనైనా మనిషి ఊహ ఎంత అద్భుతంగా ఉందో చెప్పే ప్రతీకాత్మ కత అన్నమాట!

షేక్ జాయెద్ గ్రాండ్ మాస్క్‌ను ఒక్క మాటలో వర్ణిస్తా. చాలా పెద్దది. చూడటం మొదలుపెడితే పూర్తయ్యేందుకు రెండు కిలోమీటర్ల దూరం నడవాలి. కానీ ఇందులోని వైపరీత్యాలను మాత్రం కచ్చితంగా అధ్యయనం చేయాల్సిందే. భూగర్భంలోని కారు పార్కింగ్ తరువాత స్టార్‌బక్స్, కోస్టా కాఫీలతోపాటు చాక్లెట్లు, సుగంధ ద్రవ్యాల దుకాణాలున్న షాపింగ్ ప్రాంతానికి వెళతాం. ఆ తరువాత స్వచ్ఛమైన తెల్లటి పాలరాతి పరచుకున్న గోడలున్న భారీ హాల్‌లోకి ప్రవేశిస్తాం. హాల్‌లోని స్తంభాలపై అతి కౌశలమైన కళాకృతులు, అది కూడా విలువైన రంగురాళ్ల పొదిగినవి ఉన్నాయి. పైకప్పు నుంచి జిలుగు వెలుగుల క్రిస్మస్ ట్రీల మాదిరిగా వేలాడే భారీ షాండ్లియర్లు... ఓహ్! అరేబియా అద్భుత ప్రపంచంలో కాలు పెట్టినట్లే ఉంటుంది!

అతిథులను మనసారా ఆహ్వానించే రెస్టారెంట్లు దుబాయిలో మాత్రమే ఉంటాయని అనుకునేవాడిని. అబూ ధాబీ కూడా ఈ విషయంలో ఏమీ తీసిపోదు. ఫోర్ సీజన్స్‌లోని బర్గర్లు, స్టీక్స్ కానివ్వండి... సెయింట్ రెజిస్‌లోని భారతీయ వంటకాలైనా కానివ్వండి... ఫాక్వెట్‌లోని ఫ్రెంచ్ మాధుర్యాలు, సముద్ర తీరంలోని 'తాషా'లో తీరికగా చేసే భోజనం కానివ్వండి... ఒక్కోటి పొట్టకు స్వర్గాన్ని రుచి చూపించేవే. కాకపోతే, ఇక్కడికొస్తే అప్పటి వరకూ లేని తిండిపోతుతనం మనల్ని చుట్టేయడం మాత్రం గ్యారెంటీ!

నేను ఇప్పటివరకూ చాలా దేశాల్లోని హోటళ్లలో బస చేశాను కానీ... 'ది ఎమిరేట్స్ ప్యాలెస్' ముందు అవన్నీ దిగదుడుపే! భారత్‌లోని 'లేక్ ప్యాలెస్', 'తాజ్‌మహల్'లు కూడా దీనిముందు గల్లీ హోటళ్లలా చిన్నబోతాయి. పచ్చటి పచ్చికబయళ్లున్న రూమ్ టెర్రస్‌లో కూర్చుని సముద్రాన్ని చూస్తూ కాఫీ తాగడం... డిసెంబరు చలిలో సూర్యకిరణాలు నులివెచ్చగా తాకడం... కవిత్వం చెప్పుకునేంత అద్భుతమైన అనుభూతి. మొబైల్ ఫోన్ లేకుండా కూడా కాలం ఎంచక్కా గడచిపోతుందనేందుకు ఈ అనుభూతి ఒక ఉదాహరణంటే ఒట్టు!

ఇంకో ముఖ్యమైన సంగతి. తప్పక చెప్పాల్సింది కూడా! ఎమిరాతీ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తారు. అందుకే ఇక్కడ అంతా ఒక పద్ధతి ప్రకారం నడిచిపోతూంటుంది. ఒకవేళ పొరబాటున ఎవరైనా నిబంధనలు మీరారో... జరిమానాలు వీపు విమానం మోత మోగిస్తాయి. రెడ్ లైట్ దాటారంటే ఐదు వేల దిర్హమ్‌ల చమురు వదులుతుంది. వచ్చే ఏడాది నుంచి దీన్ని ఏకంగా యాభై వేల దిర్హమ్‌లకు పెంచుతున్నారు. డాలర్లలో చెప్పాలంటే 15 వేలు. రూపాయల్లోనైతే రూ. 12.73 లక్షలు! రోడ్లపై అడ్డదిడ్డంగా నడిచే మనిషిని గానీ, ఒక్క హారన్ మోతగానీ వినలేదంటే నమ్మండి!

అబూ ధాబీ ఓ అద్భుత ప్రపంచం అనేంతగా దాన్ని వర్ణించానా? వాస్తవం ఏమిటంటే, దుబాయిలా కాకుండా... అబూ ధాబీ నిశ్శబ్దంగానే మీ అభిమానాన్ని చూరగొంటుంది. మీకు తెలియను కూడా తెలియదు. దుబాయిదంతా చెమ్కీల అంగీలే! కళ్లూ, చెవులు మదిపై చెడామడా దాడులు చేసే టైపు!


దుబాయిని చూడంగానే ఆహా ఓహో అనిపిస్తే... పొరుగునే ఉండే అబూ ధాబీ మాత్రం నెమ్మదిగా మీ మనసుల్లోకి చేరి మత్తెక్కిస్తుంది. చిరకాలం ఒక జ్ఞాపకంలా నిలిచిపోతుంది. ఎప్పుడైనా అరబ్ దేశాల వైపు వెళ్లే పని పడిందనుకోండి... అబూ ధాబీని చూసి రావడం మరచిపోకండే! మరపురాని అనుభూతిని మిగులుస్తుంది. అందుకే, నేనూ ఇంకోసారి అక్కడకు వెళ్లాలని ఇప్పటికే తీర్మానించుకున్నా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

పటేల్ ప్రధాని ఎందుక్కాలేదు?

1946లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ దశలో పార్టీ అధ్యక్షుడయే వ్యక్తి వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఉపాధ్యక్షుడు అవుతాడు. స్వాతంత్ర్యానికి ముందు మధ్యంతర ప్రభుత్వంలో అటువంటి అవకాశం లభిస్తే, ఇక స్వాతంత్ర్యానంతరం అతనే ప్రధాని కాగల అవకాశం ఉంటుంది. ఆ స్థితిలో ఆజాద్, నెహ్రూ, పటేల్, కృపలానీ నలుగురూ పార్టీ అధ్యక్ష పదవిని ఆశించారు. వారిలో నెహ్రూ పట్ల గాంధీజీ అనుకూలత చూపారు.


అభిప్రాయం



టంకశాల అశోక్

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయ సభలలో గత వారాంతంలో ప్రత్యేక చర్చ జరిగినపుడు ఒక ఆసక్తికరమైన విషయం ప్రస్తావనకు వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ తన సుదీర్ఘ పాలనా కాలంలో రాజ్యాంగాన్ని పలుమార్లు దుర్వినియోగ పరచటమే కాకుండా, స్వాతంత్ర్యానంతరం సర్దార్ పటేల్ బదులు నెహ్రూను ప్రధాని చేసేందుకు తమ సొంత పార్టీ రాజ్యాంగాన్ని సైతం ఉల్లంఘించిందన్నారు. ఆయన అటువంటి ఆరోపణ చేసినపుడు ఎందువల్లనో గానీ కాంగ్రెస్ పక్షం నుంచి పూర్తి మౌనం తప్ప కనీస నిరసనలు కూడా కనిపించలేదు. ప్రధాని విమర్శలో నిజమున్నదని వారావిధంగా అంగీకరించినట్లా? కనీసం మరునాడైనా తమ స్పందన లేమిటో ఎందుకు తెలియజేయలేదు? చరిత్రలో వాస్తవంగా జరిగిందేమిటో తెలిసిన కాంగ్రెస్‌వాదులు సభలో చర్చ జరిగిన సమయంలోగానీ, ఆ తర్వాతగానీ లేకపోయారా? వారి మౌనాన్ని బట్టి మాత్రం, మోదీ ఆరోపణ నిజమని నమ్మే అవకాశం సహజంగానే ఉంటుంది.

యథాతథంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని దేశం కోసం సహేతుకమైన అవసరాల కోసం సవరించటంతోపాటు, తమ అధికార ప్రయోజనాల కొరకు దుర్వినియోగ పరిచాయన్నది నిజం. ఆ విషయమై ఎప్పటికప్పుడు విమర్శలు రావటం తెలిసిందే. వాటిని పురస్కరించుకుని 1983లో ఏర్పడిన జస్టిస్ సర్కారియా కమిషన్, కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై ఒక గొప్ప నివేదికను ఇచ్చింది. దానితో, కేంద్రంలోని అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను యథేచ్ఛగా కూలదోసే దుష్ట సంప్రదాయం నిలిచిపోగలదని అందరూ ఆశించారు. కానీ, ఆ తీరు కొంత అదుపులోకి వచ్చినా, ఆ తర్వాత సైతం రాజ్యాంగ దుర్వినియోగం కొనసాగింది. ప్రభుత్వాలను ఆర్టికల్ 365 అనే ఆయుధంతో పడగొడుతుండటం ఒకటైతే... రాష్ట్రాల ఆర్థిక, రాజకీయాధికారాలను కుదిస్తూ పోయారు. ఆ ధోరణిలకు నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం (1989–91) కళ్లెం వేసింది. అది ఒక జాతీయ పార్టీ ప్రభుత్వం కాకుండా పలు ప్రాంతీయ పార్టీల ప్రభుత్వం కావటం అందుకు కారణం.



నెహ్రూ, గాంధీజీ, పటేల్

ఆ విధంగా దుర్వినియోగపరచటమనే రికార్డు గల కాంగ్రెస్, బీజేపీలు రెండూ జాతీయ పార్టీలే కావటం గమనించదగ్గది. అందువల్ల, ఈ విషయమై ఈ రెండు గురివింద పార్టీలలో ఎవరు ఎవరిని వేలెత్తి చూపినా అది హాస్యాస్పదమే అవుతుంది. అందువల్ల, రాజ్యాంగ ఆమోదానికి 75 సంవత్సరాలు పూర్తి కావటమనే ఒక ఘనమైన సందర్భాన్ని ఉపయోగించుకుని వీరిద్దరితోపాటు అన్ని పార్టీలు కూడా, పరస్పరం వృథా విమర్శలు చేసుకోవటానికి బదులు, ఇంతకాలం జరిగిన దుర్వినియోగాలకు చింతిస్తున్నామని, అందుకు దేశ ప్రజలు తమను క్షమించాలని, ఇక ముందు ఎట్టి పరిస్థితులలోనూ దేశ అవసరాల కోసం తప్ప స్వప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని ఉపయోగించుకొనబోమని ఏకగ్రీవ తీర్మానం చేసి ఉంటే, ఈ సందర్భానికి తగినట్లు అంతే ఘనంగా ఉండి, దేశ భవిష్యత్తుకు ఉపయోగకరమయేది.

కొంత భిన్నమైనదే అయినా రాజ్యాంగ దుర్వినియోగాలకు సంబంధించిన అవగాహనలకు అవసరమైన ఈ చర్చను అట్లుంచితే, స్వాతంత్ర్యానంతరం ప్రధానమంత్రి ఎన్నిక లేదా ఎంపిక విషయంలో వాస్తవంగా జరిగిందేమిటి?

దేశానికి 1947లో ఇక స్వాతంత్ర్యం రానున్నట్లు ధ్రువపడిపోయింది. అంతకుముందు 1946లో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నిక కాలానికి మౌలానా అజాద్ అప్పటికే ఆరు సంవత్సరాలుగా ఆ పదవిలో ఉన్నారు. అయినా మళ్లీ కావాలనుకున్నారు. అందుకు కారణం, ఆ దశలో పార్టీ అధ్యక్షుడయే వ్యక్తి వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఉపాధ్యక్షుడు కానుండటం! ఆ హోదాలో ఆ వ్యక్తి, ప్రధానమంత్రికి సమానుడవుతాడు. స్వాతంత్ర్యానికి ముందు మధ్యంతర ప్రభుత్వంలో అటువంటి అవకాశం లభిస్తే, ఇక స్వాతంత్ర్యానంతరం అతనే ప్రధాని కాగల అవకాశం ఉంటుంది. ఆ స్థితిలో ఆజాద్, నెహ్రూ, పటేల్, కృపలానీ నలుగురూ పార్టీ అధ్యక్ష పదవిని ఆశించారు. వారిలో నెహ్రూ పట్ల గాంధీజీ అనుకూలత చూపారు. దానితో ఆయన 1946 ఏప్రిల్ 20న ఆజాద్‌కు లేఖ రాసి పోటీ నుంచి విరమింపజేశారు. అంతేకాదు, 'ఎవరైనా నా అభిప్రాయం అడిగితే జవహర్‌లాల్ పేరు చెప్తాను. అందుకు నాకు చాలా కారణాలున్నాయి' అని కూడా అదే లేఖలో స్పష్టం చేశారు (ప్యారేలాల్ పేపర్స్). నామినేషన్లకు చివరి రోజు 29వ తేదీ కాగా, తను ఎవరికి అనుకూలమో 20వ తేదీ నాటికి మరి కొందరికి కూడా సూచించారు. మరొక వైపు, వర్కింగ్ కమిటీ సభ్యులు 15 మందిలో 12 మంది, మొత్తం అన్ని పీసీసీల నుంచి పటేల్‌కు మద్దతు లభించింది.

అయినప్పటికీ, గాంధీజీ అభిప్రాయం తెలిసిన కృపలానీ, నెహ్రూ పేరును ప్రతిపాదించి పోటీ నుంచి తప్పుకున్నారు. అపుడు పటేల్ కూడా ఉపసంహరించుకుని, 'నెహ్రూ ఏకగ్రీవంగా ఎన్నికయేందుకు వీలుగా' అంటూ ఒక కాగితంపై రాసి ఆజాద్‌కు అందజేశారు (పటేల్ కుమార్తె మణిబెన్). దానితో నెహ్రూ ఏకగ్రీవ ఎంపిక, అదే క్రమంలో అంతిమంగా ప్రధాని కావటం ఖాయమైంది. అదే సమయంలో గాంధీజీ నెహ్రూతో, తన పేరును ఒక్క పీసీసీ కూడా ప్రతిపాదించని విషయాన్ని లాంఛనంగా ప్రస్తావించారు గానీ, అందుకు నెహ్రూ స్పందించకపోవటంతో, ఎట్లాగూ గాంధీజీ ఆమోదం కూడా ఉన్నందున నెహ్రూదే నాయకత్వం అయింది. పీసీసీల మద్దతు గురించి ఒక విశేషాన్ని చెప్పుకోవాలి. ఉదాహరణకు, పటేల్‌కు సన్నిహితుడైన సెంట్రల్ ప్రావిన్సెస్ పీసీసీకి చెందిన డి.పి. మిశ్రా, తర్వాత 'లివింగ్ యాన్ ఈరా' అనే పుస్తకం రాస్తూ, తాము పటేల్‌నైతే బలపరిచాముగానీ భవిష్యత్తులో నెహ్రూ ప్రధాని కాకుండా అడ్డుపడటం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. నెహ్రూ అప్పటికే మూడుసార్లు అధ్యక్షునిగా పని చేసినందున పటేల్‌కు రెండో అవకాశం ఇవ్వాలనుకున్నామని, పైగా ప్రధానమంత్రి పదవికి సంబంధించినంతవరకు గాంధీజీ తన వారసునిగా నెహ్రూను ఎప్పుడో ప్రకటించారని అన్నారు.

వాస్తవానికి గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక దశలో తన వారసునిగా పటేల్‌ను ప్రకటించి, ఆ తర్వాత అభిప్రాయం మార్చుకున్నారు. అందుకు కారణాలేమిటో 1945 ప్రాంతంలోనే బహిరంగంగా చెప్పారు. అవి ఈ విధంగా ఉన్నాయి: దేశానికి ఆంగ్లేయుల నుంచి అధికారం రానుండగా ఆ సమయంలో నెహ్రూ మినహా మరొకరు ఆ స్థానంలోకి రాలేరు. విదేశాలలో చదివి బారిస్టర్ అయిన తను మాత్రమే వారితో వ్యవహరించగలడు. అది గాక ముస్లిములతో తనకున్న సత్సంబంధాలు పటేల్‌కు లేవు. ఇవి గాక మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయి. దేశంలో మత కలహాలు, దేశ విభజన అవకాశాల స్థితిలో, ముస్లిములకు వ్యతిరేకి అనే ముద్ర గల పటేల్ వల్ల సామరస్యతలు సాధ్యం కాకపోవచ్చు. ఇండియా వంటి దేశపు విదేశాంగ వ్యవహారాలను నెహ్రూ వంటి దృక్పథంగల వారే సరిగా చక్కబెట్టగలరు. పటేల్ మితవాది అయినందున పార్టీలోని మితవాద, ఫ్యూడల్ వర్గాల మద్దతు బలంగా ఉండటం నిజమే గానీ, సామాన్య ప్రజానీకానికి సంబంధించి వారి హృదయ సమ్రాట్ నెహ్రూ మాత్రమే. పైగా, మొదటి నుంచి దరిద్ర నారాయణ్ అంటూ ఆ వర్గాలతో మమేకమైన గాంధీజీకి, ఫేబియన్ సోషలిస్టు భావజాలం గల నెహ్రూయే సరైన ప్రధానిగా తోచటంలో వింత లేదు.

ఇంతకూ దీనంతటిలో కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ ఉల్లంఘన ఎక్కడున్నదో, ఆ పని నెహ్రూ కుటుంబం ఏ విధంగా చేసిందో ఎవరి అభిప్రాయానికి వారు రావచ్చు. అప్పటి పరిణామాలకు సంబంధించిన వాస్తవాలు మాత్రం ఈ విధంగా ఉన్నాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

భారత పరిశోధనా రంగంలో కొత్త అధ్యాయం

సందర్భం



డా॥ రవి కుమార్ చేగోని

భారతదేశ పరిశోధనా రంగంలో ఒక కొత్త అధ్యాయం 'నూతన విద్యా విధానం– 2020'. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రకారం భారతదేశంలోని విద్యా, పరిశోధన రంగాలను బలోపేతం చేయడానికి ఇది కృషి చేస్తుంది. ఈ దిశలోనే 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' (ఓఎన్ఓఎస్) పథకం ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. భారతదేశ పరిశోధనా రంగాన్ని బలోపేతం చేయడంలో నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 కీలక పాత్ర పోషిస్తోంది. ఈ దిశలో, అనుసంధాన నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రారంభించబడిన ఓఎన్ఓఎస్ దేశవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు నాణ్యమైన శాస్త్రీయ సమాచారాన్ని అందించే దిశగా పనిచేస్తోంది.

భారతీయ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి పత్రికలను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఇవ్వడం ద్వారా పరిశోధన ప్రమాణాలను మెరుగుపరుస్తోంది. 'ఆత్మనిర్భర భారత్' కల సాకారం కావడానికి అవసరమైన దేశీయ పరిశోధనలకు ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. దేశంలోని అట్టడుగు స్థాయి విద్యా సంస్థ నుండి ఉన్నత స్థాయి విద్యా సంస్థ వరకు సమాచారాన్ని సమానంగా అందిస్తుంది.



ఓఎన్ఓఎస్ కింద 2025 జనవరి 1 నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలను మన విద్యార్థులు, పరిశోధకులూ పొందనున్నారు. మొదటి దశ కింద 13,400 కంటే ఎక్కువ అంతర్జాతీయ పత్రికలు అందుబాటులో ఉంటాయి. ఈ పథకం కింద, 451 రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, 4,864 కళాశాలలు; అలాగే జాతీయ ప్రాముఖ్యం కలిగిన 172 సంస్థలూ, 6,380 ఉన్నత విద్య, పరిశోధనా సంస్థలూ వీటిని ఉపయోగించుకోనున్నాయి. ఇవి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పబ్లిషర్స్ (ఎల్సెవియర్, స్ప్రింగర్ నేచర్, వైలీ తదితర)తో సహా 30 ప్రచురణ సంస్థలు ప్రచురించే అగ్ర జర్నల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాబోయే మూడేళ్లపాటు ఇలా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది.

రెండవ, మూడవ దశల్లో ప్రభుత్వ–ప్రైవేట్ నమూనా ద్వారా చొరవను ప్రైవేట్ విద్యా సంస్థలకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. మూడవ దశలో పబ్లిక్ లైబ్రరీలలో ఏర్పాటు చేసిన యాక్సెస్ పాయింట్ల ద్వారా అంతర్జాతీయ పత్రికలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మూడు సంవత్సరాల కాలానికి 6,000 కోట్ల రూపాయల వ్యయంతో ఈ కార్యక్రమం సెంట్రల్ సెక్టార్ స్కీమ్‌గా ప్రారంభించబడుతుంది. ప్రపంచంలో జర్మనీ, చెకోస్లోవేకియా వంటి దేశాల్లో ఇప్పటికే ఇటువంటి వ్యవస్థ దిగ్విజయంగా నడుస్తోంది.

ఈ పథకం పరిశోధనలు కేంద్రీకృతం కాకుండా అన్ని రాష్ట్రాలలో, అన్ని పరిశోధనా సంస్థలలో, రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల్లో ఆవిష్కరణాత్మక పరిశోధనలను ప్రోత్సహిస్తుంది. పట్టణ – గ్రామీణ పరిశోధనా సంస్థల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గిస్తుంది.


అయితే ఈ పథకం అమలులో పలు సవాళ్ళు ఎదురు కానున్నాయి. ప్రధానంగా, అంతర్జాతీయ పత్రికల చందా ఖర్చులు సంవత్సరానికొకసారి పెరుగుతుండడం కీలక సమస్య. రూ. 6,000 కోట్ల భారీ బడ్జెట్ ఉన్నప్పటికీ, అన్ని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల అవసరాలను తీర్చడం సవాలుగా మారవచ్చు. అలాగే సంపాదకీయ హక్కులు, మేధా సంపత్తి సమస్యలు ముందుకు రావచ్చు. ఈ తరహా అంతర్జాతీయ ఒప్పందాలు చాలాసార్లు సాంకేతికత, భాష, మరియు అవసరాల ఆధారంగా వివిధ సంస్థలకు అసమాన అనుభవాలను కలిగించవచ్చు. అనేక స్థాయుల్లో సమాచార కొరత వల్ల పథకం గురించి అవగాహన లేని పరిస్థితి తలెత్తవచ్చు. ప్రత్యేకించి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వసతుల కొరత వల్ల వనరులను పూర్తిగా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.

మొత్తం మీద వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ పథకం భారతదేశంలోని విద్య–పరిశోధన రంగాలకు ఒక గొప్ప అవకాశాన్ని అందిస్తుంది. ఈ పథకం ద్వారా భారతదేశం త్వరలోనే ప్రపంచంలోనే అగ్ర పరిశోధనా కేంద్రంగా మారే అవకాశం ఉంది.

వ్యాసకర్త తెలంగాణ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి

భారతీయ గణిత ఘనాపాఠి

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుల ప్రతిభను ప్రపంచానికి చాటినవారిలో ఒకరు. సాధారణ సంప్రదాయ కుటుంబంలో 1887 డిసెంబర్ 22న తమిళనాడు ఈరోడ్‌లో జన్మించారు. చిన్న వయసులోనే 'ఏ సంఖ్య అయినా అదే సంఖ్యతో భాగిస్తే ఒకటి వస్తుంది' అని సార్వత్రీకరించిన ఉపాధ్యాయుని... 'సున్నను సున్నతో భాగిస్తే ఒకటి వస్తుందా?' అనే ప్రశ్న వేసి ఆశ్చర్యపరిచారు. మరో సందర్భంలో తన సీనియర్ విద్యార్థి $\sqrt{x}+y=7$, $x+\sqrt{y}=11$ అయితే x, y ల విలువలెంత అనే సమస్యకు చిటికెలో x=9, y=4 అని చెప్పి తన ప్రతిభ చాటుకొన్నాడు. పన్నెండేళ్ళ వయసులోనే అసాధారణ ప్రతిభ గల బాలునిగా గుర్తింపు పొందారు. రామానుజన్ గణిత ప్రజ్ఞను గమనించి మద్రాస్ యూనివర్సిటీ నెలకు 75 రూపాయల స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. గణితమే సర్వస్వంగా ఉండి మిగతా సబ్జెక్ట్‌లు నిర్లక్ష్యం చేయడంతో ఎఫ్ఏ పరీక్ష పూర్తి కాలేదు. 1909 జూలై 14న జానకీ అమ్మాళ్‌తో వివాహం జరిగింది. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రామానుజన్ జీవనోపాధి కోసం పోర్ట్‌లో చిన్న ఉద్యోగంలో చేరారు. తన పరిశోధనలను కేంబ్రిడ్జిలో ప్రముఖ గణిత ప్రొఫెసర్ జీహెచ్ హార్డీకి పంపించారు.



శ్రీనివాస రామానుజన్

హార్డీ సహాయంతో రామానుజన్ 1914 మార్చి 17న ఇంగ్లాండ్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చేరారు. నిరంతర గణిత సాధనతో, కఠోర పరిశ్రమతో ఆరేళ్ల కాలంలో 32 పరిశోధనా పత్రాలను సమర్పించారు. 1918 సంవత్సరంలో 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ' గౌరవాన్ని పొందారు. అదే విధంగా 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ్' గౌరవాన్ని పొందిన మొదటి భారతీయుడుగా గుర్తింపు పొందారు. రామానుజన్ మేజిక్ స్క్వేర్, మాక్ తీటా ఫంక్షన్స్, నంబర్ థియరీ, స్ట్రింగ్ థియరీ వంటి వాటిపై అనేక పరిశోధనలు చేశారు.

ఒకసారి అనారోగ్యంతో ఉన్న తనను చూడడానికి వచ్చిన హార్డీ... తాను ప్రయాణించిన టాక్సీ నంబర్ 1729 చాలా డల్ నంబర్ అన్నారు. 1729 డల్ నంబర్ కాదనీ, దాన్ని రెండు ఘనముల మొత్తంగా రెండు విధాలుగా రాయగలిగే తమాషా సంఖ్యనీ వెంటనే రామానుజన్ బదులు చెప్పారు. $1729=10^3+9^3$
$1729=12^3+1^3$ ఆశ్చర్యపడిన హార్డీ దానిని అప్పటి నుండి రామానుజన్ నంబర్‌గా పేర్కొనడం విశేషం.

అనారోగ్య కారణంగా 1920 ఏప్రిల్ 26న చిన్న వయసులోనే రామానుజన్ తుదిశ్వాస విడవడం మనదేశ గణిత మేధాసంపత్తికి కలిగిన అపార నష్టం. గణితంలో సరికొత్త ఆవిష్కరణలతో రాణించడమే విద్యార్థులు, గణిత ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆయనకిచ్చే అసలైన నివాళి.

– తోటకూర సాయి రామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత

(నేడు శ్రీనివాస రామానుజన్ జయంతి)

అప్పులతో మరో నేతన్న ఆత్మహత్య


నక్క శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం: అప్పులు, అనారోగ్య సమస్యలతో సిరిసిల్లలో మరో నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం నాటి గణేశ్ ఆత్మహత్య ఘటన మరువకముందే శనివారం బీవై నగర్‌కు చెందిన మరో కార్మికుడు నక్క శ్రీనివాస్ (45) ప్రాణాలు తీసుకున్నాడు. కొద్ది నెలల క్రితం ఒక ప్రమాదంలో శ్రీనివాస్ చేయి విరిగింది. చేతికి చేసిన శస్త్రచికిత్స ఫెయిల్ కావడం.. బీపీ, షుగర్ ఉండడంతో అనారోగ్య సమస్య తీవ్రమైంది. గతంలో జీవనోపాధి కోసం పాన్‌షాప్ పెట్టుకోగా అందులోనూ నష్టం వచ్చింది. కుటుంబ అవసరాలకు దాదాపు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. తీర్చే మార్గాలు కనిపించక మనస్తాపంతో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగ్గురిని మింగిన చెరువు

- అడుకుంటూ చెరువులోకి జారిపడిన ఇద్దరు చిన్నారులు.. వారిని రక్షించే క్రమంలో తల్లి కూడా మృతి
- మహబూబ్‌నగర్ జిల్లా పోమాల్‌లో విషాదం


చెరువులో పడి మృతి చెందిన తల్లి, ఇద్దరు పిల్లలు

నవాబుపేట: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ తల్లి, ఇద్దరు చిన్నారులు మృతిచెందిన విషాద ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పోమాల్‌లో చోటుచేసుకుంది. పోమాల్ గ్రామానికి చెందిన కుక్కింద సరోజ(28) తన నలుగురు పిల్లలతో కలిసి శనివారం దుస్తులు ఉతకడానికి గ్రామ సమీపంలోని పెద్దచెరువు దగ్గరికి వెళ్లింది. అక్కడ దుస్తులు ఉతికి ఆరేస్తుండగా ఇద్దరు పిల్లలు దివ్య (6), అక్షయ్‌కుమార్ (5) నీటిలో ఆడుకుంటూ చెరువులోకి జారిపోయారు. వారిని చూసిన తల్లి పిల్లలను రక్షించేందుకు నీటిలోకి దిగింది. కానీ, అప్పటికే పిల్లలు చెరువులో చాలా లోపలికి వెళ్లడంతో, వారిని రక్షించే క్రమంలో తల్లి సైతం నీటిలో మునిగిపోయింది. ఇది గమనించిన మరో కూతురు తేజశ్రీ 'అమ్మా.. అమ్మా'అంటూ చెరువు నీటిలోకి దిగి నీటిలో చేతులతో వెతుకుతూ ఏడుస్తుంది. అదే సమయంలో గట్టుపై ఉన్న చిన్న కుమారుడు శివతేజ ఏడుస్తూ గ్రామంలోకి పరుగులు తీశాడు. దీంతో సమీపంలోని పొలాల్లో ఉన్న వారు వెంటనే వచ్చి తేజశ్రీని నీటిలో నుంచి గట్టుకు చేర్చారు. తల్లి, చెల్లి, తమ్ముడు ఇక్కడే మునిగిపోయారంటూ తేజశ్రీ వారికి చెప్పగా.. అప్పటికే మునిగిన వారి కోసం గాలించగా ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనపై సరోజ భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.


సరోజ (ఫైల్)

కూలిన చెట్ల కటింగ్

- మేడారం అడవుల్లో ముమ్మరంగా పనులు


చెట్లను కట్ చేస్తున్న సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా మేడారం అడవుల్లో కూలిన చెట్ల కటింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత ఆగస్టు 31న మేడారం-తాడ్వాయి అటవీ ప్రాంతంలో రాకాసి గాలులకు వేలాది చెట్లు నేలకూలడం తెలిసిందే. చెట్లు కూలిన ప్రదేశాల్లో అడవి పునరుద్ధరణకు అటవీశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు కూలిన చెట్లను వన్యప్రాణుల శాఖ ఆధ్వర్యంలో లైబర్, చైన్ రంపాలతో కోస్తున్నారు. ఆ దుంగలను ఏటూరునాగారంలోని టింబర్ డిపోకు తరలిస్తున్నారు. అడవుల్లో నేలకూలిన 7,351 చెట్లను కట్ చేస్తున్నట్లు ఏటూరునాగారం ఎఫ్‌డీవో రమేశ్ శనివారం 'సాక్షి'కి తెలిపారు. జలగలంచ, బొడుగూడెం, మేడారం సౌత్ బీట్‌లతో ఇప్పటివరకు 1,600 చెట్లను కట్ చేశామన్నారు. 170 క్యూబిక్ మీటర్లు..(సీఎంటీల) అంటే 500 దుంగలను ఏటూరునాగారం డిపోకు తరలించామని వివరించారు.

టీబీ నిర్మూలనకు కట్టుబడి ఉన్నాం: మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: దేశంలో టీబీ వ్యాధిని 2025 నాటికి పూర్తిగా నిర్మూలించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'పై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి రాజనర్సింహ పాల్గొన్నారు. టీబీ పేషెంట్ల గుర్తింపు, ట్రీట్‌మెంట్ కోసం '100 రోజుల ఇంటెన్సిఫైడ్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం'నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో (తెలంగాణలో 9 జిల్లాలు) ఈ నెల 7న ప్రారంభించిన ఈ కార్యక్రమం 17 మార్చి 2025 వరకు కొనసాగుతుంది.

సింగరేణిలో సాప్ సేవలకు బ్రేక్

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కీలకమైన సిస్టమ్ అప్లికేషన్ అండ్ ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్ (సాప్)ఈ నెల 24వ తేదీ తర్వాత అందుబాటులోకి రానుంది. సాంకేతికంగా అప్‌గ్రేడ్ పనులు చేపడుతుండడంతో.. ఈనెల 20వ తేదీన ఆన్‌లైన్ సర్వీసులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా కార్మికుల మస్టర్లు, పే రోల్స్, బదిలీలు, డిప్యుటేషన్ ప్రక్రియ నిలిచిపోయిన విషయం ఉద్యోగులు గమనించాలని సూచించారు. 2008లో సింగరేణిలో ప్రారంభమైన సాప్ సేవలు అప్పుడప్పుడు ఒకటి, రెండు రోజులు నిలిచిపోయేవి. కానీ ఈసారి ఇంకా ఎక్కువ రోజులు అంతరాయం ఏర్పడడం, అదీ సింగరేణి డే సమయాన జరగడం గమనార్హం.

పార్ట్‌టైం ఉద్యోగం పేరుతో సైబర్ మోసగాళ్ల వల

- రూ.31.60 లక్షలు పోగొట్టుకున్న గృహిణి



గోదావరిఖని: పార్ట్‌టైం ఉద్యోగం ఎరచూపి సైబర్ మోసగాళ్లు ఓ గృహిణి నుంచి రూ.31.60 లక్షలు కాజేశారు. గోదావరిఖని సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఓ గృహిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో సైబర్ మోసగాళ్లు పరిచయమయ్యారు. మాటల్లో పెట్టి పార్ట్‌టైం ఉద్యోగం ఇప్పిస్తామని, దీనిద్వారా ఆదాయం వస్తుందని నమ్మించారు. ఇందుకోసం తొలుత తమకు రూ.10 వేలు డిపాజిట్‌గా పంపించాలని చెప్పారు. ఆ తర్వాత ఆమె అకౌంట్‌కు రూ.13 వేలు పంపించారు. మరోసారి రూ.10 వేలు పంపిస్తే రూ.18 వేలు ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.లక్ష వరకు పంపించగా.. ఇక టాస్క్ ప్రారంభమైందని, అది పూర్తయ్యే వరకూ సొమ్ము పంపించాలని చెప్పగానే.. విడతల వారీగా రూ.31.60 లక్షలను ఆమె అవతలి వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు పంపించింది. ఆ తర్వాత ఉద్యోగం రాకపోగా, వారి నుంచి సమాచారం కూడా లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం సీఐ కృష్ణకుమార్.. హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన సోహెల్ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న మహమ్మద్ అవాద్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. తన పేరిట బ్యాంకుల్లో మూడు ఖాతాలు తెరిచి ఇలియాస్ అనే వ్యక్తికి ఇచ్చానని, ఇందులో డబ్బు జమచేస్తామని, ఆ తర్వాత తమ బ్యాంకులోకి మళ్లించుకుంటారని చెప్పాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసలు సైబర్ మోసగాళ్లను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

ఎన్నికలు మరింత గోప్యం!

ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండవు

- సీసీటీవీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, వీడియో రికార్డింగ్‌లు పొందలేరు
- ఎన్నికలకు సంబంధించిన ఇతర పత్రాలు తనిఖీ చేయడానికే అనుమతి
- 'ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961'లోని రూల్ 93లో సవరణ
- వీడియోల దుర్వినియోగాన్ని అరికట్టడానికే అంటున్న ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని, అనుమానాలకు తావులేని విధంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం గోప్యతకే ప్రాధాన్యం ఇస్తోంది. ఎన్నికల ప్రక్రియను మరింత గోప్యంగా మార్చే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణతోపాటు పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు(సీసీటీవీ కెమెరా ఫుటేజీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ లాంటివి), వీడియో రికార్డింగ్‌లను సామాన్య ప్రజలు తనిఖీ చేసేందుకు వీల్లేకుండా ఎన్నికల నిబంధనల్లో సవరణలు చేసింది. ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు 'ఎన్నికల నిర్వహణ నిబంధనలు–1961'లోని రూల్ 93లో కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం సవరణ చేసింది. దీని ప్రకారం కొన్ని రకాల ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, వీడియోలను ప్రజలందరూ చూసేలా బహిరంగపర్చడానికి అవకాశం ఉండదు. ఆంక్షలు అమలవుతాయి. కాండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్–1961లోని రూల్ 93(2)(ఎ) ప్రకారం.. ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలను బహిరంగపర్చాల్సిందే. ప్రజలంతా వాటిని చూడొచ్చు. తనిఖీ చేసుకోవచ్చు. కొత్తగా చేసిన సవరణ ప్రకారం.. ఎన్నికలకు సంబంధించి కొన్ని రకాల పత్రాలను మాత్రమే బహిరంగపర్చవచ్చు. ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు బహిర్గతం చేయడం నేరమవుతుంది.

- కాండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్‌లో నామినేషన్ పత్రాలు, ఎలక్షన్ ఏజెంట్ల నియామకం, ఎలక్షన్ అకౌంట్ స్టేట్‌మెంట్లు, ఎన్నికల ఫలితాల వంటివి ఉన్నాయి. వీటిని బయటపెట్టడానికి అనుమతి ఉంటుంది. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో చిత్రీకరించిన సీసీటీవీ ఫుటేజీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, వీడియో రికార్డింగ్‌లు ఈ నిబంధనల పరిధిలో లేవు కాబట్టి కొత్త సవరణ ప్రకారం వాటిని ప్రజలకు ఇవ్వడం సాధ్యం కాదు.
- సీసీటీవీ కవరేజీ, పోలింగ్ కేంద్రాల వెబ్‌కాస్టింగ్ కూడా నిబంధనల పరిధిలోకి రాదని, అది బయటపెట్టడం నిబంధనలను అతిక్రమించడమే అవుతుందని ఎన్నికల సంఘం అధికారి ఒకరు చెప్పారు.
- పోలింగ్ కేంద్రాల్లో చిత్రీకరించిన సీసీటీవీ కెమెరా ఫుటేజీ దుర్వినియోగమవుతోందని ఎన్నికల సంఘం చెబుతోంది. దీంతో ఓటర్ల గోప్యతకు భంగం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది.
- కృత్రిమ మేధ(ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి కొందరు సీసీటీవీ కెమెరా ఫుటేజీని సృష్టిస్తున్నారని, ఇలాంటి ఫేక్ వీడియోలను అడ్డం పెట్టుకొని ఎన్నికల ప్రక్రియపై దుష్ప్రచారం చేస్తున్నారని అధికారులు అంటున్నారు.
- ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని రకాల పత్రాలు, ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు, వీడియోలు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. సామాన్య ప్రజలు మాత్రం కోర్టు అనుమతితోనే వీటిని పొందాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.
- అభ్యర్థుల విషయంలో నిబంధనల్లో ఎలాంటి సవరణ చేయలేదని, ప్రజల విషయంలోనే సవరణ చోటుచేసుకుందని పేర్కొన్నారు.
- మహమూద్ ప్రాచా వర్సెస్ ఎన్నికల సంఘం కేసులో పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రూల్ 93(2) కింద అనుమతించిన అన్ని రకాల డాక్యుమెంట్లు (సీసీటీవీ కెమెరా ఫుటేజీ సహా) మహమూద్ ప్రాచాకు అందజేయాలని ఆదేశించింది.
- ఎలక్షన్ పత్రాలు, డాక్యుమెంట్లు అంటే ఎలక్ట్రానిక్ పత్రాలు, వీడియో రికార్డింగ్‌లు కాదని ఈసీ అధికారులు చెప్పారు. ఈ విషయంలో సందిగ్ధానికి తెరదించడానికే నిబంధనల్లో సవరణ చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సీసీటీవీ కెమెరా ఫుటేజీ దుర్వినియోగం కాకుండా చేయాలన్నదే అసలు ఉద్దేశమని వివరించారు.
- ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు మినహా ఇతర పత్రాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని కేంద్ర న్యాయ శాఖ అధికారులు చెప్పారు.

పారదర్శకత అంటే ఎందుకు భయం?: జైరామ్ రమేశ్

ఎన్నికల నిబంధనల్లో సవరణ చేయడంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎన్నికల సమగ్రతను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అంటే ఎందుకు భయమని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''ఎన్నికల ప్రక్రియపై పూర్తి సమాచారం ప్రజలకు అందజేస్తేనే వారిలో ఎన్నికలపై విశ్వాసం పెరుగుతుంది. ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు సహా అన్ని రకాల పత్రాలు ప్రజలకు ఇవ్వాలని పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఇటీవలే తేల్చిచెప్పింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిబంధనల్లో హడావుడిగా సవరణ చేయడం దారుణం'' అని జైరామ్ రమేశ్ మండిపడ్డారు.


కువైట్ సిటీలో ప్రధాని మోదీ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన భారత సంతతి ప్రజలు

బంధం బలోపేతం

ప్రధాని నరేంద్ర మోదీ కువైట్ పర్యటన ప్రారంభం

- నేడు ద్వైపాక్షిక చర్చలు
- కీలక రంగాల్లో ఒప్పందాలకు అవకాశం
- 43 ఏళ్ల తర్వాత కువైట్‌లో కాలుమోపిన భారత ప్రధాని



ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కువైట్ సిటీ: రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం గల్ఫ్ దేశమైన కువైట్‌కు చేరుకున్నారు. కువైట్ రాజు షేక్ మెషల్ అల్–అహ్మద్ అల్–జబేర్ అల్–సబా ఆహ్వానం మేరకు ఆయన కువైట్‌లో అడుగుపెట్టారు. భారతదేశ ప్రధానమంత్రి కువైట్‌లో పర్యటిస్తుండడం గత 43 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం. రాజధాని కువైట్ సిటీలోని ఎయిర్‌పోర్టులో నరేంద్ర మోదీకి కువైట్ ఉప ప్రధానమంత్రి షేక్ ఫహద్ యూసుఫ్ సాద్ అల్–సబాతోపాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో మోదీ కువైట్ పాలకులతో భేటీ కానున్నారు. వివిధ కీలక రంగాల్లో భారత్–కువైట్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా చర్చలు జరుపనున్నారు. అలాగే పలు ముఖ్యమైన ఒప్పందాలు కుదుర్చుకొనే అవకాశం ఉంది. కువైట్‌కు చేరుకున్న తర్వాత మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. తన పర్యటన రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావడానికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వేర్వేరు రంగాల్లో భారత్, కువైట్ పరస్పరం సహకరించుకుంటూ కలిసికట్టుగా ముందడుగు వేయాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. కువైట్ నాయకులను కలుసుకోవడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని వెల్లడించారు. మోదీ ఆదివారం ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొంటారు. ఇదిలా ఉండగా, 1981లో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ కువైట్‌లో పర్యటించారు. ఆ తర్వాత కువైట్‌లో అడుగుపెట్టిన మొదటి ప్రధానిగా నరేంద్ర మోదీ రికార్డుకెక్కారు.

ప్రపంచ నైపుణ్య రాజధానిగా ఎదిగే సత్తా భారత్‌కు ఉందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఆయన శనివారం కువైట్ సిటీలో 'హలా మోదీ' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కువైట్‌లో నివసిస్తున్న భారతీయులు హాజరయ్యారు. వారిని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ప్రపంచ ప్రగతిలో మన భారతీయులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతిఏటా వందలాది మంది భారతీయులు కువైట్‌కు వస్తున్నారని, ఇక్కడ భారతీయతను చాటిచెబుతున్నారని పేర్కొన్నారు. కువైట్ అనే చిత్రానికి భారతీయ నైపుణ్యాలు అనే రంగులద్దుతున్నారని వివరించారు. భారతీయ ప్రతిభ, సాంకేతికతను కువైట్ సంప్రదాయంతో మేళవిస్తున్నారని చెప్పారు. కువైట్ దేశం మినీ–హిందుస్తాన్‌గా పేరుగాంచిందని గుర్తుచేశారు.

మనవరాలి ఆశ నెరవేరింది
సాక్షి ప్లస్ జాతీయం ఈ-పేపర్‌లో...

టార్గెట్ కేజ్రీవాల్!



ఆప్ చీఫ్‌ను విచారించేందుకు ఈడీకి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ గ్రీన్ సిగ్నల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కష్టాలు మరోసారి చుట్టుముట్టనున్నాయి. ఢిల్లీ మద్యం విధానం రూపొందించడం, అమలు చేయడంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్న కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు తాజాగా అనుమతి ఇచ్చినట్లు ఎల్జీ కార్యాలయంలోని విశ్వసనీయ వర్గాలు శనివారం వెల్లడించాయి. నేరశిక్షాస్మృతి ప్రకారం ఎవరైనా ప్రజాప్రతినిధిని విచారించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అందుకే ఎమ్మెల్యే అయిన కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా కోరారు. కేజ్రీవాల్‌ను విచారించేందుకు డిసెంబర్ ఐదో తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి కోరిన విషయం తెలిసిందే. ఈ విషయంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ హోదాలో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ ధర్మేంద్రకు ఈడీ లేఖ సైతం రాసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తనపై విచారణ ప్రక్రియను నిలిపివేయాలంటూ కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌ను ఇటీవలే ఢిల్లీ హైకోర్టు కొట్టేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఈడీ మరో అడుగు ముందుకేసింది. ఇందులోభాగంగానే కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఎల్జీ వద్ద అనుమతి సంపాదించింది. మరోవైపు ఈడీ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్న ఆదేశాలపై కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు 2025 జనవరి 30న విచారించనుంది. ఈ కేసులో ఆప్ నేత మనీష్ సిసోడియా పిటిషన్‌పై విచారణను కూడా అదే రోజు వాయిదా వేసింది.

బీఎంసీ ఎన్నికల్లో ఒంటరి పోరు!

శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ వెల్లడి

ముంబై: మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమిగా జట్టుకట్టిన శివసేన(యూబీటీ), ఎన్సీపీ(ఎస్పీ), కాంగ్రెస్‌ల మధ్య లుకలుకలు నెమ్మదిగా బయటపడుతున్నాయి. వచ్చే ఏడాది జరగబోయే బృహణ్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ) ఎన్నికల్లో ఎంవీఏ మిత్రులతో పొత్తు పెట్టుకోవడం కష్టమేనని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. బీఎంసీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసే అవకాశం ఉందని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. శనివారం ముంబైలో మీడియాతో రౌత్ మాట్లాడారు. దేశ వాణిజ్యరాజధాని ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌ను అవిభాజ్య శివసేన ఏకంగా పాతికేళ్లపాటు అప్రతిహతంగా ఏలింది. 1997 నుంచి 2022దాకా బీఎంసీపై శివసేన పట్టుకొనసాగిన విషయం విదితమే. ''ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో కూటమిగా కాకుండా ఒంటరిగానే బరిలో దిగుదామని మా శివసేన కార్యకర్తలు పట్టుబడుతున్నారు. అందుకే వారితో ఈ అంశాన్ని చర్చించేందుకు పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సమావేశం అవుతున్నారు''అని రౌత్ వెల్లడించారు. కూటమిలో విభేదాలున్నాయన్న వాదనను రౌత్ తోసిపుచ్చారు. ''శివసేన రెండుగా చీలకముందుకూడా మేం గతంలో బీజేపీతో కలిసి ఉన్న సందర్భాల్లోనూ ఎన్నికల్లో మేం ఒంటరిగా పోటీచేశాంకదా. పుణె, పింప్రి–చించ్వాడ్, నాసిక్ పురపాలికల్లో ఎంవీఏ కూటమి ఉమ్మడిగానే పోటీ చేస్తుంది ''అని రౌత్ అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల మాదిరే అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ, బీజేపీలతో శివసేన ఉమ్మడిగా మహాయుతి కూటమిగా బీఎంసీ ఎన్నికల్లో బరిలో దిగుతామని శివసేన చీఫ్ ఏక్‌నాథ్ షిండే స్పష్టం చేశారు.

సీఎం ఫడ్నవీస్ వద్దే హోం

షిండేకు పట్టణాభివృద్ధి, అజిత్‌కు ఆర్థికం

నాగ్‌పూర్: మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కీలకమైన హోం శాఖను తన వద్దే ఉంచుకుని మంత్రి వర్గ సభ్యులకు పోర్ట్‌ఫోలియోలు కేటాయించారు. ఇంధన, న్యాయ, సాధారణ పరిపాలన, సమాచార ప్రచార మంత్రిత్వ శాఖలు సైతం సీఎం ఫడ్నవీస్ వద్దే ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ, ప్రజా పనుల విభాగం అప్పగించారు. మరో డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు ఆర్థిక, ప్రణాళిక, రాష్ట్ర ఎక్సైజ్ శాఖలను అప్పగించారు. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే శనివారం ఈ మేరకు కేటాయింపులు పూర్తి చేశారు.

25, 26వ తేదీల్లో అయ్యప్ప దర్శనాలపై పరిమితులు

శబరిమల: కేరళలోని ప్రముఖ శబరిమల అయ్యప్ప క్షేత్రంలో భక్తుల తాకిడి తీవ్రతరమైంది. భక్తుల రద్దీని నివారించేందుకు వార్షిక మండల పూజోత్సవాల సందర్భంగా ఈ నెల 25, 26వ తేదీల్లో ఆన్‌లైన్, స్పాట్ బుకింగ్స్‌పై పరిమితులు విధించాలని ట్రావెన్‌కోర్ దేవస్వామ్ బోర్డ్(టీడీబీ) నిర్ణయించింది. ఈ రెండు రోజుల్లో 50 వేలు, 60వేలకు మించి భక్తులను దర్శనాలకు అనుమతించబోమని టీడీబీ శనివారం తెలిపింది. అదేవిధంగా, స్పాట్ బుకింగ్స్ కూడా 25, 26వ తేదీల్లో రోజుకు 5 వేలకు మించి అనుమతివ్వమని పేర్కొంది.

పేలిన టైరు.. ట్రక్కును ఢీకొన్న బస్సు

22 మంది మృతి, 13 మందికి గాయాలు

సావో పౌలో: బ్రెజిల్‌లో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. సావో పౌలో నుంచి 45 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు మినాస్ గెరాయిస్ ప్రాంతంలో హైవేపై అదుపుతప్పి ట్రక్కును ఢీకొట్టింది. ఘటనలో బస్సులోని 22 మంది చనిపోయారు. గాయపడిన 13 మందిని ఆస్పత్రులకు తరలించారు. నుజ్జయిన బస్సులో ఇరుక్కుపోయిన వారిని వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మృతుల సంఖ్య పెరగొచ్చని చెబుతున్నారు.

పాక్‌లో ఉగ్రదాడి.. 16 మంది జవాన్లు మృతి

పెషావర్: కల్లోలిత ఖైబర్ ప్రావిన్స్‌లోని ఆర్మీ చెక్‌పోస్ట్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 16 మంది సైనికులు చనిపోగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. అఫ్గాన్ సరిహద్దుల్లోని దక్షిణ వజీరిస్తాన్ జిల్లా మకీన్ ప్రాంతంలోని లిటా సర్ చెక్‌పోస్ట్ వద్ద శనివారం ఉదయం ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు.


కంటైనర్ కింద నలిగిన కారు

మృత్యుశకటమైన కంటైనర్

- లారీ పడటంతో నుజ్జయిన కారు
- అందులో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి దుర్మరణం
- బెంగళూరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

దొడ్డబళ్లాపురం: కర్ణాటకలోని బెంగళూరు శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో లారీ కింద నలిగిపోయి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఉదయం 11 గంటలప్పుడు తాళెకెరె గ్రామం సమీపంలోని నెలమంగల వద్ద బెంగళూరు– తుమకూరు జాతీయ రహదారిపై ఈ అనూహ్య ప్రమాదం జరిగింది. విజయపుర (బిజాపుర) జిల్లాకు చెందిన చంద్రం యోగప్ప కుటుంబం విజయపురకు తమ ఓల్వో కారులో బయల్దేరింది. మార్గమధ్యంలో నెలమంగల వద్ద అటుగా వెళ్తున్న ఒక భారీ కంటెయినర్ లారీ అతి వేగంతో దూసుకెళ్లి కారు, మినీ వ్యాన్‌ను ఢీకొట్టింది. బలంగా ఢీకొనడంతో లారీ పక్కకు ఒరిగి పక్కనే వెళ్తున్న వీళ్ల కారుపై అమాంతం పడిపోయింది. అంతటి భారీ బరువు ధాటికి కారు మొత్తం నుజ్జు నుజ్జయింది. దీంతో అందులో ఉన్న చంద్రం యోగప్ప, భార్య గౌరాబాయి, పిల్లలు జాన్, ఆర్య, దీక్ష, బంధువు విజయలక్ష్మి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చంద్రం యోగప్పకు బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో సొంతంగా ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. వారాంతం కావడంతో సొంతూరికి బయల్దేరగా ఇలా విషాదంగా ముగిసింది. ఈయన స్వస్థలం మహారాష్ట్ర కాగా, విజయపురలో స్థిరపడినట్లు సమాచారం.

రష్యాలో 9/11 తరహా దాడి!

భవనాలను డ్రోన్లతో ఢీకొట్టించిన ఉక్రెయిన్

కజాన్: అమెరికాలోని ప్రపంచ వాణిజ్య సంస్థ జంట ఆకాశహర్మ్యాలను విమానాలు ఢీకొట్టిన దాడి ఘటన వీడియో విశ్వవ్యాప్తంగా నాడు వైరల్ అయింది. ఇప్పుడు అలాంటి దాడి వీడియో ఒకటి వైరల్‌గా మారింది. తమ భూభాగాల దురాక్రమణకు దిగిన రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్ ప్రతికార దాడులతో ప్రతిఘటిస్తున్న విషయం విదితమే. ఇందులోభాగంగా శనివారం రష్యాలోని టటారస్థాన్ పరిధిలోని కజాన్ నగరంలో జనావాస ప్రాంతాల్లో ఉక్రెయిన్ డ్రోన్లతో దాడులకు తెగబడింది. అందులో చూడ్డానికి అచ్చం చిన్నపాటి విమానంలా ఉన్న ఒక డ్రోన్ బహుళ అంతస్తుల బిల్డింగ్‌లో చివరి అంతస్తును ఢీకొనడం ఒక్కసారిగా మంటలు చెలరేగడం ఆ వీడియోలోఉంది. ఆరు డ్రోన్లు జనావాసాలపై, రెండు పారిశ్రామికవాడలపై పడ్డాయని టటారస్తాన్ గవర్నర్ రుస్తమ్ మిన్నీకన్నోవ్ ప్రకటించారు. అయితే ఈ దాడిలో ఎలాంటి పౌర ప్రాణనష్టం జరగలేదని రష్యా చెబుతోంది. అయితే దాడుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా కజాన్ విమానాశ్రయాన్ని మూసేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానాల రాకపోకలను నిలిపేశారు. ఆదివారం సైతం కజాన్ నగర ప్రజలు ఒకే చోట గుమికూడి ఉండొద్దని, జనసమ్మర్ద ప్రాంతాలకు వెళ్లొద్దని గవర్నర్ రుస్తమ్ జాగ్రత్తలు చెప్పారు. గత 24 గంటల్లో ఉక్రెయిన్ పైకి రష్యా 113 డ్రోన్ల దాడులు చేసింది. అయితే వీటిల్లో 57 డ్రోన్లను నేలమట్టంచేశామని ఉక్రెయిన్ తెలిపింది. 56 డ్రోన్లను నిర్వీర్యం చేశామని తెలిపింది.


డ్రోన్ దాడితో చెలరేగిన మంటలు



అమెరికాకు తప్పిన షట్‌డౌన్ గండం

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాకు షట్‌డౌన్ గండం తప్పింది. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లుపై అమెరికా కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ చివరి నిమిషంలో ఆమోదముద్ర వేసింది. వాస్తవానికి శుక్రవారం రాత్రిలోగా బిల్లు ఆమోదం పొందకపోతే ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే, గడువుకు కొన్ని గంటల ముందు స్పీకర్ మైక్ జాన్సన్ ప్రవేశపెట్టిన కొత్త బిల్లుకు ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. అనంతరం ఈ బిల్లును సెనేట్‌కు పంపించారు. సెనేట్ సైతం ఆమోదించింది. దీంతో షట్‌డౌట్ గండం నుంచి అమెరికా తప్పించుకుంది. ఈ బిల్లును అధ్యక్షుడు జో బైడెన్‌కు పంపించారు. ఆయన సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాల్చనుంది. జో బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ద్రవ్య వినిమయ బిల్లును కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టిగా వ్యతిరేకించారు.

దీంతో వచ్చే ఏడాది మార్చి 14 వరకు ప్రభుత్వ అవసరాలకు, విపత్తుల్లో సహాయక చర్యలకు నిధులు సమకూర్చేలా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. రుణాలపై సీలింగ్‌ను రెండేళ్లపాటు రద్దు చేయడం సహా ట్రంప్ లేవనెత్తిన పలు డిమాండ్లను ఇందులో చేర్చారు. గతంలో ట్రంప్ ప్రభుత్వ పాలనలో అమెరికాలో 35 రోజులపాటు షట్‌డౌన్ కొనసాగింది. అమెరికా చరిత్రలో ఇదే సుదీర్ఘమైన షట్‌డౌన్‌గా చెబుతుంటారు. షట్‌డౌన్ వల్ల లక్షల మంది ఉద్యోగులకు జీతాలు అందలేదు.

జర్మనీ క్రిస్మస్ మార్కెట్‌లో దారుణం..

జనంపైకి కారును నడిపిన దుండగుడు

- చిన్నారి సహా ఐదుగురు మృత్యువాత
- 200 మందికిపైగా గాయాలు
- క్షతగాత్రుల్లో 41 మంది పరిస్థితి విషమం

మగ్దెబర్గ్: క్రిస్మస్ పండుగ వేళ జర్మనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. మగ్దెబర్గ్ నగరంలోని రద్దీగా ఉండే క్రిస్మస్ మార్కెట్‌లో జనంపైకి ఓ ఆగంతకుడు కారును వేగంగా నడిపాడు. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటల సమయంలో ఓ కారు మార్కెట్‌లో 400 మీటర్ల దూరం వరకు వేగంగా వెళ్లినట్లు సీసీఫుటేజీలో నమోదైంది. ఈ ఘటనలో తొమ్మిదేళ్ల చిన్నారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 200 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. వీరిలో కనీసం 41 మంది పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య పెరగొచ్చని మీడియా తెలిపింది. ఈ దారుణానికి పాల్పడిన తాలెబ్.ఎ.(50)అనే వ్యక్తిని సాయుధ పోలీసులు వెంటనే చుట్టుముట్టి, అదుపులోకి తీసుకున్నారు. వచ్చిన దారినే తిరిగి వెళ్లేందుకు కారును మళ్లించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇదంతా కేవలం మూడే మూడు నిమిషాల్లో జరిగిపోయింది. కారు ముందు భాగం, విండ్ స్క్రీన్ ధ్వంసమైంది. రద్దీగా మార్కెట్‌లో పాదచారుల మార్గంపైకి బీఎండబ్ల్యూ కారు వెళ్తున్న దృశ్యం అక్కడి సీసీ ఫుటేజీలో రికార్డయింది. తాలెబ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారని అధికారులు తెలిపారు. కాగా, ఘటనలో ఏడుగురు భారతీయులు గాయపడినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. వీరిలో ముగ్గురు చికిత్స అనంతరం హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యారంది.

భయానక విషాద ఘటన

ఘటనాస్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న బాధితులను తరలించేందుకు 100 మంది పోలీసులు, వైద్య సిబ్బంది, ఫైర్ ఫైటర్లతోపాటు 50 మంది సహాయక సిబ్బందిని రంగంలోకి దించారు. దారుణం తెలిసిన వెంటనే ఛాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ మగ్దెబర్గ్ వెళ్లి ఘటనాస్థలిని పరిశీలించారు. దాడిని భయానక విషాద ఘటనగా అభివర్ణించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆనందానికి మారుపేరుగా ఉన్న మగ్దెబర్గ్‌లో ఘోరం చోటుచేసుకుందన్నారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉందన్న వార్తలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు దారి తీసిన కారణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతామని ప్రకటించారు. ఈ ఘటన నేపథ్యంలో జర్మనీ వ్యాప్తంగా ఉన్న క్రిస్మస్ వారాంతపు మార్కెట్లను ముందు జాగ్రత్తగా మూసివేశారు.

ఏటీఎఫ్‌పై జీఎస్టీకి నో!

- రాష్ట్రాలు సమ్మతించడం లేదన్న ఆర్థిక మంత్రి నిర్మల
- జీవిత బీమాపై పన్ను తగ్గింపు నిర్ణయం వాయిదా

జైసల్మేర్: విమానాల్లో వాడే ఇంధనం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌ను (ఏటీఎఫ్) వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి తీసుకురావడానికి రాష్ట్రాలు అంగీకరించడం లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం తెలిపారు. 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ముడి పెట్రోలియం డీజిల్ ఉత్పత్తుల్లో భాగమని భావిస్తున్నందున ఏటీఎఫ్‌ను వేరుగా చూడలేమని రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయని ఆమె చెప్పారు. రుణ నిబంధనలను పాటించనందుకు రుణగ్రహీతల నుంచి బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు వసూలు చేసే జరిమానా ఛార్జీలపై జీఎస్టీ మినహాయించాలని కౌన్సిల్ తాజాగా నిర్ణయించింది. రూ.2,000 కంటే తక్కువ చెల్లింపులను ప్రాసెస్ చేసే పేమెంట్ అగ్రిగేటర్లు జీఎస్టీ మినహాయింపునకు అర్హులు. ఫిన్‌టెక్ సర్వీసెస్, పేమెంట్ గేట్‌వేలకు ఇది వర్తించదని మంత్రి స్పష్టం చేశారు. ఎగవేతకు ఆస్కారం ఉన్న వస్తువుల కోసం ట్రాక్ అండ్ ట్రేస్ మెకానిజంను అమలు చేసే ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదించింది.

ఆరోగ్య బీమాపై..

బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపునకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి వివరించారు. ఈ అంశంపై సమగ్ర అధ్యయనం కోసం మంత్రుల బృందానికి మరింత సమయం అవసరమని, పన్నుల హేతుబద్ధీకరణపై



జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాన్ని కూడా వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. దీనిపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ నుంచి సూచనల కోసం ఎదురుచూస్తున్నామని మంత్రి చెప్పారు. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలకు చెల్లించే బీమా ప్రీమియంలను, అలాగే ఆరోగ్య బీమా కవర్ కోసం సీనియర్ సిటిజన్లు చెల్లించే ప్రీమియంను జీఎస్టీ నుంచి మినహాయించాలని మంత్రుల బృందం సిఫార్సు చేసింది. రూ.5 లక్షల వరకు కవరేజీతో ఆరోగ్య బీమా కోసం సీనియర్ సిటిజన్లు కాకుండా ఇతర వ్యక్తులు చెల్లించే ప్రీమియంపై జీఎస్టీ మినహాయించాలని బృందం సూచించింది.

పాత ఈవీలపై పన్ను..

పాత ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఒక వ్యక్తి మరో వ్యక్తికి విక్రయిస్తే ఎటువంటి జీఎస్టీ ఉండదు. అయితే కంపెనీ లేదా పాత కార్ల అమ్మకాల్లో ఉన్న నమోదిత విక్రేత ఈవీ/పెట్రోల్/డీజిల్ కారును విక్రయిస్తే మార్జిన్ విలువపై 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బలవర్ధకమైన (ఫోర్టిఫైడ్) బియ్యంపై 18 శాతంగా ఉన్న జీఎస్టీ రేటు 5 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి చెప్పారు. అయితే జన్యు చికిత్సను జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయిస్తున్నట్టు వివరించారు. పాప్‌కార్న్‌పై పన్ను రేటు మారలేదని జీఎస్టీ కౌన్సిల్ వివరణ ఇచ్చింది. 50 శాతం పైగా ఫ్లైయాష్ కలిగి ఉన్న ఆటోక్లేవ్ ఏరేటెడ్ కాంక్రీట్ (ఏసీసీ) బ్లాక్స్‌పై జీఎస్టీ 18 నుంచి 12 శాతానికి కుదిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. మిరియాలు, ఎండు ద్రాక్షలను వ్యవసాయదారుడు సరఫరా చేస్తే జీఎస్టీ చెల్లించాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ.కోటి విలువైన 1000 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

-8లో



ఫిట్.. బాడీ సెట్..

కండలు తిరిగే దేహం అంటే యువతకు యమ క్రేజ్. దీనికోసం జిమ్‌కు వెళ్లి కసరత్తులు చేస్తుంటారు. రెగ్యులర్‌గా వెళ్లి సిక్స్ ప్యాక్ వచ్చేంత వరకూ కష్టపడుతుంటారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/21.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుము కుంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





భక్తిగీతాలు ఆలపించి.. క్రీస్తును స్తుతించి..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్, సీఎస్ శాంతి కుమారి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, క్రైస్తవ మత పెద్దలు, దైవజనులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఆలపించిన భక్తిగీతాలతో ఎల్‌బీ స్టేడియం పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.



న్యూ ఇయర్ వేడుకలపై గట్టి నిఘా



అక్రమంగా మద్యం సరఫరా చేస్తే కేసులు

- డ్రగ్స్ వినియోగదారులపై కఠిన చర్యలు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకలపై ఎక్సైజ్ పోలీసులు నిఘా పెట్టారు. అనుమతి లేని మద్యం, మాంసం సరఫరా, డ్రగ్స్ వినియోగం తదితరాలపై ఉక్కుపాదం మోపనున్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 30–40 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆమోదిత మద్యం మినహా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే న్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మత్తు పదార్థాలను వినియోగిస్తే నార్కోటిక్స్, డ్రగ్స్, అండ్ సైకోట్రాపిక్ (ఎన్‌డీపీఎస్) చట్టం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అనుమతి లేని ప్రాంతాలు, వాణిజ్య స్థలాల్లో మద్యం వినియోగించరాదని తెలిపారు. బెంగళూరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చే ట్రావెల్ బస్సులు, వాహనాలతో పాటు రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లలో ఎక్సైజ్ ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. నానాక్‌రాంగూడ, ధూల్‌పేట వంటి ప్రాంతాలపై నిఘా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

28న చర్లపల్లి టర్మినల్ ప్రారంభం: ఎంపీ ఈటల

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 28న చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ ప్రజలకు అంకితం చేయబోతున్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికుల తాకిడి ఎక్కువ కావటంతో చర్లపల్లిలో రైల్వే టర్మినల్ నిర్మించినట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రూ.500 కోట్లతో చర్లపల్లిలో గొప్ప రైల్వేస్టేషన్ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యం.. అంత్యోదయ నినాదం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో అట్టడుగు వర్గాల వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నదే అంత్యోదయ ముఖ్య ఉద్దేశమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రస్తుత ప్రధాని మోదీ చాలా కష్టపడిపైకి వచ్చారని తెలిపారు. సమాజం, సర్కారు.. ఈ రెండింటినీ విడదీసి చూడలేమన్నారు. సమాజం కోసం పాలసీ మేకర్స్ పని చేస్తున్నారన్నారు. ప్రపంచంలో సగం మంది మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆయా రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ప్రైడ్ అవార్డులు సొంతం చేసుకున్న వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన రావు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




ఉత్తుత్తి గ్యాసేనా?

కొంత మందికే రూ.500 వంట గ్యాస్

అర్హత సాధించినా కొందరికే పరిమితం

- నిబంధనల వర్తింపునకు స్పష్టత కరువు

రాంనగర్‌కు చెందిన గృహిణి ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి , ఇందిరమ్మ.. ఇలా ఇతరత్రా పథకాల వర్తింపునకు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె అర్హత సాధించడంతో గృహజ్యోతి కింద విద్యుత్ జీరో బిల్లు వర్తించింది. కానీ.. రూ.500 వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం వర్తించలేదు. ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ ఆమె భర్త పేరుపై ఉండటంతో ఈ పథకం వర్తించదని ప్రచారం జరగడంతో.. సరిగా ఐదు నెలల క్రితం ప్రభుత్వం దరఖాస్తును సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో కలెక్టరేట్‌లోని మీ సేవ కేంద్రానికి వెళ్లి మార్పు చేసుకుంది. అయినా.. ఆమెకు ఇప్పటి వరకు రూ. 500 గ్యాస్ పథకం వర్తించని పరిస్థితి నెలకొంది. అయితే.. దీనిపై గ్యాస్ ఏజెన్సీలతో పాటు పౌరసరఫరాల అధికారులకు సైతం స్పష్టత లేకపోవడం గమనార్హం.



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది గడిచింది. కానీ.. అర్హులందరికీ రూ.500కు వంటగ్యాస్ అందని ద్రాక్షగా మారింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా సిలిండర్‌పై సబ్సిడీ అందిస్తున్నా.. మెజార్టీ బీపీఎల్ కుటుంబాలకు వర్తించడం లేదు. బీపీఎల్ కింద ఒకే కుటుంబం గృహజ్యోతి పథకానికి అర్హత సాధించినా.. మహాలక్ష్మి పథకానికి మాత్రం అర్హత సాధించకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. దీంతో పూర్తి స్థాయి బహిరంగ మార్కెట్ ధర చెల్లించి వంట గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయక తప్పడం లేదు. లోక్‌సభ ఎన్నికల ముందు గ్యాస్ సబ్సిడీ వర్తింపు అమలు ప్రారంభమైంది. ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా బీపీఎల్ కుటుంబాలను గుర్తించారు. మిగతా పథకాల మాదిరిగా మహాలక్ష్మి పథకానికి కూడా తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. కానీ పథకం కొందరికే వర్తించడంతో పేద కుటుంబాలు నిరాశలో ఉన్నాయి.

ఒక్క శాతం సైతం దాటలేదు..

నగర పరిధిలో వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 31.18 లక్షలు ఉండగా అందులో కేవలం ఒక శాతం కనెక్షన్‌దారులకు మాత్రమే రూ.500 సబ్సిడీ వంటగ్యాస్ వర్తిస్తోంది. సుమారు 24.74 లక్షల కుటుంబాలు మహాలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో సుమారు 19.01 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. అయితే.. సబ్సిడీ గ్యాస్ మాత్రం మూడు లక్షలలోపు కనెక్షన్‌దారులు మాత్రమే ఎంపికైనట్లు పౌరసరఫరాల శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మిగతా సుమారు 16 లక్షల కనెక్షన్‌దారులు అర్హులుగా ఉన్నా.. సబ్సిడీ వర్తింపు మాత్రం అందని ద్రాక్షగా మారింది.

- నగర పరిధిలో సుమారు 52,65,129 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో ప్రజాపాలనలో గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ కోసం 24 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో 11 లక్షల కుటుంబాలు జీరో బిల్లుకు అర్హత సాధించాయి. మిగతా కుటుంబాలు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి.

కేంద్రం సబ్సిడీ ఓకే..

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వంట గ్యాస్ సబ్సిడీ మాత్రం వినియోగదారులకు బ్యాంక్ ఖాతాలో నగదు బదిలీ కింద రూ. 40.71 జమ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరతో నిమిత్తం లేకుండా వినియోగదారు బ్యాంక్ ఖాతాలో పరిమితంగా నగదు జమ చేస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ప్రకారం 14.5 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855. పలుకుతోంది. గృహ వినియోగదారులందరూ సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థల ద్వారా సబ్సిడీని నగదు బదిలీ కింద వినియోగదారుల ఖాతాలో జమ చేస్తోంది.

వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు కృషి: చిన్నారెడ్డి

కాచిగూడ: వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాలలో 'పాడినేల వ్యవసాయం – సమస్యలు, సవాళ్లు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గతంలో మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో



సదస్సులో పాల్గొన్న చిన్నారెడ్డి తదితరులు

వర్షపాతం తక్కువగా ఉండటంతో నీరు లేక భూములు డ్రైల్యాండ్‌గా మారి పంటలు పండక ప్రజలు వలస వెళ్లే వారని అన్నారు. ప్రస్తుతం భూములను సారవంతం చేయడంతో ఆ పరిస్థితిని అధిగమించి పంటలను పండిస్తున్నారని తెలిపారు. మేధావులు, యువత వ్యవసాయ రంగం పట్ల ప్రజలకు అవగాహన పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. సదస్సులో తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.ముత్యం రెడ్డి, యూఓహెచ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ శ్రీజిత్ మిశ్రా, సీఈఎస్ఎస్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ.రేవతి, ఐసీఏఆర్ రాయపూర్ జాయింట్ డైరెక్టర్ ఎ.అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ట్రేడ్'పై గురి!



నిధుల కోసం బల్దియా చర్యలు

- ఆదాయ మార్గాలపై కమిషనర్ అన్వేషణ
- సిబ్బంది వేతనాల చెల్లింపులకు తంటాలు
- ఫీజులు వసూలు చేయాలని ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: నెలాఖరు వస్తోందంటే చాలు జీహెచ్‌ఎంసీ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. సిబ్బంది జీతాల చెల్లింపుల కోసం అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు. త్వరలోనే డిసెంబర్ నెలతో పాటు సంవత్సరం కూడా ముగియ వస్తుండటంతో సకాలంలో జీతాలు చెల్లించేందుకు ఆదాయ మార్గాలపై దృష్టి సారించారు. ప్రస్తుతం కమిషనర్ ఇలంబర్తి కన్ను ట్రేడ్ లైసెన్సులపై పడింది. వాస్తవానికి డిసెంబర్ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్సుల ఫీజులు వసూలు కావాలి. కానీ, ఇప్పటి వరకు వాటి గురించి సంబంధిత అధికారులెవరూ పెద్దగా పట్టించుకోలేదు.

లైసెన్సులు తీసుకోని వారిపై దృష్టి

ట్రేడ్ లైసెన్సులున్నప్పటికీ ఫీజు చెల్లించని వారితోపాటు అసలు ట్రేడ్ లైసెన్సులే లేకుండా ఎన్నో వ్యాపారాలు నడుస్తుండటం తెలిసిందే. సాధారణంగా నివాస భవనాలకు అనుమతులు పొంది, వాటిని వ్యాపార కార్యకలాపాలకు వినియోగించేవారి గురించి తెలిసిందే. ఇది ఓవైపు పరిస్థితి కాగా.. మరోవైపు వాణిజ్య భవనానికే అనుమతి తీసుకున్నప్పటికీ, ట్రేడ్ లైసెన్సులు తీసుకోనివారు/ఫీజు చెల్లించని వారు భారీగానే ఉన్నట్లు గుర్తించారు. జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను జాబితా మేరకు 3,17,033 వాణిజ్య భవనాలుండగా, వాటిలో కేవలం 1,09,702 భవనాల వారు మాత్రమే ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించారు. ఫీజు చెల్లించని వారితోపాటు ట్రేడ్ లైసెన్స్ నంబర్లు ఆస్తిపన్ను నంబర్ (పీటీఐఎన్)తో సరిపోలని భవనాలు కలిపి 2,49,522 ఉన్నట్లు గుర్తించారు. సదరు భవనాలను గుర్తించి ఈ నెలాఖరులోగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేయాల్సిందిగా కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అలాంటి భవనాలు సర్కిళ్ల వారీగా

సర్కిల్	భవనాలు
కాప్రా	7,853
ఉప్పల్	5,483
హయత్‌నగర్	6,773
ఎల్బీనగర్	6,094
సరూర్‌నగర్	6,893
మలక్‌పేట	6,572
సంతోష్‌నగర్	3,022
చాంద్రాయణగుట్ట	2,451
చార్మినార్	1,5313
ఫలక్‌నుమా	5,171
రాజేంద్రనగర్	5,477
మెహిదీపట్నం	8,492
కార్వాన్	4,625
గోషామహల్	3,4137
ముషీరాబాద్	6,675
అంబర్‌పేట	9,750
ఖైరతాబాద్	1,4745
జూబ్లీహిల్స్	9,815
యూసుఫ్‌గూడ	3,209
శేరిలింగంపల్లి	1,7055
చందానగర్	7,437
ఆర్‌సీపురం, పటాన్‌చెరు	2,390
మూసాపేట్	7,948
కూకట్‌పల్లి	7,349
కుత్బుల్లాపూర్	6,653
గాజులరామారం	4,591
అల్వాల్	4,903
మల్కాజిగిరి	5,549
సికింద్రాబాద్	2,773
బేగంపేట	20,324

మెట్రో రెండో దశ పనులు త్వరలో

భూ బాధితులకు గజానికి రూ.81 వేల పరిహారం

- ప్రయాణికులకు చివరి మైలు కనెక్టివిటీకి చర్యలు
- ర్యాపిడోతో భాగస్వామ్యం: మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న మెట్రో ఎండీ, రాపిడో ప్రతినిధులు

అమీర్‌పేట: మెట్రో రెండో దశ పనులు త్వరలో ప్రారంభమవుతాయని, స్థలాలు ఇచ్చేవారికి గజానికి రూ.81 వేలు ఇస్తామని హైదరాబాద్ కలెక్టర్ ఇప్పటికే ప్రకటించినట్లు మెట్రోరైల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రయాణికులకు చివరి మైలు కనెక్టివిటీ మెరుగుపర్చేందుకు ర్యాపిడోతో భాగస్వామ్యం చేసుకున్నట్లు చెప్పారు. శనివారం అమీర్‌పేట హోటల్ గ్రీన్ పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 76 కిలో మీటర్ల వరకు రెండో దశ మెట్రో పనులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని, కేంద్రం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతామన్నారు. పాత బస్తీకి మెట్రో రైలు సౌకర్యం కల్పించాలనే డిమాండ్ పెరిగిందని, భూసేకరణ కోసం 1,100 ఆస్తులను గుర్తించినట్లు తెలిపారు. స్థలాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చే వారికి 10 రోజుల్లో చెక్కులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం రోడ్ల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

నిత్యం 5 లక్షల మంది మెట్రో జర్నీ

నగరంలో ప్రతి రోజూ 5 లక్షల మంది వరకు మెట్రోలో ప్రయాణం చేస్తున్నారని ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. లక్ష మంది ప్రయాణికులకైనా బస్సు, ర్యాపిడో ద్వారా కనెక్టివిటీ కల్పించాలని భావిస్తున్నామన్నారు. ఆటోల్లో ప్రయాణ ఖర్చులు ఎక్కువ అవుతున్న తరుణంలో ర్యాపిడో కేవలం 3 కిలో మీటర్ల వరకు రూ.30 మాత్రమే చార్జి చేయడం సంతోషదాయకమన్నారు.

మహిళా ప్రయాణికుల భద్రతపై రాజీ లేదు..

బైక్ టాక్సీలతో మహిళా ప్రయాణికులు సునాయాస ప్రయాణం చేసేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, భద్రత విషయంలో రాజీ పడేది లేదని చెప్పారు. సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆకతాయిలను పట్టుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక ఫోన్ నంబర్‌ను సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ, ఎల్‌టీహెచ్ఆర్ఎంఎల్ సీఎస్ఓ మురళీ వరదరాజన్, రాపిడో సీఎంఓ పవన్ దీప్ సింగ్, సందీప్ మండల్, రిషి కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మా కష్టాలు కనిపించవా!

వణికించే చలిలో దివ్యాంగుల ఆవేదన

- పూర్తి స్థాయిలో అందని దుప్పట్లు
- దోమల బెడదతో తప్పని తిప్పలు
- నాణ్యత లేని భోజనంతో నానా తంటాలు
- ఇదీ దారుషిఫా అంధ బాలుర వసతి గృహ విద్యార్థుల దయనీయ స్థితి



నాణ్యత లోపించిన చారు, అన్నం

సాక్షి, సిటీబ్యూరో: అసలే శీతాకాలం. ఆపై వణికించే చలిపులి.. మరోవైపు దోమల మధ్య నిద్ర.. శుచీ శుభ్రత లేని ఆహారం.. పూర్తిస్థాయిలో అందుబాటులో లేని దుప్పట్లు.. ఇలా ఎన్నో ఇబ్బందులతో ఆ దివ్యాంగులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. నగరంలోని దారుషిఫా ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహం సమస్యలకు నెలవుగా మారింది. ఇక్కడి విద్యార్థులను పట్టించుకునే వారే లేకుండాపోయారు. తమ కష్టాలు పాలకులకు, అధికారులకు కానరావా? అంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి దివ్యాంగ విద్యార్థుల దయనీయ పరిస్థితులను 'సాక్షి' ప్రతినిధి స్వయంగా పరిశీలించగా నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయి.

ఉన్నది ఒకే గీజర్..

గ్రామీణ ప్రాంతాలకు చెందిన 60 మంది విద్యార్థులు పాతబస్తీలోని అంధుల పాఠశాలలో చదువుతుంటున్నారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో చలి వణికిస్తోంది. కానీ.. ఇక్కడి హాస్టల్‌లో వేడి నీటి సౌకర్యం లేకుండాపోయింది. దీంతో విద్యార్థులు ఉదయం పూట వణికించే చలిలోనే చల్లని నీటితో స్నానాలు చేస్తున్నారు. ఉన్న ఒక్క గీజర్ 60 మందికి సరిపోవడం లేదు. రాత్రిపూట చలి తీవ్రత కారణంగా అరకొర దుప్పట్లతో నిద్రకుపక్రమిస్తున్నారు.

నీళ్ల చారు.. ఉడకని అన్నం..

ఉడికీ ఉడకని అన్నం. పలచని నీళ్ల పప్పు. కడుపు నింపని తిండి. చిన్న పాత్రల్లోనే వండుతుండటంతో విద్యార్థులందరికీ అన్నం సరిపోవడం లేదు. నాణ్యత లేని ఆహారం.. ఇలా ఎన్నో సమస్యల మధ్య దివ్యాంగ విద్యార్థులు రోజులు గడుపుతున్నారు. చలికాలం రాక ముందే విద్యార్థులకు దుప్పట్లు అందించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ అవి పూర్తి స్థాయిలో అందలేదు. యూనిఫారం ఇచ్చారు కానీ అవి సైజులు సరిగా లేక పోవడంతో విద్యార్థులు వాటిని వాడటం లేదు.



దుప్పటి లేకుండానే..

అడ్రస్ లేని వార్డెన్..

వసతి గృహంలో వార్డెన్ అందుబాటులో ఉండడం లేదు. విద్యార్థులకు జ్వరం, జలుబు వంటివి వస్తే సమయానికి వైద్యం అందడం లేదు. ఒకే నర్సు ఇక్కడ అందుబాటులో ఉన్నారు. రాత్రిపూట సిబ్బంది ఎవరూ ఇక్కడ ఉండటం లేదు. ఇలా చెబుతూపోతే దారుషిఫా అంధ బాలుర వసతి గృహంలో సమస్యలు ఎన్నో.. ఎన్నెన్నో..!



తమ గోడు వెళ్లబోసుకుంటున్న దివ్యాంగ విద్యార్థులు

న్యాయ నిపుణులతో హైడ్రా కమిషనర్ సమావేశం



న్యాయ నిపుణులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్: చెరువుల పరిరక్షణ, పునరుజ్జీవానికి కృషి చేస్తున్న హైడ్రాకు తగిన న్యాయ సలహాలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని న్యాయ నిపుణులు వెల్లడించారు. శనివారం హైడ్రా కార్యాలయంలో ప్రభుత్వ భూములు కాపాడుతున్న సందర్భంగా తలెత్తుతున్న ఇబ్బందులు, న్యాయపరమైన అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలతో పాటు రహదారులు, పార్కులు కబ్జాకు కాకుండా హైడ్రా కాపాడుతోందన్నారు. చెరువులను పునరుద్ధరణ, వరద కాలువలను సజీవంగా ఉంచడంతోనే నగరానికి వరద ముప్పు తగ్గుతుందని నిపుణులు సూచించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది జస్టిస్ రేసు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నబోయిన చలి!

- కొద్ది రోజులుగా తగ్గిన చలి ప్రభావం
- బంగాళాఖాతంలో అల్పపీడనమే కారణం
- ఈ నెల చివరి వరకూ ఇదే పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొద్ది రోజులుగా చలి తీవ్రత తగ్గింది. గత ఏడాది ఇదే సమయానికి చలితో ప్రజలు వణికిపోయారు. కానీ ఈ ఏడాది మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చలికాలంలో ఇదెక్కడి చోద్యం అంటూ విస్తుపోతున్నారు. ఈ నెల చివరి వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

కారణాలేంటి..?

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తమిళనాడు, ఏపీల్లోనూ గత వారంలో వర్షాలు కురిశాయి. ఈ వర్షాల కారణంగా అక్కడి నుంచి తేమ గాలులు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సాధారణంగా పొడిగాలులతో చలి తీవ్రత పెరుగుతుంది. కానీ తేమ గాలులతో ఉష్ణోగ్రతలు పెరిగి, చలి తీవ్రత తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. మరో వారం రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటుందన్నారు. ఆ తర్వాత తేమ తగ్గితే ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందంటున్నారు.

సర్వసాధారణమే..

పశ్చిమ పసిఫిక్ మహా సముద్రం నుంచి వచ్చిన గాలుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. చలికాలం ప్రారంభంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మళ్లీ కొద్దిరోజుల పాటు చలి తీవ్రత తగ్గుతుంది. ఏటా ఇలాంటి పరిస్థితులు ఉంటాయి. కాకపోతే పది రోజులు కొంచెం అటు ఇటుగా మారుతూ ఉంటాయి. ఇది సర్వసాధారణమైన విషయం.

– బాలాజీ, తెలంగాణ వెదర్‌మ్యాన్

రూ.5.25 లక్షలు రీఫండ్

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరస్తుల చేతికి చిక్కి మోసపోయిన రూ.5.25 లక్షల సొమ్మును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేసి, బాధితుడికి అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారికి సైబర్ నేరస్తులు స్టాక్ ట్రేడింగ్ పేరుతో వల వేశారు. అధిక లాభాలు అందిస్తామని నమ్మించడంతో కేటుగాళ్లు సూచించిన బ్యాంక్ ఖాతాలకు బాధితుడు రూ.7.25 లక్షల సొమ్మును బదిలీ చేశాడు. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో సత్వరమే స్పందించిన పోలీసులు అనధికారిక లావాదేవీలు జరిగాయని బ్యాంక్‌కు సమాచారం అందించి, ఖాతాలోని సొమ్మును ఫ్రీజ్ చేయించారు. సొమ్మును తిరిగి అందజేయాలని కోరుతూ బాధితుడు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు రూ.5.25 లక్షలు బాధితుడికి అందజేశారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

మరొకరికి గాయాలు



దుర్గాప్రసాద్ మృతదేహం

శామీర్‌పేట్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన శీలం దుర్గా ప్రసాద్ (27), నాగవంశీ (25) సిద్దిపేట జిల్లా, కర్కపట్ల గ్రామంలో ఉంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. బైక్‌పై నగరానికి వెళ్లిన వారు కర్కపట్లకు తిరిగి వస్తుండగా అలియాబాద్ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న దుర్గాప్రసాద్ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నాగవంశీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

- రూ.కోటి విలువైన మత్తుపదార్థాల పట్టివేత
- నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌లో విక్రయించేందుకు యత్నం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్, చైతన్య

పటాన్‌చెరు టౌన్: నూతన సంవత్సర వేడుకల కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.కోటి విలువైన 1000 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రూపేశ్ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ చైతన్యతో కలిసి శనివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నార్కోటిక్స్ బ్యూరోకు అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ జాతీయ రహదారి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా..అదుపులోకి తీసుకుని విచారించారు. ముంబైకి చెందిన అబ్దుల్ హమీద్ షేక్, ముఖేష్ దూబే అనే ఇద్దరు వ్యక్తులు నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌కు చెందిన షేక్ అమీర్‌కు అప్పగించేందుకు వెయ్యి గ్రాముల మాదకద్రవ్యాలు తీసుకుని వచ్చినట్లు తెలిపారు. వీరిద్దరూ ఢిల్లీలో ఉంటున్న జెమ్మీ, జిన్నీ అనే నైజీరియన్ల వద్ద వీటిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఢిల్లీలో గ్రాము రూ.వెయ్యి చొప్పున కొనుగోలు చేసి.. హైదరాబాద్‌లో రూ.4 వేల నుంచి 5 వేలకు విక్రయిస్తున్నారని తెలిపారు. వీరితోపాటు ముంబైకి చెందిన రాయిస్ఖాన్ అనే వ్యక్తి సైతం నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నిందితుల విచారణలో వెల్లడైందన్నారు. కొనుగోలు దారులను సైతం గుర్తించామని త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. నిందితుల నుంచి రూ.కోటి విలువైన ఎండీఎం, నాలుగు మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఢిల్లీలో వీరికి డ్రగ్స్ విక్రయించిన జెర్రీ,జిమ్మీ, రైస్ రియాజ్ ఖాన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ తయారు, రవాణా, విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే జిల్లా నార్కోటిక్ బ్యూరో (87126 56777) నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీధర్, రవీందర్ రెడ్డి, సీతారాం, పటాన్‌చెరు సీఐలు వినాయక్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ అధికారులకు పోస్టింగులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి,సిటీబ్యూరో: రవాణాశాఖలో డీటీసీలు, జేటీసీలుగా పదోన్నతులు పొందిన అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

- జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్లు గా పదోన్నతి పొందిన మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ కు విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ ఐటీ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్‌గా, శివలింగయ్యకు అడ్మినిస్ట్రేషన్, ప్లానింగ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పోస్టింగ్‌లు ఇచ్చారు.
- డిప్యూటి ట్రాన్స్ పోర్ట్ కమిషనర్లులుగా పదోన్నతులు పొందిన రవీందర్ కుమార్ ను అదిలాబాద్ డీటీసీగా, ఎస్. వాణిని నల్గొండ డీటీసీగా, అఫ్రీన్ సిద్దిఖీని కమిషనర్ కార్యాలయంలో డీటీసీగా, కిషన్‌ను మహబూబ్ నగర్ డీటీసీగా , సదానందంకు రంగారెడ్డి డీటీసీగా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శాంతా వసంత ట్రస్ట్ పురస్కారాల ప్రదానం



పురస్కారాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ కేవీ.రమణాచారి, వరప్రసాద్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణ, వికాసానికి కృషి చేస్తేనే అవి పరిపూర్ణంగా భావితరాలకు అందుతాయని వక్తలు అన్నారు. పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి నేతృత్వంలోని శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి సినీ గీత కర్త డాక్టర్ సుద్దాల అశోక్‌తేజకు డాక్టర్ వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని, మనసు ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మన్నం వెంకటరాయుడికి వెంకట రమణారెడ్డి సాహిత్య సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ వరప్రసాదరెడ్డి ప్రపంచానికి ప్రాణాధారమైన ఔషధాన్ని అందించడమే కాకుండా సాంస్కృతి వైభవాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారన్నారు. డాక్టర్ కేవీ. రమణాచారి మాట్లాడుతూ వరప్రసాద్‌రెడ్డి తల్లిదండ్రులను స్మరించుకునేందుకు వారి పేరుతో సాహితీ మూర్తులకు కళాకారులకు క్రమం తప్పకుండా పురస్కారాలు అందించి గౌరవించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, శాంతా వసంత ట్రస్ట్ కార్యదర్శి నవీన్, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే నేర పరిశోధన సులువు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కె. శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న విజిలెన్స్ డీజీ శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: నేరాల పరిశోధనలో పోలీసు విచారణ అధికారితో పాటు ఫోరెన్సిక్ నిపుణులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమన్వయంతో చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం లా కాలేజీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ క్రైం సీన్ ఇన్వెస్టిగేషన్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన న్యాయ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గతంలో పోలీస్తే క్రైం సీన్ దర్యాప్తు చేసే విషయంలో చాలా మార్పులు వచ్చాయని ఒకప్పుడు సరైన సాంకేతిక పరిజ్ఞానం ఉండేది కాదని కానీ ఇప్పుడు అత్యాధునిక పరికరాలు, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీంతో నేరస్తులు తప్పించుకోవడం సాధ్యం కావడం లేదన్నారు. క్రైం ఇన్వెస్టిగేషన్‌లో ఐవో, ఎఫ్ఎస్ఎల్, పీపీ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తే నేరస్తులకు శిక్ష పడటంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులు ఆలోచనా విధానాన్ని కూడా ఎప్పటికప్పుడు మార్చుకోవాలని ఎంతో ఓపిక ఉండాలని అప్పుడే గొప్ప న్యాయవాదులుగా మారతారన్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో కొన్ని కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసిన తీరును విద్యార్థులతో కలిసి ఆయన పంచుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఫోరెన్సిక్ డీడీ శారద అవధానం, నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ నందిని, సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, లా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గీతా, ఇబ్రహీం అలీ సిద్దిఖీ, అక్బర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరంభం.. అట్టహాసం

- ప్రారంభమైన పత్రీజీ ధ్యాన మహాయాగ వేడుకలు
- జ్యోతి ప్రజ్వలన చేసిన ఎంపీలు మల్లురవి, నాగరాజు
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీలు మల్లురవి, నాగరాజు

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహాపిరమిడ్‌లో శనివారం ధ్యాన జనుల సందడి మధ్య పత్రీజీ ధ్యాన మహాయాగం-3 వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్, కర్నూలు ఎంపీలు మల్లురవి, నాగరాజు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, దివంగత ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ కుమార్తె పరిణిత, ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ.. ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి పత్రీజీ అని, ధ్యానమయ సమాజం కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయనీయమని కొనియాడారు. పత్రీజీ చూపిన ధ్యాన మార్గం అనుసరణీయమన్నారు. కర్నూల్ ఎంపీ నాగరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యాన సాధన చేయాలని, ధ్యానంతో తమ జీవితాలను బాగు చేసుకోవాలని సూచించారు.



హాజరైన ధ్యానులు

గోవా టు హైదరాబాద్

- మద్యం అక్రమ రవాణా
- వాస్కోడిగామా రైల్‌లో తరలింపు
- స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సర వేడుకల కోసం గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు గోవా వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో రూ.లక్ష విలువ చేసే 95 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి వాస్కోడిగామా రైలులో బయలుదేరారు. దీనిపై ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందడంతో వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ భాస్కర్, ఎస్ఐలు ప్రేమ్‌రెడ్డి, వీరాంజనేయులు రైల్లో తనిఖీలు చేపట్టారు. నాలుగు బోగీలలో సోదాలు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటి కమిషనర్ పి.దశరథ్ అభినందించారు.

సెల్ టవర్ ఎక్కి మాజీ హోంగార్డు హల్‌చల్

తొలగించిన 250 మంది హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



సెల్‌టవర్ ఎక్కిన మాజీ హోంగార్డు వీరాంజనేయులు

గన్‌ఫౌండ్రీ: ఎల్బీస్టేడియం వద్ద సెల్‌టవర్ ఎక్కి మాజీ హోంగార్డు హల్‌చల్ చేశాడు. రోడ్డున పడ్డ మాజీ హోంగార్డుల కుటుంబాలను ఆదుకోవాలని నినాదాలు చేశాడు. ఈ సందర్భంగా మాజీ హోంగార్డు వీరాంజనేయులు మాట్లాడుతూ తాము ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధులు నిర్వహించామని, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు అప్పటి ప్రభుత్వం అన్యాయంగా 250 మంది హోంగార్డులను తొలగించిందన్నారు. తమను విధుల్లోకి తీసుకుంటామని మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు హామీని నెరవేర్చకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని ఎన్నో ఏళ్లుగా వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోనందునే ఈ నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. తమ సమస్యపై అసెంబ్లీలో చర్చించి తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ విషయం తెలియడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మాజీ హోంగార్డుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇవ్వడంతో అతను కిందకు దిగి వచ్చాడు.

నియామకం

ఖైరతాబాద్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధ్యక్షురాలిగా అస్మతున్నీసా



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ అస్మతున్నీసా

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) అధ్యక్షురాలిగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయిత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా ఎన్నికయ్యారు. ఈ మేరకు గాయిత్రీహిల్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆమెకు నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడడంతో పాటు బాధితులకు అండగా ఉంటానని తెలిపారు. ఇందులో భాగంగా కమిటీ ఉపాధ్యక్షునిగా ఎస్.రాజేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా అనూష, కార్యదర్శిగా అర్షియా పర్వీన్, కోశాధికారిగా శ్రీనివాస్, సభ్యులుగా మురళీకృష్ణ, పద్మావతి ఎన్నికయ్యారు.

ఖుష్బూ విద్యానికేతన్‌లో విద్యార్థుల సందడి



పోటీల్లో సందడి చేస్తున్న విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నందినగర్ ఖుష్బూ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం బ్రైట్ స్టార్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు వివిధ అంశాల్లో విద్యార్థుల అనర్గళంగా ప్రసంగిస్తూ ఆకట్టుకున్నారు.అనంతరం చిట్టిపొట్టి దుస్తులు ధరించిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్‌దేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యటన



రాజ్‌నగర్‌లో పర్యటిస్తున్న అధికారులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని రాజ్‌నగర్‌లో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ కింద చేపట్టబోయే సుందరీకరణ పనుల్లో భాగంగా శనివారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ -17 డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, డీఈ చైతన్యలు పర్యటించారు. త్వరలో రాజ్‌నగర్‌లో ఫ్లై ఓవర్ కింద సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కూర్చునేందుకు కుర్చీలతోపాటు పార్కింగ్ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అధికారుల వెంట మారుతీనగర్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కృష్ణయాదవ్, మహేందర్‌బాబు, ప్రసాద్ యాదవ్, విషాల్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో పలు చర్చిల్లో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్ సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా చర్చిల పాస్టర్లతోపాటు కాంగ్రెస్ నాయకులు సింగారి శ్రీనివాస్, పురిమి సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఇదే బస్తీలోని సియోను ప్రార్థన మందిరంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రముఖ దైవ వర్తమానికులు రెవరెండ్ యేసురత్నం పాల్గొని వ్యాఖ్యోపదేశం చేశారు. పాస్టర్లు ఇమ్మాన్యుయేల్, ఎం. ప్రసాద్(అంజయ్య), ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

ఓంప్రకాష్ చౌతాల మృతి తీరనిలోటు

లిబర్టీ: మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాష్ చౌతాల మృతి పార్టీకి తీరనిలోటని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వర్‌రావు అన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జీవితాంతం సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా లోక్ దళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారని ఆయన గుర్తు చేశారు. రైతు అభ్యున్నతి, రైతు సంక్షేమం కోసం నిరంతరం సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.శ్రీనివాసరావు, పి.వి. సంకీర్తరావు తదితరులు పాల్గొన్నారు.





ఆకట్టుకున్న 'ప్రతిభా దర్శన్'

- 'ది ఫైవ్ ఎలిమెంట్స్ ఆఫ్ లైఫ్' పేరిట కార్యక్రమం
- ఆలోచింపచేసిన విద్యార్థుల ప్రదర్శనలు



పంచభూతాల విశిష్టతపై విద్యార్థుల ప్రదర్శనలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'పంచ భూతాలు ది ఫైవ్ ఎలిమెంట్స్ ఆఫ్ లైఫ్' పేరిట ఒకటో తరగతి విద్యార్థులు నిర్వహించిన ప్రతిభా దర్శన్ కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ భూమి, ఆకాశం, వాయువు, జలము, అగ్ని పంచభూతాలు, మూడు కాలాలు, ఆరు రుతువుల సమాహారమే ప్రకృతిగా పేర్కొన్నారు. కానీ నేడు ప్రకృతి ఉనికి మర్చిపోతున్నామన్నారు. పంచ భూతాలు ఎలా క్రమబద్ధంగా ఉంటాయో మనం కూడా అలాగే ఉండాలని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారని అభినందించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ పంచభూతాలు అనే థీమ్ విశేషంగా ఉందని, ప్రకృతికి భూమి, ఆకాశం, వాయువు, జలం, అగ్ని పంచభూతాలు అయితే దృష్టి, రుచి, వాసన, స్పర్శ, వినికిడి వీటిని మనిషిలో గల పంచ భూతాలుగా అభివర్ణించారు. ప్రకృతిని గురువుగా భావించి మనిషి తమ భావోద్వేగాలను సమతుల్యంగా మలచుకోవాలన్నారు. ఇదే మనిషికి ప్రకృతితో గల అవినాభావ సంబంధమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు విదుమోహన్ మాట్లాడుతూ సృష్టిలో ఉన్న ప్రతి జీవరాశికి పంచభూతలకు గల సంబంధం అలవికానిదన్నారు. మనిషి మనుగడకు పంచభూతాలు ఒక వరం అన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మురళీముకుంద్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.బాలమురళీకృష్ణలు చిన్నారుల అపూర్వ ప్రతిభను ప్రశంసించారు.

మా భూములు మాకు ఇప్పించండి



పంజగుట్ట: గిరిజన అసైన్డ్ భూములు తన భూములుగా చూపుకొని పెద్దపెద్ద సంస్థలకు అమ్ముకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలు గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.రాంబాల్ నాయక్, బాధిత గిరిజన కుటుంబాలతో కలిసి మాట్లాడుతూ రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని రెండు తండాల్లో సుమారు 2వేల ఎకరాల భూమిని విక్రమ్ రెడ్డి పటేల్ పూర్వీకులు ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం అప్పట్లో ప్రభుత్వానికి స్వాధీనం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం సదరు భూమిని గిరిజనులకు అసైన్డ్ కింద ఇవ్వడంతో కొన్ని దశాబ్దాలుగా గిరిజనులు ఆ భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కాగా 1985 తరువాత సదరు భూమిని తాము ల్యాండ్ సీలింగ్‌కి ఇవ్వలేదని ఈ భూములు తమవే అని రెవెన్యూ, ఎమ్ఆర్‌వో, ఇతర సిబ్బంది సాయంతో ధరణిలో పేర్లు కూడా మార్చించుకొని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, గ్రీన్ మార్క్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలకు స్థలం విక్రయించి నిర్మాణాలు చేపట్టారని తండాల్లోకి వెళ్లేందుకు మార్గాలు మూసేసి తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ధరణి బదులుగా ప్రస్తుతం తీసుకువచ్చిన భూ భారతితో అయినా తమకు న్యాయం చేయాలని ఎన్నో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న గిరిజనులకే సదరు భూమి దక్కేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో లగచర్ల బాధితుల మాదిరి తాము కూడా రాష్ట్ర వ్యాప్తంగా మరో ఉద్యమాన్ని తీసుకువస్తామని, త్వరలోనే ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో ఆహారోత్సవం





ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ఆహారోత్సవం

బంజారాహిల్స్: విద్యార్థులకు పోషకాహారాన్ని అందించి వారిలో రక్తహీనతను నిరోధించేందుకు ప్రభుత్వం శనివారం అన్ని పాఠశాలల్లో తెలంగాణ ఆహారోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సర్కార్ బడుల్లో ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఆహారోత్సవం కార్యక్రమంలో తమ ఇళ్ల నుంచే తల్లులు వివిధ రకాల వంటకాలను తీసుకువచ్చారు. ఏ వంటకంలో ఎలాంటి పోషక పదార్థాలు ఉన్నాయో తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాల్లో లభించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లులు కూడా తాము చేసిన వంటకాలను రుచి చూపించడమే కాకుండా తయారీ విధానాన్ని కూడా అక్కడి ఉన్నవారికి తెలియజేశారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది.

మంత్రి పదవి నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఆమ్ ఆద్మీ ప్రతినిధులు

లిబర్టీ: రాజ్యాంగం ద్వారా దేశ పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించిన బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్‌ను కించపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన డాక్టర్ అంబేద్కర్‌ను అగౌరవపరుస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆమ్‌ఆద్మీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆమ్‌ఆద్మీ పార్టీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని ఖూని చేసి మనుస్మృతిని తీసుకురావడానికి బీజేపీ అగ్ర నాయకత్వం డాక్టర్ అంబేద్కర్‌ను అవమానిస్తుందని మండిపడ్డారు. దేశంలోని లక్షలాదిమంది దళితులు, పేదలు, అణగారిన, వెనుకబడిన వారికి డాక్టర్ అంబేద్కర్ దేవుడు కంటే తక్కువ కాదని బీజేపీ శ్రేణులకు గుర్తు చేశారు. బీజేపీ శ్రేణులు డాక్టర్ అంబేద్కర్‌ను హేళన చేస్తే ఊరుకునేది లేదని తాట తీస్తామని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో మహిళా విగ్ ప్రధాన కార్యదర్శి అడ్వొకేట్ యమునాగౌడ్, డాక్టర్స్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మానాయుడు, యువజన విభాగం అధ్యక్షులు విజయ్ మల్లంగి, పార్టీ అధికార ప్రతినిధులు ఆఫ్సా సలాం, జావీద్ షరీఫ్, ఖలీద్ బాబా, అహసన్ అబ్బాస్, సుధారాణి, జయసింగ్ జాదవ్, ధర్మేంద్ర తివారీ, అజీమ్ బేగ్, లక్ష్మణ్, వైశాలి, మౌనిక, డాక్టర్ షకీల్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్టు



మహ్మద్ ఇస్తేకర్

పంజగుట్ట: నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో పదుల సంఖ్యలో దొంగతనాలకు పాల్పడ్డ పాత నేరస్తున్ని స్పెషల్ జోనల్ క్రైమ్ టీం శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ ఇస్తేకర్ (30) క్యాబ్ డ్రైవర్ కాగా, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. ఈ క్రమంలో రద్దీగా ఉండే ప్రాంతాలు, హాస్టళ్లల్లో సెల్‌ఫోన్లు, పర్సులు కొట్టేస్తున్నాడు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌తో పాటు, నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లల్లో ఇతనిపై ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు నమోదు అయ్యాయి. సదరు నిందితుని టీంలో ప్రధాన నిందితుడు ఇంతియాజ్‌పై నగరంలో 50 కేసులకు పైగా ఉన్నాయి. ఇతని టీంలో మొత్తం 9మంది సభ్యులు ఉండగా ఇంతియాజ్‌తో పాటు, మరో ఐదుగురిని గతంలోనే పంజగుట్ట పోలీసులు అరెస్టు చేయగా, శనివారం సీసీఎస్ పోలీసులు మహమ్మద్ ఇస్తేకర్‌ను అరెస్టు చేసి పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

పికిల్ బాల్‌కోర్టు ప్రారంభం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో పికిల్ బాల్ కోర్టును జేపీసీ అధ్యక్షుడు కె. సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వరరావులు ప్రారంభించారు. అమెరికాలో పాపులర్ గేమ్‌గా ఉన్న ఈ ఆటను మొదటిసారిగా హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ క్లబ్ ఆవరణలో పరిచయం చేశారు. టేబుల్ టెన్నిస్, టెన్నిస్‌కు క్రాస్ బ్రీడ్ గేమ్‌గా పికిల్ బాల్ గేమ్ ప్రాచుర్యం పొందింది. టేబుల్ టెన్నిస్ లాగానే ఈ ఆటలో కూడా చిన్న బ్యాట్ చిన్న బాల్ ఉంటుందని, అయితే కోర్టు మాత్రం టెన్నిస్ కోర్టు లాగా నెట్‌తో పాటు కొద్దిగా చిన్నగా ఉంటుందని కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు తెలిపారు. ఇది అన్ని వయస్సుల వారు ఆడుకునే ఆట అని వెల్లడించారు. ఈ గేమ్‌ను తమ క్లబ్‌లో ప్రవేశపెట్టడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్లు పాల్గొన్నారు.



కోర్టును ప్రారంభిస్తున్న కిలారు రాజేశ్వరరావు తదితరులు

అదుపుతప్పి.. ఫుట్‌పాత్‌పైకి దూసుకొచ్చి...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో టాటా నానో కారు అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం రోడ్ నెం.10 కేన్సర్ ఆస్పత్రి వైపు టాటా నానోకారులో సోమాలియా దేశస్తుడు అహ్మద్ వస్తున్నాడు. తెలంగాణ భవన్ రోడ్డులోకి రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. కారును కంట్రోల్ చేసే క్రమంలో అహ్మద్ డివైడర్‌కు ఢీకొట్టి ఫుట్‌పాత్‌పైకి ఎక్కించాడు. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న అహ్మద్ కాలు విరిగింది. గమనించిన స్థానికులు అహ్మద్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఫుట్‌పాత్‌పైకి ఎక్కిన కారు..

మహిళల ఎదుగుదలతోనే సమాజాభివృద్ధి

కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ గుర్తుచేశారు. ప్రతి మహిళ పొదుపు సంఘంలో చేరి తన కుటుంబానికి బాసటగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బోరబండ సైట్-1 షాహీద్ తుర్రేబాజ్‌ఖాన్ సామాజిక భవనంలో జీహెచ్‌ఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహిళా సాధికరతకు పెద్దపీట వేయడం జరుగుతున్నదన్నారు. ఆరు గ్యారంటీ పథకాల్లో ఎక్కువశాతం మహిళా సంక్షేమానికి సంబంధించినవని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పొదుపు సంఘంలో సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ దిశగా అన్ని వర్గాల మహిళలకు చైతన్యవంతం చేయాలని కోరారు. పొదుపు సంఘాల నాయకత్వాల్లో మార్పు తీసుకొచ్చి కొత్తవారికి అవకాశం కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ యూసీడీ సీపీఓ వెంకట్ కిషన్, శ్రీనివాస్, ఆర్‌పీలతోపాటు డివిజన్‌లోని వివిధ బస్తీలకు చెందిన పొదుపు సంఘాల సభ్యురాళ్లు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌తో తీరనున్న దాహార్తి....

త్వరలోనే ప్రారంభకానున్న ఎస్పీఆర్‌హిల్స్ రిజర్వాయర్‌తో బోరబండ డివిజన్ వాసులకు తాగునీటి కష్టాలు తొలగనున్నాయని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఆర్ఆర్‌పురం సైట్-4, 5లోని పీజేఆర్ గ్రౌండ్‌లో పైప్‌లైన్ పనులకు ఆయన బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నెక్లెస్ రోడ్డులో 'వాక్‌ఫర్ హ్యూమానిటీ'



హ్యూమానిటీ అవగాహన వాక్..

ఖైరతాబాద్: అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం నెక్లెస్ రోడ్డులో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ హ్యూమానిటీ పేరుతో అవగాహన వాక్ నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29న అమీర్‌పేట్ ఖమ్మసంఘంలో ఉచిత మెడికల్ క్యాంపు, రథయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మనిషిలో మానవత్వం పెంపొందించాలని కోరుతూ నెక్లెస్ రోడ్డు ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ వద్ద హ్యూమానిటీ వాక్ నిర్వహించినట్లు సభ్యులు జె.వెంకటేశ్వర్‌రావు, సీ.హెచ్.గోపాల్‌లు తెలిపారు. వాక్‌లో స్ఫూర్తి కుటుంబ సభ్యులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాక్ నిర్వహించారు.



వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

ప్రత్యేక అలంకరణలో శ్రీగోదా రంగనాథస్వామి



రోడ్డునెంబర్-12లోని వేణుగోపాలస్వామి

బంజారాహిల్స్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ గోదా రంగనాథస్వామి అలంకరణ అత్యంత వైభవంగా జరిగింది. వేడుకల్లో భాగంగా స్వామివారు, అమ్మవారిని రంగ రంగుల పూలమాలలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు.

వేణుగోపాలస్వామి అలంకరణ..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామిని ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ఉదయం ధనుర్మాస పూజలు వైభవంగా జరిగాయి.



రోడ్డునెంబర్-14లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదా రంగనాథ స్వామి

సాక్షి
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024

నగరంలో నేడు

◆ బాగ్‌లింగంపల్లిలోని డా.బీఆర్ అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ ఉదయం 11 గంటలకు ఉంటాయి.

◆ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ తమిళ సంఘం 6వ వార్షికోత్సవ సెలబ్రేషన్స్, ఫోక్ డాన్స్, మ్యూజికల్ ఫెస్టివల్ మధ్యాహ్నం 2.30 గంటలకు ఉంటుంది.

◆ చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సప్త గోవులకు గోహారతి కార్యక్రమం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.


ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వైఎస్సార్ అభిమానులు, నేతలు తదితరులు


రమ్యా గ్రౌండ్‌లో నిర్వహించిన ఏపీ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఏపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు సతీష్‌రెడ్డి, శివరామిరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఈశ్వర ప్రసాద్‌రెడ్డి తదితరులు

కేంద్ర హోంమంత్రిపై ఫిర్యాదు


అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన వి.హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు

అంబర్‌పేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు చేయాలంటూ మాజీ ఎంపీ వి.హనుమంతరావు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ చిత్రపటాలను పట్టుకొని రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తారా అంటూ నినాదాలు చేశారు. అమిత్‌షా దేశ ప్రజలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ అశోక్‌కు ఫిర్యాదు కాపీని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్ పుల జగన్, నాయకులు రాంమ్మోహన్, శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, జమీర్, ఫరిద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని బచ్‌పన్ ప్లే స్కూల్, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన గ్రాండ్ సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సృజనకు పదును పెడుతూ వినూత్నంగా వైజ్ఞానిక ఎగ్జిబిట్లను రూపొందించి ఆలోచింపజేశారు. రోబోటిక్స్, పునరుత్పాదక ఇంధన నమూనాల నుంచి పర్యావరణ పరిరక్షణ వంటి 100కి పైగా నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సమీర్‌జైన్, ప్రిన్సిపాల్ రహత్ ఉన్నీసా మాట్లాడుతూ చిన్నారుల్లో సైన్స్ పట్ల ఆసక్తి రేకెత్తించడంతో పాటు సైన్స్ ప్రాముఖ్యతను ఈ ప్రదర్శన ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు చక్కగా సైన్స్ నమూనాలను రూపొందించి ప్రదర్శించి తమ ప్రతిభ చాటుకున్నారన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ నిర్మాణం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కవాడిగూడ: పుస్తక పఠనంతో వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవచ్చని, పుస్తక పఠనం వల్ల దివ్యమైన జ్ఞానాన్ని సంపాదించవచ్చని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. నగరంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో కొనసాగుతున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శన శనివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బుక్ ఫెయిర్‌లోని స్టాల్స్‌ను పరిశీలించి సందర్శకులతో మాట్లాడారు. వారు కొన్న పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షలాది మంది ఆలోచనలను పుస్తక రూపంలో తీసుకువచ్చి ప్రజల్లోకి తీసుకెళ్లే రచయితల కృషిని అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పుస్తక పఠనం చాలా అవసరమన్నారు. లోతైన విజ్ఞానం సంపాదించాలంటే చదువు ఎంతో అవసరం అని తెలిపారు. నేటి యువతరం కోసం గ్రంథాలయాలను పెంచి పుస్తక పఠనం ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసుతో పాటు బుక్‌ఫెయిర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిరంతరం నిఘా

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక బృందాలుగా పోలీసులు
- జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అప్రమత్తం


సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల బృందాలు ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు అప్రమత్తమయ్యాయి. కొత్త సంవత్సరం వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో గంజాయి అంతర్రాష్ట్ర రవాణాదారులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఒడిశా, విశాఖపట్నం ప్రాంతాల నుంచి పూణె, ముంబై, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు గంజాయి అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు గస్తీ ముమ్మరం చేశారు. వ్యాపారులు గంజాయిని రవాణా చేయడం కోసం ఎక్కువగా రైలు మార్గాలను ఎంపిక చేసుకుంటారు. అందులోనూ ఎక్కువ సంఖ్యలోని రైళ్లు సికింద్రాబాద్ మీదుగా రాకపోకలు సాగిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు నిర్వహించే సాధారణ తనిఖీల్లోనూ కిలోల కొద్దీ గంజాయి ప్యాకెట్లు పట్టుబడుతుండటం షరా మామూలే..

సికింద్రాబాద్ మీదుగా..

కొద్ది కాలం క్రితం గంజాయి రవాణాదారులు దక్షిణాది నుంచి ఉత్తరాదికి నేరుగా వెళ్లే రైళ్లలో తరలించేవారు. ఇటువంటి రైళ్లలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తుండటం, సరుకు పట్టుబడుతుండటంతో వ్యాపారులు పంథా మార్చుకున్నారు. సాధారణ పౌరుల మాదిరి గంజాయి ప్యాకెట్లను లగేజీ బ్యాగుల్లో సర్దుకుని ముందుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్నారు. స్టేషన్‌లో కొద్ది గంటల తర్వాత మరో రైలు ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. పెద్దమొత్తంలో గంజాయి ప్యాకెట్లు రవాణా చేయాలనుకున్న వ్యక్తులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకుని ఒకటి రెండు రోజులు ఇక్కడ బస చేసిన తర్వాత తిరిగి రైల్వేస్టేషన్‌కు వచ్చి ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్తున్నారు.

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో..

రోజువారీ తనిఖీల్లోనే గంజాయి ప్యాకెట్లు పట్టుబడుతుండటం తెలిసిందే. కొద్ది రోజుల్లో న్యూ ఇయర్ వేడుకలు జరగనున్న నేపథ్యంలో పెద్దమొత్తంలో గంజాయి రవాణా జరిగే అవకాశం ఉందని భావించిన రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ ఎస్ఎన్ జావెద్ నేతృత్వంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సమన్వయంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ బీ.సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సారస్వత్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందాలు రెండు రోజులుగా తనిఖీలను విస్తృతం చేశాయి.

అన్ని రైళ్లలోనూ తనిఖీలు

ఒడిశా, విశాఖపట్నం మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటున్న అన్ని రైళ్లు, ఇక్కడి నుంచి పూణె, ముంబైతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు బయలుదేరుతున్న అన్ని రైళ్లలోనూ రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్లే వారిలో అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అంతేగాకుండా స్టేషన్‌లోని పది ప్లాట్‌ఫామ్‌లలో సంచరించే వ్యక్తుల లగేజీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పలువురు పోలీసులను మఫ్టీలో ఉంచి రైల్వేస్టేషన్‌లో గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండే గదులు, ప్రవేశమార్గాల పరిస్థితులను సీసీ కెమెరాల ద్వారా వీక్షిస్తున్నారు.

మార్కెట్ కమిటీల బలోపేతానికి కృషి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


చాదర్‌ఘాట్: మార్కెట్ కమిటీల బలోపేతం చేయడానికి కృషి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో శనివారం జరిగిన జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ హైదరాబాద్ జిల్లా నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వెళ్తున్నామని, మూసీనదిని పునరుజ్జీవం చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నగరంలో మౌలిక వసతులను పెంచడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వారి సమక్షంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెకొలేకర్ లక్ష్మీ, వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు నేలపాటి రామరావు, పన్నాల రాజేందర్‌రెడ్డి, మహ్మద్ షకీల్, ప్రత్యూష, బుద్ధ సత్యనారాయణ, పాశం అశోక్‌గౌడ్, కనకాల శివాజీ, పి.కిషన్‌సింగ్, దుగ్గు జగదీశ్, మాచారం కృష్ణ, సాయిరాం, మస్రత్ సుల్తానాలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మల్లేశం, ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్-1 సెక్రటరీ చిలుక నర్సింహారెడ్డి, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి, సిటీబ్యూరో: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 114 వ్యవస్థాపన దినోత్సవంలో భాగంగా శనివారం మణికొండలో మరో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. బ్యాంకు జనరల్ మేనేజర్ ధారసింగ్ నాయక్, రీజినల్ హెడ్ జి.రామకృష్ణన్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, రిటైర్డ్ డీజీఎం ఎ.సురేష్, జీఎం బాపన్న, రిటైర్డ్ డివిజన్ రాజేంద్రకుమార్, రిటైర్డ్ డీజీఎం లక్ష్మన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రా.రా. లేకుండా సాహిత్య విమర్శను చూడలేం..



సాక్షి, సిటీబ్యూరో: సాహిత్యంలో చలం, శ్రీశ్రీ, శివసాగర్, సీవీ, కాళోజీ, వట్టికోట, దాశరథి, రావెళ్ల, బిరుదురాజు, అలిశెట్టి ప్రభాకర్‌లను ఎలాగో, రాచమల్లు రాంచంద్రారెడ్డి పేరెత్తకుండా తెలుగు సాహిత్య విమర్శపై మాట్లాడలేమని తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో శనివారం తెలంగాణ పబ్లికేషన్స్ ముద్రించిన యాకూబ్ రాసిన 'తెలుగు సాహిత్య విమర్శ రా.రా. మార్గం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ విమర్శకుడి శైలిలోనూ లేని పదును, వాక్య నిర్మాణంలోని సారళ్యం, కంఠస్వరంలోని తీవ్రత, గండ్ర గొడ్డలి లాంటి పలుకు, కుసంస్కారం పట్ల అసహనం రా.రా. రచనల్లో కనిపిస్తుందని పేర్కొన్నారు. అలాంటి సాహిత్య విమర్శకుల వల్లనే తెలుగు సాహిత్యం పటిష్టంగా నిలవగలుగుతుందన్నారు. కార్యక్రమంలో రచయిత, హైదరాబాద్ బుక్ ఫెయిర్ చైర్మన్ యాకూబ్, తెలంగాణ పబ్లికేషన్స్ చైర్మన్, బుక్ ఫెయిర్ మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్ పాల్గొన్నారు.

అన్నం పెట్టేది వ్యవసాయ రంగమే..

- రైతన్నకు సమాజం రుణపడి ఉంటుంది
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఏజీవర్సిటీ: అన్నం పెట్టే రైతులకు, వ్యవసాయ శాస్త్రవేత్తలకు, వ్యవసాయ విద్యార్థులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం విద్యార్థులు విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధుల మధ్య చర్చాగోష్టి విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అందరికీ అన్నం పెట్టేది రైతులు, వ్యవసాయ రంగమేనని అటువంటి విద్యను, వృత్తిని ఎంపిక చేసుకున్న వారిని ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ప్రతి వ్యవసాయ విద్యార్థి వృత్తిలో భాగంగా మూడు అంశాలకు ప్రాధ్యాన్యం ఇవ్వాలని సూచించారు. రైతాంగంలో ధనిక, మధ్యతరహా సన్న, చిన్న కారు రైతులు ఉంటారని, వారందరికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతాంగంలో అధిక శాతం మంది పేదరికంలోనే ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అదే సమయంలో వ్యవసాయంలో ఏ ఆవిష్కరణలు ప్రవేశపెట్టినా దానివల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదల ఉండాలని, అది సుస్థిరతకు అవకాశం కల్పించాలన్నారు. ఇతర దేశాల వ్యవసాయానికి మన దేశం వ్యవసాయానికి చాలా అంతరాలు ఉన్నాయన్నారు. మన పరిస్థితులకు తగ్గట్టుగా విధానాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాయలం వీసీ డాక్టర్ డి.రాజిరెడ్డి, వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి, కాన్సస్ యూనివర్సిటీ యూఎస్ఏ డైరెక్టర్ పీవీ వరప్రసాద్, మాజీ వీసీ రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సదస్సులో మాట్లాడుతున్న వెన్నెల గద్దర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ ఉద్యమకారులు, కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ మాట్లాడుతూ.. మన హక్కులను సాధించుకునేందుకు ఉద్యమకారులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేశానని, నేను ఓడిపోయినా ప్రజాపాలన గెలిచిందన్నారు. ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ టీమ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, అర్హులైన ఉద్యమకారులకు రూ.25 వేల పెన్షన్ కల్పించాలని, వెయ్యి మంది అర్హులైన వారికి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని, కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించాలని, ఇందిరమ్మ ఇళ్లలో 10శాతం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ యేల్లా పోశెట్టి, ప్రధాన కార్యదర్శి పట్లోళ సురేందర్‌రెడ్డి, గాయకుడు నేర్నాల కిషోర్, వరాల దేవయ్య, బొడ్డ రాములు, దయానంద్, కొంతం యాదిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

చిన్నతనం నుంచే సృజనాత్మకత అలవర్చుకోవాలి

గిన్నీస్ వరల్డ్ రికార్డు గ్రహీత, అతిపిన్న వయస్సులో చార్టర్డ్ అకౌంటెంట్ నిశ్చల్ నారాయణం


ముఖ్య అతిథి చార్టర్డ్ అకౌంటెంట్ నిశ్చల్ నారాయణం, ప్రిన్సిపాల్ పద్మ

శేరిలింగంపల్లి: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు విభిన్నమైన ఆలోచనలు కలగాలని అతిపిన్న వయస్సులో గిన్నీస్ వరల్డ్ రికార్డు గ్రహీత, చార్టర్డ్ అకౌంటెంట్ నిశ్చల్ నారాయణం పేర్కొన్నారు. నల్లగండ్ల హుడా కాలనీలోని ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ స్కూల్‌లో 'టెడెడ్ టాక్స్-2024' పేరిట 3వ ఎడిషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టుదలతో ఎంపిక చేసిన లక్ష్యాలను సాధించాలనే ఆలోచన కూడా ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రిన్సిపల్ పద్మ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. అద్భుతమైన నైపుణ్యాలను పెంపొందించినందుకు తల్లిదండ్రులను కూడా అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ఆవిష్కరణ, ఆలోచనల శక్తిని పెంపొందించడం విద్యార్థులకు అవసరం అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నుంచి సూర్య సిద్ధాంతం, ప్రాచీన, ప్రస్తుత జ్ఞానంతో పాటు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 37 మంది విద్యార్థులు ఆయా అంశాలపై తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలిపారు. కార్యక్రమంలో 6 నుంచి 11వ తరగతి వరకు చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో నీల వెంకటేష్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి బీసీ కుటుంబానికి 90శాతం సబ్సిడీతో రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 12 కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. దాదాపు 30 కులాలకు కార్పొరేషన్లు లేవని, వీటికి కూడా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కార్పొరేషన్‌కు చైర్మన్, పాలక మండళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ 12 ఫెడరేషన్లకు ఎండీ పోస్టులు 11 సంవత్సరాలుగా భర్తీ చేయలేదని, వెంటనే ఎండీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్ల బడ్జెట్, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరల ప్రకారం మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్స్‌ను పెంచడానికి ఈ పథకం కింద బడ్జెట్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు పిల్లుట్ల శ్రీనివాస్, తంగెళ్లమూడి నంద గోపాల్, వేముల రామకృష్ణ, జి.అంజి, సతీష్, లింగయ్య యాదవ్, రాందేవ్‌యాదవ్, ఉదయ్, సత్యనారాయణ, రవియాదవ్ పాల్గొన్నారు.

అశ్రువర్ణం, రమాయణం-1 పుస్తకాల ఆవిష్కరణ


అశ్రువర్ణం కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నందిని సిధారెడ్డి తదితరులు

నాంపల్లి: తెలంగాణ రచయితల సంఘం, వరంగల్-జంట నగరాల శాఖల సంయుక్త నిర్వహణలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శనివారం ఉదయం జరిగిన మొదటి సదస్సులో నెల్లుట్ల రమాదేవి రచించిన 'అశ్రువర్ణం' కవితా సంపుటి, రమాయణం-1 (కాలమ్స్ సంపుటి) ఆవిష్కరించారు. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి హాజరై అశ్రువర్ణం పుస్తకాన్ని, విశిష్ట అతిథిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరై రమాయణం-1 కాలమ్స్ సంపుటిని ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథులుగా విజయ్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ అమృతలత, కవయిత్రి కిరణ్‌బాల హాజరై ప్రసంగించారు. అలాగే రెండవ సదస్సులో కవయిత్రి డాక్టర్ కొండపల్లి నీహారిణి సంపాదకత్వంలోని మయూఖ జరిపిన 44 మంది సాహితీవేత్తల ఇంటర్వ్యూల సంకలనం 'మయూఖ ముఖాముఖి' రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు హాజరై మయూఖ ముఖాముఖం -1 అండ్ 2 పుస్తకాలను ఆవిష్కరించి ప్రసంగించారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ విమర్శకురాలు డాక్టర్ కొల్లాపురం విమల, రచయిత వేణు నక్షత్రం హాజరయ్యారు. కేఎస్.అనంతాచార్యులు, మాడిశెట్టి గోపాల్ సభా నిర్వహణ చేయగా, అరుణ ధూళిపాళ వందన సమర్పణ చేశారు.

గౌరవ మర్యాదలతో పనులు చేయించాలి

- మహిళా సఫాయి కరంచారిల సమస్యలు పరిష్కరించాలి
- జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్



సాక్షి, సిటీబ్యూరో: మహిళా సఫాయి కరంచారిలు ఎదుర్కొంటున్న సమస్యలను అంతరంగిక కమిటీల్లో చర్చించడం ద్వారా సత్వరమే పరిష్కరించాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కరంచారిల కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ తెలిపారు. అంతరంగిక కమిటీల్లో మహిళా సఫాయి కరంచారిలపై కొనసాగుతున్న వేధింపులతో సహా ఇతర సమస్యలు ఉంటే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సఫాయి కరంచారిల జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కాకుంటే యూనియన్ దృష్టికి తేవాలన్నారు. అక్కడ కూడా పరిష్కారం కాకుంటే కమిషన్ నంబర్: 011-24648924కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీ, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న సఫాయి కరంచారిలతో ఆయన మాట్లాడుతూ జీతం సరిగ్గా వస్తుందా..? ఏమైనా కోతలు విధిస్తున్నారా? అడిగి తెలుసుకున్నారు. తమకు జీతం తక్కువ వస్తోందని కొంతమంది పేర్కొనడంతో సంబంధిత మున్సిపల్ కమిషనర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి యూనిఫాం, ఐడీ కార్డులు, నెలలో 4 రోజుల సెలవులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని లేబర్ కమిషనర్‌ను ఆదేశించారు. సబ్బులు, నూనె వంటి కనీస అవసరాలు అందించాలని అధికారులకు సూచించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మర్యాద, గౌరవంతో పనులు చేయించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఆర్డీవో శంకర్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మోసిస్‌బాబు, సంబంధిత జిల్లా అధికారులు, సఫాయి కరంచారిలు పాల్గొన్నారు.





విల్లామేరీలో విల్లా ఫెస్టా..

డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

విల్లామేరీ మహిళా కాలేజీలో క్రిస్మస్ వేడుకలు అదరగొట్టారు. ఈ సంవత్సరం విల్లా ఫెస్టా 'ఈ విద్యా సంవత్సరంతో గతం నుంచి వర్తమానానికి మారుదాం' అనే థీమ్‌తో రోజు మొత్తం డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికల ప్రదర్శనలతో వేడుకలు నిర్వహించారు. అన్ని రకాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ తమ కళాశాలలో వేడుకలు వైభవంగా నిర్వహించడం తమ ఆనవాయితీ అని కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఫిలోమినా, సెక్రటరీ చిన్నమ్మ తెలిపారు.


– పంజగుట్ట



ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు

సందర్శకులతో ఉత్సాహంగా బుక్‌ఫెయిర్

కవాడిగూడ: శనివారం వీక్ ఎండ్ కావడంతో ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఉత్సాహంగా కొనసాగింది. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోయి విజయభారతి వేదికపై తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పిల్లలు ప్రదర్శించిన డ్యాన్సులు, ఫ్యాన్సీ డ్రస్ ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. పిల్లలని సత్‌ప్రవర్తన కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు, మనుషుల మధ్య సోదర భావాన్ని పెంపొందించడానికి చదువుతోపాటు కళల్లో విద్యార్థులు ప్రతిభావంతులు కావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ నృత్యప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.









కండలు తిరిగే దేహం అంటే యువతకు యమ క్రేజ్ ఉంటుంది. దీనికోసం జిమ్‌కు వెళ్లి కసరత్తులు చేస్తూ చెమటలు చిందిస్తుంటారు. కొందరు రెగ్యులర్‌గా వెళ్లి సిక్స్ ప్యాక్ వచ్చేంత వరకూ కష్టపడుతుంటారు. కండలు పెరిగేందుకు ప్రొటీన్ పౌడర్ వంటివి తీసుకుంటుంటారు. వీటివల్ల దుష్పరిణామాలు చాలానే ఉంటాయి. అయితే అథ్లెటిక్ బాడీ అంటే గత కొంత కాలంగా యువతలో క్రేజ్ పెరిగిపోతోంది. విల్లులా దేహాన్ని మలుచుకునేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. ఈ దేహాన్నే మీసోమార్ఫ్ దేహం అని అంటుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రౌండ్స్‌లో పరుగులు పెడుతూ.. వ్యాయామాలు చేస్తున్నారు. దీంతో ఫిట్‌నెస్‌తో పాటు మానసిక ఉల్లాసం, చక్కటి దేహాన్ని సొంతం చేసుకుంటున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

ఫిట్.. బాడీ సెట్..

కండల కన్నా విల్లులాంటి దేహంపై యువత ఆసక్తి..

- అథ్లెటిక్ బాడీ కోసం గ్రౌండ్స్‌లో పరుగులు, వ్యాయామాలు
- ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తున్న పలువురు శిక్షకులు..
- ఫిట్‌నెస్‌తో పాటు కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకూ ఉపయుక్తం
- సరైన ఆహార నియమాలు తప్పనిసరి అంటున్న నిపుణులు

నగరంలో చాలా ప్రాంతాల్లోని గ్రౌండ్స్‌లో యువత ఇటీవల ఫిట్‌నెస్ కోసం వ్యాయామాలు, కసరత్తులు చేస్తూ కనిపిస్తున్నారు. దీనికి పోటీ పరీక్షలైన ఆర్మీ, పోలీసులు, ఆర్పీఎఫ్ వంటి నియామకాలు ఒక కారణమైతే.. స్పోర్ట్స్‌పై ఇంట్రెస్ట్‌తో కొందరు.. ఫిట్‌నెస్ మీద పెరిగిన అవగాహనతో మరి కొందరు వ్యాయామాల భాటపడుతున్నారు. దీంతో ఉదయాన్నే లేచి గ్రౌండ్‌లో పరుగులు పెడుతున్నారు. అయితే గ్రౌండ్‌లో కసరత్తుల వల్ల ఎలాంటి లాభాలు ఉంటాయి..? ఎలాంటి కసరత్తులు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి..? ఇలాంటి కొన్ని విషయాలు తెలుసుకుందాం..

కూల్‌డౌన్ పద్ధతులు తప్పనిసరి..



గ్రౌండ్‌లో రన్నింగ్ లేదా కసరత్తులు చేసిన తర్వాత బాడీ కూల్‌డౌన్, స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు తప్పనిసరిగా చేయాలి. ఇది అలసిపోయిన కండరాలను యథాస్థితికి తీసుకొచ్చేందుకు పనికొస్తుంది. 30 ఏళ్లు దాటిన వాళ్లు ఎక్కువ కఠినమైన ఎక్సర్‌సైజులు చేయకపోవడం మంచిది. కండరాలపై స్ట్రెస్ పడకుండా చూసుకోవాలి. నిపుణుల పర్యవేక్షణలోనే కసరత్తులు చేయడం మంచిది.

– కె.ధర్మేందర్, ఫిజికల్ డైరెక్టర్

డైట్ చాలా ముఖ్యం..

గ్రౌండ్‌లో వర్కవుట్ చేసే వారికి డైట్ చాలా ముఖ్యం. శరీర తీరు, బరువు, చేసే వర్కవుట్‌ను బట్టి ఆహారం తీసుకోవాలి. కార్బోహైడ్రేట్స్‌ఉన్న ఆహారపదార్థాలు తగ్గించాలి. ప్రొటీన్స్ ఉన్న ఫుడ్ తీసుకుంటే కండరాలు పెరుగుతాయి. ఫైబర్ ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సరిగ్గా జరిగి, బరువు పెరగదు. నీరు కూడా అధికంగా తీసుకుంటుండాలి. వర్కవుట్ కన్నా ముందు కనీసం ఒక లీటర్ నీళ్లు (గోరు వెచ్చటి నీరు) తాగాలి.



– వసుధ, క్లినికల్ న్యూట్రిషనిస్టు

15 ఏళ్లుగా వర్కవుట్స్..



ఉదయం గ్రౌండ్‌లో వర్కవుట్ చేయనిదే రోజంతా ఏదోలా ఉంటుంది. గత 15 ఏళ్లుగా దాదాపు ప్రతిరోజూ గ్రౌండ్‌కు వెళ్లి కసరత్తులు చేస్తూ ఉన్నాను. గ్రౌండ్‌లో చేయడం వల్ల స్వచ్ఛమైన గాలి పీల్చుకోవచ్చు. దీంతో మనసుకు ప్రశాంతత కూడా లభిస్తుంది. ఉదయం వర్కవుట్ చేస్తే రోజంతా చాలా యాక్టివ్‌గా ఉంటాను. సూర్యోదయానికి ముందే లేచి గ్రౌండ్‌కు వెళ్తుంటా. ఆహారపు అలవాట్లలో కూడా కొన్ని మార్పులు చేసుకుని, సహజమైన ఆహారమే తీసుకుంటుంటా. పోలీస్ నియామకాల్లో దేహదారుఢ్య పరీక్షల సమయంలో కూడా ఈ వర్కవుట్స్ చాలా పనిచేశాయి.

– శ్రీకాంత్ తోటకూరి, ఎక్సైజ్ కానిస్టేబుల్





శరీర భాగాలపై సమానంగా..

జిమ్‌కు వెళ్లి కసరత్తులు చేయడం కన్నా రోజూ రన్నింగ్ చేయడం వల్ల శరీరం ఎదుగుదల బాగుంటుందని నిపుణులు చెబుతున్నారు. జిమ్‌లో ఒకే శరీర అవయవంపై మాత్రమే వర్క్‌లోడ్ పడుతుంటుంది. అదే గ్రౌండ్‌లో వర్కవుట్స్ వల్ల శరీరంలోని అన్ని భాగాలపై ఒకే విధంగా పనిచేస్తుంది. హెవీ వర్కవుట్స్ చేయడం వల్ల కండరాలకు గాయమయ్యే ప్రమాదం ఉంటుంది. అది దీర్ఘకాలికంగా ఉండే అవకాశాలూ ఎక్కువే. అయితే గ్రౌండ్‌లో వర్కవుట్స్ ద్వారా వచ్చిన ఫలితాలు చాలా కాలం వరకూ ఉంటాయి. అంటే కొంత కాలం కసరత్తులు ఆపేసినా కూడా పెద్దగా శరీరంలో మార్పులు రావు. అదే జిమ్ మధ్యలో ఆపేస్తే శరీరం మొత్తం మారిపోతుంది.

ట్రైనింగ్ పద్ధతులు..

గ్రౌండ్‌లో చేసేందుకు సాధారణంగా పలు రకాల ట్రైనింగ్ పద్ధతులు ఉంటాయి. వెయిట్ ట్రైనింగ్, సర్క్యూట్ ట్రైనింగ్, ఇంటర్వెల్ ట్రైనింగ్, రెప్యుటేషన్ ట్రైనింగ్, క్రాస్ కంట్రీ ట్రైనింగ్ అనే రకరకాల పద్ధతులు ఉంటాయి. ఎలాంటి ఖర్చు లేకుండా చక్కటి శరీరాకృతి పొందవచ్చు. బర్పీ, జంపింగ్ జాక్స్ వంటి ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శరీరం మొత్తంపై ప్రభావం పడుతుంది. వీటి వల్ల కొవ్వు తగ్గి బరువు తగ్గుతుంది. రన్నింగ్‌తో జీవక్రియలు మెరుగుపడటమే కాకుండా, శ్వాసవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. గ్రౌండ్‌లో వర్కవుట్స్ చేసే వాళ్లు తప్పనిసరిగా బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం తప్పనిసరి. దీంతో రన్నింగ్ చేసే స్టామినా పెరుగుతుంది.



ఎత్తు పెరిగే అవకాశం..

గ్రౌండ్‌లో కసరత్తులు, రన్నింగ్ చేయడం వల్ల 18 ఏళ్ల లోపు పిల్లల్లో ఎత్తు పెరుగుతారని చెబుతున్నారు. అదే ఆ వయసులో ఉన్న వారు జిమ్ చేస్తే ఎత్తు పెరగడం ఆగిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిమ్‌లో ఉండే పరికరాలు అందరూ వాడటం వల్ల కొన్ని చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.





నెయిల్.. భలే స్టైల్..

- అందుబాటులో ఇన్‌స్టంట్ నెయిల్స్
- పండుగలు, శుభకార్యాల్లో గోళ్లపై డెకరేషన్స్
- నెయిల్ ఆర్ట్‌కు పెరుగుతున్న డిమాండ్

చేతికున్న గోళ్లు ట్రెండీగా కనిపించాలని చాలా మంది అనుకుంటారు. లక్షల్లో ఒకరిద్దరికి తప్ప మిగతావారికి అది సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటి వారి కోసం ప్రత్యామ్నాయంగా ఇన్‌స్టంట్ గోళ్లు (స్ట్రిప్స్) అందుబాటులో వస్తున్నాయి. అదే వాటిపై వివిధ రకాల కళాకృతులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. బ్యూటీ పార్లర్లతో పాటు, మార్కెట్‌లోని పలు వెబ్‌సైట్లలోనూ నెయిల్ ఆర్ట్ పెయింటింగ్ స్ట్రిప్స్ దొరుకుతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో

బ్యూటీ పార్లర్లు, ఫ్యాన్సీ స్టోర్స్‌లో నెయిల్ స్ట్రిప్స్ అందుబాటులో ఉన్నాయి. యాక్రిలిక్, గ్లాస్ టైప్, ప్లాస్టిక్, వివిధ రకాల మెటీరియల్స్‌తో కృత్రిమ గోళ్లను తయారు చేస్తున్నారు. వీటిని మన చేతి గోళ్లకు అతికించడం చాలా సులువే. ముందుగా ఆల్కహాల్ ప్యాడ్ రిమూవర్‌తో చేతి గోళ్లను శుభ్రం చేసుకోవాలి. అనంతరం సరిపోలే గోరును ఎంపిక చేసుకుని గ్యాప్ లేకుండా అతికించుకోవాలి. అవసరం లేదనుకున్నప్పుడు గోటిపై ఉన్న స్ట్రిప్ తొలగిస్తే మళ్లీ మన ఒరిజినల్ గోరు కనిపిస్తుంది. వేరే మోడల్ కావాలనుకుంటే స్ట్రిప్స్ మార్చితే సరిపోతుంది. ఇలా ఆర్టిఫీషియల్ గోళ్లకు మార్కెట్‌లో తయారు చేసే మెటీరియల్‌ను బట్టి ధరలు నిర్ణయిస్తారు. 24 నెయిల్స్ ఉండే ప్యాక్ ధర సుమారు రూ.500 నుంచి రూ.3500కుపైగా ఉంటాయి. బ్రాండెడ్ ఐటం ధరలు మరింత ప్రీమియంగా ఉంటాయి.



కళాత్మకంగా తీర్చిదిద్ది..

నెయిల్ ఆర్ట్‌లో గోళ్లపై విభిన్నమైన ఆకృతుల్లో పెయింటింగ్స్ వేస్తున్నారు. వివిధ రకాల బొబ్బలు, సీతాకోకచిలుక, బార్బీ డాల్స్, జామెట్రిక్ డిజైన్స్, ఆయిల్ ఫినిషింగ్, పేస్టల్ షేడ్స్, ఫ్లోరల్, షిమ్మరీ, ముగ్గులు, పుష్పాలు, వివిధ రకాల రంగులు, డిజైన్లతో సహజమైన గోళ్లు, కృత్రిమంగా తయారు చేసిన గోళ్లు రెండు రకాల నెయిల్ ఆర్ట్‌తో అదరగొడుతున్నారు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకునే వారు నెయిల్ ఆర్ట్ పట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రధానంగా పెళ్లి, పుట్టిన రోజు, ఇతర శుభకార్యాల్లో మహిళలు ఈ తరహా ట్రెండ్ బాగా ఫాలో అవుతున్నారు. నెయిల్ ఆర్ట్ భాగ్యనగరంలో వేగంగా విస్తరిస్తోంది. మెహిందీ, నెయిల్ ఆర్ట్స్ నేర్చుకోడానికి యువతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీని వల్ల ఆదాయ మార్గాలు సులువుగా లభిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇది నయా ట్రెండ్.



ఆర్టిఫీషియల్ నెయిల్స్, నెయిల్ ఆర్ట్స్ అనేవి ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. బ్యూటీ పార్లర్స్‌కు వచ్చేవాళ్లు కొంతమంది అయితే, స్వతహాగా నెయిల్ డెకరేట్ చేసుకునే వాళ్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. ప్రధానంగా శుభకార్యాలు ఉన్నపుడు అందరూ నెయిల్ ఆర్టిస్ట్‌పై దృష్టిపెడుతున్నారు. యువత మాత్రం ఎప్పటికప్పుడు తమ మోడల్స్‌ను మార్చుతున్నారు. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకునే వారు ఆధునిక ట్రెండ్స్ ఫాలో అవుతున్నారు.

– నిహారిక, కాస్మొటాలజీ స్పెషలిస్టు





క్రిస్మస్ తోలుబొమ్మల ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్‌లో క్రిస్మస్ వేడుకలు సందడిగా ప్రారంభమయ్యాయి. తొలి కార్యక్రమంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన పప్పెట్ షో ఆకట్టుకుంది. క్రిస్మస్ పాత్రలకు ప్రాణం పోస్తూ తోలుబొమ్మల ప్రదర్శన కొనసాగగా, ది జింజర్‌బ్రెడ్ మ్యాన్, ది ఎల్వ్స్ అండ్ ది షూమేకర్, ఎ స్టోరీ ఆఫ్ గ్రాటిట్యూడ్ అండ్ గివింగ్ ది క్రిస్మస్ స్పైడర్ కథలను కళ్లకు కట్టారు. ఇదే విధంగా సోమవారం ఇంటర్నేషనల్ క్లౌన్ షో, తర్వాతి రోజుల్లో జాయ్ ఆఫ్ గిఫ్ట్ ఈవెంట్, శాంతాక్లాజ్, గ్రీట్ మీట్.. ఇంకా పలు వర్క్‌షాప్స్ ఆటపాటలు వగైరాలు నిర్వహించనున్నట్టు మాల్ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 29 వరకూ కొనసాగే ఈ వేడుకలు హార్ప్ కచేరీతో ముగుస్తాయన్నారు.



తిరుపతిలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో వైఎస్ జగన్ చిత్రపటాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గంలో నల్లమల అభయారణ్యంలోని మారుమూల గిరి జన గూడెం పాలుట్లలో జగన్ జన్మదినం సందర్భంగా ఆనందంతో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేస్తున్న నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్ తదితరులు

ఊరూవాడా సంబరాలు

ఘనంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

సాక్షి, అమరావతి: అభివృద్ధి, సంక్షేమ సారథి, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శనివారం ఏపీ వ్యాప్తంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు చేసుకొన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు 26 జిల్లాల్లో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో కేక్‌లు కట్ చేశారు. వీధులు, కూడళ్లలో వైఎస్ జగన్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. యువత ర్యాలీలు చేశారు. పేదలు, అనాథలకు వస్త్ర దానాలు చేశారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్ జగన్ అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా 14 దేశాల్లోనూ జగన్ జన్మదిన వేడుకలను అభిమానులు వైభవంగా నిర్వహించారు.

కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధం

- ఓయూ కృతజ్ఞత సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



అభివాదం చేస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ–కార్ రేసు కుంభకోణంలో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంపదను దోచుకుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు చెప్పారు. ఇక నుంచి జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏటా ఉద్యోగాల భర్తీ జరుగుతుందన్నారు. శనివారం ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీహెచ్‌డీ విద్యార్థి చనగాని దయాకర్ అధ్యక్షత వహించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేయని అభివృద్ధిని ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓయూకు విచ్చేసి ఇక్కడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు మేడ శ్రీను పాల్గొన్నారు.

మంత్రులు వేస్ట్.. కాదుకాదు పాలన వేస్ట్

ఆమాత్యుల పనితీరు మీద ఏపీ ప్రభుత్వం సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఆరునెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా చేయించుకున్న సర్వేలోనూ అదే విషయం వెల్లడికావడం అధికార పార్టీ వర్గాలను తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. పాలనను ప్రతిబింబించే మంత్రుల పనితీరు మీద సర్కారు ఇటీవల సర్వే చేయించి వారికి ర్యాంకింగ్ ఇచ్చింది. ఇదే విషయాన్ని సీఎం స్వయంగా కేబినెట్ సమావేశంలో మంత్రులకు వెల్లడించారు. తాజాగా.. మంత్రుల పనితీరు మీద ర్యాంకులు ఇచ్చిన నివేదికను ప్రభుత్వ పెద్దలు లీక్ చేశారు. కేవలం ఆరుగురు మంత్రుల పనితీరు మాత్రమే సంతృప్తికంగా ఉందని, మిగతా 18 మంది ర్యాంకులు అధ్వానంగా ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. సహజంగా.. ప్రభుత్వ పాలన తీరుకు మంత్రివర్గం పనితీరును గీటురాయిగా తీసుకుంటారు. మంత్రివర్గంలో 75 శాతం మంది సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని, సర్వేలో ర్యాంకులు అధ్వానంగా రావడం మంచి పరిణామం కాదని అధికార పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ర్యాంకులు మరీ అధ్వానంగా ఉన్న మంత్రుల జాబితాలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, సీఎం కుమారుడు లోకేశ్ కూడా ఉండటం గమనార్హం. ప్రభుత్వానికి అన్నీ తామై వ్యవహరిస్తున్న ఈ ఇద్దరి పనితీరు, ప్రభుత్వ పనితీరును వేరుచేసి చూడలేమని, ప్రభుత్వం చేయించిన సర్వేలో తేలిన విషయమే ప్రజల్లోనూ స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఒక్క హామీని కూడా అమలుచేయకుండా కబుర్లతో కాలక్షేపం చేస్తున్న తీరును ప్రజలు గుర్తించారు. ప్రజాసంక్షేమం దిశగా ప్రభుత్వం ఏమీచేయలేక చేతులెత్తేసిన విధానమే మంత్రుల పనితీరు మీద ప్రతిబింబించిందనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించకుండా, 'అధ్వాన్న పనితీరు' పేరిట తమను నిందించడంలో అర్థంలేదని మంత్రులు తమ సన్నిహితుల దగ్గర వాపోతున్న విషయం అధికార పార్టీ వర్గాలకు తెలుసు. పైపెచ్చు.. లోకేశ్ అన్ని మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకుంటే తాము చేయడానికి ఏముంటుందని.. తమ చేతులు కట్టేసి తాము అసమర్థులమని సర్వేల్లో తేల్చి ర్యాంకింగ్ ఇవ్వడం ఏమిటని మంత్రులు ప్రశ్నిస్తున్నారు. సర్వే చేశామని చెప్పి, ర్యాంకులంటూ లీకులు ఇస్తే ప్రయోజనం ఏమీ ఉండదని.. ప్రభుత్వమే ప్రజా సంక్షేమం గురించి ఆలోచించి హామీలు అమలుచేస్తే ప్రభుత్వ సామర్థ్యం పెరిగిందని ప్రజలు భావిస్తారని, అప్పుడు ప్రజలు అడిగిన పనులు చేశామని తమ పనితీరు కూడా బ్రహ్మాండంగా ఉంటుందని మంత్రులు చెబుతున్నారు.

పవన్ పనితీరుపైనా అసంతృప్తి..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పనితీరు అంత బాగోలేదని నివేదిక తేల్చడమంటే.. అన్ని శాఖల కంటే అత్యధిక బడ్జెట్ ఉన్న పంచాయతీరాజ్ శాఖను ఇచ్చినా ఆయన అందుకు తగ్గ రీతిలో పనిచేయడం లేదని, అంటే ప్రభుత్వ పనితీరు అధ్వానంగా ఉందనే అర్థమని పరిశీలకులు చెబుతున్నారు. హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడమే మంత్రుల ర్యాంకింగ్ అద్దంపడుతోందని, అది కేవలం పవన్‌కళ్యాణ్ ఒక్కడి వ్యక్తిగత సామర్థ్యం తక్కువనే భావన కాదని జనసేన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు తనయుడు లోకేశ్ నిర్వహిస్తున్న కీలకమైన మానవవనరుల (విద్యా శాఖలు) శాఖలో అన్నీ సమస్యలే ఉండడంతో ఆయన పనితీరుపైనా పెదవి విరుస్తున్నారు.

పెత్తనం లోకేశ్‌ది.. తిట్లు మాకా!?

ఈ ర్యాంకింగ్‌లపై మంత్రులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ప్రాతిపదికన తమ పనితీరు అంచనా వేసిందో తెలీడంలేదని సీనియర్ మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాంనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు వంటి నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు సమాచారం. ప్రభుత్వంలోని అన్ని వ్యవహారాల్లో లోకేశ్ తలదూరుస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇక తమకు పనిచేయడానికి అవకాశమెక్కడ ఉందని వారు ప్రశ్నిస్తున్నారు. తమ శాఖలకు చెందిన కీలక నిర్ణయాలు లోకేశే తీసుకుంటుంటే వాటికి తమను బాధ్యులను చేయడం ఏమిటని ఆందోళన చెందుతున్నారు. చివరికి.. తమ శాఖల కార్యదర్శులు, కమిషనర్లు తమను పట్టించుకోకుండా.. లోకేశ్ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని వీరు చెబుతున్నారు. అన్ని పనులూ వారే చేసుకుంటూ తమ పనితీరు బాగోలేదని ఎలా చెబుతారని ఈ మంత్రులు మండిపడుతున్నారు.

అభినందన 'పత్రం'

రావి ఆకుపై మాజీ సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నారాయణఖేడ్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఖేడ్‌కు చెందిన ప్రముఖ పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై చిత్రాలు మలిచారు. ప్రముఖుల జన్మదినోత్సవాలు, ఆయా పండుగలు, ప్రాధాన్యాలపై లీఫ్ ఆర్టిస్ట్ గుండు శివకుమార్ చిత్రాలు వేస్తూ విశిష్టతను తెలియపరుస్తుంటారు. ఏపీ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను కూడా రావి ఆకులపై మలచి వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపారు.

రేపు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు?

- అర్వింద్‌కుమార్, బీఎల్‌ఎన్‌రెడ్డిలకు కూడా ఇచ్చే అవకాశం
- ఫార్ములా–ఈ కార్ల రేసు కేసులో చర్యలకు సిద్ధం
- బ్యాంకు అధికారుల నుంచి వివరాలు సేకరించనున్న ఈడీ

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా–ఈ'కార్ల రేసు వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఏసీబీ నమోదు చేసిన కేసు ఆధారంగా 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)'ను నమోదు చేసిన ఈడీ అధికారులు ఈ కేసులో ప్రధాన నిందితులకు సమన్లు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ కేసులో ఏ–1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఏ–2గా ఉన్న పురపాలకశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఏ–3గా ఉన్న హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డికి ఈడీ సోమవారం సమన్లు జారీ చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఏసీబీ నుంచి ఫార్ములా–ఈ కారు రేసు ఒప్పందాలకు సంబంధించి సేకరించిన పత్రాలు, ఎఫ్‌ఐఆర్‌తోపాటు బ్యాంకు లావాదేవీలను ఈడీ అధికారులు పరిశీలించారు. హెచ్‌ఎండీఏ సాధారణ నిధుల నుంచి యూకేకు చెందిన 'ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈఓ)'కు రూ.45,71,60,625 సొమ్మును విదేశీ కరెన్సీలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా బదిలీ చేశారు. దీంతో సదరు బ్యాంకు అధికారుల వాంగ్మూలాలను ఈడీ అధికారులు నమోదు చేయనున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకు అధికారులను సైతం ప్రశ్నించనున్నారు. ఓవైపు ఈ కేసులో ఈడీ అధికారులు వేగం పెంచగా మరోవైపు తెలంగాణ ఏసీబీ సైతం కీలకాంశాలపై దర్యాప్తు ముమ్మరం చేసింది. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్టు చేయొద్దని.. కానీ దర్యాప్తు కొనసాగించుకోవచ్చని హైకోర్టు ఆదేశించడంతో ఆధారాల సేకరణపై ఏసీబీ దృష్టి పెట్టింది. తొలుత హెచ్‌ఎండీఏ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ వాంగ్మూలం నమోదుతో దర్యాప్తు ప్రక్రియ ప్రారంభించనుంది. ఈడీ, ఏసీబీ దర్యాప్తులో ఏ విషయాలు వెలుగులోకి వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ఏసీబీ సేకరించే పత్రాలు ఈడీకి ఉపయోగపడినట్లే ఈడీ దర్యాప్తులో మనీలాండరింగ్ కోణంలో ఏవైనా ఆధారాలు లభిస్తే ఈ కేసు మరో మలుపు తిరుగుతుందన్న చర్చ నడుస్తోంది.

ఇకపై నో బెనిఫిట్ షోస్

సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

- సందేశాత్మక, తెలంగాణ చరిత్రపై సినిమాలకే నామమాత్రంగా టికెట్ రేట్లు పెంచుతాం
- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడ్డ బాలుడికి పరామర్శ
- తన సొంత ఫౌండేషన్ నుంచి బాలుడి తండ్రికి రూ. 25 లక్షల చెక్కు అందజేత



కిమ్స్ ఆస్పత్రి వద్ద శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు చెక్కును అందిస్తున్న కోమటిరెడ్డి

రాంగోపాల్‌పేట్: తెలంగాణలో ఇకపై ఎంత పెద్ద బడ్జెట్‌తో రూపొందించే సినిమాలకైనా బెనిఫిట్ షోలను అనుమతించబోమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. అలాగే టికెట్ రేట్ల పెంపుపై ఆచితూచి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సందేశాత్మక చిత్రాలతో పాటు తెలంగాణ పోరాటం, ఉద్యమం, చారిత్రక అంశాలపై రూపొందించే సినిమాలకు నామమాత్రంగా టికెట్ రేట్ల పెంపునకు అనుమతిస్తామని తెలిపారు. సంధ్య థియేటర్‌లో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను శనివారం సాయంత్రం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీతేజ్‌కు గొంతులో పైపులు వేసి ఆహారం అందిస్తున్నారని.. ప్రస్తుతం చాలా బలహీనంగా ఉన్నాడన్నారు. అతను కోలుకోవడానికి ఏడాదికిపైగా సమయం పట్టొచ్చని వైద్యులు అంటున్నారన్నారు. బాలుడు కోలుకొనే వరకు ప్రభుత్వం ఆస్పత్రి ఖర్చులు భరిస్తుందని చెప్పారు. 'కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా రూ. 25 లక్షల చెక్కును బాలుడి తండ్రి భాస్కర్‌కు అందించారు. భాస్కర్‌కు ఆత్మస్థైర్యం అందించడంతోపాటు ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పేందుకు సీఎం రేవంత్ ఆదేశాలతో తాను వచ్చినట్లు తెలిపారు. సంధ్య థియేటర్‌కు రావొద్దని పోలీసులు రాతపూర్వకంగా సూచించినప్పటికీ హీరో అల్లు అర్జున్ వచ్చారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు.

కొద్దిగా మెరుగుపడ్డ శ్రీతేజ్ ఆరోగ్యం

బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొద్దిగా మెరుగుపడినట్లు కిమ్స్ ఆస్పత్రి శనివారం విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో తెలిపింది. వెంటిలేటర్ సాయం లేకుండానే అతను శ్వాస తీసుకోగలుగుతున్నాడని పేర్కొంది.

సినిమా వాళ్లు స్పెషలా?

▶ మొదటి పేజీ తరువాయి

కాపాడటం తమకు ప్రధానమని.. ప్రాణాలు పోయేందుకు ఎవరు కారణమైనా విడిచిపెట్టబోమని హెచ్చరించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైన వారిని విచారించి శిక్షించే వరకు విడిచిపెట్టబోమని ప్రకటించారు.

శనివారం అసెంబ్లీలో రైతుభరోసాపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ''సంధ్య థియేటర్ తొక్కిసలాట విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అతిగా స్పందించిందన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. ఒక మహిళ చనిపోగా, ఒక బాలుడు కోమాలో, మరొకరు తొక్కిసలాటలో ఇరుక్కుపోతే.. ఆ హీరో కనీసం పట్టించుకోకుండా అభిమానులకు చేతులు ఊపుతూ వెళ్లడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?''అని పేర్కొన్నారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

''ఈ అంశం సభలో చర్చకు వస్తుందని అనుకోలేదు. డిసెంబర్ 4న పుష్ప–2 విడుదల సందర్భంగా హీరో, హీరోయిన్ వస్తారని బందోబస్తు కల్పించాలని డిసెంబర్ 2న సంధ్య టాకీస్ వాళ్లు చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేశారు. ఆ ప్రాంతంలో రద్దీతోపాటు సంధ్య థియేటర్‌లోకి వెళ్లడానికి, బయటికి రావడానికి ఒకే గేటు ఉన్న కారణంగా సెక్యూరిటీ కల్పించలేమని అనుమతి నిరాకరిస్తూ 3న అక్కడి సీఐ సమాధానమిచ్చారు. అయినా 4న రాత్రి 9 గంటల ప్రాంతంలో అల్లు అర్జున్ ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మీదుగా తన కారు రూఫ్ టాప్ ఓపెన్ చేసి రోడ్‌షో నిర్వహిస్తూ థియేటర్‌కు వచ్చారు. తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఉన్న ఆ ప్రాంతంలో వేలమంది ఒకచోట చేరడంతో పరిస్థితి అదుపు తప్పింది. అల్లు అర్జున్ 50, 60 మంది ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుగా ఉన్న వారిని తోసేయడం తొక్కిసలాటకు దారితీసింది. రేవతి అనే మహిళ, శ్రీతేజ్ అనే బాలుడు స్పృహ తప్పినట్టుగా పోలీసులు గుర్తించారు. అప్పటికే రేవతి మరణించగా, శ్రీతేజ్ బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ప్రకటించారు.

పోలీసులు చెప్పినా పట్టించుకోలేదు

ఏసీపీ ఆ రోజు రాత్రి 11 గంటల సమయంలో సంధ్య థియేటర్‌కు వెళ్లి పరిస్థితి బాగో లేదని.. హీరోను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరినా పూర్తి సినిమా చూస్తానంటూ ఆయన పట్టించుకోలేదు. తర్వాత డీసీపీ వెళ్లారు. వెంటనే వెళ్లిపోకపోతే అరెస్ట్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో బయటికి వచ్చారు. ఇంత ప్రమాదం జరిగి, ఒకరు చనిపోయాక కూడా హీరో కారు రూఫ్‌టాప్ ఓపెన్ చేసి అభిమానులకు చెయ్యి ఊపుతూ వెళ్లారంటే... ఆయన ఎలాంటి మనిషి అనుకోవాలి? నేను సీఎం కుర్చీలో కూర్చుని మౌనంగా ఉండలేను.

ఇంటికెళ్లిన పోలీసులతో దురుసుగా..

తొక్కిసలాట ఘటనపై పోలీసులు కేసు పెట్టారు. కొందరిని అరెస్ట్ చేశారు. కొన్నిరోజుల తర్వాత హీరో నివాసానికి కూడా వెళ్లి తమ వెంట రావాల్సిందిగా కోరారు. కానీ పోలీసులపై వారు దురుసుగా ప్రవర్తించారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయి. ఆ హీరోను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లగానే... నా రాజకీయ మిత్రుల కోసం కేసు పెట్టానంటూ సోషల్ మీడియాలో కొన్ని రాజకీయపార్టీల వారు నన్ను పైశాచికంగా, నీచంగా తిడుతూ పోస్టులు పెట్టారు.

బాధితులను కనీసం పరామర్శించలేదు

శ్రీతేజ్ తండ్రి నెలకు రూ.30 వేలు సంపాదించే మామూలు ఉద్యోగి. కొడుకు ఆ హీరో అభిమాని కావడంతో.. స్పెషల్ షో కోసం ఒక్కో టికెట్‌కు రూ.మూడేసి వేల చొప్పున రూ.12 వేలు పెట్టి కొన్నారు. తల్లి రేవతి చనిపోయి, అబ్బాయి తీవ్ర అస్వస్థతకు గురై 11 రోజులు గడిచినా ఆ కుటుంబ సభ్యులను హీరో, ప్రొడ్యూసర్, మరెవరూ పరామర్శించలేదు. ఇది ఏరకమైన మానవత్వం? ఇలా వ్యవహరించే వారిని ఏమనాలి? విధి నిర్వహణలో భాగంగా హీరోను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళితే.. పదేళ్ల మంత్రిగా ఉన్న ఓ వ్యక్తి, ఉద్యమాల టైంలో షూటింగ్‌లు జరపొద్దంటూ దాడులు చేసిన వ్యక్తి విమర్శలు చేస్తారు. ఈ హీరో భగవత్ స్వరూపుడు, ఆయనను పోలీసులు ముట్టుకుంటారా? అసలేం జరుగుతోంది? అంటారు. అంటే మీ స్నేహితులైతే అరెస్ట్ చేయొద్దా? వారేం చేసినా మాఫీనా?

ప్రత్యేక రాయితీలిచ్చింది మా సర్కారే కదా!

సినీ పరిశ్రమను ప్రోత్సాహించాలని ఆ సినిమాకు టికెట్ రేట్ల పెంపు, స్పెషల్ షోలకు అనుమతినిచ్చింది మా ప్రభుత్వమే. అయితే ఇలా ప్రోత్సహించే క్రమంలో ప్రాణాలు తీసే ఘటనలు జరిగినా ఏమీ చేయకూడదంటే ఎలా? అంటే ఫిల్మ్‌స్టార్, సూపర్ స్టార్, రాజకీయ ప్రముఖులు ఎవరినైనా హత్యచేసినా... వారిని ప్రాసిక్యూట్ చేయొద్దని ఏదైనా ప్రత్యేక చట్టం ఉంటే చెప్పండి పాటిస్తాం.

సినీ ప్రముఖులను సూటిగా అడుగుతున్నా..

తల్లి చనిపోయింది, పిల్లవాడు బ్రెయిన్ డెడ్ అయ్యి కోమాలో ఉంటే ఒక్కరైనా వెళ్లారా? సినీ ప్రముఖులను సూటిగా అడుగుతున్నా.. ఆ సినీ హీరోకు ఏమైంది కాలు పోయిందా? చెయ్యి పోయిందా? కన్ను పోయిందా? కిడ్నీలు దెబ్బతిన్నాయా? ఏమైంది.. వెళ్లి పరామర్శించడానికి.. అదే చావుబతుకుల్లో ఉన్న పిల్లవాడిని ఒక్కరూ పరామర్శించలేదు. ఇది సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి.

హీరో అయితే అర్ధరాత్రి జైలు నుంచి వదిలిపెట్టాలా?

హీరోకు హైకోర్టు బెయిల్ ఇచ్చింది. ఆయనను అర్ధరాత్రి 11, 12 గంటలకు విడుదల చేయాలని చాలా మంది గట్టిగా కోరారు. అర్ధరాత్రి జైలు నుంచి వదిలేందుకు చట్టంలో ఏదైనా వెసులుబాటు ఉందా? సినీహీరో కాబట్టి అర్ధరాత్రి వదిలిపెట్టాలంటే ఎలా? కొన్ని రాజకీయ పార్టీల నేతలు, పదేళ్ల మంత్రిగా ఉన్న వారు ఆ హీరోపై కేసు పెట్టడాన్ని తప్పుబడుతున్నారు. హీరో కాబట్టి ఏం చేసినా చెల్లుతుందా? మేం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి అనుగుణంగా చట్టం, న్యాయం ప్రకారం నడిపిస్తాం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అప్పుల్లో పోటీపడుతున్న చంద్రబాబు, రేవంత్‌రెడ్డి: పాల్



రామగిరి (నల్లగొండ): రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిలు అప్పులు చేయడంలో పోటీ పడుతున్నారని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ పేర్కొన్నారు. శనివారం నల్లగొండలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సీఎం సంవత్సరంలో రూ. లక్షా 20 వేల కోట్లు అప్పు చేయగా, చంద్రబాబు ఆరు నెలల్లోనే రూ.68 వేల కోట్లు అప్పు చేశారని విమర్శించారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరుతో 432 నిర్మాణాలను కూల్చారన్నారు. ఆర్.కృష్ణయ్య లాంటి బీసీ లీడర్ పార్టీలకు బానిసగా మారారని విమర్శించారు. ప్రజాశాంతి పార్టీని గెలిపిస్తే రాష్ట్రంలో అప్పులు తీర్చడమే కాకుండా నిరుద్యోగ సమస్యను తీర్చి అభివృద్ధి చేస్తానని పాల్ హామీ ఇచ్చారు.

స్పీకర్‌తో సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: వారం రోజుల పాటు జరిగిన శీతాకాల శాసనసభ సమావేశాలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సీఎం సన్మానించారు.

నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై చేసిన విమర్శల నేపథ్యంలో శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అల్లు అర్జున్ మాట్లాడారు. తాజా పరిణామాలపై వివరణ ఇచ్చారు.

థియేటర్ నాకు గుడిలాంటిది..

'సినిమా థియేటర్ నాకు గుడి లాంటిది. అక్కడ ప్రమాదం జరగడం నాకు చాలా బాధగా ఉంది. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. ఆ ఘటన తర్వాత నిర్మాత బన్నీ వాసు వెళ్లి బాధిత కుటుంబంతో మాట్లాడారు. నేను కూడా వస్తానంటే ఉద్రిక్త పరిస్థితులు ఉన్నందున మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని చెప్పి వారించారు. నాపై పోలీసులు కేసు నమోదు చేసినందున బాధిత కుటుంబాన్ని కలిస్తే చట్టపరంగా తప్పుడు సంకేతాలు వస్తాయని లీగల్ టీం సైతం గట్టిగా చెప్పడం వల్లే అక్కడికి వెళ్లలేకపోయా'అని అల్లు అర్జున్ తెలిపారు.

నా అభిమాని చనిపోతే వెళ్లాలని నాకు ఉండదా?

తొక్కిసలాట ఘటనలో ఒకరి మృతితో 15 రోజులుగా బాధలో ఉన్నానని అల్లు అర్జున్ చెప్పారు. ఈ నేపథ్యంలో సినిమా విజయోత్సవాలను నిర్వహించరాదని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 'గతంలో మెగాస్టార్ చిరంజీవితోపాటు పలువురు హీరోల అభిమానులు చనిపోతే విజయవాడ, వైజాగ్ లాంటి ప్రాంతాలకు వెళ్లి పరామర్శించా. అలాంటిది నా అభిమాని చనిపోతే వెళ్లనా? పరామర్శించాలని నాకు ఉండదా?'అని అల్లు అర్జున్ ప్రశ్నించారు. ఘటన జరిగిన మర్నాడే బాధిత కుటుంబాన్ని కలవాలనుకున్నప్పటికీ తన లీగల్ టీం సూచనల వల్ల వెళ్లలేకపోయానన్నారు.

అనుమతి లేకపోతే పోలీసులు వెనక్కి పంపేవారు కదా..

థియేటర్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనను అత్యంత దురదృష్టకరమైన ప్రమాదంగా హీరో అల్లు అర్జున్ అభివర్ణించారు. సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు పోలిసులు అక్కడ ఉన్నారని... దాంతో తన రాకకు అనుమతి ఉందనే భావించినట్లు ఆయన చెప్పారు. తాను లోపలికి వెళ్లేందుకు వీలుగా తన వాహనాలకు దారి చూపింది పోలిసులేనని.. ఒకవేళ తన రాకకు పోలీసుల అనుమతి లేకుంటే వారు అప్పుడే వెనక్కి పంపేవారు కదా? అని అల్లు అర్జున్ ప్రశ్నించారు.

రోడ్ షో అనడం దారుణం

థియేటర్‌కు రోడ్ షో, ర్యాలీ చేసుకుంటూ వెళ్లాననే మాట పూర్తిగా అవాస్తవం, దారుణమని అల్లు అర్జున్ వ్యాఖ్యానించారు. థియేటర్‌కు కేవలం కొన్ని మీటర్ల దూరంలో ఉండగా భారీ సంఖ్యలో అభిమానులు తన వాహనాన్ని చుట్టుముట్టారని చెప్పారు. తాను కారులో నుంచి పైకి వచ్చి అభివాదం చేస్తే అభిమానులు పక్కకు జరుగుతారని అక్కడి వారు చెబితే తాను బయటకు వచ్చానని వివరించారు. తనను ఒక్కసారైనా చూసేందుకు అంత మంది అభిమానులు వచ్చినప్పుడు తాను కారులోనే కూర్చుంటే తనకు తల పొగరు అనుకుంటారని భావించే వారికి నమస్కరిస్తూ దారివ్వాలని కోరానన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అల్లు అర్జున్. చిత్రంలో అల్లు అరవింద్, శిరీష్ తదితరులు

మహిళ మృతి గురించి పోలీసులు చెప్పలేదు..

తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందిందని పోలిసులు తనకు చెప్పలేదని అల్లు అర్జున్ చెప్పారు. కేవలం థియేటర్ యాజమాన్యం తన వద్దకు వచ్చి బయట గొడవగా ఉన్నందున వెళ్లిపోవాలని సూచించారన్నారు. దీంతో వెంటనే తాను భార్యతో కలిసి బయటకు వెళ్లిపోయానని వివరించారు. తన పిల్లల్ని లోపలే వదిలి వెళ్లానని.. ఒకవేళ జరిగిన దుర్ఘటన గురించి తెలిస్తే వారిని వదిలి పెట్టి ఎందుకు వెళ్తానని ప్రశ్నించారు. ఈ విషయం మరుసటి రోజు ఉదయం తెలిసి షాక్‌కు గురయ్యానన్నారు. ఆ తర్వాత బాధిత కుటుంబానికి అండగా ఉన్నాననే విషయాన్ని తెలియజేసేందుకే వీడియో విడుదల చేశానన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు శ్రీతేజ్ కోలుకుంటున్నాడని తెలియడం ఒక్కటే ప్రస్తుతం తనకు ఊరట కలిగించే అంశమన్నారు. తాను వెళ్లడం సమస్యగా మారుతుందనే ఉద్దేశంతోనే తన తండ్రి అల్లు అరవింద్‌ను ప్రత్యేక అనుమతి ద్వారా ఆస్పత్రికి పంపి బాలుడి చికిత్స వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని అల్లు అర్జున్ వివరించారు. తాను, దర్శకుడు సుకుమార్ కలిసి పిల్లల భవిష్యత్తు కోసం కచ్చితంగా ఏదైనా మంచి పని చేయాలని అవసరమైతే వారి పేరిట ఫిక్స్ డిపాజిట్ చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు.

ఎవరినీ నిందించట్లేదు..

తాను ఎవరినీ నిందించాలని మాట్లాడటం లేదని.. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కోపం లేదని అల్లు అర్జున్ చెప్పారు. ప్రభుత్వం తమ సినిమాకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించిందని.. అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అదే సమయంలో తనను మానవత్వం లేని వ్యక్తిగా చిత్రీకరించే పరిస్థితి ఎదురవడం అత్యంత బాధాకరంగా ఉందన్నారు. కేసు విచారణ దశలో ఉన్నందున మీడియా ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేనని అల్లు అర్జున్ పేర్కొన్నారు.

మా కుటుంబం గురించి అందరికీ తెలుసు: అల్లు అరవింద్

పాన్ ఇండియా మూవీగా వచ్చిన సినిమాను ప్రేక్షకులతో కలిసి థియేటర్లో చూసుకుందామనే ఉద్దేశంతోనే అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వెళ్లాడని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. థియేటర్ వద్ద ఘటన తర్వాత మనస్తాపానికి గురై అదే ఆలోచనలతో ఉండిపోయాడన్నారు. మూడు తరాల చరిత్రగల తమ కుటుంబం గురించి అందరికీ తెలుసన్నారు. అసత్య ప్రచారాల వల్ల బాధలో ఉన్నందున మనసులోని ఆవేదనను చెప్పుకుంటున్నామన్నారు. ప్రజలు ఆదరిస్తేనే ఈ స్థాయికి వచ్చామని.. అభిమానాన్ని ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నామన్నారు.



'అనుకోలేదని ఆగవు కొన్ని!'
నిజమే... ఇంటర్ వరకు తాను క్రికెట్‌లోకి అడుగు పెడతానని శ్రీచరణి అనుకోలేదు. ఖోఖో, లాంగ్‌జంప్‌లలో అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయిలో పతకాలు గెలుచుకున్న శ్రీచరణి ఇంటర్ చదివే రోజుల్లో క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంది. క్రికెట్ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టింది. ఆటలో తనను తాను మెరుగుపరుచుకుంటూ ఆల్‌రౌండర్ అనిపించుకుంది.
తాజా విషయానికి వస్తే...
మహిళల ప్రీమియర్ లీగ్ 2025 కోసం నిర్వహించిన మినీ వేలంలో శ్రీచరణిని ఎంపిక చేసుకోవడానికి ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 'ఢిల్లీ క్యాపిటల్స్' రూ.55 లక్షలతో శ్రీచరణిని ఎంపిక చేసుకుంది.



శ్రీచరణి బౌలింగ్...

సత్తా చాటేలా...

2021లో అండర్-19 చాలెంజర్స్ ట్రోఫీలో ఇండియా–సి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. గత ఏడాది నిర్వహించిన బీసీసీఐ సీనియర్ అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ మ్యాచ్‌లలో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి కర్నాటక జట్టుపై 7 వికెట్లు, అండర్-23 మ్యాచ్‌లలో రాజస్థాన్ జట్టుపై 5 వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా, లెఫ్ట్‌హ్యాండ్ బ్యాట్స్ ఉమన్‌గా నిలకడగా రాణిస్తుండటంతో ఇటీవల నిర్వహించిన ఉమెన్ టీ-20 పోటీల్లో ఆంధ్రాజట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. తన బౌలింగ్ తీరుతో సెలెక్టర్‌ల దృష్టిని ఆకర్షించింది. గత నెలలో ముంబై ఇండియన్స్ జట్టు ఎంపికలకు వెళ్లిన సమయంలో శ్రీచరణి ఆటలోని నైపుణ్యం గుర్తించిన డబ్ల్యూపీఎల్ ప్రతినిధులు ఢిల్లీ క్యాపిటల్స్‌కు రూ.55 లక్షలతో ఎంపిక చేసుకున్నారు.

● బౌండరీ దాటింది

యర్రంపల్లి నుంచి ఢిల్లీకి

కడప జిల్లా యర్రంపల్లి గ్రామానికి చెందిన శ్రీచరణి అందరిలాగే ఎంతోమంది స్టార్ క్రికెటర్‌ల అద్భుతాలు చూస్తూ, వింటూ వస్తోంది. ఇప్పుడు ఆమె ఒక అద్భుతంగా, మోడల్‌గా నిలిచింది. 'శ్రీచరణి మా ఊరు అమ్మాయే' అని గ్రామస్థులు గర్వంగా చెప్పుకునేలా చేసింది.

యర్రంపల్లి గ్రామానికి చెందిన నల్లపురెడ్డి చంద్రశేఖరరెడ్డి, రేణుక దంపతుల కుమార్తె శ్రీచరణి. తండ్రి ఆర్‌టీపీపీలో ఎలక్ట్రికల్ ఫోర్ మెన్. ఒకటి నుంచి పదవ తరగతి వరకు ఆర్‌టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో చదివింది శ్రీచరణి.

ఆ నమ్మకం ఉంది

చిన్నప్పటి నుంచి నాకు ఆటలంటే ఎంతో ఇష్టం. అమ్మానాన్నలు ఎంతో ప్రోత్సహించేవారు. అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న నేను క్రికెట్‌పై ఆసక్తి చూపినప్పుడు అమ్మానాన్నలు మొదట సందేహించారు. అయితే మామ కిశోర్ కుమార్ మాత్రం ప్రోత్సహించేవారు. నేను క్రికెట్‌లో కూడా రాణిస్తుండటంతో అమ్మానాన్నలకు నాపై నమ్మకం వచ్చి, సంతోషంగా ఉన్నారు. మనలో పట్టుదల ఉంటే ప్రతికూల పరిస్థితులు కూడా అనుకూలంగా మారి దారి చూపుతాయి. సరదాగా మొదలుపెట్టిన క్రికెట్ ఇప్పుడు నాకు సర్వస్వం అయింది. రానున్న కాలంలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానన్న నమ్మకం ఉంది.
– శ్రీచరణి

ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని లేపాక్షి జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. ప్రస్తుతం వీరపునాయునిపల్లెలోని వీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, కంప్యూటర్స్ చదువుతూ మరోవైపు క్రికెట్‌లో రాణిస్తోంది.

2017–18లో క్రికెట్‌లో జిల్లా అండర్-19 జట్టుకు ఎంపికైంది. అప్పటినుంచి ఇక వెనక్కి తిరిగిచూసే అవసరం రాలేదు. అదేఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చింది. 2020లో సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది.

జిల్లాకు చెందిన శిక్షకులు ఖాజామైనుద్దీన్, మధుసూదన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎన్నో మెలకువలు నేర్చుకుంది. మెరుగైన శిక్షణ కోసం కడపకు చెందిన మాజీ రంజీ క్రీడాకారుడు ఎం. సురేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'సురేష్ క్రికెట్ అకాడమీ'లో శిక్షణ పొందుతూ ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రస్తుతం కోల్‌కతాలో నిర్వహిస్తున్న బీసీసీఐ మహిళల సీనియర్ క్రికెట్ మ్యాచ్‌లలో ఆంధ్రా జట్టుకు ఆడుతుంది.

పెద్ద పట్టణాల్లో ఉండే అమ్మాయిలు మాత్రమే క్రికెట్‌లో రాణిస్తారని, జాతీయ స్థాయిలో ఆడతారనే అపోహను బ్రేక్ చేసింది. 'నీ ఇష్టానికి కష్టం తోడైతే... అదే విజయం' అంటున్న శ్రీ చరణి ఎంతోమంది గ్రామీణ ప్రాంత అమ్మాయిలకు స్ఫూర్తిని ఇస్తోంది.

– నాగరాజు, కడప
ఫోటోలు: వల్లెపు శ్రీనివాసులు

రోజూ కొన్ని గంటల పాటు నడుచుకుంటూ పట్టణానికి వెళ్లి కూరగాయలు అమ్మే యాంగ్మీలా ఇప్పుడు ఒక స్టార్టప్‌కు యజమానురాలు. ఎంతోమంది గ్రామీణ మహిళలకు ఉపాధిని, స్ఫూర్తిని ఇస్తున్న ఉత్తేజం.

కష్టాలను పచ్చడి చేసింది!



వర్కర్స్‌తోపాటు పనిచేస్తున్న యాంగ్మీలా

మణిపూర్‌లోని ఫరుంగ్ గ్రామానికి చెందిన యాంగ్మీలా ప్రతిరోజూ ఉదయం తన ఊరి నుంచి ఉఖ్రుల్ పట్టణానికి కూరగాయల బుట్టను మోసుకుంటూ ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లేది. వాటిని అమ్మి ఎండలో తిరిగి ఇంటికి వచ్చేది. తాను నడిచి వెళ్లే దారి మామూలు దారి కాదు. కొండల దారి.

ఆర్థిక ఇబ్బందుల వల్ల 21ఏళ్ల వయసులో కూరగాయలు అమ్మడం మొదలుపెట్టింది యాంగ్మీలా. అప్పటికే ఆమెకు ఒక మగబిడ్డ. భర్త తనను విడిచి వెళ్లాడు. బిడ్డతోపాటు అనారోగ్యంతో బాధ పడుతున్న తండ్రిని చూసుకోవాల్సిన బాధ్యత ఉండడంతో కష్టాన్నే నమ్ముకుంది యాంగ్మీలా.

వయసు పై బడుతుండడంతో యాంగ్మీలాకు నడక భారమైంది. 'ఇలా ఎంతకాలం! వేరే మార్గం లేదా?' అని ఆలోచించింది మనసులో. ఏదైనా వ్యాపారం చేయాలనే ఆలోచనతో మొదటగా పాత బట్టల వ్యాపారంలోకి అడుగు పెట్టింది. ఆ తరువాత కోళ్ల పెంపకం చేపట్టింది. మిఠాయిల దుకాణం నడిపింది. ఉసిరి, మామిడి, ఆపిల్... మొదలైన వాటిని ప్రాసెస్ చేసి మిఠాయిలు తయారు చేసేది. ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న తరువాత ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారంలోకి అడుగు పెట్టింది.

మిర్చి, వెల్లుల్లి, వంకాయలు, వెదురు చివుళ్లు... మొదలైన వాటితో సేంద్రియ ఊరగాయల తయారీని ప్రారంభించింది.

తన స్టార్టప్‌కు 'షిరిన్ ప్రాడక్ట్స్' అని పేరు పెట్టింది.

'షిరిన్' అనేది నాగా పదం. 'పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి' అనేది దీని అర్థం.

జర్మన్ ఎన్జీవో 'జీఐజెడ్' నుంచి ఈ స్టార్టప్‌కు 1.2 లక్షల గ్రాంట్ లభించింది. ఆర్‌బీఐకి సంబంధించిన 'రంగ్ దే' అనే లెండింగ్ ప్లాట్‌ఫామ్ నుంచి రెండు లక్షల రుణం తీసుకుంది. 'షిరిన్' ప్రాడక్ట్స్ చుట్టుపక్కల ప్రాంతాలలోనే కాకుండా మణిపూర్ రాజధాని ఇంఫాల్, అస్సాం, నాగాలాండ్, ఢిల్లీలలో కూడా అమ్ముడవుతున్నాయి.

ఫేస్‌బుక్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను విక్రయిస్తోంది యాంగ్మీలా.

'ఒకే ఉద్యోగితో మా కంపెనీ ప్రారంభం అయింది. మొదట్లో డోర్ టు డోర్ అమ్మకాలు చేసేవాళ్లం. ఇప్పుడు నా దగ్గర పన్నెండు మంది వర్కర్లు పనిచేస్తున్నారు. వారికి నేనే శిక్షణ ఇచ్చాను' అంటుంది యాంగ్మీలా. ఎమ్మెస్సీ చేసిన ఆమె కుమారుడు షంగ్రీఫా ఇప్పుడు వ్యాపారంలో తల్లికి సహాయంగా ఉంటున్నాడు.

'సింగిల్ మదర్‌గా ఆమె ఎలాంటి కష్టాలు పడిందో ఊహించుకోవచ్చు. అయితే ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. కష్టపడాలి, ఎప్పుడూ ఏదో చేయాలనే తపన ఆమెకు విజయాన్ని చేరువ చేసింది. వ్యాపారం మీద ఎంత శ్రద్ధ పెట్టిందో నా చదువు, భవిష్యత్ మీద కూడా అంతే శ్రద్ధ పెట్టింది. ఆమెను చూసి గర్వపడతాను. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి భయపడని ధైర్యవంతురాలైన మహిళ మా అమ్మ' తల్లి గురించి గర్వంగా చెబుతాడు షంగ్రీఫా.

'అస్సాం ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అవార్డ్'తో సహా ఎన్నో అవార్డులు అందుకున్న యాంగ్మీలా ఎంతోమంది గ్రామీణ మహిళలకు స్ఫూర్తిని ఇస్తోంది.

> 'షిరిన్' అనేది నాగా పదం. 'పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి' అనేది దీని అనర్థం.

● ముగ్గు ముచ్చట



5 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు
సరి చుక్క



ఉప్పేటి అర్చిత రెడ్డి
పుటాన్‌పల్లి,
గద్వాల జిల్లా

18 చుక్కలు : 10 వరుసలు : 10 వచ్చే వరకు





సాయి సమీర
బెంగళూరు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

హెల్త్

● హౌజ్ వైఫ్ డర్మటైటిస్!

చలి చేతికి చిక్కొద్దు!



ఈ చర్మవ్యాధిని గృహిణులకు వచ్చే సమస్యగా ప్రత్యేకంగా పేర్కొంటారు. ఎందుకంటే ఇంటి గచ్చును శుభ్రం చేస్తుండటం, బట్టలు ఉతికే సమయంలో సబ్బు (డిటర్జెంట్) వీళ్ల చేతుల్ని ప్రభావితం చేస్తుండటం, ఇంటిపనుల్లో ఇంకవైనా రసాయనాలు తగిలి చేతులు ఇరిటేషన్‌కు లోనవ్వడం వంటివి జరుగుతుంటాయి కాబట్టి దీన్ని 'హౌజ్ వైఫ్ డర్మటైటిస్' అంటారు. దాంతోపాటు చెయ్యిపై దుష్ప్రభావాలు పడతాయి కాబట్టి దీన్ని 'హ్యాండ్ ఎక్సిమా', 'హ్యాండ్ డర్మటైటిస్' అని కూడా అంటారు. నిజానికి ఇది కేవలం గృహిణులనే కాకుండా పలు రకాల రసాయనాలు వాడే వృత్తుల్లో ఉండే వారందరికీ వస్తుంది. ముఖ్యంగా శుభ్రం చేసే వృత్తుల్లో ఉన్నవారూ, కేటరింగ్, బ్యూటీ కేర్ సెలూన్‌లలో హెయిర్ డ్రస్సింగ్ చేసేవారూ, హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో ఉన్నవారు... వీళ్లంతా ఏదో ఒక డిటర్జెంట్ లేదా రసాయనం చేతుల్లోకి తీసుకొని పని చేస్తుంటారు కాబట్టి వీళ్లందరినీ ఈ ఎగ్జిమా లేదా డర్మటైటిస్ ప్రభావం చూపుతుంది. పైగా చలి పెరిగే ఈ సీజన్‌లో ఇది మరింత బాధిస్తుంటుంది. మహిళలను ఎక్కువగా బాధించే ఈ సమస్య గురించి తెలుసుకుందాం.

ఈ వింటర్ సీజన్‌లో మామూలుగానే చర్మం పొడిబారడం ఎక్కువ. దీనికి తోడు రసాయనాలూ చేతులపై దుష్ప్రభావం చూపడం వల్ల ఈ సమస్య మరింతగా అరచేతులూ, చేతివేళ్లూ, గోళ్ల చుట్టూ ఉండే చర్మం (పెరీ ఉంగ్యువల్) ప్రభావితమయ్యే భాగాల్లో ఈ సమస్య తీవ్రంగా మారినప్పుడు అక్కడ నీటిపొక్కుల్లా రావడాన్ని 'పామ్‌ఫోలిక్స్' అని అంటారు. ఒక్కోసారి కొందరిలో ఈ సమస్య అనువంశీకంగానూ కనిపిస్తుంది. తమ సొంత వ్యాధి నిరోధక శక్తే తమ చర్మాన్ని దెబ్బతీయడం వల్ల ఇలా జరుగుతుంది. కొన్ని అలర్జిక్ రియాక్షన్స్, ఆహారం వల్ల కలిగే అలర్జీలు, చాలాసేపు నీళ్లలో ఉండటం వంటి అంశాలూ దీన్ని మరింత పెచ్చరిల్లేలా చేస్తాయి. డ్రై స్కిన్ ఉన్నవారిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఒక్కోసారి ఇక్కడ ఇన్ఫెక్షన్‌లా కూడా మారి మరింత ఇబ్బంది కలిగించే అవకాశముంది.

నివారణ / మేనేజ్‌మెంట్ / చికిత్స...

● ఇంటి పనులు అయిన వెంటనే ఘాటైన సువాసనలు లేని మంచి క్లెన్సర్‌ను గోరువెచ్చని నీటిలో వేసి చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. (ఇందుకు వేడి నీళ్లు ఉపయోగించకూడదు. కేవలం గోరువెచ్చని నీళ్లే వాడాలి). ఇక క్లెన్సర్‌ను ఎంపిక చేసే విషయంలో వాటిల్లో ఘాటైన లేదా చేతికి హానిచేసే తీవ్రమైన రసాయన సాల్వెంట్స్ లేకుండా జాగ్రత్త పడాలి.
● చేతులకు ఈ సమస్యను తెచ్చిపెట్టే డిటర్జెంట్లు / రసాయనాలు కలిపిన నీళ్లు... వంటి వాటికి వీలైనంత దూరంగా ఉండటం లేదా తప్పనప్పుడు ఈ ఎక్స్‌పోజర్ వ్యవధిని వీలైనంతగా తగ్గించడం.
● చేతులను శుభ్రంగా ఉంచుకోవడం (హ్యాండ్ హైజీన్‌ను పాటించడం). ఇందుకోసం ఘాటైన సబ్బులను కాకుండా గ్లిజరిన్, ఆల్కహాల్ బేస్‌డ్ మైల్డ్ శానిటైజర్లు వాడటం. ● ఇల్లు శుభ్రం చేసే సమయంలో లేదా ఇంటి పనులప్పుడు శుభ్రమైన కాటన్ గ్లౌజ్ వాడటం. ఇంటికి సంబంధించిన కాస్తంత మురికి పనులు (డ్రైయిన్లు శుభ్రం చేయడం వంటివి) చేసేటప్పుడూ గ్లౌజ్ ధరించడం.
● చర్మ సంరక్షణ కోసం వాడే వాసన లేని ఎమోలియెంట్స్ (చేతులకు హాయిగొలిపే లేపనాల వంటివి) వాడటం. ● అరచేతులు, చేతివేళ్లు తేమ కోల్పోకుండా ఉండేందుకు చేతికి కొబ్బరి నూనె లేదా చేతులు తేమ కోల్పోకుండా చేసే ఆయింట్‌మెంట్స్ /క్రీమ్స్ వాడటం.
● చేతులకు తగిలే చిన్న చిన్న దెబ్బలు, గీరుకుపోవడం వంటి వాటినీ నిర్లక్ష్యం చేయకుండా వాటికి తగిన బ్యాండ్‌ఎయిడ్ వంటివి వేయడం.

ఈ జాగ్రత్తలు పాటించాక కూడా ఇంకా చేతులు పొడిబారిపోయి, చర్మం లేస్తుండటం, పొట్టురాలుతుండటం, పగుళ్లు వస్తుండటం జరుగుతుంటే డర్మటాలజిస్టుకు చూపించాలి. వారు తగిన పూతమందులు, ఇతరత్రా చికిత్సలతో సమస్యను తగ్గిస్తారు.

లక్షణాలు...
● చేతులపై చర్మం బాగా పొడిగా మారడం, ఇంతగా పొడిబారడంతో పొట్టు లేస్తుండటం ● చేతివేళ్లపై పగుళ్లు, ఈ పగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు చిన్న చిన్న పుండ్లలా మారడం (బ్లిస్టర్స్) ● చర్మం ఊడిపోతూ ఉండటం ● చర్మం ఎర్రబారడం ● ఒక రకమైన నొప్పితో కూడిన ఇబ్బంది.



డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

కంట్లో వలయం... కలవరం?!



కొంత మందికి కంట్లో నల్లగుడ్డు చుట్టూరా ఓ తెల్లని రింగ్ కనిపిస్తుంటుంది. దీన్ని చూడగానే ఆందోళనకు గురవుతుంటారు. కానీ ఇది అంతగా ఆందోళన చెందాల్సిన అంశమూ కాదు... అంతగా ప్రమాదకారీ కాదు. ఇది కేవలం అలర్జీతో వచ్చిన సమస్య మాత్రమే. మన కన్ను ఆరు బయట ఉండే దుమ్మూ ధూళి వంటి కాలుష్యాలకూ, పుప్పొడికి ఎక్స్‌పోజ్ అయినప్పుడు... అలర్జీ ఉన్నవాళ్లలో కంటి నల్ల గుడ్డు చుట్టూ ఇలాంటి తెల్లటి రింగ్ కనిపించే అవకాశం ఉంది. అందుకే కేవలం ఇలా రింగ్ కనిపించే వాళ్లు మాత్రమే కాకుండా అందరూ ఈ తరహా కాలుష్యాలకు దూరంగా ఉండాలి. రక్షణ కోసం ప్లెయిన్ గ్లాసెస్ వాడటమూ మంచిదే.

ఈ సమస్య ఉన్నవారు ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు కన్ను స్వచ్ఛమైన నీటితో కడుగుతూ ఉండాలి. డాక్టర్‌ను సంప్రదించి యాంటీ అలర్జిక్ చుక్కల మందు వాడాల్సి ఉంటుంది. అయితే హానికరం కాదు కదా అంటూ ఈ సమస్యను అలాగే వదిలేస్తే... దీర్ఘకాలం తర్వాత చూపు కాస్తంత మందగించడం, కార్నియా పొర దెబ్బతినడం వంటి సమస్యలు వస్తాయి కాబట్టి వీలైనంత త్వరగా కంటి డాక్టర్‌కు చూపించుకొని వారు సూచించే మందులు వాడాలి.

● సడెన్ సెన్సరీ న్యూరల్ హియరింగ్ లాస్

చెవిపై ఓ కన్నేయండి!



కొందరిలో అకస్మాత్తుగా చెవులు వినపడకుండా పోయే సమస్య కనిపిస్తుంటుంది. అకస్మాత్తుగా కనిపించే ఈ వినికిడి సమస్యను ఇంగ్లిష్‌లో 'సడెన్ డెఫ్‌నెస్' అనీ, వైద్యపరిభాషలో 'సడెన్ సెన్సరీ న్యూరల్ హియరింగ్ లాస్' (సంక్షిప్తంగా ఎస్ఎస్‌హెచ్‌ఎల్) అంటారు. అకస్మాత్తుగా వచ్చే ఈ సమస్య సాధారణంగా ఒక్క చెవినే ప్రభావితం చేస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుంది, అప్పుడు ఏం చేయాలి, వైద్యులు ఎలాంటి చికిత్సలు అందిస్తారనే అంశాలను తెలుసుకుందాం.

అకస్మాత్తు వినికిడి సమస్యను గుర్తించడం కాస్త విచిత్రంగానే జరుగుతుంది. ఉదాహరణకు పొద్దున్నే వాకింగ్‌కు వెళ్తున్నప్పుడు వినిపించే అలారం ఒకవైపే వినిపిస్తుండం లేదా ఫోన్ మాట్లాడుతుంటే ఒకవైపు చెవి వినిపించక... మరో చెవితో వినాల్సి రావడం వంటి అంశాలతో ఈ సమస్య తెలిసివస్తుంది.

లక్షణాలు...
● చెవి పూర్తిగా నిండిపోయినట్లు భావన కలుగుతుండటం ● తల తిరుగుతున్నట్లుగా (డిజ్జీనెస్) అనిపిస్తుండటం ● ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నిల్చున్నప్పుడు వినిపిస్తున్నట్టుగా చెవిలో హోరుమనే శబ్దం వినిపిస్తుండటం (ఈ తరహా సమస్యను 'టినైటస్' అంటారు. ఇది విడిగా కూడా కనిపించే అవకాశముంది).

గుర్తించడం / నిర్ధారణ ఎలా?

ఈఎన్‌టీ డాక్టర్‌ను సంప్రదిస్తే... కొన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. 'కండక్టివ్ హియరింగ్ లాస్' అనే వినికిడి సమస్య లేదనే అంశాన్ని నిర్ధారణ చేయడం కోసం ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. అంటే చెవిలో గులిమి గానీ లేదా ద్రవాలు గాని అడ్డుపడటం వల్ల వినికిడి సమస్య రావడాన్ని కండక్టివ్ హియరింగ్ లాస్ అంటారు. ఆ అడ్డంకిని తొలగించగానే ఈ సమస్య తొలగిపోతుంది. కానీ 'అకస్మాత్తుగా వచ్చే వినికిడి సమస్య' (ఎస్ఎస్‌హెచ్‌ఎల్) లో అలా జరగదు. అటు తర్వాత 'ప్యూర్ టోన్ ఆడియోమెట్రీ' అనే మరో వైద్య పరీక్షతో చెవి ఏయే ఫ్రీక్వెన్సీలలో, ఎంతెంత గట్టి శబ్దాలు వినగలుగుతోందనే విషయాన్ని తెలుసుకుంటారు. అకస్మాత్తుగా వినికిడి సమస్య వచ్చిన వారు కేవలం 72 గంటల్లోనే 30 డెసిబుల్స్ కంటే తక్కువ తీవ్రత ఉన్న శబ్దాలను వినగలిగే శక్తిని కోల్పోతారు. ఇలా అకస్మాత్తుగా వినికిడి సమస్య వచ్చిన వారికి ఎదుటివారు మామూలుగా మాట్లాడుకుంటున్నప్పటికీ అవి గుసగుసల్లా అనిపిస్తుంటాయి.

పైన పేర్కొన్న పరీక్షలతో పాటు మరికొన్ని రక్త పరీక్షలు, ఎమ్మారై వంటి ఇమేజింగ్ పరీక్షలు, బ్యాలెన్స్ పరీక్షలూ బాధితుల్లో ఈ సమస్యకు కారణమేమిటో తెలుసుకోడానికి ఉపయోగపడతాయి.

కోల్పోయిన వినికిడి శక్తి మళ్లీ వస్తుందా?

వినికిడి శక్తి కోల్పోయిన వెంటనే ఎంత త్వరగా చికిత్సకోసం వస్తే అంతగా వినికిడిని మళ్లీ పొందడం సాధ్యమవుతుంది. అయితే... ఇందులో కొందరికి కోల్పోయిన వినికిడి శక్తి పూర్తిగా వస్తే మరికొందరికి కొద్దిగానే వస్తుంది. చికిత్స ఆలస్యమవుతున్న కొద్దీ కోల్పోయిన వినికిడి శక్తిని తిరిగి పొందడం అన్నది కూడా తగ్గుతూ పోతుంది. అందుకే వినికిడి కోల్పోయినట్లు అనిపించగానే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

చికిత్స : వినికిడి శక్తిని కోల్పోయిన సందర్భాల్లో అది ఏ కారణం వల్ల జరిగిందో తెలియనప్పుడు ప్రధానంగా కార్టికో స్టెరాయిడ్స్ సహాయంతో చికిత్స అందిస్తారు. అవి చెవిలో వచ్చిన ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించి, వినికిడి శక్తిని పునరుద్ధరించడానికి తోడ్పడుతుంది. గతంలో ఈ స్టెరాయిడ్స్‌ను నోటి ద్వారా తీసుకునే మందుల రూపంలో ఇచ్చేవారు. అయితే ఇటీవల వీటిని చెవిలోపలికి ఇచ్చే ఇంజెక్షన్‌ల (ఇంట్రా టింపానిక్ ఇంజెక్షన్స్) రూపంలో ఇస్తున్నారు. ఇలా ఇవ్వడం వల్ల ఈ మందులు ప్రభావపూర్వకంగా పనిచేస్తాయి. అంతేకాకుండా, ఈ స్టెరాయిడ్స్ కారణంగా శరీరంలో కలిగే దుష్ప్రభావాలనూ (సైడ్ ఎఫెక్ట్స్) నివరించవచ్చు. అంతేకాదు... ఇలా ఇంజెక్షన్ రూపంలో ఇవ్వడం వల్ల మందు చెవిలో లోపలి వరకు మందు చేరడం సులువవుతుంది. వీటిని ఔట్ పేషెంట్స్ విభాగంలోనే ఓటోలారింగాలజిస్టుల ఆధ్వర్యంలో ఇస్తుంటారు. ఫలితాలు ప్రభావ పూర్వకంగా ఉండాలంటే ఈ ఇంజెక్షన్లను సమస్య కనుగొన్న వెంటనే ఇవ్వాల్సి ఉంటుంది.

ఒకవేళ ఈ అకస్మాత్తు వినికిడి సమస్యకు ఇంకేవైనా అంశాలు కారణమని తెలిస్తే... ముందుగా వాటికి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల ఈ సమస్య వచ్చిందని తేలితే, యాంటీబయాటిక్స్ ఇవ్వడం, ఏవైనా హానికరమైన మందుల వల్ల ఈ సమస్య వచ్చిందని తేలితే, ఆ మందుల్ని ఆపేసి, ప్రత్యామ్నాయ ఔషధాలను ప్రిస్క్రయిబ్ చేయడం, ఒకవేళ తమ సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ ఈ సమస్యను తెచ్చిపెట్టిందని తేలినప్పుడు... ఆ వ్యవస్థను నెమ్మదింపజేసే మందులను వాడటం వంటి చికిత్సలను డాక్టర్లు సూచిస్తారు.

ఒకవేళ వినికిడి లేమి సమస్య చాలా తీవ్రంగా ఉన్నా... లేదా సమస్య రెండువైపులా చెవులకూ వస్తే బయటి శబ్దాలను పెద్దగా వినిపింపజేసే 'హియరింగ్ ఎయిడ్స్' వాడటం లేదా నేరుగా చెవి నుంచి మెదడుకు శబ్దాలను వినిపించే ప్రక్రియను ప్రేరేపించే 'కాక్లియార్ ఇంప్లాంట్స్' అమర్చడం వంటి చికిత్సలు అవసరం కావచ్చు.

విస్మరించే అవకాశాలు ఎక్కువ...

అకస్మాత్తుగా తమకు ఒక చెవి వినిపించకుండా పోయిన ఈ సమస్యను కొందరు పూర్తిగా విస్మరిస్తుంటారు. దీనికి కారణం... తమకు ఏదో అలర్జీ కారణంగా చెవి దిబ్బెడ వేసినట్లు అనిపిస్తుందని అనుకుంటుంటారు లేదా తమకు సైనస్ వంటి ఇన్ఫెక్షన్ ఉన్నందున ఇలా జరుగుతుందని భావిస్తుంటారు. మరికొందరైతే చెవిలో గువిలి చేరిందనీ, అందువల్ల తమ చెవి నిండుగా అనిపిస్తుందనీ, దాన్ని శుభ్రం చేయిస్తే అంతా మామూలైపోతుందని భావిస్తుంటారు.



డా. మోగంటి అశోక్ పృథ్వీరాజ్,
సీనియర్ ఈఎన్‌టీ,
హెడ్ అండ్ నెక్ సర్జన్



నేడు అండర్-19 మహిళల ఆసియాకప్ ఫైనల్ - బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ

ఆసియాకప్ అండర్-19 మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో యువ భారత జట్టు బరిలోకి దిగనుంది. ఈ టోర్నీలో అజేయంగా నిలిచిన భారత జట్టు ఆదివారం కౌలాలంపూర్‌లో జరగనున్న తుది పోరులో బంగ్లాదేశ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని భారత జట్టు 'సూపర్ ఫోర్' చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై విజయంతో ఫైనల్‌కు అర్హత సాధించగా... మరోవైపు బంగ్లాదేశ్ ఈ టోర్నీలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట గెలిచి తుది పోరుకు చేరింది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో సమష్టిగా రాణిస్తున్న యువ భారత జట్టు... ఆఖరి సమరంలోనూ అదే జోరు కొనసాగించాలని భావిస్తోంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) తొలిసారి నిర్వహిస్తున్న ఈ టోర్నీకి మలేసియా ఆతిథ్యమిస్తోంది. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష ఫుల్ ఫామ్‌లో ఉండగా... కెప్టెన్ నిక్కీ ప్రసాద్, కమలిని, మిథిల, ఐశ్వరి కూడా మంచి టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్‌లో ఆయుషి శుక్లా, షబ్నమ్, పరుణిక, ధ్రుతి కీలకం కానున్నారు.

ఫిబ్రవరి 23న భారత్ X పాకిస్తాన్

చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్



దుబాయ్: ఐసీసీ వేదికపై మరోసారి భారత్, పాకిస్తాన్ జట్లు తలపడేందుకు రంగం సిద్ధమైంది. చాంపియన్స్ ట్రోఫీ–2025లో భాగంగా ఇరు జట్లు ఫిబ్రవరి 23న తలపడనున్నాయి. పలు అవాంతరాల తర్వాత ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఐసీసీ సిద్ధమైంది. టోర్నీ షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించకపోయినా...తేదీలు, గ్రూప్‌ల వివరాలు మాత్రం ఖాయమైనట్లు సమాచారం. వేదికల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడంతో ఐసీసీ పూర్తి వివరాలు వెల్లడించలేదు. పాకిస్తాన్‌లో లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. పాక్ గడ్డపై ఆడేందుకు నిరాకరించిన భారత్ హైబ్రిడ్ మోడల్ ప్రకారం యూఏఈలో పాకిస్తాన్‌ను ఎదుర్కొంటుంది. దుబాయ్‌ను తటస్థ వేదికగా ఐసీసీ పరిశీలిస్తోంది. ఫిబ్రవరి 19న ప్రారంభమయ్యే టోర్నీ ఫైనల్‌ను మార్చి 9న నిర్వహిస్తారు. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో భారత్‌తో పాటు పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ ఉండగా...గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ ఉన్నాయి.

భారత్ జోరుకు ఎదురుందా!

వెస్టిండీస్ మహిళలతో సిరీస్‌లో నేడు తొలి వన్డే

- మ.గం.1.30 నుంచి స్పోర్ట్స్–18లో ప్రసారం



వడోదర: కరీబియన్ జట్టుపై వరుసగా మరో సిరీస్ నెగ్గేందుకు భారత మహిళల జట్టు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం తొలి వన్డే జరుగుతుంది. ముంబైలో జరిగిన టి20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌లకు రెగ్యులర్ కెప్టెన్, కీలకమైన మిడిలార్డర్ బ్యాటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ లేకపోయినా స్మృతి మంధాన నేతృత్వంలో జట్టు విజేతగా నిలిచింది. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా మారడం జట్టుకు కలిసొచ్చే అంశం. అయితే మోకాలు గాయంతో సతమతమవుతున్న హర్మన్‌ప్రీత్ ఫిట్‌నెస్ జట్టును కాస్త కలవరపెడుతోంది. 50 ఓవర్ల మ్యాచ్‌ల్లో మిడిలార్డర్ పాత్ర చాలా కీలకం. కాబట్టి ఆమె అందుబాటులోకి వస్తే జట్టుకు లాభిస్తుంది. 2017లో ఇరు జట్ల మధ్య జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో భారత మహిళల జట్టు 4–1తో వెస్టిండీస్‌ను కంగుతినిపించింది. అయితే అప్పటికీ ఇప్పటికి చాలా మారింది. ప్రస్తుత జట్ల బలాబలాల విషయానికొస్తే... సొంతగడ్డపై పొట్టి ఫార్మాట్‌లో భారత్ జట్టు గర్జించింది. వన్డే ఫార్మాట్‌లోనూ ఇదే జోరు కనబరిచేందుకు తహతహలాడుతోంది. స్టార్ ఓపెనర్, తాత్కాలిక కెప్టెన్ స్మృతి వరుస మూడు మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీలతో అదరగొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ నిలకడగా రాణిస్తుండగా, హిట్టర్ రిచా ఘోష్ ఆఖరి టి20లో మెరుపు ఫిఫ్టీతో విండీస్ బౌలర్ల భరతం పట్టింది. ఈ త్రయం ఫామ్ ఇలాగే కొనసాగితే భారత్‌కు ఏ బెంగా ఉండదు. మిడిలార్డర్‌లో తేజల్ హసబ్నిస్, హర్లీన్ డియోల్ జట్టును నడిపించగలరు. బౌలింగ్‌లో దీప్తిశర్మ, రేణుక సింగ్, సైమా ఠాకూర్‌లు ప్రభావం చూపిస్తున్నారు. యువ పేసర్ టైటస్ సాధు ఫీల్డింగ్‌లో కనిపించే చురుకుదనం ప్రత్యర్థి పరుగుల్ని నిరోధిస్తోంది. మరోవైపు ప్రత్యర్థి వెస్టిండీస్ దెబ్బతిన్న పులిలా ఉంది. టి20ల్లో కోల్పోయిన సిరీస్‌ను వన్డేల్లో రాబట్టుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ వెటరన్ బ్యాటర్స్ డియాండ్రా డాటిన్, షెమైన్ క్యాంప్‌బెల్ నిలకడగా ఆడితే భారత్‌కు కష్టాలు తప్పవు. బౌలింగ్‌లో హెన్రీ, ఫ్లెచర్, కరిష్మా రమ్హారక్, జైదా జేమ్స్ ప్రభావం చూపగలరు.

తుది జట్లు (అంచనా)

భారత్ మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ఉమా ఛెత్రి, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, హర్లీన్ డియోల్, తేజల్ హసబ్నిస్, దీప్తి శర్మ, రేణుక, సైమా ఠాకూర్, మిన్ను మణి.

వెస్టిండీస్ మహిళల జట్టు: హేలీ మాథ్యూస్ (కెప్టెన్), క్వియానా జోసెఫ్, డియాండ్రా, షెమైన్ క్యాంప్‌బెల్, నెరిసా క్రాఫ్టన్, హెన్రీ, ఆలియా అలిన్, అఫీ ఫ్లెచర్, షబిక, జైదా జేమ్స్, కరిష్మా.

అన్‌మోల్ రికార్డు సెంచరీ

- 35 బంతుల్లో శతకం
- లిస్ట్ 'ఎ'లో భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీ


అన్‌మోల్

అహ్మదాబాద్: పంజాబ్ బ్యాటర్ అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (45 బంతుల్లో 115 నాటౌట్; 12 ఫోర్లు, 9 సిక్స్‌లు) లిస్ట్ 'ఎ' క్రికెట్ (అంతర్జాతీయ, దేశవాళీ వన్డేలు కలిపి)లో వేగవంతమైన సెంచరీ చేసిన భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. ఫలితంగా విజయ్ హజారే వన్డే టోర్నీలో పంజాబ్ జట్టు అరుణాచల్ ప్రదేశ్‌పై 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అన్‌మోల్‌ప్రీత్ 35 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకోగా... గతంలో ఈ రికార్డు యూసుఫ్ పఠాన్ (40 బంతుల్లో; 2009–10లో) పేరిట ఉంది. ఓవరాల్‌గా లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (29 బంతుల్లో), ఏబీ డివిలియర్స్ (31 బంతుల్లో) తొలి రెండు స్థానాల్లో ఉండగా... ఆ జాబితాలో అన్‌మోల్ మూడో స్థానంలో నిలిచాడు. శనివారం జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన అరుణాచల్ ప్రదేశ్ 48.4 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. తెచీ నెరీ (42; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... పంజాబ్ బౌలర్లలో మయాంక్ మార్కండే, అశ్వని కుమార్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అన్‌మోల్ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో పంజాబ్ 12.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 167 పరుగులు చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (35 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు.

'మా టాపార్డర్ చెలరేగాలి'

రవీంద్ర జడేజా వ్యాఖ్య



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో జరిగే మూడో టెస్టు మ్యాచ్‌లో భారత టాపార్డర్‌నుంచి మరింత మెరుగైన ప్రదర్శన ఆశిస్తున్నట్లు జట్టు సభ్యుడు, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అన్నాడు. ఆరంభంలో పరుగులు రాకపోతే ఆ తర్వాత ఒత్తిడి పెరిగిపోతుందని అతను అభిప్రాయ పడ్డాడు. మూడు టెస్టుల తర్వాత సమాన స్థితిలో తర్వాతి పోరుకు సిద్ధం కావడం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని జడేజా చెప్పాడు. 'ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలాంటి చోట టాపార్డర్ పరుగులు కీలకంగా మారతాయి. వారు పరుగులు చేయకపోతే లోయర్ ఆర్డర్‌పై చాలా ఒత్తిడి పెరిగిపోతుంది. ఈ టెస్టులో అలా జరగదని ఆశిస్తున్నా. జట్టుగా చూస్తే బ్యాటింగ్‌లో అందరూ రాణిస్తేనే భారీ స్కోరుకు అవకాశం ఉన్నా టాపార్డర్, మిడిలార్డర్ పరుగులు ప్రధానం' అని జడేజా వ్యాఖ్యానించాడు. గత మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో రాణించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన జడేజా... ఆసీస్ గడ్డపై అడుగు పెట్టిన దగ్గరినుంచి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటూ సాధన చేసినట్లు వెల్లడించాడు. 'మూడు టెస్టుల తర్వాత 1–1తో సమంగా ముందుకు వెళ్లడం మంచి స్థితిగా భావిస్తున్నా. తర్వాతి రెండు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగుతాయి. మేం ఒకటి గెలిచినా చాలు బోర్డర్–గావస్కర్ ట్రోఫీని నిలబెట్టుకుంటాం. ఇందులో సత్తా చాటితే చివరి టెస్టు గురించి ఆలోచన లేకుండా ఫలితం సాధించవచ్చు' అని భారత ఆల్‌రౌండర్ అన్నాడు.

రాహుల్‌కు స్వల్ప గాయం...

శనివారం ప్రాక్టీస్ సందర్భంగా కేఎల్ రాహుల్ చేతికి స్వల్ప గాయమైంది. బ్యాటింగ్ చేస్తుండగా అతని చేతికి బంతి బలంగా తగిలింది. నొప్పితో అతను కొద్ది సేపు సాధన నిలిపివేశాడు. ఫిజియో చికిత్స తర్వాత అతను కోలుకున్నట్లు కనిపించింది. అయితే రాహుల్ గాయం తీవ్రత గురించి ఎలాంటి సమాచారం లేదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అశ్విన్ హెబర్ సెంచరీ

రైల్వేస్‌పై ఆంధ్ర గెలుపు



ముంబై: ఓపెనర్ అశ్విన్ హెబర్ (136 బంతుల్లో 132; 18 ఫోర్లు, 1 సిక్స్) భారీ సెంచరీతో చెలరేగడంతో విజయ్ హజారే టోర్నీలో ఆంధ్ర జట్టు బోణీ కొట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో ఆంధ్ర జట్టు 91 పరుగుల తేడాతో రైల్వేస్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 49.2 ఓవర్లలో 294 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అశ్విన్ శతకంతో విజృంభించగా... కెప్టెన్ శ్రీకర్ భరత్ (30; 5 ఫోర్లు, 1 సిక్స్), రికీ భుయ్ (41; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రైల్వేస్ బౌలర్లలో రాహుల్ శర్మ 4, యువరాజ్ సింగ్ మూడు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో రైల్వేస్ 41.5 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఉపేంద్ర యాదవ్ (64; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకం బాదగా... మొహమ్మద్ సైఫ్ (46; 5 ఫోర్లు), సూరజ్ అహూజా (40; 5 ఫోర్లు) ఆకట్టుకున్నారు. ఆంధ్ర బౌలర్లలో వినయ్ కుమార్ 4, శశికాంత్ మూడు వికెట్లు తీశారు. తమ తదుపరి మ్యాచ్‌లో సోమవారం రాజస్తాన్‌తో ఆంధ్ర జట్టు అమీతుమీ తేల్చుకోనుంది.

అవనీశ్ అదరహో

నాగాలాండ్‌పై హైదరాబాద్ ఘనవిజయం



అహ్మదాబాద్: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. గ్రూప్ 'సి'లో భాగంగా శనివారం జరిగిన తమ తొలి పోరులో హైదరాబాద్ 42 పరుగుల తేడాతో నాగాలాండ్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 48.1 ఓవర్లలో 276 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ అరవెల్లి అవనీశ్ (82 బంతుల్లో 100; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో ఆకట్టుకోగా... ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (51; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), వరుణ్ గౌడ్ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ తిలక్ వర్మ (0) విఫలమయ్యాడు. నాగాలాండ్ బౌలర్లలో ఇమ్లీవతి లెమ్టుర్ 4, జొనాథన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో నాగాలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. యుగంధర్ సింగ్ (80; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), జగదీశ సుచిత్ (66; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో పోరాడినా లాభం లేకపోయింది. హైదరాబాద్ బౌలర్లలో నిశాంత్, ముదస్సిర్ రెండేసి వికెట్లు తీశారు. అవనీశ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తదుపరి మ్యాచ్‌లో సోమవారం ముంబైతో హైదరాబాద్ తలపడనుంది.

సినిమా

మీ ప్రేమాభిమానాలు చూస్తుంటే మాటలు రావటం లేదు


- రామ్ చరణ్



''డల్లాస్‌లోని అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఇక్కడి వారు చూపించిన ప్రేమాభిమానాలతో మాటలు కూడా రావటం లేదు. మమ్మల్ని రిసీవ్ చేసుకున్న తీరు చూసి ఆశ్చర్యపోయాను. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్నామా? లేక డల్లాస్ వచ్చామా? అని కూడా అర్థం కావటం లేదు. నాపై ప్రేమతో ఇక్కడకు వచ్చినందుకు ధన్యవాదాలు'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన పాన్ ఇండియన్ మూవీ 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లుగా నటించారు. అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జనవరి 10న ఈ సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా అమెరికాలోని డల్లాస్‌లో 'గేమ్ చేంజర్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ నేపథ్యంలో అభిమానులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో రామ్ చరణ్, 'దిల్' రాజు, శిరీష్, చరిష్మా డ్రీమ్స్ రాజేష్ కల్లెపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ– ''ఓవర్సీస్‌లోని ప్రేక్షకులు ముందుగా సినిమాను చూస్తారు. అందుకే ఇక్కడి నుంచే ప్రమోషన్స్‌ను మొదలు పెడుతున్నాం. మా 'గేమ్ చేంజర్'కు మీ ఆశీస్సులు కావాలి. 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు కృతజ్ఞతలు. ఇంత పెద్ద ప్రీ రిలీజ్ వేడుకని ఇంత ఘనంగా నిర్వహించిన రాజేష్ కల్లెపల్లి అండ్ టీమ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు'' అని తెలిపారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''గేమ్ చేంజర్' టైటిల్ పెట్టినప్పుడే సరికొత్తగా ప్రమోషన్స్ చేయాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగా డల్లాస్‌ను సెలక్ట్ చేసుకున్నాం. ఇంత భారీగా ఓ తెలుగు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఇక్కడ నిర్వహించటం ఇదే తొలిసారి. టైటిల్‌కి తగ్గట్టు ఈవెంట్‌ని ఘనంగా చేయాలని ఇక్కడ చేశాం. దానికి రాజేష్ కల్లెపల్లి ముందుకొచ్చి సపోర్ట్ చేశారు'' అన్నారు.

ఈ చిత్రానికి కథ: కార్తీక్ సుబ్బరాజ్, సహ నిర్మాత: హర్షిత్, కెమెరా: ఎస్. తిరుణ్ణావుక్కరసు, సంగీతం: ఎస్ఎస్ తమన్, లైన్ ప్రొడ్యూసర్స్: నరసింహా రావు .ఎన్, ఎస్.కె. జబీర్.

మనం తమిళులకు వదిలేసిన... మన తెలుగు సినిమా కాళిదాస్



సాధారణంగా తొలి తెలుగు టాకీ అనగానే అందరి నోటా వచ్చే మాట 'భక్త ప్రహ్లాద' (1932). కానీ, అంతకన్నా ముందే తెరపై తెలుగు మాటలు, పాటలు వినిపించాయని తెలుసా? పది రీళ్ళ పూర్తి నిడివి 'భక్త ప్రహ్లాద' కన్నా ముందే రిలీజైన సదరు నాలుగు రీళ్ళ సినిమా గురించి విన్నారా? తెరపై తెలుగు వారి ఘన వారసత్వానికి గుర్తుగా నిలిచే ఆ సినిమాను అశ్రద్ధతో మనం మన లెక్కల్లో చేర్చకుండా వదిలేశామంటే నమ్ముతారా? తమిళులు మాత్రం అది తమదిగా గొప్పగా చెప్పుకుంటున్నట్టు గమనించారా? రచయిత – సీనియర్ జర్నలిస్టు **రెంటాల జయదేవ** సుదీర్ఘ పరిశోధనలో తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్' (1931)పై అనేక కొత్త సత్యాలు బయటపడ్డాయి. తెలుగు సినిమా చరిత్రను మలుపు తిప్పుతూ త్వరలో రానున్న ఆ పరిశోధనలోని భాగం...

ఇవాళ్టి 'సాక్షి' ఆదివారం అనుబంధం 'ఫన్‌డే' బుక్‌లో..!

ఫిబ్రవరిలో ప్రారంభం



ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తారని తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ జనవరిలో ప్రారంభం కానుందని తెలిసింది. ముందు ఎన్టీఆర్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తారని, ఆ తర్వాత ఫిబ్రవరిలో ఆరంభించే కొత్త షెడ్యూల్‌లో ఎన్టీఆర్ కూడా జాయిన్ అవుతారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ ఎక్కువగా విదేశాల్లో జరుగుతుందని, డిఫరెంట్ గెటప్స్‌లో ఎన్టీఆర్ నటిస్తారని తెలిసింది. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ 'వార్ 2' చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో హృతిక్ రోషన్ మరో హీరోగా నటిస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఆగస్టు 14న విడుదల కానుంది.

అది నా అదృష్టం

- అనన్య నాగళ్ల



''ఓ నటిగా నాకు ఇండస్ట్రీలో కంటిన్యూస్‌గా పని దొరుకుతున్నందుకు హ్యాపీగా ఉంది. ఇటీవల నేను హీరోయిన్‌గా చేసిన 'పొట్టేల్' సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా నాకు ఆఫర్స్ వస్తున్నాయి. ఇది నా అదృష్టంగా భావిస్తున్నా. నటిగా వంద శాతం బెస్ట్ ఇవ్వడానికి కష్టపడతాను'' అన్నారు అనన్య నాగళ్ల. 'వెన్నెల' కిశోర్ టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. అనన్య నాగళ్ల, శియా గౌతమ్, రవితేజ మహాదాస్యం ఇతర కీలక పాత్రల్లో నటించారు. రైటర్ మోహన్ దర్శకత్వంలో లాస్యా రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో అనన్య నాగళ్ల మాట్లాడుతూ– ''శ్రీకాకుళం నుంచి వచ్చిన ఓ డిటెక్టివ్ ఓ మర్డర్ మిస్టరీని ఎలా ఇన్వెస్టిగేట్ చేశాడు? అన్నదే ఈ సినిమా కథ. ఈ సినిమాలో డిటెక్టివ్ అమ్మ పేరు షర్మిలమ్మ. నాన్న పేరు లోకనాథ్. తన పేరు ఓం ప్రకాశ్. ఈ మూడు పేర్లలో ఫస్ట్ లెటర్ సౌండింగ్‌తో షెర్లాక్ హోమ్స్ అని టైటిల్ పెట్టడం జరిగింది. తెలుగులో డిటెక్టివ్ సినిమా అనగానే చిరంజీవిగారి 'చంటబ్బాయ్' సినిమా గుర్తుకు వస్తుంది. అందుకే ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యేలా ఉండాలని ట్యాగ్‌లైన్‌గా 'చంటబ్బాయిగారి తాలుకా' అని పెట్టాం. ఇక ప్రస్తుతం 'కథాకళి, లేచింది మహిళా లోకం' సినిమాలతో పాటు ఓ ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్, హిందీలో ఓ సినిమా, ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను'' అన్నారు.

జాతర పాటను బాధ్యతగా భావించాను

- నృత్యదర్శకుడు విజయ్ పోలాకి



''అల్లు అర్జున్‌గారి 'పుష్ప 2' సినిమాలోని జాతర సాంగ్‌కు కొరియోగ్రఫీ చేయడాన్ని ఒత్తిడిగా ఫీలవ్వలేదు. బాధ్యతగా ఫీలయ్యాను. ఈ సినిమాలోని 'జాతర' పాటకు, పుష్ప 2 టైటిల్ సాంగ్‌కు మంచి స్పందన వస్తుండటం హ్యాపీ'' అన్నారు కొరియోగ్రాఫర్ విజయ్ పోలాకి. 'అమ్మాడి...' (నాని 'హాయ్ నాన్న'), 'మార్ ముంత చోడ్ చింత...' (రామ్ 'డబుల్ ఇస్మార్ట్'), 'లింగిడి లింగిడి...' (శ్రీకాంత్ 'కోట బొమ్మాళి'), 'నక్కిలీసు గొలుసు...' ('పలాస'), 'కళ్ల జోడు కాలేజ్ పాప...' ('మ్యాడ్') పాటలకు కొరియోగ్రఫీ చేసిన విజయ్ పోలాకి 'పుష్ప 2' చిత్రంలోని జాతర పాట, టైటిల్ సాంగ్ 'పుష్ప పుష్ప'లకు నృత్యరీతులు సమకూర్చారు. ఈ నేపథ్యంలో విజయ్ పోలాకి మాట్లాడుతూ– ''నేను కొరియోగ్రఫీ చేసిన మొదటి సాంగ్ సంపూర్ణేష్ బాబు 'కొబ్బరిమట్ట' సినిమాలోని 'అఆఇఈ...'. ఆ తర్వాత చాలా హిట్ సాంగ్స్‌కు కొరియోగ్రఫీ చేశాను. 'పుష్ప: ది రైజ్' సినిమాలోని 'ఊ అంటావా..' పాట కోసం గణేష్ ఆచార్య మాస్టర్‌గారితో కలిసి వర్క్ చేశాను. అయితే 'పుష్ప 2'లో నాకు కొరియోగ్రాఫర్‌గా చాన్స్ వస్తుందని అప్పుడు ఊహించలేదు. 'పుష్ప 2'లోని 'గంగమ్మ తల్లి...' జాతర పాట, 'పుష్ప... పుష్ప...' పాటకు వర్క్ చేశాను. జాతర పాట రొటీన్‌గా ఉండకూడదని సుకుమార్‌గారు చెప్పారు. ఇలా ఉండాలి అంటూ... కొన్ని మూమెంట్స్ ఆయన చూపించారు. పుష్పరాజ్ క్యారెక్టర్‌ని అర్థం చేసుకుని ఈ పాట చేయాలనుకున్నాను. అందుకని 'పుష్ప' ఫస్ట్ పార్ట్‌ని చాలాసార్లు చూశాను. జాతర సాంగ్‌కి మూడు నెలలు ప్రిపేర్ అయ్యి, 20 రోజులు షూట్ చేశాం. అల్లు అర్జున్‌గారు చాలా కష్టపడి చేశారు. ప్రస్తుతం సాయి తేజ్‌గారి 'సంబరాల ఏటిగట్టు', రామ్‌గారి సినిమా, బెల్లంకొండ శ్రీనివాస్‌గారి 'భైరవం', 'మ్యాడ్ 2' (సింగిల్ కార్డు), హిందీలో 'బేబీ' సినిమాలకు వర్క్ చేస్తున్నాను'' అన్నారు.

డైరెక్టర్‌గా త్రీడీ సినిమా నాకో సవాల్

- మోహన్ లాల్



''ఇప్పటివరకూ మలయాళం నుంచి మూడు త్రీడీ సినిమాలు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు మేం తీసిన మా 'బరోజ్ 3డీ' ఫ్యాంటసీ ఫిల్మ్. ఇప్పుడున్న టెక్నాలజీని వాడుకొని ఈ సినిమాని రూపొందించాం. విజువల్ వండర్‌తో పాటు స్టోరీ టెల్లింగ్‌ని రీ డిస్కవర్ చేసేలా ఉంటుంది. పిల్లలు, పెద్దలు.. ఇలా అందరికీ నచ్చేలా ఉంటుంది'' అని హీరో మోహన్ లాల్ అన్నారు. ఆయన టైటిల్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'బరోజ్ 3డీ'. ఆంటోని పెరుంబవూర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ మూవీని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మోహన్ లాల్ విలేకరులతో మాట్లాడుతూ– ''గార్డియన్ ఆఫ్ డి గామాస్ ట్రెజర్' నవల ఆధారంగా ఒక ఫ్యాంటసీ అడ్వెంచరస్ కథని తయారు చేశాం. వాస్కో డి గామాలో దాగి ఉన్న రహస్య నిధిని కాపాడుతూ వచ్చే బరోజ్... ఆ సంపదను నిజమైన వారసుడికి అందించడానికి చేసే ప్రయత్నాలు ఈ సినిమాలో అద్భుతంగా ఉంటాయి. త్రీడీ సినిమా చేయడం అంత ఈజీ కాదు. ప్రత్యేకమైన కెమేరాలు అవసరం. అలాగే అన్ని కెమేరాల విజన్ పర్ఫెక్ట్‌గా సింక్ అవ్వాలి. ప్రేక్షకులకు గొప్ప త్రీడీ అనుభూతినివ్వడానికి అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. దర్శకుడిగా తొలి సినిమానే త్రీడీలో చేయడం సవాల్‌గా అనిపించింది. ఓ డైరెక్టర్‌గా ఇది నాకు కొత్త అనుభూతి. మా సినిమాకి హాలీవుడ్ పాపులర్ కంపోజర్ మార్క్ కిల్లియన్ నేపథ్య సంగీతం ఇచ్చారు. 12 ఏళ్ల లిడియన్ నాదస్వరం ఈ సినిమాకి సాంగ్స్ కంపోజ్ చేయడం మరో విశేషం. సంతోష్ శివన్ కెమేరా వర్క్ మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రాఫిక్స్ వర్క్ కూడా అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులు థియేటర్‌లో కొత్త ప్రపంచాన్ని అనుభూతి పొందుతారనే నమ్మకం ఉంది'' అని తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా...



ప్రముఖ కవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. మూల విరాట్ (అశోక్ రెడ్డి) టైటిల్ రోల్‌లో నటించారు. పద్మ, రాజ్ కుమార్, స్వప్న ఇతర పాత్రలు పోషించారు. డా. ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో జైనీ క్రియేషన్స్‌పై విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ సినిమా రేపు (డిసెంబరు 23) విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''కాళోజీగారి సందేశం మన విద్యార్థులకైనా చేరితే సినిమా తీసిన ప్రయోజనం నెరవేరుతుందనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డిగారిని కలిశాం. దీంతో తెలంగాణ ప్రభుత్వం సహకారంతో ఈ నెల 23 నుండి 29 వరకు 24 థియేటర్లలో ఉదయం ఆటని ప్రదర్శించనున్నాం. ఉదయం 9 గంటల నుండి 11 గంటలకు అది కూడా స్కూలు పిల్లలకు ఉచితంగా ప్రదర్శిస్తున్నాం. మా చిత్రం పిల్లలకు బాగా నచ్చి, ఈ సినిమా అందరూ చూడాలని వారు ఉద్యమిస్తే రెగ్యులర్ షోస్ వేసే అవకాశం కలుగుతుంది... లేదా కనీసం ఓటీటీలో విడుదల చేసే చాన్స్ ఉంటుంది'' అని చెప్పారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

రత్నాకర్ జౌహరీకి పోస్టింగ్ ఇవ్వండి

సీఎస్‌కు క్యాట్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఐఎఫ్‌ఎస్ అధికారి రత్నాకర్ జౌహరీకి పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు జారీచేసినా ఉల్లంఘించడంపై అసహనం వ్యక్తం చేసిన కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్).. తదుపరి విచారణ లోగా పోస్టింగ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పోస్టింగ్ ఇవ్వని పక్షంలో తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని తెలంగాణ సీఎస్ శాంతికుమారికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను జనవరి 9కి వాయిదా వేసింది. తనను తెలంగాణకు కాకుండా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ 2015, మార్చి 5న నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఐఎఫ్‌ఎస్ అధికారి రత్నాకర్ జౌహరి 2016లో క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై విచారణ చేపట్టిన క్యాట్... ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 80కి నోటిఫికేషన్ విరుద్ధమని, తెలంగాణ రాష్ట్ర కేడర్‌కు చెందిన ఐఎఫ్‌ఎస్ అధికారిగా పరిగణించి జౌహరికి పోస్టింగ్ ఇవ్వాలని కేంద్రం, ఇరురాష్ట్రాలకు 2022లో ఆదేశాలు జారీ చేసింది. ఆదేశాలు జారీచేసిన నాటి నుంచి 3 నెలల్లో పోస్టింగ్ ఇవ్వాలని తెలంగాణ ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేసింది. ఆదేశాలు ఇచ్చి ఇంతకాలమైనా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో జౌహరి మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. దీనిపై వరుణ్ సింధు కుల కౌముది (అడ్మినిస్ట్రేషన్), లతా భరద్వాజ్ పట్నే (జ్యుడీషియల్) ధర్మాసనం విచారణ చేపట్టింది.

బాలికపై లైంగికదాడి?

- కోపోద్రిక్తులైన స్థానికులు, కుటుంబ సభ్యులు
- నిందితుడి ఇంటికి నిప్పు
- పోలీసులపై రాళ్లదాడి.. సీఐ, ఎస్సైకి గాయాలు
- ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో ఘటన



నిందితుడి ఇంటి వద్ద ఆందోళనకారులను నిలువరిస్తున్న సీఐ భీమేశ్ తదితరులు

గుడిహత్నూర్: బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు దిగారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలో శనివారం ఈ ఘటన జరిగింది. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఓ బాలిక (12) మధ్యాహ్నం నుంచి ఇంట్లో కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికారు. ఈ క్రమంలో కాలనీలోని చట్ల పోశెట్టి (25) ఇంటిలోపల గడియపెట్టి ఉండటం, బాలిక సైతం అందులోనే ఉందని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై మహేందర్ హుటాహుటిన అక్కడికి చేరుకుని బాలికను వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ తరుణంలో మద్యం మత్తులో ఉన్న యువకుడిని తమకు అప్పగించాలంటూ బాలిక కుటుంబ సభ్యులు ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలిసి సీఐ భీమేశ్, ఇచ్చోడ ఎస్సై తిరుపతితో కలసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఆగ్రహంతో ఉన్న ఆందోళనకారులను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో స్థానికులు గుమికూడటంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో సీఐ భీమేశ్ తలకు, ఎస్సై తిరుపతి కాలికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు లాఠీచార్జి చేసి ఆందోళనకారులను చెదరగొట్టి, నిందితుడిని అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో ఆందోళనకారులు అక్కడే నిలిపి ఉన్న రెండు పోలీసు వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. అనంతరం నిందితుడి ఇంట్లోని సామగ్రిని బయట పడేసి ఇంటికి నిప్పు పెట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న డీఎస్పీ నాగేందర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదనపు బలగాలను రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

దేశానికి మన విత్తన పాదు

- రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న విత్తన సాగు
- 7.5 లక్షల ఎకరాల్లో.. 3.5 లక్షల మంది రైతుల కృషి
- దేశ అవసరాల్లో 55 శాతం విత్తనాలు ఇక్కడినుంచే..
- నీరు, నేల, వాతావరణం, రైతు వనరులు అనుకూలం
- సాధారణ పంటలకంటే రెట్టింపు ఆదాయం
- విదేశాలకు సైతం తెలంగాణ విత్తనాలు ఎగుమతి



వర్గల్ మండలం వేలూరులో వరి విత్తన సాగు నారుమడి

(యెన్నెల్లి సురేందర్)

గజ్వేల్: భారత్ ఇప్పటికీ వ్యవసాయాధారిత దేశమే. కోట్లమంది రైతులు, కోట్ల ఎకరాల్లో అనేక రకాల పంటలు పండిస్తున్నారు. మంచి పంట రావాలంటే అతి ప్రధానమైనది విత్తనం. పంటలు పండే ప్రతి చోటా విత్తనాన్ని ఉత్పత్తి చేయటం సాధ్యం కాదు. అందుకు సమృద్ధిగా నీరు ఉండాలి.. మంచి నేలలు కావాలి. అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉండాలి.. వీటన్నింటినీ చక్కగా వాడుకోగల నిపుణులైన రైతులు ఉండాలి. ఈ వనరులన్నింటికీ ఇప్పుడు తెలంగాణ ఆలవాలమైంది. అందుకే రాష్ట్రం నుంచి ఏటా విత్తన ఎగుమతులు పెరుగుతున్నాయి. దేశానికి అవసరమైన మొత్తం విత్తనాల్లో 55 శాతం తెలంగాణ నుంచే సరఫరా అవుతున్నాయని తెలంగాణ విత్తనాభివృద్ధి కార్పొరేషన్ అధికారులు తెలిపారు. నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేయటం ఎంత ముఖ్యమో.. దానిని పాడవకుండా దీర్ఘకాలం నిల్వచేయటం కూడా అంతే ముఖ్యం. తెలంగాణ వాతావరణం విత్తన నిల్వకు చక్కగా సరిపోతోంది. అందుకే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసిన విత్తనాలను కూడా తెలంగాణకు తరలించి నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా విత్తనోత్పత్తి పరిశ్రమను ప్రోత్సహిస్తూ దేశంలోనే తొలిసారి ఇక్కడే సీడ్ పార్కును ఏర్పాటుచేసింది. ఏటా విత్తనోత్పత్తి పంటల సాగు పెరుగుతున్న తీరుపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్..

ఒక్కో జిల్లాలో ఒక్కో విత్తనం

విత్తనోత్పత్తి రాష్ట్రంలోని దాదాపు అన్ని ఉమ్మడి జిల్లాలకు విస్తరిస్తోంది. ఉమ్మడి వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్‌తోపాటు సిద్దిపేట జిల్లా విత్తనోత్పత్తికి హబ్‌గా అవతరించాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, భూత్పూర్ ప్రాంతాల్లో పత్తి విత్తనోత్పత్తి భారీగా జరుగుతోంది. ముఖ్యంగా గద్వాల జిల్లాలో విత్తన పత్తి పంట దాదాపు 35 వేల ఎకరాల్లో సాగవుతోంది. మిగితా జిల్లాల్లో వరి, మొక్కజొన్న, సోయా, సజ్జలు, పచ్చ జొన్న తదితర పంటల విత్తనోత్పత్తి జోరుగా సాగుతోంది. నిర్మల్, నిజామాబాద్ ప్రాంతాల్లో సజ్జ విత్తనాల ఉత్పత్తి అధికంగా ఉంది. 2014–15లో వరి విత్తన ఉత్పత్తి 3 లక్షల కిలోలకుపైగా ఉండగా, ఇప్పుడు రెట్టింపైంది. ఇలా అన్ని రకాల విత్తనోత్పత్తి పెరుగుతూనే ఉన్నది. ఈ ఏడు మరింత పెరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.



సజ్జ విత్తనోత్పత్తి సాగు

లక్షల టన్నుల విత్తనాల ఎగుమతి


రాష్ట్ర వ్యవసాయశాఖ, తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారుల లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,400లకు పైగా గ్రామాల్లో 3.10 లక్షల మంది రైతులు 7.5 లక్షల ఎకరాల్లో విత్తనోత్పత్తి చేస్తున్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏటా 80 వేల టన్నుల విత్తనోత్పత్తి జరుగుతోంది. 20 లక్షల టన్నుల విత్తనాల నాణ్యతను ఈ సంస్థ ధ్రువీకరించి ఎగుమతి చేస్తోంది. ప్రైవేట్ కంపెనీలు మరో 11.200 లక్షల టన్నుల విత్తనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. మొత్తంగా రాష్ట్రంలో 12 లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతున్నట్లు అంచనా. మరో 12 లక్షల టన్నుల విత్తనాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. దేశంలో సుమారుగా 44 లక్షల టన్నులకుపైగా విత్తనాల అవసరం ఉండగా.. తెలంగాణ నుంచే 24 లక్షల టన్నులు సరఫరా అవుతుండటం విశేషం. చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, వియత్నాం తదితర 20 దేశాలకు తెలంగాణ విత్తనాలు ఎగుమతి అవుతున్నాయి.



తాను ఉత్పత్తి చేసిన వరి విత్తనాన్ని చూపుతున్న రైతు సీతారామ్‌రెడ్డి

విత్తన సాగుపై రైతుల ఆసక్తి

సాధారణ పంటలకంటే విత్తనోత్పత్తి పంటల సాగులో ఆదాయం అధికంగా వస్తుండటంతో రైతులు అటువైపు మొగ్గుచూపుతున్నారు. సాధారణ పద్ధతిలో ఎకరా విస్తీర్ణంలో వరి సాగుచేస్తే పెట్టుబడి ఖర్చులుపోను రూ.20–30 వేలు మిగలడమే గగనం. కానీ విత్తనోత్పత్తి పంటలు వేస్తే ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్షకుపైగా ఆదాయం వస్తోంది. ఈ పంటల సాగు క్లిష్టమైనదే అయినప్పటికీ.. నిష్ణాతులైన కూలీలతో సులువుగా సాగు చేపడుతున్నారు. విత్తన వడ్లకు క్వింటాలుకు వివిధ కంపెనీలు రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు ధర చెల్లిస్తున్నాయి. ఒకవేళ 10 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడి వస్తే సదరు కంపెనీ రైతుకు పరిహారం కింద ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.1 లక్ష చెల్లిస్తోంది. ఇదే తరహాలో పంట రకాలను బట్టి ధరను చెల్లిస్తున్నారు. మంచి లాభం ఉండటంతో ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 5 వేల ఎకరాల్లో వరితోపాటు ఇతర విత్తన పంటల సాగు చేస్తూ ఏటా రూ.80 కోట్లకుపైగానే లాభం పొందుతున్నారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సేకరించే విత్తనాలపై క్వింటాల్‌కు కనీస మద్దతు ధరకంటే వరికి 20 శాతం అధికంగా ఇన్సెంటివ్స్ ఇస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. తృణధాన్యాలకు 17 శాతం, సోయాబీన్స్‌కు 25 శాతం, ఇతర పంటలకు 15 శాతం ఇన్సెంటివ్స్ ఇస్తున్నారు.



విత్తనోత్పత్తిలో అగ్రిమెంట్లే కీలకం

విత్తనోత్పత్తి విధానంలో రైతులు, కంపెనీలతో కుదుర్చుకునే ఒప్పందాలు సక్రమంగా లేకుంటే నష్టాలు తప్పవు. అగ్రిమెంట్లు సరిగా లేకపోతే కంపెనీ ముందుగా చెప్పే దిగుబడుల కంటే తక్కువ వస్తే పరిహారం ఇవ్వటంలేదు. అందువల్ల రైతులు విత్తనోత్పత్తి చేపట్టే సందర్భంలో ప్రాంతీయ విత్తన అధికారి వద్ద తమ పంటకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే, ప్రైవేటు కంపెనీలు భారీ ఎత్తున విత్తనోత్పత్తి చేపడుతున్నా.. ప్రభుత్వం వైపు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. విత్తనోత్పత్తికి సంబంధించి రైతుల్లో స్వయం ప్రతిపత్తిని పెంపొందించడానికి ఆరేళ్ల క్రితం వరకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామ విత్తనోత్పత్తి పథకాన్ని అమలు చేశారు. ఈ పథకాన్ని పునరుద్ధరించాలని రైతుల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.

విత్తనోత్పత్తితో మంచి ఆదాయం

నాకు పదెకరాల భూమి ఉంది. సాధారణ పద్ధతిలో ఎంత కష్టపడినా ఎకరాకు 25–30 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. ఆ వడ్లను అమ్మితే ఖర్చులు పోను రూ.20–25 వేలు కూడా మిగిలేవి కాదు. అందువల్ల విత్తనోత్పత్తి వైపు వచ్చాను. ఖర్చులు పోను ఒక సీజన్‌లో ఎకరాలో రూ.60–80 వేల వరకు ఆదాయం వస్తోంది.

చిమ్ముల సీతారాంరెడ్డి, వేలూరు, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా

మూడేళ్లుగా సజ్జ విత్తనోత్పతి చేస్తున్న



మూడేళ్లుగా సజ్జ పంటలో విత్తనోత్పత్తి చేస్తున్న. ఖర్చులు పోను ఎకరాకు రూ.50 వేలకుపైనే ఆదాయం వస్తోంది. ఇప్పటివరకు మంచి ఫలితాలే వచ్చినయ్.

- చంద్రం, దండుపల్లి, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా

విత్తనోత్పత్తికి తెలంగాణ నేలలు అనుకూలం



తెలంగాణలో విత్తనోత్పత్తికి అనుకూలమైన నేలలు ఉన్నాయి. చౌడు నేలలు మినహా మిగితా నేలల్లో విత్తన సాగు చేపట్టవచ్చు. విత్తన సాగు రైతులకు లాభదాయకమే అయినప్పటికీ కంపెనీలతో సరిగ్గా అగ్రిమెంట్లు చేసుకోకపోతే నష్టపోవడం ఖాయం.

- డాక్టర్ విజయ్‌కుమార్, సిద్దిపేట జిల్లా డాట్ సెంటర్ శాస్త్రవేత్త

ఢిల్లీకి తిరిగి వెళ్లిన రాష్ట్రపతి ముర్ము

● వీడ్కోలు పలికిన గవర్నర్, ఇతర మంత్రులు ● ముగిసిన శీతాకాల విడిది

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది పర్యటన విజయవంతంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ఢిల్లీకి తిరుగుప్రయాణమయ్యారు. శీతాకాల విడిది కోసం ఆమె ఈ నెల 17న నగరంలోని బొల్లారం రాష్ట్రపతి నిలయానికి వచ్చిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులు, సాంస్కృతిక కార్యక్రమాలను రాష్ట్రపతి ప్రారంభించారు. ఢిల్లీ బయలుదేరి వెళ్లిన రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత గనుల మంత్రిత్వ శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతం, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఇతర అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

రాష్ట్రపతిని కలిసిన యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్

తెలంగాణకు చెందిన యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్‌కు భారత రాష్ట్రపతిని కలిసే అవకాశం లభించింది. శనివారం ఆయన రాష్ట్రపతి నిలయంలో ద్రౌపదీ ముర్మును కలిశారు. తన పర్వతారోహణ వివరాలను యశ్వంత్ ఈ సందర్భంగా రాష్ట్రపతికి వివరించారు. యశ్వంత్‌ను అభినందించిన ముర్ము, మరింత స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆశీర్వదించారు.



రాష్ట్రపతికి ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులు

విమాన ఇంధనాన్ని వ్యాట్ పరిధిలోనే ఉంచాలి

- డెలివరీ సేవల పన్నుపై కమిటీ వేయాలి
- జీఎస్టీ కౌన్సిల్ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి ప్రతిపాదనలు



సాక్షి, హైదరాబాద్: విమానాల్లో వినియోగించే ఇంధనాన్ని వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలో కాకుండా రాష్ట్ర వ్యాట్ పరిధిలోనే ఉంచాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రతిపాదనను జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. రాజస్తాన్‌లోని జైసల్మేర్‌లో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో భట్టి మాట్లాడుతూ రాష్ట్రాలకు తక్కువ ఆదాయ వనరులు ఉన్నందున ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు తెలిపారు. రెస్టారెంట్ సేవలు, ఇతర డెలివరీ సేవలను ఈ–కామర్స్ ఆపరేటర్ల ద్వారా అందించడంపై పన్ను రేటు అమలు చేయడంలో సరళీకృత విధానాన్ని రూపొందించేందుకు అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలన్న సూచనకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపిందని భట్టి చెప్పారు. 2019లో ఏర్పాటైన జీఎస్టీ ఆదాయ విశ్లేషణపై ఉన్న గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం)ను కొనసాగించాలని, 2015–16 ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా కేటాయించిన ఐజీఎస్టీ పునరుద్ధరణ విషయంలో న్యాయబద్ధమైన విధానం అనుసరించాలని, ఈ పునరుద్ధరణను తదుపరి ఆర్థిక సంవత్సరంలో అమలు చేయాలని తాను చేసిన ప్రతిపాదననూ కౌన్సిల్ ఆమోదించిందన్నారు. బీ2బీ (బిజినెస్ టు బిజినెస్) లావాదేవీలపై ఒక శాతం సెస్ వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, వరదల వల్ల జరిగిన నష్టాలను దృష్టిలో ఉంచుకుని అదే తరహా సౌకర్యాన్ని తెలంగాణకూ కల్పించాలని కోరితే.. ఈ అంశాన్ని జీఓఎంకు అప్పగించారని తెలిపారు.

ఎయిర్ ఇండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

- చెన్నై నుంచి పుణే బయల్దేరిన విమానం
- ఇంధనం సరిపడా లేక ఎమర్జెన్సీ ల్యాండింగ్

శంషాబాద్ (హైదరాబాద్): ఇంధనం సరిపడా లేకపోవడంతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. చెన్నై నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 1675 విమానం 160 మంది ప్రయాణికులతో శనివారం ఉదయం పుణేకు బయల్దేరింది. టేకాఫ్ తీసుకున్న కొద్ది సమయం తర్వాత.. ఇంధన సమస్యను గుర్తించిన పైలట్‌లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏటీసీని సంప్రదించారు. ఏటీసీ అనుమతితో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఇంధనం నింపుకొన్న తర్వాత విమానం ఇక్కడి నుంచి పుణే బయలుదేరి వెళ్లినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

టీజీవో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సంతోష్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా గంగుల సంతోష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. టీజీవో కేంద్ర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సంతోష్‌కుమార్ ఎన్నికైన సందర్భంగా.. పలు జిల్లాల టీజీవో అధ్యక్షులు కందుకూరి రవి, కాళీ చరణ్, దేవానంద్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్‌లు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఒక్క మంచు చిరుత ఫొటో తీయడానికే చాలా మంది ఫొటోగ్రాఫర్లు రోజుల తరబడి ఎదురుచూసిన ఘటనలు బోలెడు. అలాంటిది ఇక్కడ రెండు మంచు చిరుతలు.. అది కూడా ఆడుకుంటున్నప్పుడు.. ఇటలీకి చెందిన పౌలో డెల్లా ఈ ఫొటోను హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటీ వ్యాలీలో తీశారు. దీని కోసం–25 డిగ్రీల గడ్డ కట్టించే వాతావరణంలో 6 గంటలపాటు ఎదురుచూసినట్లు చెప్పారు. పౌలో కష్టం వృథా పోలేదు. ఈ చిత్రం నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్–2024 పోటీలో క్షీరదాల విభాగంతోపాటు ఓవరాల్ విన్నర్‌గానూ నిలిచింది. పౌలో డెల్లాకు నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాన్ని తెచ్చి పెట్టింది.

వాగ్వాదాలు.. వాకౌట్‌లు

- ముగిసిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- 8 బిల్లులు ఆమోదం.. 4 అంశాలపై చర్చ
- సమావేశాలకు దూరంగా కేసీఆర్
- మండలి భేటీకి వెళ్లని సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: వారం పాటు సాగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఆరోపణలు– ప్రత్యారోపణలు, సవాళ్లు–ప్రతి సవాళ్లు, వాగ్వాదాలు, నిరసనలు, ఉద్రిక్తతల మధ్య శనివారం ముగిశాయి. ఈ సమావేశాల్లో ఓఆర్ఆర్ లీజు టెండర్లపై సిట్ విచారణ, ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అప్పులపై తీవ్రస్థాయిలో చర్చ జరగ్గా.. ప్రధానమైన భూ భారతితోపాటు మొత్తం 8 బిల్లులు ఆమోదం పొందాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ ప్రారంభమైన తొలి రోజు నుంచి అడుగడుగునా అధికారపక్షాన్ని ఇరుకున పెట్టేందుకు యత్నించింది. అధికార పక్షం కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ పదేళ్ల పాలన రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని, వాటిని సరిచేయడానికే సరిపోతోందని చెప్పింది. ప్రశ్నోత్తరాలు, బిల్లులు, వాయిదా తీర్మానాలు, స్వల్పకాలిక చర్చ కోసం ప్రతిపాదించిన అంశాలపై పలు సందర్భాల్లో అధికార, విపక్ష సభ్యులు పరస్పరం దుమ్మెత్తిపోసుకున్నారు. సమావేశాల చివరి రోజు శనివారం రైతుభరోసాపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించారు. కేటీఆర్ కూడా రైతు రుణమాఫీ అంశంలో రేవంత్ ప్రభుత్వం అబద్ధాలు చెప్తోందంటూ మాటల దాడికి దిగారు. రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలోనైనా రుణమాఫీ సంపూర్ణంగా జరిగిందని రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాలు చేశారు. మిషన్ భగీరథ, నల్లగొండ జిల్లాకు సాగునీరు అంశాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, హరీశ్‌రావు నడుమ కూడా సవాళ్ల పర్వం నడిచింది. ఇన్నాళ్లూ తమ మిత్రపక్షంగా చెప్పుకున్న ఎంఐఎం విమర్శలు చేయడం బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ లక్ష్యంగా బీజేపీ విమర్శలు చేయగా, కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ ప్రభుత్వ అప్పులపై జరిగిన చర్చలో అధికార పక్షం వాదనను పూర్తిగా సమర్థించింది. మరిన్ని అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టాలని సూచించింది.



రోజుకో రచ్చ..

కొత్త రూపంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, అదానీతో రేవంత్ ఫొటోలు, ఆటో డ్రైవర్ల సమస్యలు, లగచర్ల రైతులకు బేడీలు, ప్రభుత్వ అప్పులు, గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, భూ భారతి బిల్లు, ఫార్ములా ఈ, రైతు భరోసా, సభా ఉల్లంఘన నోటీసులు, ప్రతిపక్ష నేత కేసీఆర్ సమావేశాలకు గైర్హాజరు వంటి అంశాలు కేంద్రంగా అసెంబ్లీ సమావేశాలు సాగాయి. ఈ నెల 9న ప్రారంభమైన అసెంబ్లీ కేవలం ఒక రోజు మాత్రమే సమావేశమై తిరిగి 16వ తేదీకి వాయిదా పడింది. 16న స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ భేటీలో సభ నిర్వహణ తేదీలు, ఎజెండాపై స్పష్టత ఇవ్వకపోవడంతో సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్ చేశాయి. రాష్ట్ర పర్యాటక విధానం, గురుకుల విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ అప్పులు, రైతు భరోసా అంశాలపై స్వల్పకాలిక చర్చ జరిగింది. మండలిలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ చేపట్టకుండానే సమావేశాలు ముగిసినట్లు ప్రకటించారు. ప్రస్తుత సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి శాసనమండలి భేటీకి హాజరు కాలేదు.

ఆమోదం పొందిన 8 బిల్లులు

యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీలు (సవరణ), జీఎస్టీ (సవరణ), వేతనాలు, పెన్షన్ల చెల్లింపులు, అనర్హతల తొలగింపు (సవరణ), భూ భారతి (ఆర్వోఆర్), మున్సిపాలిటీ (సవరణ), జీహెచ్ఎంసీ (సవరణ), పంచాయతీరాజ్ (సవరణ) బిల్లులు.

ఉభయ సభల భేటీ తీరుతెన్నులు

	శాసనసభ	శాసనమండలి
సభ పనిచేసిన రోజులు	7	7
పని చేసిన గంటలు	37.44	28.03
ప్రశ్నోత్తరాలు	25	38
సభ్యుల ప్రసంగాలు	71	74
ఆమోదం పొందిన బిల్లులు	8	8
స్వల్పకాలిక చర్చలు	4	3

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.4 వేల కోట్లు

- నెలాఖరుకల్లా వాటిని విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారు
- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యోగ జేఏసీ కార్యాచరణ రూపొందిస్తోందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగులకు విస్తృత సేవలు అందించే దిశగా నాయకత్వాన్ని పటిష్టం చేసేందుకు కేంద్ర సంఘాన్ని విస్తరించాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా 33 పదవులు ఏర్పాటు చేసి నాయకులను ఎన్నుకున్నామని ఆయన వెల్లడించారు. ఈ దిశగా సంఘం బైలాస్‌లో కూడా మార్పులు చేశామన్నారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్యలు 55 ఉన్నాయని, ఇందులో 44 అంశాలు ఆర్థికపరమైనవి కావని, కేవలం 11 అంశాలు మాత్రమే ఆర్థిక సంబంధమైనవని వివరించారు. ఆర్థికపరమైనవి కాని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలసి వివరించామన్నారు. అదేవిధంగా ఉద్యోగుల పెండింగ్ బిల్లులు దాదాపు రూ.4 వేల కోట్లు ఉన్నాయని, వాటిని డిసెంబర్ నెలాఖరుకల్లా విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వీలైనంత వేగంగా ఈ సమస్యలు పరిష్కారమయ్యేలా పోరాడతామని, వచ్చే నెలలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ కార్యవర్గ సమావేశంలో కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తామని, ఆ తర్వాత శాంతియుతంగా పోరాడతామని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖలకు చెందిన పలువురు ఉద్యోగులపై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలున్నప్పుడు వాటిని ఉద్యోగులపై రుద్దవద్దని అన్నారు.

ఫిబ్రవరి 28 వరకు ఘోష్ కమిషన్ గడువు

మరో రెండు నెలలు పొడిగించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. కమిషన్ గడువు ఈ నెల 31తో ముగియనుండగా, 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 28లోగా విచారణ ముగించి నివేదిక సమర్పించాలని కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. గతేడాది అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో సీపేజీ సమస్యలు బయటపడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బరాజ్‌ల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేస్తూ గత మార్చి 14న ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, కమిషన్ గడువును పొడిగించడంఇది నాలుగోసారి. జనవరితో క్రాస్ ఎగ్జామినేషన్‌ను ముగించి ఫిబ్రవరి చివరిలోగా నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది.

- నేడు వెంకట దత్తసాయితో బాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వివాహం
- రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వేడుక
- విందులోనూ మేవారీ రుచులు

రాయల్‌గా రాజస్తానీ టచ్‌తో



సాక్షి, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ స్టార్ పూసర్ల వెంకట సింధు ఆదివారం వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. పారిశ్రామికవేత్త వెంకట దత్తసాయిని సింధు పెళ్లాడుతున్నారు. రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో ఈ పెళ్లి జరుగుతోంది. ఉదయ్ సాగర్ సరస్సు మధ్యలో ఉన్న ప్రముఖ లగ్జరీ హోటల్ 'రఫల్స్'ను సింధు పెళ్లి కోసం ప్రత్యేకంగా సిద్ధం చేశారు. రాజసం ఉట్టిపడేలా పెళ్లి వేదికను అలంకరించారు. అతిథులను వేదికకు తీసుకువచ్చే పడవలను కూడా ప్రత్యేక రీతిలో తీర్చిదిద్దారు. డెకరేషన్ అంతా రాజస్తానీ శైలిలో సంప్రదాయం, రాజసాల మేళవింపుగా ఉందని చెబుతున్నారు. విందులోనూ మేవారీ రుచులతో కూడిన రాజస్తానీ వంటకాలను వడ్డించినట్లు తెలిసింది. వధూవరుల కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య మూడు రోజులపాటు సాగే ఈ పెళ్లి వేడుకల్లో భాగంగా శుక్రవారం 'హల్దీ'సంబరాలు నిర్వహించగా, శనివారం 'మెహందీ, సంగీత్' వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సాయంత్రం 'వరమాల'కార్యక్రమం జరుగుతుంది. రాత్రి 11.30 గంటల ముహూర్త సమయాన సంప్రదాయ రీతిలో పెళ్లి తంతును నిర్వహిస్తామని సింధు తండ్రి పీవీ రమణ వెల్లడించారు. తమ వివాహానికి ప్రధాని సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులను సింధు కుటుంబం ఆహ్వానించింది. అయితే పెళ్లికి పరిమిత సంఖ్యలో ఆత్మీయులు మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. మంగళవారం నాడు హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి పెద్ద సంఖ్యలో అతిథులు హాజరు కానున్నారు. ప్రతిష్టాత్మక ఒలింపిక్ క్రీడల్లో రెండు పతకాలు, వరల్డ్ చాంపియన్‌షిప్ సహా పలు అగ్రశ్రేణి టోర్నీల్లో విజేతగా నిలిచిన సింధు.. భారత బ్యాడ్మింటన్‌లో అతి పెద్ద స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

చాలా కాలంగా స్నేహం..

- సింధు, దత్తసాయి కుటుంబాల మధ్య చాలా కాలంగా స్నేహం ఉంది. ఇటీవలే వీరి పెళ్లిని ఇరు కుటుంబాలు ఖాయం చేశాయి. హైదరా బాద్‌కు చెందిన డేటా మేనేజ్‌మెంట్ సొల్యూ షన్ సంస్థ 'పొసిడెక్స్ టెక్నాలజీస్'ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా దత్తసాయి పని చేస్తున్నారు. ఆయన తండ్రి, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ ఎస్)లో ఉన్నతాధికారిగా పని చేసి రిటైర్ అయిన జీటీ వెంకటేశ్వర రావు.. ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. పొసిడెక్స్ టెక్నాలజీస్ ఇటీవలి వరకు తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 'ధరణి'పోర్టల్‌ను నిర్వహించింది. డేటా సైన్స్‌లో మాస్టర్స్ చేసిన దత్తసాయి స్వయంగా క్రీడాభిమాని. జేఎస్ డబ్ల్యూ సంస్థలో పని చేసినప్పుడు ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు సంబంధించిన ఆపరేషన్స్‌ను దత్తసాయి పర్యవేక్షించాడు. జనవరి నుంచి సింధు వరుసగా వేర్వేరు టోర్నమెంట్‌లలో పాల్గొనే అవకాశం ఉండటంతో డిసెంబర్‌లోనే పెళ్లి చేయాలని నిర్ణయించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో మంత్రి జూపల్లి తదితరులు

ధ్యానంతో ఆరోగ్యం ఆనందం

- మానసిక ప్రశాంతతకు చక్కని మార్గం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గచ్చిబౌలి స్టేడియంలో తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాలు
- ధ్యానంతో ప్రపంచశాంతి: జూపల్లి

చందానగర్: భారత ప్రాచీన సంస్కృతులలో ఒకటిగా గుర్తింపు పొందిన ధ్యానంతో ఆరోగ్యం, ఆనందం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్ సహకారంతో ప్రపంచ ధ్యాన్య దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలంలో ధ్యాన విద్య ఆధ్యాత్మిక కారణాల వలన ప్రాచుర్యం పొందితే.. ప్రస్తుతం ఆరోగ్య కారణాల వలన ప్రాచుర్యం పొందుతోందని తెలిపారు.

ధ్యానంతో ప్రపంచ శాంతి: జూపల్లి

ధ్యానంతో ప్రపంచ శాంతి సాధ్యమేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ధ్యానం శాంతి, ఆధ్యాత్మికతనే కాకుండా మనిషిలో పరివర్తనకు దారి తీస్తుందని పేర్కొన్నారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ (దాజీ) మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ధ్యానం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సుధాదేవ్‌వర్మ, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జలాల్‌పురం చెరువులోకి దూసుకెళ్లిన మరో కారు




- ప్రాణాలతో బయటపడిన ఇద్దరు వ్యక్తులు..
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికుల ఆందోళన

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం చెరువులోకి ఇటీవల ఓ కారు దూసుకెళ్లి ఐదుగురు యువకులు జలసమాధి అయిన ఘటన మరవకముందే శనివారం మధ్యాహ్నం మరో కారు అదే ప్రదేశంలో చెరువులోకి దూసుకెళ్లింది. అయితే కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోచంపల్లి మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన గూడురు చంద్రారెడ్డి (49), ఆయన మామ సగ్గు ఎల్లారెడ్డి (70) హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. బ్యాంక్ పని కోసం శనివారం వారు కారులో పోచంపల్లికి వస్తున్నారు. జలాల్‌పురం చెరువు కట్ట మూలమలుపు వద్దకు రాగానే వారి కారు అదుపుతప్పి బారికేడ్‌ను ఢీకొట్టి చెరువులో పడిపోయింది. అటుగా వెళ్తున్న వాహనదారులు దీనిని గమనించి కారులోంచి ఇద్దరినీ బయటకు తీశారు. కారు ముందు భాగం ధ్వంసం కాగా, డ్రైవింగ్ చేస్తున్న చంద్రారెడ్డి చేతికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చంద్రారెడ్డి, ఎల్లారెడ్డిని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. జలాల్‌పురం చెరువులో మరో కారు పడిపోయిందని తెలుసుకున్న పోచంపల్లి, జలాల్‌పురం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చెరువు వద్ద భద్రతా చర్యలు చేపట్టం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండువారాల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు జలసమాధి అయిన విషయాన్ని వారు గుర్తు చేశారు.

గ్రామస్తుల ధర్నా

జలాల్‌పురం చెరువుకట్ట వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం పోచంపల్లి, జలాల్‌పురం గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు వాటి నివారణకు శాశ్వత చర్యలు చేపట్టడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రమాదాలకు కారణమవుతున్న మూలమలుపులను సరిచేయాలని, చెరువుకట్ట వద్ద రక్షణ గోడ, స్పీడ్‌బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకొన్న ఆర్ఐ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని చెరువు వద్ద భద్రతా చర్యలకు గాను ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పి ప్రొసీడింగ్ కాపీ చూపించడంతో వారు ఆందోళన విరమించారు.



రూ. 20లక్షలు మంజూరు

భూదాన్‌పోచంపల్లి కొత్తగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డులో జలాల్‌పురం చెరువు కట్ట వద్ద రోడ్డు మార్కింగ్, సైన్‌బోర్డులు, మెటల్ రక్షణ కవచం ఏర్పాటుకు రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే ప్రమాదాల నివారణకు పోచంపల్లి నుంచి కొత్తగూడెం వరకు గల మూలమలుపుల వద్ద ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో పనులను కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

అసలే ఇరుకు.. ఆపై మలుపు

- అసలే ఇరుకు రోడ్డు.. ప్రమాదకరంగా మలుపు.. ఆ పక్కనే చెరువు
- వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపులేని అధికారులు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామ చెరువు మూలమలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. అసలే సన్నటి రోడ్డు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక.. ఇక్కడ పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాక చెరువు సమీపంలో ఎలాంటి ప్రమాదసూచిక బోర్డులు లేకపోవడంతో దగ్గరిదాక వచ్చే వరకు అక్కడ చెరువు ఉందనే విషయం తెలియక చాలా వాహనాలు చెరువులోకి దూసుకెళ్లి పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు అక్కడ ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

వాహనాలతో నిత్యం రద్దీ..

పోచంపల్లి.. పర్యాటక కేంద్రంగా, అలాగే చేనేతకు ప్రసిద్ధి చెందటంతో హైదరాబాద్ తో పాటు వివిధ ప్రాంతాల నుంచి అనేకమంది పర్యాటకులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసే వారు వస్తుంటారు. జలాల్‌పురం మీదుగా పోచంపల్లి వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. జలాల్‌పురం చెరువు కట్ట వద్ద



ఇరువైపులా పెద్ద మూలమలుపులు ఉన్నాయి. అంతేకాక రోడ్డుకు ఇరువైపులా చెట్లు, పొదలు పెరిగి ఉండటంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరికి వచ్చేంత వరకు కూడా కనిపించవు. దాంతో ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రక్షణ గోడ లేకపోవడంతో జలాల్‌పురం చెరువు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

చెరువు వద్ద ఇప్పటి వరకు జరిగిన కొన్ని ప్రమాదాల వివరాలు..

- 2020 జూన్ 26న చెరువుకట్ట మూలమలుపు వద్ద ఎదురెదురుగా వచ్చిన కారు, బైక్ ఢీని ముక్తాపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కారు చెరువులోకి దూసుకెళ్లింది.
- 2020 జూలై 24న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌కు చెందిన జింక వంశీ అనే యువకుడు తన స్నేహితులతో కలసి కారులో పోచంపల్లి మండలం రాంలింగంపల్లిలో ఉంటున్న బంధువులకు పెండ్లిపత్రికలు ఇవ్వడానికి వస్తూ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో వంశీ మృతిచెందగా, ఈత వచ్చిన ముగ్గురు యువకులు సురక్షితంగా బయటపడ్డారు.
- 2023 జూలై 17న ఇటుకల లోడుతో వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో ప్రాణాలతో బయటపడ్డాడు.
- 2023 జూలై 24న చెరువు కట్టపై పండ్ల వాహనం బోల్తా పడింది.
- 2023 నవంబర్ 26న చెరువు కట్ట మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు సడన్ బ్రేక్ వేయడంతో ఫుట్‌బోర్డుపై ఉన్న కండక్టర్ దేవినేని సత్తిరెడ్డి కిందపడి మరణించారు.
- 2023 డిసెంబర్ 21న జరిగిన ప్రమాదంలో ప్రశాంత్ అనే యువకుడు మృతిచెందాడు.
- 2024 డిసెంబర్ 7 తెల్లవారుజామున కారు చెరువులోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మృతిచెందారు.
- ఇవే కాక పదుల సంఖ్యలో బైక్‌లు అదుపుతప్పి చెరువులో పడి పలువురు గాయాలపాలయ్యారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 22 । 12 । 2024

శ్రీకృష్ణదేవరాయలకు రక్షణగా 'గట్టు'

- శత్రువుల నుంచి రక్షణ కోసం కోటగోడ ప్రాకారాలు
- గట్టు సంస్థానంలో సిరిసంపదలతో తులతూగిన ప్రజానీకం

గద్వాల: శ్రీకృష్ణదేవరాయులు తన విజయనగర సామ్రాజ్యాన్ని ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకూ విస్తరించారు. ఆంధ్ర ప్రాంతంలో ఎత్తయిన ప్రదేశంగా ఉన్న గట్టు ప్రాంతంలో ఆయన శత్రువుల నుంచి రక్షణ కోసం కోటగోడ ప్రాకారాలు నిర్మించారు. ఈ క్రమంలోనే అక్కడ రాజ్యవిస్తరణ జరిగి గట్టు సంస్థానం వెలసినట్టు చరిత్రకారులు చెబుతారు. అందుకే శ్రీకృష్ణదేవరాయలను ఆంధ్ర, కన్నడ ప్రజలు గొప్ప చక్రవర్తిగా అభిమానిస్తారు. ఆంధ్రా భోజుడిగా, సాహితీ సమరాంగణ సార్వభౌముడిగా, కన్నడ రాజ్య రమారమణగా కీర్తించబడ్డారు.



గట్టులో నిర్మించిన కోటగోడ ముఖద్వారం

సోమనాద్రికి అండగా..

పూడూరు కేంద్రంగా నలసోమనాద్రి గద్వాలలో తన రాజ్యస్థాపన చేసే క్రమంలో కోట నిర్మాణం చేశారు. అయితే దీనిని సహించని ఉప్పేరు నవాబు నలసోమనాద్రిపై యుద్ధం ప్రకటించారు. ఈ క్రమంలో ఉప్పేరు నవాబు రాయచూరు నవాబు సాయం కోరారు. గట్టు ఆరగిద్ద ప్రాంతంలో హోరాహోరీగా యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో నలసోమనాద్రి విజయ దుందుభి మోగించారు. తన విజయంలో గట్టు ప్రాంతం ఎంతో కీలక పాత్ర పోషించిందని నలసోమనాద్రి చెప్పినట్టు చరిత్రకారులు చెబుతారు. ఆ యుద్ధం అనంతరం సోమనాద్రి తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకొని పాలించారు.

రతనాల గట్టు..

శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలం(1509–1529)లో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితి బాగా ఉండేదని చరిత్ర చెబుతోంది. ఇక్కడ ఎనిమిది చావిడ్లు ఉంటాయి. శ్రీకృష్ణదేవరాయల కాలంలో గట్టు సంతబజారులో రతనాలు, బంగారు నాణేలను రాశులుగా పోసి క్రయవిక్రయాలు జరిపే వారని చరిత్ర తెలిసిన పెద్దలు నేటికీ చెబుతుంటారు. గట్టులో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. సారవంతమైన భూమిలో మంచి పంటలు పండించేవారు. శ్రీ కృష్ణదేవరాయలు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి ప్రోత్సహించేవారు. అందులో భాగంగానే చెరువులు, కాల్వలు తవ్వించి వ్యవసాయ అభివృద్ధికి దోహద పడ్డారు. అనేక రకాల పండ్ల తోటలు పెంచేవారు. వ్యవసాయాధార పరిశ్రమలు ప్రతి గ్రామంలోనూ ఉండేవి. బెల్లం, నీలిమందు తయారీ, వస్త్ర తయారీ వంటివి కూడా ప్రోత్సహించారు. గట్టులో పట్టుపరిశ్రమను ప్రోత్సహించారు. అప్పట్లో మగ్గాలపై వస్త్రాలను తయారు చేసేవారు. ఇలా తయారు చేసిన వస్త్రాలను రాయలసీమలోని రాయదుర్గానికి తరలించేవారని చెబుతారు.



ప్రస్తుత సంతబజారులోనే బంగారునాణేలు, రతనాలను రాశులుగా పోసి క్రయవిక్రయాలు జరిపేవారు

శ్రీకృష్ణదేవరాయల తర్వాతి కాలంలో..

శ్రీకృష్ణదేవరాయల తర్వాతి కాలంలో పాలించిన రాజులు గట్టు ప్రాంతంపై నిర్లక్ష్యం చూపడంతో పూర్తి వెనుకబాటుకు గురైంది. దీంతో ఈ ప్రాంతంలో పేరుమోసిన ఓ దొంగ గట్టును ఆవాసంగా చేసుకున్నాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో దోచుకున్న సొమ్మును గట్టులో భద్రపర్చుకునే వాడని చెబుతారు. ఈ సొమ్ముకు కాపలాగా తన సోదరిని పెట్టగా.. ఆమె ఓ బాటసారిని ప్రేమించింది. విషయం తెలుసుకున్న దొంగ తన సోదరిని పక్కనే ఉన్న గంగిమాన్‌దొడ్డిలో ఆమె చివరి జీవనం వరకు బందీగా చేశాడని చెబుతారు.

రక్షణ ప్రాంతంగా..

కర్ణాటకకు సరిహద్దు ప్రాంతంగా ఉండే గట్టును శ్రీకృష్ణదేవరాయలు రక్షణ ప్రాంతంగా నిర్మించారు. గ్రామం చుట్టూ కోటబురుజులతో కూడిన ప్రహరీ, లోపల 8 వరకు చావిడిలను నిర్మించారు. వీటిపై అర్ధచంద్రాకార గుర్తులు ఉన్నాయి. చీకటి పడితే కోటగోడలపై కాగడాలు వెలిగించి, సైనికులు కాపలా కాసేవారని చెబుతారు.

కరువుకు నిలయం..

రాజుల కాలంలో సిరిసంపదలతో తులతూగిన గట్టు ప్రాంతం.. రాజులు పోయి, రాజ్యాలు అంతరించిన తర్వాత అత్యంత వెనుకబడ్డ ప్రాంతంగా పేరుగాంచింది. కరువుకు నిలయంగా మారింది. ఇక్కడి నుంచే పొట్టచేత పట్టుకొని కుటుంబాలకు కుటుంబాలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్న దైన్యస్థితి నెలకొంది.

40 ఏళ్ల క్రితం..

సుమారు 40 ఏళ్ల క్రితం గట్టు నేతాజీ చౌరస్తాలో గుప్తనిధుల తవ్వకాలలో పెద్దఎత్తున అలనాటి విలువైన నిధులు, బంగారు నాణేలు బయటపడ్డాయి. వీటిలో కొంతమేర అన్యాక్రాంతం కాగా.. మిగిలిన వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో భద్రపరిచారు.

పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించండి

సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చాలా గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్టు పనులు పూర్తి చేసి.. బిల్లులు రాక ఎంతోమంది ఎదురు చూస్తున్నారని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ రాసింది. దాదాపు రెండేళ్లుగా బిల్లులు చెల్లించపోవడంతో పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. ఈ పనులు చేసిన వారంతా.. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసేవారేనని స్పష్టం చేశారు. బిల్లులు రాక, వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో.. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే వారికి ఊరట ఇచ్చినట్లవుతుందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి సూచించారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా బలవంతంగా సర్పంచ్‌లతో పనులు చేయించడం గత ప్రభుత్వ తప్పిదమే అయినా.. దానికి సర్పంచ్‌లను బాధ్యులను చేయడం సబబు కాదని అభిప్రాయపడ్డారు.

ఏపీ, తెలంగాణలో 71.99 లక్షల పీఎం కిసాన్ లబ్ధిదారులు

- 18 వాయిదాల్లో ఇప్పటివరకు రూ.1,463.77 కోట్లు చెల్లింపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిసాయం అందిస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా 'ప్రధాన మంత్రి సమ్మాన్ యోజన'(పీఎం కిసాన్) పథకం ద్వారా రైతులకు పంట సాయం అందిస్తున్నట్లు పేర్కొంది. 2019లో ప్రారంభించిన ఈ పథకంలో ఆంధ్రప్రదేశ్ నుంచి 41,22,252 మంది, తెలంగాణ నుంచి 30,77,274 మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నట్లు లోక్‌సభలో కేంద్ర సహాయ మంత్రి భగీరథ్ చౌదరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 41,22,252 మంది రైతులకు రూ.836.31 కోట్లు, తెలంగాణలో 30,77,274 మంది రైతులకు రూ.627.46 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రెండు రాష్ట్రాల్లో 71,99,526 మందికి రూ.1,463.77 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆధార్ ఆధారితంగా 18 విడతల్లో రైతులకు చెల్లించినట్లు వెల్లడించారు. ఇందుకు రైతుల భూమిని ఈ–కేవైసీతో సీడింగ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇలా చేయని రైతులకు నిధులు విడుదల కాలేదని చెప్పారు. ఇక దేశవ్యాప్తంగా 9,58,97,635 మంది రైతులకు రూ.20,657.36 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.



శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ధ్యాన దినోత్సవంలో ధ్యానం చేస్తున్న దృశ్యం




ప్రపంచ ధ్యాన దినోత్సవంలో సాంస్కృతిక కళాప్రదర్శన



శనివారం వింటర్ సోల్‌స్టిస్ (పగటి సమయం తక్కువ, రాత్రి సమయం ఎక్కువ) నేపథ్యంలో సాయంత్రం 5.15 గంటలకు సచివాలయం వద్ద ఇలా చీకటిగా కనిపించింది.



ట్యాంక్‌బండ్‌పై 5:20 గంటలకు ఇలా..



సాయంత్రం 6 గంటలకు ఎంజే మార్కెట్ వద్ద ఇలా..

సిద్దిపేట 'శిల్ప'విలాపం!

- మధ్యలోనే ఆగిపోయిన శిల్పారామం పనులు
- పిల్లర్ల దశలోనే రంగనాయకసాగర్‌లో కాటేజీల నిర్మాణం
- ఏడాది కాలంగా నిలిచిపోయిన పర్యాటక అభివృద్ధి పనులు
- గత ప్రభుత్వ హయాంలోనే నిధుల కేటాయింపు
- సిద్దిపేట పర్యాటక నిర్మాణాల పూర్తిపై ఆసక్తిగా ఉన్న ప్రజలు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్రంలో పర్యాటక కేంద్రంగా సిద్దిపేట ఇప్పటికే ప్రసిద్ధి చెందింది. అయితే దీనికి పర్యాటకంగా మరిన్ని సొబగులు అద్దేందుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించింది. కోమటి చెరువు దగ్గర శిల్పారామం, నెక్లెస్‌రోడ్ పనుల పూర్తి, రంగనాయకసాగర్ దగ్గర పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ ఆ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సంవత్సరం నుంచి ముందుకు సాగడం లేదు.



నిలిచిన నక్లెస్‌రోడ్ పనులు

పిల్లర్ల దశలోనే కాటేజీలు

చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా తయారు చేసేందుకు రూ.100 కోట్లను గత ప్రభుత్వం కేటాయించింది. నీటిలో తేలియాడే కాటేజీలు, వాటర్ షోలు, పెద్ద బంకెట్ హాల్ వంటి ఎన్నో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాటేజీల నిర్మాణం పనులు పిల్లర్ల దశలోనే నిలిచి పోయాయి. ఇప్పటికే రంగనాయకసాగర్‌ను చూసేందుకు దేశం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మరింత అభివృద్ధి చెందుతుందని పర్యాటకులు, ప్రజలు ఎదురు చుస్తున్నారు.



మధ్యలోనే నిలిచిపోయిన శిల్పారామం

10 ఎకరాల్లో శిల్పారామం

కోమటి చెరువు సమీపంలో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.23 కోట్లతో శిల్పారామం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా అలాగే చేనేత హస్తకళా ప్రదర్శన, పలు కుల వృత్తులకు చేయూతనందించేందుకు పనులను ఏప్రిల్, 2023లో ప్రారంభించారు. శిల్పారామం పనులు డిసెంబర్ 2023 వరకు వేగంగా సాగాయి. తర్వాత అర్ధంతరంగా నిలిచిపోయాయి. క్రాఫ్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ ఇలా అన్ని రకాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

నిలిచిన ఆర్టిఫిషియల్ బీచ్

సిద్దిపేట శిల్పారామంలో ఆర్టిఫిషియల్ బీచ్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. బీచ్ నిర్మాణం పూర్తయితే సముద్రం బీచ్ దగ్గర పొందే అనుభూతి సిద్దిపేటలో లభిస్తుందని పర్యాటకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ ఆ పనులు కూడా నిలిచిపోయాయి. అలాగే కోమటి చెరువు నెక్లెస్‌రోడ్ పూర్తి నిర్మాణం కోసం రూ.15 కోట్లను కేటాయించారు. ఆ పనులూ ఆగిపోయాయి. సిద్దిపేటలో మహతి ఆడిటోరియం కోసం రూ.50 కోట్లను మంజూరు చేశారు. ఈ నిధుల మంజూరును కూడా ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటికైనా మంత్రులు స్పందించి నిధులు మంజూరు చేసి పనులు వేగంగా పూర్తయ్యే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు తప్పుకున్నారు

పలు పనులకు సంబంధించిన పాత కాంట్రాక్టర్లు తప్పుకున్నారు. పనులు జరుగుతుంటే రన్నింగ్ బిల్లులు రాకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపివేశారు. అలాగే కాంట్రాక్టర్ అగ్రిమెంట్ సమయం కూడా ముగిసింది.

– నటరాజ్, డీఈ, పర్యాటక శాఖ

క్లుప్తంగా...

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన


అమిత్‌షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న దళిత సంఘాలు

దాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా): పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం విశాఖ దళిత సంఘాల సమాఖ్య (విదసం) ఆధ్వర్యంలో దళిత సంఘాలు దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాయి. బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ అమిత్‌షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ అమిత్‌షా కర్మ ఫలంతో స్వర్గానికి చేరుతారో.. నరకానికి చేరుతారో గానీ..అంబేడ్కర్ లేకుంటే..రాజ్యాంగం లేకుంటే హోం మంత్రి కాగలిగేవారా? అని ప్రశ్నించారు. అమిత్‌షా వ్యాఖ్యలపై భారత రాష్ట్రపతి సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అమిత్‌షా తప్పిదాన్ని సరిదిద్దాల్సిన ప్రధాని మోదీ సమర్థించడం చూస్తుంటే అంబేడ్కర్ విషయంలో బీజేపీ మనువాద దృక్పథం బయటపడిందన్నారు.

'లోకేశ్‌పై కేసు నమోదు చేయాలి'

అనంతపురం: మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేలా ఐటీడీపీ ద్వారా సోషల్ మీడియాలో పోస్టింగులు చేయిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై కేసు నమోదు చేయాలని అనంతపురం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చవ్వా రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌తో పాటు మాజీ మంత్రులు రోజా, రజనిలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతూ కించపరుస్తున్నారని పేర్కొన్నారు. మతపరమైన విద్వేషాలను కూడా రెచ్చగొడుతూ సమాజంలో అశాంతికి కుట్ర చేసే రీతిలో వ్యవహరిస్తున్న ఐటీడీపీ సభ్యులతో పాటు వీరికి నాయకత్వం వహిస్తున్న లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, వాట్సాప్ గ్రూపుల్లో ఈ పోస్టులన్నింటినీ వెంటనే తొలగించాలని, ఐటీడీపీ సభ్యులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్: గత సార్వత్రిక ఎన్నికల్లో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. చిత్తూరు కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3,580 కోట్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జీవో 77 రద్దు చేస్తామని పాదయాత్రలో నారాలోకేశ్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు.

కార్మికా.. మేలుకో

రిజిస్ట్రేషన్ కార్డు తీసుకో..



రోజంతా రెక్కాడితే గానీ డొక్కాడని కూలీ కుటుంబాలవి. చేతినిండా పని దొరికితేనే కడుపు నిండేది. లేకపోతే పస్తులు ఉండాల్సి వస్తుంది. భవన నిర్మాణ రంగంలో పని చేసే దినసరి కార్మికుల పరిస్థితి ఇలా ఉంటుంది. ఈ క్రమంలోనే వారి సంక్షేమం కోసం కార్మిక శాఖ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. అయితే, ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలంటే రిజిస్ట్రేషన్ కార్డు అవసరం ఉంటుంది. ఇందులో సభ్యుడిగా చేరడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఈ కార్డును ఎలా తీసుకోవాలి? ఇందువల్ల కలిగే ఉపయోగాలు ఏంటో తెలుసుకుందాం.

- గుర్తింపు కార్డులకు ఎంతో మంది దూరం
- ఒకసారి పొందితే అనేక ప్రయోజనాలు
- నైపుణ్య శిక్షణ, పింఛన్‌కు అవకాశం
- పిల్లలకు ఉచిత విద్య, వివాహాలకు నగదు సాయం

కడప కోటిరెడ్డిసర్కిల్: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికులకు సంబంధించి కడప నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా 3,65,648 మందికి పైగా కార్మికులు ఉన్నారు. అయితే గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. భవన నిర్మాణ రంగంతోపాటు పెయింటర్లు, కార్పెంటర్లు, ప్లంబర్లుగా అనేక మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులు రోజూ పని కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కడప నగరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఉదయం జెడ్పీ కార్యాలయం, అప్సర సర్కిల్‌లోని అడ్డాలకు చేరుకుని వేచి చూస్తుంటారు. కొందరికి పని దొరకుతున్నా, మరికొందరు ఇబ్బంది పడుతున్నారు.



వివిధ వృత్తుల్లో..

భవన నిర్మాణ రంగానికి సంబంధించి పలు విభాగాల కార్మికులు పని చేస్తున్నారు. మట్టి పని, పునాది గుంతలు తీయడం, చదును, తాపీ మేస్త్రీ, కూలీలు, రాడ్‌బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పాలీష్ వేసే వారు ఉన్నారు. సీలింగ్, కంకర కార్మికులు, రోడ్డు నిర్మాణ కూలీలు, క్రేన్, పొక్లెయినర్ ఆపరేటర్లు తమ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. చెరువులు తవ్వడం, పూడిక తీయడం, బోర్‌వెల్స్, సిమెంటు ఇటుకలు తయారు చేసే వారు ఇదే రంగంపై ఆధారపడి ఉన్నారు. వీరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పని భద్రత కల్పించాలి. గుర్తింపు కార్డులు పొందాలంటే కార్మిక శాఖ కార్యాలయంలో ఆధార్, రెండు ఫొటోలు, నామిని ఆధార్ కార్డుతోపాటు రూ.50 సభ్యత్వ రుసుం చెల్లించాలి.

అవగాహన లేమితో నష్టపోతున్న వైనం

కార్మికులకు అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారు. కార్డులు కలిగిన కార్మికులకు నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, శిక్షణ కాలంలో రూ.300 స్టయిఫండ్ ఇస్తారు. అలాగే 60 ఏళ్ల దాటిన కార్మికులకు రూ.1000–5000 పెన్షన్ అందజేస్తారు. కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వివాహాలకు నగదు అందిస్తారు. భవన యజమానులు నిర్మాణ రిజిస్ట్రేషన్ చేసి.. పని చేసే కార్మికుల పేరిట ఒక శాతం కార్మిక శాఖకు సెస్ చెల్లించాలి. వీటిపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారు. ఈ విషయాలపై అధికారులు అవగాహన కల్పించి.. అన్ని పథకాలు అందేలా చూడాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.


కార్మికుల వివరాలు నమోదు చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

చైతన్య పరుస్తున్నాం



అర్హులను గుర్తించి కార్డులను అందజేస్తున్నాం. ఇంకా పొందని వారిని చైతన్య పరుస్తున్నాం. కార్మికులు కూడా తమవంతుగా స్పందించి సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు రావాలి. కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్నాం.

– శ్రీకాంత్‌నాయక్, కార్మిక శాఖ అధికారి, కడప

స్వాహాకారులు సేఫ్!

ఉపాధి హామీలో అక్రమాలపై అధికారుల బరితెగింపు



- కిందిస్థాయి ఉద్యోగులపైనే కేసులు
- అసలు కారకులను తప్పించడం వెనుక అధికార పార్టీ నేతలు
- నెల్లూరు జిల్లాలో అక్రమాలు

నెల్లూరు (పొగతోట): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడిన తిమింగలాలకు వదిలేసి చిరుద్యోగులను బలిచేస్తున్నారు. ఉపాధి పేమెంట్ల చెల్లింపు, జాబ్‌కార్డుల మంజూరులో కీలకమైన ఇద్దరు ఏపీఓలకు బదులు కిందిస్థాయి సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం చినగోపవరం గ్రామంలో అక్రమంగా 147 జాబ్ కార్డులు సృష్టించారు. గ్రామంలో నివాసం ఉండకుండా ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల్లో ఉండే వారి ఆధార్‌లు సేకరించి బ్యాంకు అకౌంట్లతో వీటిని సృష్టించి చేయని పనులకు బిల్లులు పెట్టి చినగోపవరం గ్రామంలో రూ.25 లక్షల మేర ఉపాధి నిధులను స్వాహాచేశారు. జాబ్‌కార్డులు మంజూరు చేయడంలో సంబంధిత గ్రామ ఫీల్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఏపీఓ కీలకంగా వ్యవహరించారు. బిల్లులు చెల్లింపు చేసిన పనులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో, పనుల కేటాయింపులో ఏపీఓ కీలకంగా వ్యవహరించారు. దీనికి సంబంధించి కలువాయి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16వ విడత సోషల్ ఆడిట్‌లో రూ.58 లక్షలు అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఒక్క చినగోపవరం గ్రామంలోనే రూ.25 లక్షల అవినీతి జరిగింది. కలువాయి మండలంలో పనిచేసిన ముగ్గురు ఎంపీడీఓల సంతకాలను ఫోర్జరీ చేసి చేయని పనులకు బిల్లులను అప్‌లోడ్ చేశారు. దీనికి సంబంధించి ఇద్దరు ఏపీఓలు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ప్రస్తుతం దీనిపై డ్వామా కార్యాలయంలో విచారణ జరుగుతోంది. అధికారులు రికార్డులు తనిఖీలు చేస్తున్నారు. ఇక కలువాయి మండలానికి సంబంధించి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్లు చినగోపవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఫీల్డు అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, ఏపీఓలు ఎం. మురళీధర్‌రావు, డి. సుబ్బరాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ పి. బాబురాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ ఆర్. ప్రసన్న, ఎంవి. ప్రసాద్, ఎం.వెంకటేశ్వర్లు, ఈసీ ఇన్‌చార్జ్ జే.శీనయ్యలపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలంటూ డ్వామా పీడీకి పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు జారీచేశారు. ఇందులో కీలకమైన ఇద్దరు ఏపీఓల పేరు మినహా మిగిలిన ఆరుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ)లో రాపూరు మండలంలో రూ.76 లక్షలు, కొండాపురం మండలంలో రూ.86 లక్షలు, కలిగిరి మండలంలో రూ.30 లక్షలు, సైదాపురం మండలంలో రూ.59 లక్షల మేర ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు.

అధికారుల ఆదేశాలు అమలు చేశాం..

చినగోపవరంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారుల నుంచి ఆదేశాలందాయి. దీంతో.. ఆరుగురు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదుచేశాం. మిగిలిన మండలాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. రాపూరు మండలంలో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యల ఫైల్ కలెక్టర్ వద్ద ఉంది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం రాపూరు సిబ్బందిపై త్వరలో చర్యలు తీసుకుంటాం.

– గంగాభవాని, డ్వామా పీడీ

చెడు వ్యసనాలతో జీవితాన్ని బలి చేసుకోవద్దు

- సైబర్ క్రైమ్, డ్రగ్స్ వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలి
- ఇంజనీరింగ్ విద్యార్థులకు డీజీపీ ద్వారకా తిరుమలరావు సూచన

ఏఎన్‌యూ: చెడు వ్యసనాలకు లోనై జీవితాలు బలి చేసుకోవద్దని విద్యార్థులకు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం నిర్వహించిన ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు డీజీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రసంగిస్తూ నేడు యువతను పట్టిపీడిస్తున్న సైబర్ క్రైమ్, సైబర్‌టాక్‌లు, డ్రగ్స్ ముప్పు వంటి సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలిసీ తెలియని వయసులో విద్యార్థులు, యువత చెడు వ్యసనాల వైపు పయనిస్తూ ఉండటం బాధాకరమన్నారు. తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు ప్రసంగిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతికత అంశాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలన్నారు. నేడు సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సమస్యలకు విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోందని, దానిలో ఉన్న అపార ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారారు. విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ లేదని చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కు పాద మోపుతామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన స్కిల్ ఓరియెంటెడ్ కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తరగతులను, ఉద్యోగాలు పొందేందుకు క్యాంపస్ డ్రైవ్‌లను నిరంతరం చేపట్టనున్నామని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టర్ పి.పి.వావా


సమీక్ష నిర్వహిస్తున్న వావా

మహారాణిపేట (విశాఖజిల్లా): కార్మిక చట్టాల ప్రకారం జిల్లాలో సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు కనీస వేతనం చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి. వావా అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులను అధ్యయనం చేసి, సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు విధివశాత్తు మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలని, ఎట్టి పరిస్థితిలో జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్య కార్మికులకు అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు, వారి సంక్షేమానికి అందజేస్తున్న ఇతర సదుపాయాలను వివరించారు.

కుమారుడిని హతమార్చిన తండ్రి!

- 20 రోజుల తరువాత వెలుగులోకి



పుంగనూరు: అన్నమయ్య జిల్లా, మదనపల్లె రూరల్ మండలం మమ్మిడిగుండ్లపల్లెకి చెందిన గంగులరెడ్డి కుమారుడు సోమశేఖర్‌రెడ్డి (36)ను చిత్తూరు జిల్లా పరిధిలో రాళ్లతో కొట్టి చంపేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శనివారం పుంగనూరు సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమశేఖర్‌రెడ్డిని 20 రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు కొంత మంది చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బోయకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకొచ్చారు. రాళ్లతో కొట్టి చంపేసి వెళ్లిపోయారు. శుక్రవారం రాత్రి దీనిని గమనించిన ఆ ప్రాంత వాసులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేశారు. హతుడు వద్ద దొరికిన సమాచారాన్ని బట్టి మదనపల్లె రూరల్ మండలం మమ్మిడిగుండ్లపల్లెకి చెందిన సోమశేఖర్‌రెడ్డిగా నిర్ధారించారు. శవం పూర్తిగా గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. ఎముకలు బయపడ్డారు. శవానికి అటవీప్రాంతంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదనాచారి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈమేరకు దర్యాప్తులో హత్యగా నిర్ధారణ చేశారు. ఈ హత్యకేసులో పలురకాల అనుమానాలు ఉన్నాయని, హతుడు తండ్రిపై కూడా ఆరోపణలు ఉన్నాయని సీఐ తెలిపారు. దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉందన్నారు. త్వరలోనే హంతకులను పట్టుకుంటామని స్పష్టం చేశారు. కాగా హతుడు తన భార్య, బిడ్డలు మృతి చెందిన కేసులో మదనపల్లె పోలీసులు హతుడుపై కేసు నమోదు చేసి ఉన్నారని తెలిపారు. ఇలాంటి ప్రవర్తన కలిగిన సోమశేఖర్‌రెడ్డి నడవడిక నచ్చని తండ్రి గంగులరెడ్డి ఈ హత్య చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

మన ఎమ్మెల్యే.. మా ఊరు

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వినూత్న కార్యక్రమం


ఇసుకలు గ్రామంలో మన ఎమ్మెల్యే మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: గ్రామాల్లో పర్యటించి స్థానిక గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని కుజ్జెలి పంచాయతీ మారుమూల ఇసుకలు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, సీసీ రోడ్డు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, జన్‌మన్ పథకంలో కొంతమందికి మాత్రే ఇళ్లు మంజూరు అయ్యాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే ఆయన తాగునీటి సమస్యపై అక్కడి నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

తెర మరుగు


నరసాపురంలో మూతపడిన శారదా థియేటర్

అభిమాన హీరో కొత్త సినిమా రిలీజయ్యిందంటే చాలు థియేటర్ల వద్ద సందడే సందడి. సంక్రాంతి, దసరా, దీపావళి తదితర పండుగల వేళ ప్రేక్షకుల కోలాహలం అంతా ఇంతా కాదు. నాడు టూరింగ్ టాకీస్‌లుగా, టాకీస్‌లుగా వినోదాన్ని అందించిన సినిమా థియేటర్లు నేడు ఆదరణ కరువై గోడౌన్లుగా, వ్యాపార సముదాయాలుగా మారిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగాగత కొన్నేళ్లలో 61 థియేటర్లు మూతపడ్డాయి.

సినిమా హాలు.. ఘొల్లు

- ఓటీటీలకు పెరుగుతున్న క్రేజ్
- థియేటర్లకు తగ్గుతున్న ఆదరణ
- పశ్చిమ గోదావరి జిల్లాలో 61 సినిమా హాళ్ల మూత
- మిగిలిన వాటికీ నామమాత్రంగా ప్రేక్షకులు


తణుకులో మూతపడిన శ్రీనివాసా థియేటర్

సాక్షి, భీమవరం : మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు సినిమా మంచి వినోద సాధనం. కుటుంబమంతా కలిసి థియేటర్‌కు వెళ్లి ఆనందించేవాళ్లు. థియేటర్లకు ఎంతో ఆదరణ ఉండేది. బుల్లితెర రాకతో సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. కోవిడ్ సమయంలో ఓటీటీ (ఓవర్ ది టాప్) క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. సినిమాలు, వెబ్ సిరీస్, టీవీ కార్యక్రమాలు, సెలెబ్రిటీ, తదితర అనేక షోలను ప్రసారం చేస్తూ అప్పట్లో ఓటీటీ ప్లాట్‌ఫాంలే ప్రజలకు వినోద సాధనంగా మారాయి. చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు, చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు కొన్ని నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా.. మరికొన్ని వారం పదిరోజుల్లో ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. వీటి ప్రభావంతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. మరోపక్క ఏసీ, మల్టీప్లెక్స్‌లుగా అభివృద్ధి చెంది వినోదంతో పాటు షాపింగ్, ఫుడ్ పాయింట్ కేంద్రాలుగా థియేటర్లు మారాయి. కాలక్రమంలో టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్ డ్రింక్ ధరలు చూసి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో సినిమాలు శతదినోత్సవ వేడుకలు జరుపుకుంటే ఇప్పుడు రెండు వారాలు ఆడటం గగనంగా మారింది. కొత్త సినిమాలు విడుదలైన సందర్భంలో 2,3 రోజుల సందడి మినహా తర్వాత థియేటర్లు ఖాళీ అయిపోతున్నాయి. పది మంది కూడా ప్రేక్షకులు రాక షోలు పడని పరిస్థితి నెలకొంటోందని యజమానులు ఆవేదన చెందుతున్నారు.

ప్రస్తుతం 37 థియేటర్లే..

ప్రస్తుతం జిల్లాలో 37 థియేటర్లు ఉండగా వీటిలో చాలా వరకూ సురేష్ ప్రొడక్షన్స్, గీతా ఆర్ట్స్ తదితర సినీ నిర్మాణ సంస్థలు లీజుకు తీసుకున్నాయి. సౌండ్ సిస్టమ్, ఇంటీరియర్, సిట్టింగ్ తదితర ఆధునిక హంగులతో స్క్రీన్ల సంఖ్యను పెంచి నిర్వహిస్తున్నాయి. కొన్ని థియేటర్లు మాత్రమే యజమానుల చేతుల్లో ఉన్నాయి.

ఐదేళ్ల క్రితం 98 వరకు సినిమా హాళ్లు

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి నియోజకవర్గాల పరిధిలో ఐదేళ్లకు పూర్వం 98 వరకు సినిమా థియేటర్లు ఉండేవి. సినీ లాకాసంలో సందడి చేసిన థియేటర్లు ఆదరణ తగ్గి నిర్వహణ భారంగా మారడంతో గోదాములుగా, ఫంక్షన్ హాళ్లుగా, వాణిజ్య సముదాయాలుగా మారిపోతున్నాయి. భూముల విలువ పెరగడంతో కొన్నింటిని తొలగించి స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా 61 థియేటర్లు మూతపడ్డాయి. భీమవరంలో ఒక వెలుగు వెలిగిన సత్యనారాయణ, గోవర్ధన్ థియేటర్లు గొడౌన్లుగా, పాలకొల్లులో పేరొందిన రత్న టాకీస్ థియేటర్, వెంకట్రామా థియేటర్లను షాపింగ్ కాంప్లెక్స్‌లుగాను, వీర హనుమాన్ థియేటర్‌ను తొలగించి అపార్ట్‌మెంట్ నిర్మించారు. తాడేపల్లిగూడెంలోని జయలక్ష్మి థియేటర్ ఫంక్షన్ హాల్‌గాను, రేలంగి చిత్రమందిర్, ప్రభాత థియేటర్లు, నరసాపురంలోని ప్రియదర్శిని థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్‌గా, తణుకులోని వెంకటకృష్ణా థియేటర్‌ను వీకే ఫంక్షన్ హాలుగా మార్చుచేశారు. కొన్ని ఎటూ వినియోగానికి నోచుకోక మూతపడిపోయి నాటి జ్ఞాపికాలకు తీపి గుర్తులుగా మిగిలిపోయాయి.

వ్యవసాయ కూలీగా మారాను



పాలకొల్లులోని పలు సినిమా థియేటర్లలో నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేశారు. అప్పట్లో రోజూ ప్రతి షోకూ థియేటర్ వద్ద పండుగ వాతావరణం కనిపించేది. సినిమాలు చూసేందుకు పల్లెటూళ్ల నుంచి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లపై ప్రేక్షకులు తరలి వచ్చేవారు. రానురానూ ఆదరణ తగ్గి థియేటర్లు మూతపడటంతో ఉపాధి కోసం నేను వ్యవసాయ కూలీగా మారాను.

– ఉన్నమట్ల భీమారావు, సినిమా థియేటర్ కార్మికుడు, కొంతేరు

నిర్వహణ కష్టమవుతోంది



కొత్త సినిమాలు సైతం ఓటీటీల్లో విడుదలైపోతుండటంతో ఇటీవల కాలంలో థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుల సంఖ్య చాలావరకూ తగ్గిపోయి మెయింటెనెన్స్‌కు చాలా కష్టంగా ఉంటోంది. ఒక్కోసారి జనం లేక షోలు పడటం లేదు. కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కూడా డబ్బులు రావడంలేదు.

– అందే బాపూజీ, అన్నపూర్ణ థియేటర్ యజమాని, నరసాపురం



తెలుగుతెరపై మరో కళాఖండం

సిరివెన్నెల

తెలుగుతెరపై మరో కళాఖండం 'సిరివెన్నెల'. కళాతపస్వి కె. విశ్వనాథ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయిన సినిమాల్లో ఇదొకటి. శాస్త్రీయ సంగీత ప్రాధాన్యమున్న 'సిరివెన్నెల' 1986లో విడుదలై అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ పతాకం నుంచి వచ్చిన మరో ఆణిముత్యం. ఈ సినిమా కథ ఓ అంధుడైన ఫ్లూటిస్ట్ హరిప్రసాద్, మూగమ్మాయి అయిన ఓ ఆర్టిస్ట్ చుట్టూ నడుస్తుంది. కేవీ మహదేవన్ సంగీతం సమకూర్చిన ఈ సినిమాలోని పాటలన్నీ ఇప్పటికీ తెలుగు లోగిళ్లలో వినిపిస్తూనే ఉంటాయి. అన్ని పాటల్నీ సీతారామ శాస్త్రి రాశారు. ఈయనకు పాటల రచయితగా ఇదే తొలి సినిమా. ఈ సినిమాతో చేంబ్రోలు సీతారామ శాస్త్రి పేరు తెర మీద 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రిగా మారింది. 'విధాత తలపున ప్రభవించినదీ..' పాటకు సీతారామ శాస్త్రి ఉత్తమ గేయరచయితగా, ఉత్తమ గాయకుడిగా ఎస్పీ బాలసుబ్రమణ్యం, మూన్ మూన్ సేన్ ఉత్తమ సహాయనటిగా, ఎంవీ రఘు ఉత్తమ ఛాయాగ్రాహకుడిగా నంది పురస్కారాలు అందుకున్నారు.

చిత్రవధకు గురి చేసిన కథ

చక్కటి సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన కథా కథనాలతో ప్రేక్షకుడికి పంచభక్ష్య పరమాన్నాలను వడ్డించే విశ్వనాథ్‌ను 'సిరివెన్నెల' కథ మాత్రం చిత్రవధకు గురి చేసిందట. మాటలు రాని అమ్మాయేంటి, కళ్లు కనపడని అబ్బాయేంటి? ఈ కథను ఎందుకు తీసుకున్నానా? అని బాధ పడని రోజు లేదట. మధ్యలో వదల్లేను... అలాగని కంటిన్యూ చేయలేను అని మానసికంగా చిత్రవధకు గురయ్యారట. అంతలా విశ్వనాథ్‌ను ఇబ్బంది పెట్టిన ఈ కథ చివరికి తెలుగు సినీ చరిత్రలో ఓ కళాఖండమై నిలిచింది.

'విధాత తలపున...'కు వారం రోజులు

సీతారామ శాస్త్రి ఈ సినిమాతోనే సినీ రంగ ప్రవేశం చేశారు. తన తొలి సినిమాకే చిరస్థాయిగా గుర్తుండిపోయే పాటలందించి శభాష్ అనిపించుకున్నారు. వాస్తవానికి తన సినిమాలన్నింటికీ వేటూరి చేత పాటలు రాయించుకునే విశ్వనాథ్‌పై ఏదో కారణం చేత ఆ సమయంలో వేటూరి అలిగారట. దీంతో ఆయన్నెందుకు ఇబ్బంది పెట్టడమని సీతారామశాస్త్రిని పిలిపించి రాయించుకున్నారట. అప్పటికి ఆయన టెలిఫోన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి. సెలవుపై వచ్చి మరీ ఈ సినిమాకు పాటలు రాశారు. తొలుత భరణి పేరుతో కథలు, పాటలు రాసేవారు ఆయన. 'సిరివెన్నెల'తో తన తొలి సినిమానే ఇంటి పేరుగా నిలుపుకున్నారు. అలాగే ఈ సినిమాలో హీరో వేణువు నుంచి వచ్చే సంగీతాన్ని ప్రఖ్యాత వేణుగాన విద్వాంసుడు హరిప్రసాద్ చౌరాసియా అందించారు. ముఖ్యంగా ఈ సినిమాలో ఓంకార సంబంధమున్న 'విధాత తలపున ప్రభవించినది...' పాట రాయడానికి సీతారామ శాస్త్రికి వారం రోజులు పట్టిందట.

'సిరివెన్నెల' (1986) విడుదలై పాతికేళ్లకు పైనే అయినప్పటికీ ఈ చిత్రం గురించి ఇంకా మాట్లాడుకుంటూనే ఉంటారు. ఏ తరానికైనా నచ్చే ఈ ప్రేమకథ ఎప్పటికీ చెరిగిపోదు. తెలుగు చలన చిత్ర చరిత్రలో, ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర ఈ 'సిరివెన్నెల'.

- దాచేపల్లి సురేష్‌కుమార్

ఎక్కువ భాగం రాజస్థాన్‌లోనే...

ఇక షూటింగ్ విషయానికొస్తే... ఈ సినిమాలో చాలాభాగం రాజస్థాన్‌లోని జైపూర్‌లో చిత్రీకరించారు. ఇక్కడ షూటింగ్ పర్మిషన్ కోసం జైపూర్ టూరిజం డిపార్ట్‌మెంట్ సంప్రదించగా కేంద్రం నుంచి అనుమతి తెచ్చుకోమన్నారట. దీంతో అజ్మీర్ జిల్లా కలెక్టరును కలవడానికి వెళ్లగా ఆయన 'శంకరాభరణం' సినిమాకు పెద్ద అభిమాని కావడంతో విశ్వనాథ్‌ని గుర్తుపట్టి క్షణాల్లో అనుమతి ఇప్పించారట.







ప్రభాస్ నంబర్ వన్

సమంత హ్యాట్రిక్ రికార్డ్

ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ ప్రతి నెలా దేశంలోని సెలబ్రిటీలపై సర్వే నిర్వహించి, టాప్ పొజిషన్‌లోని వారి జాబితాలను విడుదల చేస్తుంటుంది. అందులో భాగంగా నవంబరు నెలకుగాను మోస్ట్ పాపులర్ స్టార్స్ జాబితాను ప్రకటించగా హీరో ప్రభాస్ మొదటి స్థానంలో నిలిచారు. హీరోయిన్లలో సమంత తొలి స్థానాన్ని దక్కించుకున్నారు. అంతేకాదు... కథానాయికల జాబితాలో సమంత వరుసగా మూడో సారి (సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) ఫస్ట్ ప్లేస్‌లో నిలవడం విశేషం. ప్రభాస్ వరుసగా రెండో సారి (అక్టోబర్, నవంబర్) నిలిచారు. ఇక నవంబర్ నెలకు ప్రకటించిన మోస్ట్ పాపులర్ స్టార్ జాబితాలో ప్రభాస్ తర్వాతి స్థానంలో విజయ్ రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత వరుసగా అల్లు అర్జున్, షారుక్ ఖాన్, ఎన్టీఆర్, అజిత్ కుమార్, మహేశ్‌బాబు, సూర్య, రామ్‌చరణ్, అక్షయ్ కుమార్ నిలిచారు. ఇక హీరోయిన్ల విషయానికొస్తే... సమంత తొలి స్థానంలో నిలిచారు. వరుసగా మూడు నెలలపాటు ఆర్మాక్స్ మోస్ట్ పాపులర్ హీరోయిన్‌ల జాబితాలో తొలి స్థానంలో నిలిచి, హ్యాట్రిక్ రికార్డ్ సృష్టించారు సమంత. దీంతో ఆమె అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఈ జాబితాలో సమంత తర్వాతి ప్లేస్‌లలో ఆలియా భట్, నయనతార, సాయి పల్లవి, దీపికా పదుకోన్, త్రిష, కాజల్ అగర్వాల్, రష్మికా మందన్నా, శ్రద్ధా కపూర్, కత్రినా కైఫ్ ఉన్నారు.

నిజంగా సారీ

హీరోయిన్ రష్మికా మందన్నా క్షమాపణలు చెప్పారు. ఇంతకీ ఏం జరిగింది అంటే... ఇటీవల రష్మికా మందన్నా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తాను స్క్రీన్‌పై తొలిసారిగా చూసిన సినిమా తమిళ హీరో విజయ్ 'గిల్లీ' అని, ఈ చిత్రం మహేశ్‌బాబు 'పోకిరి' సినిమాకు రీమేక్ అని రష్మికా మందన్నా ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దీంతో రష్మికా మందన్నా వ్యాఖ్యల్లోని పొరపాటుని గుర్తించిన నెటిజన్లు, 'గిల్లీ' సినిమా మహేశ్‌బాబు 'ఒక్కడు'కి తమిళ రీమేక్ అని, 'పోకిరి' సినిమాకు రీమేక్ కాదని పోస్ట్‌లు చేశారు. ఈ విషయంపై రష్మికా మందన్నా సోషల్ మీడియా వేదికగానే స్పందించారు. ''అవును... తెలుసు... సారీ... ఇంటర్వ్యూ అయిపోయిన తర్వాత అనుకున్నాను. 'గిల్లి' సినిమా 'ఒక్కడు' చిత్రానికి రీమేక్ కదా అని, 'పోకిరి' సినిమా 'పోకిరి'గానే రీమేక్ అయ్యింది అని. నా మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతాయని కూడా అనుకున్నాను. నిజంగా సారీ... నాకు వాళ్ల (మహేశ్‌బాబు, విజయ్‌లను ఉద్దేశిస్తూ..) నటించిన సినిమాలన్నీ ఇష్టమే..'' అని రెస్పాండ్ అయ్యారు. ఇక ఈ ఏడాది అల్లు అర్జున్ నటించిన 'పుష్ప: ది రూల్' సినిమాలో హీరోయిన్‌గా నటించారు రష్మికా మందన్నా. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 1500 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను కొల్లగొట్టి, ఇంకా విజయవంతంగా ప్రదర్శితమవుతోందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ హీరోగా చేస్తున్న హిందీ చిత్రం 'సికందర్'తో బిజీగా ఉన్నారు రష్మికా మందన్నా. ఈ చిత్రంతో పాటు రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించిన 'కుబేర' (ధనుష్–నాగార్జున హీరోలు), ఛావా (విక్కీ కౌశల్) చిత్రాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. అలాగే రష్మికా మందన్నా నటిస్తున్న తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది గర్ల్ ఫ్రెండ్' కూడా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. అలాగే రష్మిక చేతిలో మరో రెండు హిందీ చిత్రాలు ఉన్నాయని తెలిసింది.



• రష్మికా మందన్నా

• తమన్నా



పవర్‌ఫుల్ నాగ సాధు

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తొలి భాగాన్ని తెరకెక్కించిన అశోక్ తేజ రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహా, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి.మధు నిర్మిస్తున్న ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ ఓదెల గ్రామంలో జరుగుతోంది. శనివారం (డిసెంబరు 21) తమన్నా బర్త్ డే సందర్భంగా 'ఓదెల 2' నుంచి ఆమె కొత్త ఫొటో విడుదల చేశారు. ''ఓదెల 2' సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఇందులో శక్తిమంతమైన నాగ సాధు పాత్రలో తమన్నా నటిస్తున్నారు. భారీ బడ్జెట్, హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో రూపొందుతోన్న ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇచ్చే విధంగా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, క్రియేటెడ్ బై: సంపత్ నంది.

హంటర్ వస్తున్నాడు



• ఆరోన్ టేలర్

హాలీవుడ్ నటుడు ఆరోన్ టేలర్ జాన్సన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'క్రావెన్: ది హంటర్'. అరియానా డిబోస్, ఫ్రెడ్ హెచింగర్, అలెశాంద్రో నివోలా, క్రిస్టోఫర్ అబాట్, రస్సెల్ క్రోవ్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన ఈ చిత్రం ఈ నెల 13న అమెరికాలో విడుదలైంది. అవి అరద్ , మాట్ టోల్మాచ్, డేవిడ్ హౌస్‌హోల్టర్ నిర్మించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ రిలీజ్ చేసింది. అలాగే 'క్రావెన్: ది హంటర్' సినిమాను 2025 జనవరి 1న ఇండియాలో ఇంగ్లిష్, హిందీ, తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ చేసేందుకు సోనీ పిక్చర్స్ సంస్థ సన్నాహాలు చేస్తోందని తెలుస్తోంది. కాగా క్రావెన్ రోల్‌కి తాను ప్రిపేర్ అయిన విధానం గురించి టేలర్ జాన్సన్ మాట్లాడుతూ – ''మార్వెల్ కామిక్ బుక్స్‌లో కనిపించే క్రావెన్ క్యారెక్టర్‌నే ఆడియన్స్ అందరూ స్క్రీన్‌పై కూడా చూడాలనుకుంటున్నారు. సో... ఈ క్యారెక్టర్ కాస్ట్యూమ్స్‌కి తగ్గట్లుగా నా గెటప్‌ను రెడీ చేసుకోవాలనుకున్నాను. ఇందుకు బాడీ ట్రాన్స్‌ఫార్మ్ చేయాలని డిసైడ్ అయ్యాను. కానీ ఇదేమీ అంత సులభమైన పని కాదు. కానీ మేం ఆరు నెలలో చేశాం'' అని తెలిపారు. ''చాలా చాలెంజ్‌లను ఫేస్ చేశాం. మొబైల్ జిమ్‌ను ఉపయోగించేవాళ్లం. ఎక్కువ ట్రెనింగ్ వల్ల మజిల్ డ్యామేజ్ అవుతుందని, కొన్ని ప్రత్యేకమైన వర్కౌట్స్ మాత్రమే చేశాం'' అని తెలిపారు ఫిజికల్ ట్రైనర్ కింగ్స్ బరీ. ఇక ఈ చిత్రకథ విషయానికి వస్తే... క్రావినోఫ్ (రస్సెల్ క్రోవ్) ఒక క్రూరమైన గ్యాంగ్‌స్టర్. కొన్ని పరిణామాల వల్ల క్రావెన్ కూడా కొన్ని క్రూరమైన పరిణామాలతో ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాడు. ఈ క్రమంలో అతను ప్రపంచంలోనే గొప్ప హంటర్‌గా మారడమే కాకుండా అందరూ భయపడే వ్యక్తిగా ఎలా మారాడు? అన్నదే కథ.



• సైఫ్ అలీఖాన్



• కరీనా కపూర్



• మృణాల్ ఠాకూర్

ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో పోలీస్ యాక్షన్ డ్రామాగా 'స్పిరిట్' చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తొలిసారిగా పోలీసాఫీసర్‌గా నటించనున్నారు ప్రభాస్. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ దాదాపు పూర్తి కావచ్చాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ

స్పిరిట్‌లో..?

సినిమా చిత్రీకరణను ఆరంభించాలనుకుంటున్నారు. దీంతో ఈ సినిమాలోని నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట సందీప్ రెడ్డి వంగా. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రను మృణాల్ ఠాకూర్ చేయనున్నారనే టాక్ బాలీవుడ్‌లో తెరపైకి వచ్చింది. అలాగే ఈ చిత్రంలోని కీలక పాత్రల్లో సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ నటిస్తారనే ప్రచారం కూడా బీ టౌన్‌లో జరుగుతోంది. ఇక ఆల్రెడీ సౌత్ కొరియన్ నటుడు డాన్ లీ ఈ చిత్రంలో ఓ రోల్ చేయనున్నారనే ప్రచారం ఎప్పట్నుంచో జరుగుతున్న సంగతి తెలిసిందే. మరి... బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతున్నట్లుగా ప్రభాస్ సరసన మృణాళ్ కనిపిస్తారా? అలాగే కీలక పాత్రల్లో సైఫ్ అలీ ఖాన్, కరీనా కపూర్ కన్‌ఫార్మ్ అవుతారా? అనేది వేచి చూడాల్సిందే.



• ధర్మ, ఐశ్వర్యా శర్మ

తన్నితే వెన్న పూసినట్టున్నదే...

'నువ్వు గుద్దితే ముద్దు పెట్టినట్టున్నదే... నువ్వు తన్నితే వెన్న పూసినట్టున్నదే...' అంటూ మొదలవుతుంది 'డ్రింకర్ సాయి' సినిమాలోని 'నువ్వు గుద్దితే..' పాట లిరికల్ వీడియో. ధర్మ, ఐశ్వర్యా శర్మ ఈ చిత్రంలో హీరో హీరోయిన్లుగా నటించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్ పై బసవ రాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'నువ్వు గుద్దితే...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'నువ్వు రక్కితే చక్కిలిగింత పుడుతున్నదే... నువ్వు రక్కితే చక్కిలిగింత పుడుతున్నదే... నువ్వు తొక్కితే థాయ్ మసాజ్ చేసినట్టుందే..' అనే లిరిక్స్‌తో సాగుతుందీ పాట. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను జాస్సీ గిఫ్ట్ పాడారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ వసంత్.

ఏపీ, తెలంగాణలో మరిన్ని కేవీబీ శాఖలు

చెన్నై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మరో రెండు శాఖలు ప్రారంభించింది. ఒకటి అనంతపురంలో మరొకటి నిజామాబాద్‌లో ఏర్పాటు చేసింది. వీటిలో ఖాతాలు, డిపాజిట్లు, రుణాలు, లాకర్ సదుపాయాలు మొదలైన సరీ్వసులన్నీ అందుబాటులో ఉంటాయని బ్యాంకు తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం శాఖల నెట్‌వర్క్ 864కి, రెండు తెలుగు రాష్ట్రాల్లో 209కి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 26 కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేసినట్లు బ్యాంకు తెలిపింది.

ఎంటీఏఆర్‌కు రూ.226 కోట్ల ఆర్డర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్షణ, అంతరిక్ష రంగానికి విడిభాగాలను సరఫరా చేస్తున్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ తాజాగా క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ విభాగాల్లో రూ.226 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకున్నట్లు శుక్రవారం వెల్లడించింది. బ్లూమ్ ఎనర్జీ నుండి రూ.191 కోట్ల ఆర్డర్ ఇందులో ఒకటి. అలాగే రాఫెల్, ఐఎంఐ సిస్టమ్స్, ఐఏఐతో సహా ప్రఖ్యాత ఏరోస్పేస్ కస్టమర్ల నుండి రూ.35 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు కంపెనీ ఎండీ పర్వత్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

శ్రీరామ్ 'గ్రీన్ ఫైనాన్స్' కార్యకలాపాలు ఏకీకృతం

న్యూఢిల్లీ: శ్రీరామ్ ఫైనాన్స్ తాజాగా తమ గ్రీన్ ఫైనాన్సింగ్ కార్యకలాపాలన్నింటినీ శ్రీరామ్ గ్రీన్ ఫైనాన్స్ కింద ఏకీకృతం చేస్తున్నట్లు వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రుణాల పరిధిని దాటి విస్తరించడంపై దృష్టి సారించనున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో వచ్చే 3-4 ఏళ్లలో రూ. 5,000 కోట్ల ఏయూఎం (నిర్వహణలోని అసెట్స్) లక్ష్యాన్ని సాధించాలని నిర్దేశించుకున్నట్లు పేర్కొంది. తొలుత కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో ఈవీ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసుకోవడంపై ఫోకస్ చేయనున్నట్లు కంపెనీ వివరించింది.

హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ టెక్నాలజీ కార్యాలయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ దిగ్గజాల్లో ఒకటైన వాన్‌గార్డ్ కొత్తగా హైదరాబాద్‌లో తమ టెక్నాలజీ ఆఫీసును ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. 2025లో దీన్ని ప్రారంభించనున్నట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధికారి వెంకటేశ్ నటరాజన్ దీనికి సారథ్యం వహించనున్నట్లు వివరించింది. సాంకేతికత తోడ్పాటుతో 5 కోట్ల మంది పైగా క్లయింట్లకు ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలు, పెట్టుబడి సలహాలు అందిస్తున్న నేపథ్యంలో ఈ సెంటర్ తమకు కీలకంగా ఉంటుందని వాన్‌గార్డ్ గ్లోబల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ నితిన్ టాండన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-12-2024

విశాఖ	590-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	580-00
విజయవాడ	580-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	570-00
వరంగల్	572-00
రిటైల్ ధర	6.30

గృహ విక్రయాలు 21% తగ్గొచ్చు !

- డిసెంబర్ క్వార్టర్‌లో 1.08 లక్షల ఇళ్ల అమ్మకాలు
- స్థిరాస్తి డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అంచనా

న్యూఢిల్లీ: దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో డిసెంబర్ క్వార్టర్‌లో గృహ అమ్మకాలు 21 శాతం తగ్గి 1.08 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని స్థిరాస్తి డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ అంచనా వేసింది. ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో (ఎన్‌సీఆర్) మాత్రం విక్రయాలు పెరుగుతాయని వెల్లడించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, నవీ ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పుణే, హైదరాబాద్, చెన్నై, థానే నగరాల్లో గృహ విక్రయాల వివరాలను ప్రాప్‌ఈక్విటీ శనివారం విడుదల చేసింది. మొత్తం తొమ్మిది నగరాల్లో 2024 డిసెంబర్ క్వార్టర్‌లో 1,08,261 యూనిట్ల ఇళ్లు అమ్ముడు కావొచ్చు. గతేడాది అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 1,37,225 యూనిట్ల విక్రయాలు జరిగాయి. అయితే 2024 సెప్టెంబర్ త్రైమాసికంతో పోలిస్తే అక్టోబర్-డిసెంబర్ అమ్మకాలు 5% పెరిగే అవకాశం ఉందని వివరించింది. అధిక బేస్ ధరల ప్రభావం కారణంగానే క్యూ3లో ఇళ్ల ధరలు తగ్గాయి. పండుగ డిమాండ్ కలిసిరావడంతో త్రైమాసిక ప్రాతిపదికన అమ్మకాలు పెరుగుతాయి. రియల్ ఎస్టేట్ రంగంలో మూలాలు బలంగా, ఆరోగ్యకరంగా ఉన్నాయని ప్రాప్‌ఈక్విటీ వ్యవస్థాపకుడు సీఈవో సమీర్ జసుజా తెలిపారు.



- హైదరాబాద్ పరిధిలో విక్రయాలు 47% తగ్గొచ్చని అంచనా వేసింది. 2023-24 డిసెంబర్ త్రైమాసికంలో 24,044 గృహ విక్రయాలు జరిగితే ఈ ఏడాది 12,682 యూనిట్లకు పరిమితం కావొచ్చు.
- బెంగళూరులో 13 శాతం తగ్గి విక్రయాలు 17,276 యూనిట్ల నుంచి 14,957 యూనిట్లకు దిగివచ్చే అవకాశం ఉంది. చెన్నైలో 4,673 యూనిట్ల నుంచి తొమ్మిది శాతం తగ్గి 4,266 యూనిట్లకు చేరుకోవచ్చు. కోల్‌కతాలో అమ్మకాలు 33% తగ్గి 5,653 నుంచి 3,763 యూనిట్లకు దిగిరావచ్చు.
- ముంబై నగరంలో గృహ విక్రయాలు 13,878 యూనిట్ల నుంచి 27% పతనమై 10,077 యూనిట్లుగా ఉండొచ్చు. నవీ ముంబై పరిధిలో 13% విక్రయాలు తగ్గొచ్చు. కాగా 2023-24 డిసెంబర్ త్రైమాసికంలో 8,607 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఈ ఏడాది 7,478 గృహాలకు పరిమితం కావచ్చు. థానేలో 26,099 యూనిట్ల నుంచి 21,893 యూనిట్లకు పడిపోవచ్చు. పుణేలో ఇండ్ల విక్రయాలు 24 శాతం తగ్గే చాన్స్ ఉంది.
- ఇన్వెస్టర్ల నుంచి బలమైన డిమాండ్ కారణంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో గురుగ్రాం పరిధిలో లగ్జరీ ఇళ్లకు కొన్నేళ్లుగా డిమాండ్ అసాధారణ రీతిలో పెరుగుతోంది. 2023-24 డిసెంబర్ త్రైమాసికంలో 10,354 గృహ అమ్మకాలు జరిగితే.. ఈ ఏడాది అక్టోబర్-డిసెంబర్ మధ్య 12,915 ఇళ్ల విక్రయాలు జరిగే అవకాశం ఉంది. అంటే 25% అమ్మకాలు పుంజుకోవచ్చు.

వారీ ఎనర్జీస్ యూఎస్ ప్లాంటు షురూ

పరిశీలనాత్మక ఉత్పత్తికి శ్రీకారం



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ వారీ ఎనర్జీస్ యూఎస్‌లో ఏర్పాటు చేసిన సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. సొంత అనుబంధ సంస్థ వారీ సోలార్ అమెరికాస్ ఇంక్ పరిశీలనాత్మక విధానంలో ఉత్పత్తి ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. తొలి దశలో 1.6 గిగావాట్ల సోలార్ మాడ్యూల్ తయారీ సామర్థ్యంతో యూనిట్‌ను నెలకొల్పింది. తదుపరి దశలో 3 గిగావాట్లకు సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికల్లో ఉంది. వెరసి టెక్సాస్‌లో పీవీ మాడ్యూల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తొలి భారతీయ పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీగా వారీ ఎనర్జీస్ నిలిచింది.

స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇటీవలే లిస్టయిన వారీ ఎనర్జీస్ షేరు ఎన్ఎస్ఈలో 5.5 శాతం పతనమై రూ. 2,871 వద్ద ముగిసింది.

ఎన్‌డీఆర్ ఇన్విట్ నిధుల సమీకరణ

రూ. 630 కోట్ల పెట్టుబడులకు ఐఎఫ్‌సీ రెడీ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకు గ్రూప్ సంస్థ ఐఎఫ్‌సీ నుంచి ఎన్‌డీఆర్ ఇన్విట్ 7.5 కోట్ల డాలర్లు(రూ. 630 కోట్లు) సమీకరించనుంది. ఎన్‌డీఆర్ ఇన్విట్ జారీ చేయనున్న దేశీ కరెన్సీ సస్టెయినబిలిటీ లింక్‌డ్ బాండ్(ఎస్ఎల్‌బీ)లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఐఎఫ్‌సీ ఈ నిధులను అందించనుంది. తద్వారా సస్టెయినబుల్ వేర్‌హౌసింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు దన్నునివ్వనుంది. అంతేకాకుండా లాజిస్టిక్స్ రంగానికి వ్యూహాత్మక ప్రోత్సాహాన్నివ్వనుంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఇన్విట్)లను ఎన్‌డీఆర్ వేర్‌హౌసింగ్ ప్రయివేట్ లిమిటెడ్ జారీ చేయనుంది. దేశీయంగా ఎస్ఎల్‌బీని వేర్‌హౌసింగ్ ఇన్విట్ తొలిసారి జారీ చేస్తున్నట్లు ఐఎఫ్‌సీ పేర్కొంది. ఐఎఫ్‌సీ ప్రపంచస్థాయిలో జారీ చేసే గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్‌లో భాగంగా ఎడ్జ్ సర్టిఫికేషన్‌కు ఇది వీలు కల్పిస్తుందని తెలియజేసింది.

రెస్టారెంట్ బ్రాండ్స్ క్విప్‌నకు సై

రూ. 500 కోట్ల సమీకరణపై దృష్టి



న్యూఢిల్లీ: రెస్టారెంట్ బ్రాండ్స్ ఏషియా లిమిటెడ్(గతంలో బర్గర్ కింగ్ ఇండియా) అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు సెక్యూరిటీల జారీ(క్విప్) చేపట్టనుంది. తద్వారా రూ. 500 కోట్లవరకూ సమీకరించేందుకు బోర్డు తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. వెరసి ఈక్విటీ షేర్లు లేదా క్విప్‌నకు వీలయ్యే సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 500 కోట్లు సమకూర్చుకోనున్నట్లు కంపెనీ తెలియజేసింది. 2024 ఉద్యోగులకు షేర్ల కేటాయింపు(ఇసాప్)నకు సైతం బోర్డు ఆమోదముద్ర వేసినట్లు పేర్కొంది. దీనిలో భాగంగా అర్హులైన డైరెక్టర్లు, ఉద్యోగులు తదితరులకు స్టాక్ ఆప్షన్లను జారీ చేయనున్నట్లు వివరించింది. ఇసాప్‌లో భాగంగా దాదాపు 1.05 కోట్ల ఆప్షన్స్‌ను గరిష్ఠంగా ఆఫర్ చేసే వీలున్నట్లు తెలియజేసింది.

ఎన్ఎస్ఈలో రెస్టారెంట్ బ్రాండ్స్ షేరు 1 శాతం నీరసించి రూ. 80 వద్ద ముగిసింది.

భారత్ మార్కెట్‌కు కట్టుబడి ఉన్నాం: టాటా స్టార్‌బక్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా తమకు కీలక మార్కెట్లలో ఒకటైన భారత్‌లో కార్యకలాపాల విస్తరణకు కట్టుబడి ఉన్నామని కేఫె చెయిన్ సంస్థ టాటా స్టార్‌బక్స్ వెల్లడించింది. భారత్ నుంచి స్టార్‌బక్స్ నిష్క్రమిస్తున్నట్లుగా వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ప్రస్తుతం దేశీయంగా 76 నగరాల్లో 470 పైచిలుకు స్టోర్స్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించింది. టాటా గ్రూప్‌లో ఎఫ్ఎంసీజీ విభాగమైన టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్ (టీసీపీఎల్), అమెరికాకు చెందిన స్టార్‌బక్స్ కార్పొరేషన్ కలిసి జాయింట్ వెంచర్‌గా టాటా స్టార్‌బక్స్‌ను ఏర్పాటు చేశాయి. నిర్వహణ వ్యయాలు భారీగా ఉండటం, నష్టాలు పెరిగిపోతుండటం, మార్కెట్లో చౌక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండటం తదితర అంశాల కారణంగా స్టార్‌బక్స్ భారత్ నుంచి నిష్క్రమించే యోచనలో ఉన్నట్లు వార్తలొచ్చాయి.

వేదాంతా రిసోర్సెస్ రేటింగ్ అప్

ఎస్‌అండ్‌పీ గ్లోబల్ నుంచి 'బీ'కు అప్‌గ్రేడ్




న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ మాతృ సంస్థ వేదాంతా రిసోర్సెస్ కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్‌ను రేటింగ్ దిగ్గజం ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మైనస్'బీ' నుంచి 'బీ'కు అప్‌గ్రేడ్ చేసింది. వెరసి గతేడాది డిసెంబర్‌లో లభించిన రేటింగ్ 'సీసీ'తో పోలిస్తే తాజాగా ఐదంచెలు బలపడింది. కాగా.. వేదాంతా రిసోర్సెస్ క్రెడిట్ రేటింగ్‌ను మైనస్ బీ నుంచి బీకు పెంచినట్లు ఎస్‌అండ్‌పీ పేర్కొంది. కంపెనీ జారీ చేసిన గ్యారంటీడ్ బాండ్ల రేటింగ్‌ను సీసీసీప్లస్ నుంచి బీమైనస్‌కు హెచ్చించినట్లు వెల్లడించింది. 2028 బాండ్ల సొలిసిటేషన్ ప్రతిపాదనకు వాటాదారుల నుంచి కనీస అంగీకారం లభించిన నేపథ్యంలో రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు ఎస్‌అండ్‌పీ వివరించింది. కంపెనీ రీఫైనాన్సింగ్ రిస్కులను మరింత సమర్థవంతంగా ఎదుర్కోగలదన్న అంచనాలు సైతం ఇందుకు దోహదపడినట్లు తెలియజేసింది.



సరికొత్తగా హోండా యాక్టివా 125

గురుగ్రామ్: ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తాజాగా అధునాతన ఫీచర్లతో సరికొత్త యాక్టివా 125 స్కూటర్‌ను విడుదల చేసింది. రూ.94,422 ధరతో డీఎల్ఎక్స్, రూ.97,146 ధరతో హెచ్-స్మార్ట్ అనే రెండు వేరియంట్లలో ఇది లభిస్తుంది. బ్లూటూత్ అనుసంధానంతో 4.2 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే కలిగి ఉంది. 123.99 సీసీ సామర్థ్యం కలిగిన సింగిల్ సిలిండర్ పీజీఎం-ఎఫ్ఐ ఇంజిన్‌తో తయారైంది. ఇది 6.20 కిలోవాట్ల శక్తిని, 10.5ఎన్ఎం టార్క్ విడుదల చేస్తుంది. యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్ సదుపాయం ఉంది. పర్ల్ ఇగ్నోస్ బ్లాక్, మాట్ యాక్సిస్ గ్రే మెటాలిక్, పర్ల్ డీప్ గ్రౌండ్ గ్రే, పర్ల్ సిరెన్ బ్లూ, రెబల్ రెడ్ మెటాలిక్, పర్ల్ ప్రిసియస్ వైట్ రంగుల్లో లభిస్తుంది. ఈ సరికొత్త 2025 హోండా యాక్టివా 125 స్కూటర్ దేశవ్యాప్తంగా అన్ని డీలర్ల వద్ద అందుబాటులో ఉందని హెచ్ఎంఎస్ఐ తెలిపింది.

చెన్నై నుంచి నేరుగా పెనాంగ్‌కు ఇండిగో సర్వీసులు



ముంబై: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్ చెన్నై నుంచి మలేషియాలోని పెనాంగ్ నగరానికి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించింది. ఈ ప్రైవేటు సంస్థకిది 37వ అంతర్జాతీయ గమ్యస్థానం. ఒక ప్రయాణికుడికి తొలి బోర్డింగ్ పాస్‌ను చైన్నై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సీవీ దీపక్ అందించి సర్వీసులను షురూ చేశారు. 'వ్యాపారం, పర్యాటక ప్రయాణికుల నుంచి నెలకొన్న డిమాండ్ దృష్ట్యా రెండు నగరాల మధ్య సేవలు మొదలుపెట్టాం. పెనాంగ్‌తో పాటు కౌలంపూర్, లంకవీ నగరాలకు కూడా నేరుగా సర్వీసులున్నాయి. మొత్తంగా మలేషియాకు వారానికి 28 సర్వీసులు నడుస్తున్నాయి' అని ఇండిగో గ్లోబల్ సేల్స్ హెడ్ వినయ్ మల్హోత్రా తెలిపారు.

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండండి

- కాలర్ ట్యూన్స్ ద్వారా అవగాహన
- మూడు నెలలపాటు సందేశాలు
- టెలికం శాఖ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో టెలికం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కాలర్ ట్యూన్స్ ద్వారా సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని నడుం బిగించింది. ఈ మేరకు టెలికం కంపెనీలకు ఆదేశాలు వెలువరించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని టెల్కోలను ఆదేశించింది. హోమ్ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్‌క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ ఈ కాలర్ ట్యూన్స్‌ను టెలికం కంపెనీలకు అందిస్తుంది. టెలికం కంపెనీలు మొబైల్ కస్టమర్లకు ప్రతిరోజు 8-10 కాల్స్‌కు ఈ సందేశాన్ని వినిపిస్తాయి. ప్రతి వారం కాలర్ ట్యూన్‌ను మారుస్తారు. ఇలా మూడు నెలలపాటు కాలర్ ట్యూన్స్ ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. భారత్‌లో ఉద్భవించినట్లు కనిపించే భారతీయ మొబైల్ నంబర్లను ప్రదర్శించే అంతర్జాతీయ స్పూఫ్డ్ ఇన్‌కమింగ్ కాల్స్‌ను గుర్తించి బ్లాక్ చేసే వ్యవస్థను కేంద్రం, అలాగే టెలికం సర్వీస్ ప్రొవైడర్లు రూపొందించారు. ఇటీవల నకిలీ డిజిటల్ అరెస్టులు, ఫెడెక్స్ స్కామ్‌లు, ప్రభుత్వం, పోలీసు అధికారులుగా నటించడం మొదలైన కేసులలో సైబర్ నేరస్థులు ఇటువంటి అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్స్ చేసినట్టు ప్రభుత్వం గుర్తించింది. 2024 నవంబర్ 15 వరకు 6.69 లక్షలకు పైగా సిమ్ కార్డ్‌లు, 1,32,000 ఐఎంఈఐలను కేంద్రం బ్లాక్ చేసింది.

భారంగా మారనున్న స్టీల్ దిగుమతులు!?

చౌక దిగుమతులపై దర్యాప్తు ఆరంభం



న్యూఢిల్లీ: కొన్ని రకాల ఫ్లాట్ స్టీల్ ఉత్పత్తులు చౌకగా దిగుమతి అవుతున్నాయన్న దేశీ స్టీల్ పరిశ్రమ ఫిర్యాదుపై డైరెక్టరేజ్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) అధికారిక దర్యాప్తు మొదలుపెట్టింది. ఫ్యాబ్రికేషన్, పైపుల తయారీ, నిర్మాణ రంగం, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ట్రాక్టర్లు, సైకిళ్లు, ఎలక్ట్రికల్ ప్యానెళ్ల కోసం వినియోగించే నాన్ అలాయ్, అలాయ్ స్టీల్ ఫ్లాట్ ఉత్పత్తులపై దర్యాప్తు మొదలు పెట్టినట్టు డీజీటీఆర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్పత్తులపై 25 శాతం రక్షిత సుంకం విధించాలని ఇండియన్ స్టీల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఇటీవల ఉన్నట్టుండి, పెద్ద ఎత్తున పెరిగిన ఈ దిగుమతులతో దేశీ పరిశ్రమకు శరాఘాతంగా మారినట్టు ఆందోళన వ్యక్తం చేసింది. దేశీ పరిశ్రమకు తీవ్ర హానికరంగా పేర్కొంది. దరఖాస్తుదారు (స్టీల్ పరిశ్రమ) సమర్పించిన వివరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించేందుకు కావాల్సిన ప్రాథమిక సాక్ష్యాధారాలుట్టు భావిస్తున్నామని డీజీటీఆర్ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. హాట్ రోల్డ్ (హెచ్ఆర్) కాయిల్స్, షీట్స్ అండ్ ప్లేట్స్, హెచ్ఆర్ ప్లేట్ మిల్ ప్లేట్స్, కోల్డ్‌రోల్డ్ (సీఆర్) కాయిల్స్ అండ్ షీట్స్, మెటాలిక్ కోటెడ్ స్టీల్ కాయిల్స్ అండ్ షీట్స్, కలర్ కోటెడ్ కాయిల్స్ అండ్ షీట్స్ ఉత్పత్తులు డీజీటీఆర్ దర్యాప్తు పరిధిలోకి రానున్నాయి. విచారణ అనంతరం తన సిఫారసులను కేంద్ర ఆర్థిక శాఖకు డీజీటీఆర్ సమర్పిస్తుంది. ఈ సిఫారసుల ఆధారంగా దిగుమతులపై ప్రత్యేక సుంకాలు విధించే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా చైనా నుంచి ఈ దిగుమతులు గణనీయంగా పెరిగినట్టు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల గణాంకాల ఆధారంగా తెలుస్తోంది.

2025 ఆటో ఎక్స్‌పోలో 'ఈ-విటారా'

మారుతీ నుంచి తొలి ఎలక్ట్రిక్ కారు ఆవిష్కరణ

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ వచ్చే ఏడాది (2025) జరగబోయే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో తమ తొలి ఎలక్ట్రిక్ కారు ఈ-విటారాను ప్రదర్శించే ప్రణాళికల్లో ఉంది. ఇటీవలే దీన్ని ఇటలీలో ఆవిష్కరించింది. వాహన రంగంలో దశాబ్దాల అనుభవంతో అధునాతన ఎలక్ట్రిక్ టెక్నాలజీని ఉపయోగించి దీన్ని రూపొందించినట్లు మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. మరోవైపు, సమగ్రమైన ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థను కూడా అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మారుతీ సుజుకీ డీలర్‌షిప్‌లు, సర్వీస్ టచ్ పాయింట్లలో ఫాస్ట్ చార్జర్ల నెట్‌వర్క్, హోమ్ చార్జింగ్ సొల్యూషన్స్ మొదలైనవి వీటిలో ఉంటాయని వివరించారు. సరైన చార్జింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి పెద్ద అవరోధంగా ఉంటోందని బెనర్జీ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈవీలను మరింత అదుబాటులోకి తెచ్చేందుకు, విస్తృత స్థాయిలో కస్టమర్లకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.



అఫ్గాన్‌దే వన్డే సిరీస్

- మూడో మ్యాచ్‌లో జింబాబ్వే పరాజయం
- ఘజన్‌ఫర్‌కు 5 వికెట్లు



ఘజన్‌ఫర్

హరారే: జింబాబ్వే పర్యటనలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న అఫ్గానిస్తాన్ జట్టు... వన్డే సిరీస్ కూడా కైవసం చేసుకుంది. టి20 సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసిన అఫ్గాన్... తాజాగా వన్డే సిరీస్‌ను 2–0తో చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఆఖరి వన్డేలో అఫ్గాన్ 8 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 30.1 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. సీన్ విలియమ్స్ (61 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించగా... మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ ఇర్విన్ (5), ఆల్‌రౌండర్ సికందర్ రజా (13), బెనెట్ (9) ఒకరివెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. అఫ్గాన్ బౌలర్లలో ఘజన్‌ఫర్ 5 వికెట్లతో విజృంభించగా... రషీద్ ఖాన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గానిస్తాన్ 26.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. సెదిఖుల్లా అతల్ (50 బంతుల్లో 52; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఘజన్‌ఫర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సెదిఖుల్లా అతల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి తొలి టెస్టు జరగనుంది.

పరుగుల ప్రవాహం

ముంబై, కర్ణాటక మ్యాచ్‌లో 765 పరుగులు

- ముంబై 382/4... కర్ణాటక 383/3
- శ్రేయస్ 55 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లతో 114 నాటౌట్
- కృష్ణన్ శ్రీజిత్ 101 బంతుల్లో 150 నాటౌట్


శ్రీజిత్



శ్రేయస్

అహ్మదాబాద్: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ముంబై, కర్ణాటక జట్ల మధ్య జరిగిన పోరులో పరుగుల వరద పారింది. రెండు సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు నమోదైన ఈ మ్యాచ్‌లో ఓవరాల్‌గా ఇరు జట్లు కలిసి 765 పరుగులు రాబట్టాయి. గ్రూప్ 'సి'లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 7 వికెట్ల తేడాతో ముంబైని చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముబై నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 382 పరుగులు చేసింది. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గెలుచుకొని ఫుల్ జోష్‌లో ఉన్న ముంబై జట్టు ఇక్కడ కూడా అదే జోరు కొనసాగించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (55 బంతుల్లో 114 నాటౌట్; 5 ఫోర్లు, 10 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిన శ్రేయస్ ఫోర్ల కంటే ఎక్కువ సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. హార్దిక్ తమోర్ (84; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆయుశ్ మాత్రె (78; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (36 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. సూర్యకుమార్ యాదవ్ (20; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడే క్రమంలో పెవిలియన్ చేరాడు. ఆయుశ్, హార్దిక్ జట్టుకు గట్టి పునాది వేయగా.. ఆ తర్వాత శ్రేయస్, దూబే దాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారీ లక్ష్యం ఎదురుగా ఉన్నా... ఏమాత్రం వెనకడుగు వేయని కర్ణాటక 46.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 383 పరుగులు చేసి విజయం సాధించింది. క్రిష్ణన్ శ్రీజిత్ (101 బంతుల్లో 150 నాటౌట్; 20 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ సెంచరీతో విజృంభించగా... కేవీ అనీశ్ (66 బంతుల్లో 82; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రవీణ్ దూబే (50 బంతుల్లో 65 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) దంచికొట్టారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (47; 7 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇటీవల ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలకు ముంబై ఇండియన్స్ జట్టు కొనుగోలు చేసుకున్న శ్రీజిత్... ముంబై బౌలర్లపై విరుచుకుపడటంతో కొండంత స్కోరును కర్ణాటక మరో 22 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ముంబై బౌలర్లలో జునేద్ ఖాన్ 2 వికెట్లు తీశాడు. శ్రీజిత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఢిల్లీపై బెంగాల్ గెలుపు...

సాక్షి, హైదరాబాద్: వికెట్ కీపర్ అభిషేక్ పొరెల్ (130 బంతుల్లో 170 నాటౌట్; 18 ఫోర్లు, 7 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగడంతో బెంగాల్ జట్టు విజయ్ హజారే ట్రోఫీలో శుభారంభం చేసింది. గ్రూప్ 'ఇ'లో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో బెంగాల్ జట్టు 6 వికెట్ల తేడాతో ఢిల్లీపై విజయం సాధించింది. మొదట ఢిల్లీ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. వికెట్ కీపర అనూజ్ రావత్ (66 బంతుల్లో 79 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), హిమ్మత్ సింగ్ (60; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. కెప్టెన్ ఆయుశ్ బదోనీ (41; 5 ఫోర్లు), వైభవ్ (47; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. బెంగాల్ బౌలర్లలో ముకేశ్ కుమార్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిషేక్ పొరెల్ దంచి కొట్టడంతో బెంగాల్ 41.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 274 పరుగులు చేసింది. తక్కినవాళ్ల నుంచి సరైన సహకారం లభించకపోయినా... అభిషేక్ అదరగొట్టడంతో బెంగాల్ జట్టు సునాయాసంగా గెలుపొందింది. ఢిల్లీ బౌలర్లలో ఆయుశ్ బదోనీ 2 వికెట్లు తీశాడు.



సమీర్ రిజ్వీ 201 నాటౌట్

- 97 బంతుల్లో డబుల్ సెంచరీ
- 13 ఫోర్లు, 20 సిక్స్‌లు బాదిన ఉత్తర ప్రదేశ్ బ్యాటర్

వడోదర: ఉత్తరప్రదేశ్ యువ ఆటగాడు సమీర్ రిజ్వీ (97 బంతుల్లో 201 నాటౌట్; 13 ఫోర్లు, 20 సిక్స్‌లు) మెరుపు ద్విశతకంతో చెలరేగాడు. బీసీసీఐ పురుషుల అండర్–23 స్టేట్ 'ఎ' ట్రోఫీలో భాగంగా శనివారం త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ సారథి వీరవిహారం చేశాడు. దీంతో ఉత్తరప్రదేశ్ జట్టు 152 పరుగుల తేడాతో త్రిపురను మట్టికరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. సమీర్ రిజ్వీ అజేయ డబుల్ సెంచరీతో చెలరేగగా... శౌర్య సింగ్ (51; 9 ఫోర్లు, 1 సిక్స్), ఆదర్శ్ సింగ్ (52) హాఫ్‌సెంచరీలతో రాణించారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన త్రిపుర జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 253 పరుగులకు పరిమితమైంది. ఆనంద్ (68), తన్మయ్ దాస్ (48) పోరాడినా లాభం లేకపోయింది. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో కునాల్ త్యాగి 3, విజయ్ కుమార్, వన్ష్ చౌదరి చెరో రెండు వికెట్లు తీశారు.

భారత్‌లో జూనియర్ ప్రపంచకప్ షూటింగ్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే జూనియర్ ప్రపంచకప్ షూటింగ్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో పోటీలుంటాయని భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) వెల్లడించింది. దేశంలో వరుసగా జరుగుతున్న మూడో అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ప్రపంచకప్ అని ఎన్‌ఆర్‌ఏఐ తెలిపింది.

మళ్లీ ఓడిన తెలంగాణ



- జమ్మూ కశ్మీర్ 3–0తో జయభేరి
- సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు వైఫల్యం కొనసాగుతోంది. గ్రూప్ 'ఎ'లో శనివారం దక్కన్ ఎరెనా మైదానంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ 3–0తో తెలంగాణపై ఘనవిజయం సాధించింది. తెలంగాణ రక్షణ పంక్తి లోపాలను ఆసరా చేసుకొని కశ్మీర్ స్ట్రయికర్లు, మిడ్‌ఫీల్డర్లు పదేపదే గోల్‌పోస్ట్‌వైపు దూసుకెళ్లారు. ఆట మొదలైన ఐదు నిమిషాల్లోనే జమ్మూ కశ్మీర్ ఖాతా తెరిచింది. హయత్ బషీర్ (5వ ని.లో) చేసిన గోల్‌తో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి అర్ధభాగం ఇదే స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో అరుణ్ నగియల్ (74వ ని.), ఆకిఫ్ జావిద్ (88 వ ని.) స్వల్ప వ్యవధిలో చేసి గోల్స్‌లో జమ్మూ జట్టు 3–0తో తెలంగాణపై ఏకపక్ష విజయం సాధించింది. కశ్మీర్‌కు ఈ టోర్నీలో ఇదే తొలి విజయం కాగా... నాలుగు మ్యాచ్‌లాడిన ఆతిథ్య తెలంగాణ జట్టు ఇంకా బోణీ కొట్టలేదు. మూడు మ్యాచ్‌ల్లో ఓడిన ఆతిథ్య జట్టు ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఈ గ్రూపు నుంచి సర్వీసెస్, వెస్ట్ బెంగాల్, మణిపూర్ జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సంపాదించాయి. శనివారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్ 2–0తో రాజస్తాన్‌పై గెలుపొందింది. వరుసగా మూడు విజయాలతో నాకౌట్ చేరింది. రాజస్తాన్‌కు క్వార్టర్స్ చేరే అవకాశం మిగిలుంది. సోమవారం జరిగే లీగ్ మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్‌పై గెలిస్తే రాజస్తాన్ నాకౌట్‌కు అర్హత సాధిస్తుంది.



ముంబై సిటీ ఐదో విజయం

ముంబై: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో ముంబై సిటీ ఫుట్‌బాల్ జట్టు ఐదో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో ముంబై సిటీ 1–0 గోల్స్ తేడాతో చెన్నయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. మ్యాచ్‌లో నమోదైన ఏకైక గోల్ ముంబై జట్టు తరఫున నికోస్ కరెలిస్ (8వ నిమిషంలో) సాధించాడు. మ్యాచ్ ఆరంభం నుంచే బంతిపై సంపూర్ణ నియంత్రణ కనబర్చిన ముంబై జట్టు... ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై మూడుసార్లు దాడి చేసి అందులో ఒక గోల్ నమోదు చేసింది. అదే సమయంలో చెన్నయిన్ జట్టు నాలుగు సార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇప్పటి వరకు లీగ్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన ముంబై సిటీ జట్టు 5 విజయాలు, 2 పరాజయాలు, 5 'డ్రా'లతో 20 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకింది. చెన్నయిన్ ఎఫ్‌సీ జట్టు 13 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 6 పరాజయాలు, 3 'డ్రా'లతో 15 పాయింట్లు సాధించి పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో ఈస్ట్‌బెంగాల్ జట్టు 1–0 తేడాతో జంషెడ్‌పూర్‌పై విజయం సాధించింది. ఈస్ట్‌బెంగాల్ తరఫున దిమిత్రోస్ డియామాంటొకోస్ (60వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై ఆరుసార్లు దాడి చేసిన ఈస్ట్‌బెంగాల్ అందులో ఒక్కసారి సఫలీకృతం కాగా... గోల్ పోస్ట్‌పైకి రెండు షాట్లు కొట్టిన జంషెడ్‌పూర్ ఒక్కసారి కూడా గోల్ చేయలేకపోయింది. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న పోరులో కేరళ బ్లాస్టర్స్‌తో మొహమ్మదన్ స్పోర్ట్స్ క్లబ్ (రాత్రి గం.7:30 నుంచి) తలపడుతుంది.



అన్‌మోల్

ప్రిక్వార్టర్స్‌లో అన్‌మోల్

- చిరాగ్ సేన్ ఓటమి
- జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ అన్‌మోల్ ఖర్బ్, గతేడాది రన్నరప్ తన్వీ శర్మ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మాజీ చాంపియన్లు మిథున్ మంజునాథ్, సౌరభ్ వర్మలు అలవోక విజయాలతో మూడో రౌండ్‌కు చేరారు. కానీ పురుషుల డిఫెండింగ్ చాంపియన్ చిరాగ్ సేన్‌కు మూడో రౌండ్లోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్లో అన్‌మోల్ 21–14, 21–14తో కృషిక మహాజన్‌పై గెలుపొందగా, తన్వీ శర్మ 21–12, 21–8తో స్వాతి సోలంకిపై సునాయాస విజయం సాధించింది. రుజుల రాము 21–19, 19–21, 21–17తో పదో సీడ్ సూర్యచరిష్మ తమిరిపై, జియా రావత్ 25–27, 21–14, 21–10తో తొమ్మిదో సీడ్ శ్రుతి ముందాడపై గెలుపొందారు. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో చిరాగ్ సెన్‌ను తమిళనాడు షట్లర్ రిత్విక్ కంగుతినిపించాడు. తొలి గేమ్‌ను సులువుగా గెలుచుకున్న చిరాగ్‌కు తర్వాతి గేముల్లో రిత్విక్ నుంచి ఊహించని పోటీ ఎదురవడంతో చేతులెత్తేశాడు. చివరకు రిత్విక్ 12–21, 21–19, 21–15తో చిరాగ్ సేన్‌పై విజయం సాధించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో రిత్విక్... ఎమ్. రఘుతో తలపడనున్నాడు. మిథున్ మంజునాథ్ 21–9, 21–18తో మూడో సీడ్ భరత్ రాఘవ్‌ను, సౌరభ్ వర్మ 21–17, 21–17తో అభినవ్ గార్గ్‌ను ఓడించారు. రోహన్ గుర్బాని 21–15, 21–1తో 11వ సీడ్ లోకేశ్ రెడ్డిపై, రఘు 21–19, 21–16తో కార్తీక్ జిందాల్‌పై గెలిచారు.

షూటింగ్‌లో 'స్వర్ణ' సురుచి

- నాలుగో పసిడి కైవసం
- ఆంధ్ర షూటర్లు ప్రణవి–ముకేశ్‌లకు రజతం


సురుచి

న్యూఢిల్లీ: హరియానా టీనేజ్ షూటర్ సురుచి జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకాల్ని అవలీలగా సాధిస్తోంది. ఈ టోర్నీలో ఆమె నాలుగో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఆంధ్ర షూటింగ్ జోడీ నేలవల్లి ముకేశ్– ద్వారం ప్రణవి 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజత పతకం సాధించింది. శుక్రవారం మహిళల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో మూడు స్వర్ణాల్ని క్లీన్‌స్వీప్ చేసిన సురుచి శనివారం 10 మీటర్ల యూత్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో పసిడి పతకాన్ని గెలుచుకుంది. సామ్రాట్ రాణాతో జోడీ కట్టిన ఆమె ఫైనల్లో 16–2తో ఉత్తరాఖండ్‌కు చెందిన అభినవ్ దేశ్వాల్–యశస్వీ జోషి జోడీపై ఏకపక్ష విజయం సాధించింది. ప్రత్యర్థి ద్వయం కనీసం ఖాతా తెరువకముందే సురుచి–సామ్రాట్ జంట 14–0తో స్పష్టమైన ఆధిపత్యాన్ని చలాయించింది. కాంస్య పతక పోరులో కర్నాటకకు చెందిన జొనాథన్ గెవిన్ ఆంథోని–అవంతిక మధు 17–13తో జస్వీర్ సింగ్ సాహ్ని–సైనా భర్వానిలపై గెలిచింది. 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో ముకేశ్–ప్రణవి జోడీ 12–16తో ఆర్మీ షూటర్లు రవీందర్ సింగ్–సేజల్ కాంబ్లి జంట చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. రవీందర్, సేజల్‌లకు స్వర్ణ పతకం లభించింది.

పట్నా, గుజరాత్ మ్యాచ్ 'టై'

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో భాగంగా శనివారం పట్నా పైరేట్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్ 40–40 పాయింట్లతో 'టై'గా ముగిసింది. పట్నా పైరేట్స్ తరఫున దేవాంక్ 10 పాయింట్లతో సత్తా చాటగా... సుధాకర్ 7 పాయింట్లు సాధించాడు. గుజరాత్ జెయింట్స్ తరఫున రాకేశ్ 9 పాయింట్లు సాధించగా... గుమన్ సింగ్, జితేందర్ యాదవ్ చెరో 8 పాయింట్లతో మెరిశారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో పట్నా 22 రెయిడ్ పాయింట్లు సాధించగా... గుజరాత్ 18 రెయిడ్ పాయింట్లకు పరిమితమైంది. ట్యాక్లింగ్‌లో వెనుకబడిన పట్నా 11 పాయింట్లతో సరిపెట్టుకోగా... గుజరాత్ 20 ట్యాకింగ్స్‌తో సత్తాచాటింది. ఇరు జట్ల మధ్య ఆధిక్యం చేతులు మారుతూ సాగిన పోరు చివరకు సమంగా ముగిసింది. పట్నా జట్టు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరడంతో పాటు పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతుండగా... గుజరాత్ 21 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 13 పరాజయాలు, 3 'టై'లతో 38 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 11వ స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 33–31 పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. ఢిల్లీ తరఫున అశు మాలిక్ 12 పాయింట్లతో రాణించగా... జైపూర్ పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ 10 పాయింట్లతో పోరాడాడు. ఢిల్లీ, జైపూర్ జట్లు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 8 గంటలకు), హరియాణా స్టీలర్స్‌తో యూ ముంబా (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.


పట్నా, గుజరాత్ మ్యాచ్‌లో ఒక దృశ్యం



కువైట్‌లో శనివారం ఐఎఫ్‌ఎస్ రిటైర్డు అధికారి మంగళ్‌సైన్ హండాకు ప్రధాని మోదీ కరచాలనం



కువైట్‌లో తనకు స్వాగతం పలికిన భారత సంతతి కళాకారులతో ప్రధాని మోదీ



రామాయణం, మహాభారతాలను అరబిక్‌లోకి తర్జుమా చేసిన బరౌన్, నసీఫ్‌లతో ప్రధాని



గల్ఫ్ స్పిక్ లేబర్ క్యాంపులో భారత కార్మికులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

మనవరాలి ఆశ నెరవేరింది

మంగళ్‌సైన్ హండాను కలిసిన ప్రధాని మోదీ

కువైట్ సిటీ: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం కువైట్‌కు చేరుకున్నారు. కువైట్‌లో స్థిరపడిన ఇండియన్ ఫారిన్ సర్వీసు(ఐఎఫ్ఎస్) రిటైర్డు అధికారి మంగళ్‌సైన్ హండా(101)ను ఈ సందర్భంగా మోదీ కలిశారు. ఐఎఫ్ఎస్ అధికారిగా భారత్‌కు చక్కటి సేవలు అందించారని, దేశ పురోభివృద్ధిని కాంక్షిస్తున్నారని హండాను ప్రశంసించారు. నిజానికి శతాధిక వృద్ధుడైన హండాను నరేంద్ర మోదీ కలుసుకోవాలన్నది హండా మనవరాలు శ్రేయా జునేజా కోరిక. 'కువైట్‌కు వెళ్తున్నారు కాబట్టి అక్కడ మా తాతయ్య హండాను కలుసుకోండి ప్లీజ్. మీరంటే ఆయనకు ఎంతో అభిమానం. మీరు మా తాతను కలవాలన్నది నా ఆశ' అంటూ ఆమె శుక్రవారం సోషల్ మీడియాలో మోదీకి విజ్ఞప్తి చేశారు. మోదీ సానుకూలంగా స్పందించడంతో మనవరాలి ఆశ తీరింది.

అరబిక్ మహాభారతం, అరబిక్ రామాయణం

భారతీయ ప్రాచీన గ్రంథాలైన మహాభారతం, రామాయణం అరబిక్ భాషలోకి సైతం అనువాదమయ్యాయి. రెండు గ్రంథాలను అనువాదం చేసి, ప్రచురించిన ఇద్దరు కువైట్ పౌరులను ప్రధాని మోదీ కలిశారు. అరబిక్ మహాభారతం, అరబిక్ రామాయణ ప్రతులపై సంతకాలు చేశారు. అబ్దుల్లా అల్–బరౌన్ వీటిని అరబిక్ భాషలోకి అనువదించగా, అబ్దుల్ లతీఫ్ అల్–నసీఫ్ ప్రచురించారు. వారిని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ''అరబిక్ మహాభారతం, అరబిక్ రామాయణ గ్రంథాలను చూడడం చాలా సంతోషం కలిగించింది. అబ్దుల్లా అల్–బరౌన్, అబ్దుల్ లతీఫ్ అల్–నసీఫ్ ఎంతో శ్రమించి వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. వారిని అభినందిస్తున్నాను. వారిద్దరి కృషితో ప్రపంచవ్యాప్తంగా మన భారతీయ సంస్కృతికి ఆదరణ మరింత పెరుగుతుంది అనడంలో సందేహం లేదు''అని మోదీ 'ఎక్స్'లో హర్షం వ్యక్తంచేశారు. సంబంధిత ఫొటోలను సైతం షేర్ చేశారు.

కువైట్ జనాభాలో 21% మంది భారతీయులే

ఇండియాకు అతిపెద్ద వాణిజ్య, వ్యాపార భాగస్వామ్య దేశాల్లో కువైట్ కూడా ఒకటి. ఇక్కడ భారీ సంఖ్యలో భారతీయులు ఉన్నారు. ఎన్నో రంగాల్లో వారు ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. కువైట్‌లోని మొత్తం జనాభాలో భారతీయులు ఏకంగా 21 శాతం (10 లక్షలు) ఉన్నారు. ఉద్యోగులు, కార్మికుల్లో భారతీయుల వాటా 30 శాతం (9 లక్షలు). ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వ్యాపార రంగంలోనూ వారిది కీలక పాత్ర. 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారత్, కువైట్ మధ్య 10.47 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. ఇండియాకు ముడి చమురు సరఫరా చేసే దేశాల జాబితాలో కువైట్ ఆరోస్థానంలో ఉంది. ఇండియా చమురు అవసరాల్లో 3 శాతం కువైట్ తీరుస్తోంది. ఇండియా నుంచి కువైట్‌కు ఎగుమతుల విలువ 2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అలాగే ఇండియాలో కువైట్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ పెట్టుబడులు 10 బిలియన్ డాలర్లకు చేరాయి. రెండు దేశాల మధ్య చిరకాలంగా స్నేహ సంబంధాలు కొనసాగుతున్నాయి. కువైట్‌లో ముడి చమురు నిల్వలు బయటపడక ముందునుంచే ఆ దేశంతో భారత్‌కు వాణిజ్య, వ్యాపార సంబంధాలు ఉన్నాయి. అప్పట్లో ఓడల ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపారం జరిగేది.

సప్తపదిని కాదని.. రాజ్యాంగం సాక్షిగా పెళ్లి



ఛత్తీస్‌గఢ్‌లో యువ జంట ఆదర్శం

రాయ్‌పూర్: ఆధునిక ప్రపంచంలో వివాహం ఒక అత్యంత ఆడంబర కార్యక్రమం. స్థితిమంతులైతే పెళ్లికూతురు, పెళ్లికొడుకు తరఫు బంధువులు చేసే హడావిడి అంతాఇంతాకాదు. పెళ్లి ఖాయమైంది మొదలు నిశ్చితార్థం, మెహందీ, బ్యాచిలర్స్ పార్టీ, మంగళస్నానాలు, పెళ్లి కొడుకును చేయడం, పెళ్లి కూతురును చేయడం విడిది గృహాల వద్ద బంధుమిత్రగణం హడావిడి గురించి చెప్పనక్కర్లేదు. ఇక పెళ్లిరోజు ఫంక్షన్ హాల్‌లో కళ్లు తిప్పుకోలేనంతగా సర్వాంగ సుందరంగా సిద్ధంచేసిన కళ్యాణమండప వేదిక, ఎల్ఈడీ తెరల ఏర్పాట్లు, డ్రోన్లు, జిమ్మీ కెమెరాలతో ప్రత్యేక ఫొటోషూట్‌లు, భారీ ఎత్తున రిటర్న్ గిఫ్టులు, ఆపకుండా వారం తిన్నా తరగని తినుబండారాలు, వెరైటీ భోజనాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే వివాహవేడుకకు పెట్టే ఖర్చు చాంతాడంత ఉంటుంది. ఇలాంటి ఆడంబరాలకు సుదూరంగా నిరాడంబరంగా ఒక యువజంట పెళ్లితో కొత్త జీవితంలోకి అడుగుపెట్టింది. ఈ పెళ్లిలో పైన చెప్పిన ఎలాంటి హంగామా ఆర్భాటం మచ్చుకైనా కనిపించలేదు. డబ్బును నీళ్లలా ఖర్చుపెట్టడం అటుంచితే హిందూ సంప్రదాయబద్ధంగా జరిగే అగ్నిహోత్రం చుట్టూ మంత్రోచ్చారణల మధ్య ఏడడుగులు నడుస్తూ జరిగే కార్యక్రమం కూడా జరగలేదు. బ్యాండ్ చప్పుళ్లు, బరాత్ చిందులు కూడా లేకుండా అత్యంత సాదాసీదాగా జరిగిన ఈ పెళ్లితంతుపై ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో అంతా మాట్లాడుకుంటున్నారు.

అంబేడ్కర్ చిత్రపటం చుట్టూ..

ఛత్తీస్‌గఢ్‌లోని జష్పూర్ జిల్లాలోని కపూ గ్రామానికి చెందిన అమ్మాయి ప్రతిమా లాహ్రీతో అబ్బాయి ఇమాన్ లాహ్రీకి ఈనెల 18వ తేదీన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి జరిగింది. ఈ పెళ్లికొచ్చిన వారంతా ఒకింత అవాక్కయ్యారు. చాలా సింపుల్‌గా వివాహ వేడుకను ముగించారు. పెళ్లికూతురు నుదుటిన పెళ్లికొడుకు సింధూరం కూడా దిద్దలేదు. కనీసం తాళి కూడా కట్టలేదు. కానీ సువాసనలు వెదజల్లే పూలదండలు మార్చు కుని పెళ్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను పెళ్లిపెద్దగా భావించారు. ఆయన చిత్రపటం చుట్టూ తిరిగారు. తర్వాత రాజ్యాంగ ప్రతి సాక్షిగా ప్రమాణం చేశారు. ఈ తరహాలో పెళ్లి ఎందుకు చేసుకున్నారని అక్కడి వారు ప్రశ్నించగా కొత్త జంట తన అభిప్రాయాలను పంచుకుంది. ''అనవసర ఖర్చులకు మేం చాలా దూరం. మా కుటుంబాలను ఒప్పించి ఇష్టపూర్తిగా పెళ్లిచేసుకున్నాం''అని పెళ్లికూతురు చెప్పారు. సత్నానీ కులానికి చెందిన తాము తమ గురు ఘసిదాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని అదే రోజున పెళ్లాడామని నవవరుడు ఇమాన్ చెప్పారు. అనవసర ఖర్చుల జోలికి పోని ఆదర్శమయ వివాహం చేసుకున్న జంటను స్థానికులు అభినందించి శుభాకాంక్షల ఆశీస్సుల అక్షింతలు చల్లారు.

ఈశాన్యంలో తీవ్రవాదం అంతం

- పోలీసుల వైఖరి మారాలి.. సత్వర న్యాయం అందించాలి
- పెండింగ్ కేసులను మూడు నెలల్లోగా పూర్తిగా పరిష్కరించాలి
- ఎన్ఈసీ 72వ ప్లీనరీలో హోం మంత్రి అమిత్ షా నిర్దేశం



హోం మంత్రి అమిత్ షా

అగర్తలా: ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో తీవ్రవాదం అంతమైందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రధాని మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో కనీసం 20 శాంతి ఒప్పందాలను కుదుర్చుకోగా, 9 వేల మంది సాయుధ తీవ్రవాదులు లొంగిపోయారన్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో శాంతికి బాటలుపడ్డాయన్నారు. ఇకపై పోలీసుల వైఖరిలో మార్పు రావాలంటూ ఆయన..బాధితులకు సత్వర న్యాయం అందించడంపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. శనివారం అగర్తలాలో జరిగిన నార్త్ ఈస్టర్న్ కౌన్సిల్(ఎన్ఈసీ)72వ ప్లీనరీలో అమిత్ షా ప్రసంగించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఈశాన్య రాష్ట్రాల్లోని పోలీసు బలగాలు వేర్పాటువాదులతో పోరు సాగించారు. వేర్పాటువాదం ఇప్పుడిక సమసింది. ఇకపై మన బలగాల వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పెండింగ్‌లో ఉన్న కేసులన్నిటినీ వచ్చే మూడేళ్లలో పూర్తిగా పరిష్కరించాలి'అంటూ మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో కనెక్టివిటీ సమస్యను కూడా అధిగమించామన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో రైలు మార్గాల అనుసంధానానికి సుమారు రూ.81వేల కోట్లు, రహదారి నెట్‌వర్క్ కోసం రూ.41 వేల కోట్లు వెచ్చించినట్లు అమిత్ షా వెల్లడించారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్న ఆయన.. 'బీజేపీ అధికారంలోకి వచ్చాక పలువురు కేంద్ర మంత్రులు ఈ రాష్ట్రాల్లో '700 రాత్రులు'గడిపారు. బంగ్లాదేశ్‌తో సరిహద్దుల వివాదాన్ని పరిష్కరించుకున్న తర్వాత, ఈశాన్య రాష్ట్రాలకు మిగతా ప్రపంచంతో సంబంధాలు మెరుగయ్యాయి. పెట్టుబడులకు అనువైన వాతావరణం నెలకొంది'అని చెప్పారు. ఆర్గానిక పంటలు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిని పెంచడం ద్వారా ఈ ప్రాంతంలో పూర్తి స్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి మాదక ద్రవ్యాల బెడదను నివారించేందుకు మరిన్న చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతోపాటు ఈ ప్రాంతంలోని 8 రాష్ట్రాలు.. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాల్యాండ్, సిక్కిం, త్రిపుర గవర్నర్లు, ముఖ్యమంత్రులు, సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ పిల్లలుంటే చెప్పండి

ఢిల్లీ పాఠశాలలకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఆదేశాలు

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బంగ్లాదేశ్‌కు చెందిన వలసదారుల పిల్లలు విద్యను అభ్యసిస్తుంటే అలాంటి విద్యార్థుల పూర్తి వివరాల సమగ్ర సమచారాన్ని తమకు అందించాలని అన్ని పాఠశాలలకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఆదేశించింది. ఈ మేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ హోం శాఖ ప్రధాన కార్యదర్శితో ఎంసీడీ అధికారుల వర్చువల్ భేటీలో సంబంధిత అంశంపైనే ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అక్రమంగా చేరి చదువుకుంటున్న వలసదారుల పిల్లలను గుర్తించడమే లక్ష్యంగా కార్పొరేషన్ ఈ చర్యలు తీసుకుంటోంది. అక్రమ చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలు ఉండవని అంశాన్ని ఆయా పాఠశాలలు మరోసారి పునఃపరిశీలించుకోవాలని డిసెంబర్ 18నాటి సంబంధిత సర్క్యులర్‌లో కార్పొరేషన్ పేర్కొంది. ఢిల్లీలో స్థిరపడిన అక్రమ వలసదారుల వివరాలను తమకు అందజేయాలని గతంలోనే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సంబంధిత కార్యాలయం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. మరికొద్ది నెలల్లో ఢిల్లీ శాసనసభ ఎన్నికల సమరం మొదలుకానున్న నేపథ్యంలో ఢిల్లీ ప్రాంతంలో అక్రమ వలసల అంశం ఎన్నికల అంశంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యలంలో కార్పొరేషన్ సంబంధిత వివరాలను అడగటం గమనార్హం. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి ఆక్రమించిన ఖాళీ స్థలాల నుంచి వెంటనే వారిని పంపించాలని సంబంధిత మున్సిపల్ జోన్‌లను ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ గతంలోనే సూచనలు చేసింది. డిసెంబరు 31లోగా ఎంసీడీ డిప్యూటీ కమిషనర్ ద్వారా తాజా పరిస్థితిపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించింది. దీంతోపాటే ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకల్లా ఆ వారంలో పురోగతిపై నివేదికనూ సమర్పించాలని సూచించింది. ''ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ సమయాల్లో అక్రమ బంగ్లాదేశీ వలసదారుల పిల్లలను గుర్తించడానికి విద్యా శాఖ తగిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే అడ్మిషన్ పొందిన వారినీ చెక్‌చేయనున్నారు''అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్పందించిన ఆప్

ఈ ఆదేశాలపై ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ స్పందించారు. అక్రమ వలసదారుల పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ పూర్వాంచల్ నుంచి వలస వచ్చిన ప్రజలను అవమానపరుస్తోంది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా గతంలో ఈ పూర్వాంచల్ ప్రజలను అన్యాయంగా రోహింగ్యా, బంగ్లాదేశీ చొరబాటుదారుల జాబితాలో చేర్చారు. తాజా ఉత్తర్వులతో బిహార్, యూపీ పేద వలసదారులను అగౌరవపరుస్తోంది. వారి నివాసాలను కూల్చడం, దుకాణాలను తొలగించడమే మోదీ సర్కార్ పని''అని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పు ఉత్తర ప్రదేశ్, బిహార్ నుంచి ఢిల్లీకి వలసవచ్చిన వారిని ఢిల్లీలో స్థానికంగా పూర్వాంచలీలుగా పరిగణిస్తుంటారు. ఈ ప్రాంత ఓటు బ్యాంక్‌లో దాదాపు 42 శాతం వారే ఉన్నట్లు వార్తలొచ్చాయి. బురారీ, లక్ష్మీ నగర్, ద్వారక వంటి కీలక ప్రాంతాలతో సహా ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాలపై వీరి ప్రభావం అధికంగా ఉంటుందని తెలుస్తోంది.

నిత్య జీవితంలో ధ్యానం ఒక భాగం కావాలి

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ: నిత్య జీవితంలో ధ్యానాన్ని ఒక భాగంగా మార్చుకోవాలని ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శాంతి, సామరస్యం పొందడానికి ధ్యానం ఒక చక్కటి మార్గమని పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆధునిక సాంకేతిక యుగంలో మనిషి జీవితం ఒత్తిళ్లమయంగా మారిందని, అందుకే ధ్యానాన్ని ఆశ్రయించడం శ్రేయస్కరమని సూచించారు. ధ్యానం ఎలా చేయాలి? ప్రయోజనాలు ఎలా పొందాలి? అనేది నేర్పించడానికి ఎన్నో యాప్‌లు, వీడియోలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాటిని ఉపయోగించుకోవాలని చెప్పారు. ధ్యానంతో జీవితంలో సానుకూల మార్పు వస్తుందని పేర్కొన్నారు. మన జీవితాలతోపాటు మన చుట్టూ ఉన్న సమాజం, ప్రపంచం, విశ్వంలో శాంతి, సామరస్యం నెలకొనడానికి మెడిటేషన్ తోడ్పడుతుందని, అదొక శక్తివంతమైన ఆయుధమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ధ్యానంపై, దాని ప్రయోజనాలపై ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ నిర్ణయం తీసుకుంది.

రణ్ ఉత్సవ్.. మర్చిపోలేని అద్భుతమైన అనుభూతి

గుజరాత్‌లోని కచ్ ప్రాంతాన్ని సందర్శించాలని, అక్కడ జరుగుతున్న రణ్ ఉత్సవాన్ని స్వయంగా తిలకించాలని ప్రధాని మోదీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఉత్సవం జీవితంలో మర్చిపోలేని అద్భుతమైన అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ''కచ్ మీ కోసం ఎదురు చూస్తోంది. అందమైన ఈ ప్రాంతాన్ని సందర్శించండి. కచ్ సంస్కృతిని వీక్షించండి. ఇక్కడి అతిథి సత్కారాలు పొందండి. ఇందుకు రణ్ ఉత్సవం చక్కటి వేదిక. ఈ వేడుకలో అందరూ పాలుపంచుకోండి''అని మోదీ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ ఉత్సవం వచ్చే ఏడాది మార్చి నెల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కచ్‌లో వెన్నెల్లో మెరిసిపోయే ఉప్పు ఎడారిని తిలకించడం జీవితంలో అత్యంత విలువైన అనుభవం అని వివరించారు.

సొరోస్‌తో భేటీకి థరూర్ ఆసక్తి

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ వెల్లడి

- రాజకీయ ఉద్దేశాలు లేవన్న కాంగ్రెస్ నేత
- దుమారం రేపుతున్న 2009 నాటి సమావేశం

న్యూఢిల్లీ: 2009లో కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా ఉన్న శశి థరూర్ అమెరికా వ్యాపారవేత్త జార్జి సొరోస్‌తో న్యూయార్క్‌లో జరిపిన సమావేశం తాజాగా వివాదం రేపుతోంది. ఈ భేటీ నిజమేనంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ తెలపడంపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పందించారు. థరూర్ అసలు విషయం దాటేశారంటూ అప్పట్లో భారత దౌత్యాధికారిగా, ఐరాసలో శాశ్వత రాయబారిగా పనిచేసిన మంత్రి హర్దీప్ సింగ్ శనివారం 'ఎక్స్'లో తెలిపారు. 'మంత్రి హోదాలో శశిథరూర్ ఇచ్చిన జాబితా ప్రకారమే దౌత్యాధికారులతోపాటు జార్జి సొరోస్‌ను నా నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు ఆహ్వానించాను. రాజీవ్ గాంధీ ఫౌండేషన్ నుంచి ప్రయోజనాలు అందుకుంటున్న వారిలో సొరోస్ ఒకరు. ఆయన్ను కలుసుకునేందుకు థరూర్ ఎంతో ఆసక్తి కనబర్చారు'అని పేర్కొన్నారు. వివాదం ఎక్కడ మొదలైందంటే.. కర్ణాటక బీజేపీ కార్యకర్తగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి ఈ నెల 15న 'ఎక్స్'లో 2009లో శశి థరూర్ చేసిన పాత పోస్టును ప్రస్తావించారు. 'పాత మిత్రుడు జార్జి సొరోస్‌తో సమావేశమయ్యాను. మన దేశం గురించి ఆయన సానుకూలంగా మాట్లాడారు. పొరుగు దేశంపై ఆసక్తి చూపారు. సొరోస్ పెట్టుబడిదారే కాదు.. అంతకుమించి. గుర్తుంచుకోదగ్గ ప్రపంచ పౌరుడు'అంటూ అందులో వ్యాఖ్యానించారు. దీనిపై థరూర్ తాజాగా 'ఎక్స్'లో స్పందిస్తూ.. అప్పటి దౌత్యాధికారి, ప్రస్తుతం కేంద్ర మంత్రి పూరీయే తన నివాసంలో విందు ఏర్పాటు చేసి పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. ఆ సందర్భంలో సొరోస్‌తో సమావేశమయ్యాను. ఆ తర్వాత సొరోస్‌ను కలుసుకోలేదు. మా మధ్య సంబంధంలో ఎటువంటి రాజకీయ కోణం లేదు. సొరోస్ నుంచి గానీ, ఆయన సంస్థల నుంచి గానీ నయా పైసా తీసుకోలేదు, మద్దతివ్వ లేదు'అని చెప్పుకొచ్చారు. ఈ పోస్ట్‌పైనే కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ తాజాగా స్పందించారు. 2009 మేలోనూ సొరోస్‌తో భేటీ అయిన థరూర్ ట్వీట్ కూడా చేశారని తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీ సెయింగ్ స్టీఫెన్స్ కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో శశి థరూర్ విద్యార్థిగా ఉన్నారని మంత్రి పూరీ గుర్తు చేశారు. కొన్నేళ్ల క్రితం భారత్‌పై వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన వివాదాస్పద వ్యక్తి జార్జి సొరోస్. విదేశాల్లోని వివిధ సంస్థలు, వ్యక్తుల సాయంతో దేశాన్ని అస్థిరతకు గురిచేసేందుకు కాంగ్రెస్ పార్టీ జార్జి సొరోస్‌తో చేతులు కలిపిందంటూ తరచూ బీజేపీ విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.

అమిత్ షా సారీ చెప్పకుంటే దేశవ్యాప్త ఆందోళన: మాయావతి

సాక్షి, న్యూఢిల్లీ: అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించబోమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి హెచ్చరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పకపోతే బీఎస్పీ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతుందని మాయావతి ప్రకటించారు. అంబేడ్కర్‌ను అవమానించిన అంశంపై బహుజన సమాజ్‌వాదీ పార్టీ డిసెంబర్ 24న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఆమె వెల్లడించారు. ఇంతకు ముందు యూపీలో మాత్రమే ఈ ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించినప్పటికీ, అమిత్ షా క్షమాపణలు చెప్పకపోవడంతో మాయావతి ఆందోళనల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆమె శనివారం 'ఎక్స్'లో హిందీలో పలు పోస్ట్‌లు పెట్టారు. ''అణగారిన వర్గాల అభ్యున్నత కోసం మానవీయకోణంలో రాజ్యాంగ రచన చేసిన అంబేడ్కర్‌ను బడుగు, బలహీన వర్గాల ప్రజలు దేవుడిలా కొలుస్తారు. అలాంటి మహానుబావుడు అంబేడ్కర్‌నుద్దేశిస్తూ సాక్షాత్తూ పార్లమెంట్ వేదికగా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై యావత్ భారతావని ఆగ్రహంతో రగిలిపోతోంది. వెంటనే అమిత్ తన మాటలను ఉపసంహరించుకోవాలి. లేదంటే దేశవ్యాప్త నిరసనలు చేపడతాం. డిసెంబర్ 24న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బీఎస్పీ కార్యకర్తల శాంతియుత నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు''అని మాయావతి చెప్పారు.

వ్యోమగాములకు శిక్షణ.. ఈఎస్‌ఏతో ఇస్రో ఒప్పందం

సాక్షి, బెంగళూరు: వ్యోమగాముల శిక్షణ, పరిశోధన, మానవ సహిత అంతరిక్ష పరిశోధనల్లో సహకారం నిమిత్తం యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)తో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శనివారం ఒప్పందం చేసుకుంది. ఒప్పంద పత్రాలపై ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్, ఈఎస్ఏ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోసెఫ్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం తొలి ప్రధాన ప్రాజెక్టు 'ఏక్సిమ్–4'మిషన్‌లో పరస్పరం సహకరించుకుంటారు. ఈ మిషన్ ద్వారా భారత గగన్‌యాత్రి వ్యోమగాములతో పాటు ఈఎస్ఏ వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లనున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చేపట్టే మానవ, బయో మెడికల్ ప్రయోగాల్లో ఈఎస్ఏ వనరులను ఇస్రో శాస్త్రవేత్తలు వినియోగించుకుంటారు. ఈ నెల 5న పీఎస్ఎల్‌వీ సీ59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా–3 ఉపగ్రహాన్ని ప్రయోగించడం తెలిసిందే.ఈ ప్రయోగమే రెండు సంస్థల మధ్య మైత్రికి బాటలు వేయడం విశేషం.

హుండీలో ఐఫోన్

పొరపాటున పడినా సరే తిరిగి ఇవ్వబోమన్న ఆలయ అధికారులు

కంగుతున్న ఐఫోన్ యజమాని • తమిళనాడులో ఘటన



చెన్నై: పుస్తకం హస్తభూషణం అంటారు. నేటి యుగంలో స్మార్ట్‌ఫోన్ చేతికి హస్తభూషణంగా కాకుండా ఆరో వేలిగా అతుక్కుపోయింది. అందులోనూ అత్యంత ఖరీదైన యాపిల్ ఐఫోన్ అయితే జనం చాలా జాగ్రత్తగా చూసుకుంటారు. అలాంటి ఐఫోన్‌ను దినేశ్ అనే ఒక వ్యక్తి పొరపాటున ఆలయ హుండీలో పడేసుకున్నాడు. గుడి అధికారులను అడిగితే తిరిగి ఇచ్చేస్తారులే అనుకున్నాడు. ఇక్కడే పెద్దతిరకాసు వచ్చిపడింది. డేటా ఇస్తాంగానీ ఫోన్ మాత్రం తిరిగి ఇచ్చేదిలేదని తెగేసి చెప్పడంతో కంగుతినడం ఫోన్ యజమాని వంతయింది. తమిళనాడులోని తిరుపోరూర్‌లోని శ్రీ కందస్వామి ఆలయంలో ఈ ఘటన జరిగింది. ఇటీవల దినేశ్ కందస్వామి ఆలయంలో మొక్కు తీర్చుకుంటూ ఆలయ పెద్ద హుండీకి అత్యంత సమీపంగా వెళ్లారు. ఆ సమయంలో ఐఫోన్ అనూహ్యంగా హుండీలో పడిపోయింది. వెంటనే అక్కడి అధికారులకు విషయం చెప్పినా వాళ్లు హుండీ తెరచినప్పుడు ఆ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పి ఆయనను పంపించేశారు. శుక్రవారం రోజు హుండీ తెరచి కానుకల లెక్కింపు చేపట్టారు. కరెన్సీ నోట్ల మధ్య కనిపించిన ఐఫోన్‌ను అధికారులు తీసుకుని దినేశ్‌కు సమాచారం అందించారు. ఫోన్ తిరిగిస్తారన్న ఆనందంలో ఆలయానికి వచ్చిన దినేశ్‌కు అధికారులు అనూహ్య సమాధానమిచ్చారు. కావాలంటే ఐఫోన్‌లోని డేటాను బ్యాకప్ తీసుకోండిగానీ ఫోన్‌ను మాత్రం ఇవ్వబోమని తెగేసి చెప్పారు. హుండీ ఏర్పాటు, పరిరక్షణ, నిర్వహణ నిబంధనావళి–1975 ప్రకారం హుండాలో ఉండే ఎలాంటి వస్తువైనా సరే అది పూర్తిగా ఆలయానికే చెందుతుందని అధికారులు స్పష్టంచేశారు.

పరిహారం ఆలోచిస్తాం: మంత్రి

విషయం చివరకు తమిళనాడు హిందూ మత, దాతృత్వ దేవాదాయ ధర్మాదాయ మంత్రిత్వ శాఖకు చేరింది. రూ.2.5 కోట్లవ్యయంతో వేణుగోపాల్‌నగర్‌లో సుందరీకరిస్తున్న కైలాసనాథ ఆలయ పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన దేవాదాయ మంత్రి కే శేఖర్‌బాబును శనివారం మీడియా ఈ అంశంపై ప్రశ్నించింది. ''తెలిసి వేసినా, తెలియక పడినా హుండీలో ఉన్నదంతా దేవుడికే చెందుతుంది. ఐఫోన్‌ను మాత్రం తిరిగిచ్చేది లేదు. మానవీయ కోణంలో అతనికి ఏదైనా పరిహారం ఇవ్వొచ్చోలేదో అధికారులను కనుక్కొని చెబుతా''అని మంత్రి తాపీగా సమాధానం ఇచ్చారు.

గతంలో జరిగాయా ?

తమిళనాడులో కాకపోయినా కేరళలో దాదాపు ఇలాంటి ఘటనే ఒకటి గత ఏడాది మేనెలలో పళనిలోని శ్రీ ధండయుత్తపాణి స్వామి ఆలయంలో ఈ ఘటన జరిగింది. అళపుజ్జకు చెందిన ఎస్. సంగీత అనే ఒకావిడ తన మెడలోని తులసీమాలను స్వామివారికి సమర్పిద్దామని హుండాలో వేయబోతూ మెడలోంచి మాలను తీసింది. తులసీమాలతోపాటు మెడలోని 1.75 సవర్ల బరువైన బంగారుగొలుసు సైతం హుండీలో పడింది. వెంటనే గమనించిన ఆమె విషయం అధికారులకు చెప్పగా వాళ్లు కూడా ''హుండీలో ఉన్నదంతా స్వామివారికే చెందుతుంది''అని చెప్పి ఆమెను షాక్‌కొట్టే సమాధానమిచ్చారు. తనకున్న ఏకైక గొలుసు అదొక్కటేనని, పొరపాటున పడిందని వేడుకోవడంతో సీసీటీవీ ఫుటేజీని సరిచూసి, హుండీ ఘటనలో ఆమె నిర్లక్ష్యం ఏమీ లేదని తేల్చారు. అయినాసరే అదే బంగారు గొలుసును తిరిగి ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవుగనక మరో ఉపాయం ఆలోచించారు. అంతే బరువైన మరో బంగారు గొలుసును కొత్తగా చేయించిమరీ ఆమెకు ఆలయ బోర్డ్ చైర్మన్ అప్పజెప్పారు.

సాక్షి ప్లస్
ఆదివారం। 22-12-2024

బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఆర్టికల్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా,నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం,అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ,ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌కు జిల్లా పరిషత్ లేదు.

జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

ఆర్థిక వనరులు

1. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం.
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ.


మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
ఎ) ప్రజలు స్వార్థపరులు
బి) ప్రజలే సార్వభౌములు
సి) ప్రజలు చేతకాని వారు
డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
ఎ) గోలక్‌నాథ్ కేసు
బి) మినర్వా మిల్స్ కేసు
సి) ఇందిరా సహానీ కేసు
డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంభించింది?
ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
ఎ) 14 బి) 15
సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
ఎ) 17 బి) 16 (4)
సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
ఎ) అయిదు బి) ఏడు
సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300-ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
ఎ) రాజకీయ హక్కు బి) ఆర్థిక హక్కు
సి) పౌర హక్కు డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
ఎ) 80 బి) 81
సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
ఎ) 20 బి) 21
సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
బి) సైమన్ కమిటీ
సి) సర్కారియా కమిటీ
డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?
ఎ) సిక్కిం బి) తమిళనాడు
సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
ఎ) 49 బి) 50
సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
ఎ) ఎం.ఎన్.రాయ్
బి) రాజేంద్రప్రసాద్
సి) బి.ఆర్.అంబేద్కర్
డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
ఎ) 4 బి) 5
సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
సి) అమెరికా డి) చైనా

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

మానవుడు ఉపయోగించిన మొదటి లోహం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
రసాయన శాస్త్రం

లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరొటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధిలోకి వస్తాయి.

ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్ లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.

ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్‌ల రూపాల్లో లభిస్తాయి.

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హైమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.

ఖనిజ రూపం	ఖనిజాలు
ఆక్సైడ్	బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్).
కార్బొనేట్	సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్
సల్ఫేట్	బెరైటీస్, జిప్సం.
సల్ఫైడ్	పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్.
క్లోరైడ్	కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్).

సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.

సాంద్రీకరణ పద్ధతులు

లెవిగేషన్: గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధి ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

ప్లవన క్రియ: సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

లీచింగ్ (నిక్షాళనం): ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

అయస్కాంత వేర్పాటు పద్ధతి: ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోల్లర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు	
లోహం	ముఖ్య ఖనిజాలు
అల్యూమినియం	బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్
బేరియం	బెరైటీస్
కాపర్	కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్.
ఐరన్	ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లియెనైట్, సిడరైట్.
కాల్షియం	సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం.
మెగ్నీషియం	కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం.
థోరియం	మోనోజైట్
మెర్క్యూరీ	సిన్నబార్
జింక్	కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్.
మాంగనీస్	పైరోలుసైట్
సిల్వర్	అర్జెంటైట్, హార్న్ సిల్వర్
లెడ్ (సీసం)	గెలీనా
సోడియం	రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్.

ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

భస్మీకరణం(కాల్సినేషన్): ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరు పడుతుంది.

భర్జనం(రోస్టింగ్): గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్‌లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

ప్రగలనం: ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

క్షయకరణం: లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్ (CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట్ కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట్ ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్లబారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 - 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1-1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెలుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
1) బంగారం 2) యురేనియం
3) సీసం 4) మెర్క్యూరీ
2. చార్జ్ అంటే ఏమిటి?
1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
1) 2 శాతం 2) 0.1 శాతం
3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
1) భస్మీకరణం 2) భర్జనం
3) నిక్షాళనం 4) పోలింగ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
1) అల్యూమినియం 2) ఇనుము
3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
1) బాక్సైట్ 2) బెరైటీస్
3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
1) ఇనుము 2) బంగారం
3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
1) జింక్ బ్రోమైడ్ 2) జింక్ నైట్రేట్
3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

వీరోచితంగా పోరాడిన సమ్మక్క

ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనే వారు. వీరు నిర్ణీత మొత్తంలో సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయుల సామంతులు

నతవాడి వంశం

నందిగామ, మధిర తాలూకాలు, మహబూబాబాద్, జనగామ తాలూకాలు నతవాడి రాజ్యపరిధిలో ఉండేవి. ఈ రాజ్యాన్ని నతవాడి వంశం పాలించింది. ఈ వంశీయులు మొదట కల్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉండి తర్వాత కాకతీయుల సామంతులయ్యారు.

ఈ వంశానికి ఆద్యుడు బేతరాజు. ఇతడు కాకతీయ రెండో ప్రోలరాజుకు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఇతడి కుమారుడైన దుర్గరాజు(1104-1157) కల్యాణీ చాళుక్య ఆరో విక్రమాదిత్యుడికి, మూడో సోమేశ్వరుడికి సామంతుడిగా పనిచేశాడు. దుర్గరాజు కుమారుడైన బుద్ధరాజును కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు నతవాడి పాలకుడిగా నియమించారు. ఇతడి పెద్ద కుమారుడు రుద్రుడు. కాకతి మహాదేవుడు ఇతడికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. బుద్ధరాజు రెండో కుమారుడు వక్కడి మల్లరుద్రుడు. ఇతడు గణపతిదేవుడి సోదరి అయిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. రుద్రమదేవి కాలం వరకు నతవాడి రాజులు కాకతీయ సామంతులుగా పనిచేశారు.

గోనవంశం

రుద్రదేవుడు కందూరి చోడులను పానుగల్లు, దేవరకొండ ప్రాంతాలకు పరిమితం చేసినందువల్ల వారు వర్ధమానపురాన్ని విడిచి వెళ్లారు. మళ్లీ రుద్రదేవుడే వర్ధమానపురం (కందూరినాటి) పాలకుడిగా గోన బుద్ధరాజు(రంగనాథ రామాయణ కర్త)ను నియమించి ఉంటాడని భావిస్తున్నారు. అతడి కుమారుడైన గోన గన్నారెడ్డి గణపతిదేవుడి వల్ల వర్ధమానపుర రాజ్యాన్ని తిరిగి పొందాడు. ఇతడి తమ్ముడు విఠల నరేంద్రుడు. వీరిద్దరూ యాదవ రాజులు ఆక్రమించిన ఆదవాని, తుంబుళాలను జయించి రాయచూరు దుర్గాన్ని ఆక్రమించారు. విఠలుడు హోళువ, మాణువ రాజ్యాలను జయించాడు. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించి దక్షిణాంధ్ర భూభాగాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపాడు. గోన గన్నారెడ్డి సోదరి కుప్పాంబిక. ఆమె భర్త మల్యాల గుండ దండాధీశుడు. గోన గన్నారెడ్డి తర్వాత ఇతడు వర్ధమానపుర పాలకుడయ్యాడు. ఇతడు 1245-46లో వర్ధమానపుర శాసనం వేయించాడు. 1259లో బూదపూర శాసనం, 1272లో మరో శాసనం వేయించాడు. ఇతడి మరణానంతరం భార్య కుప్పాంబిక తన భర్త పేరు మీద 1276లో గుండేశ్వరాలయం నిర్మించి శాసనం వేయించింది. ఇందులో ఆమె చిన్న తమ్ముడు గోనబుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయ గురించి పేర్కొన్నారు.

వావిలాల వంశం

వీరు రెడ్డి వంశస్థులు. రుద్రమదేవి కాలంలో ఆమనగల్లు, వంగూరు విషయాల (సీమ) పాలకులుగా ఉన్నారు. చెరకు రెడ్లతో వీరికి వివాహ సంబంధాలు ఉన్నాయి.

కాయస్థ వంశం (1239-1304)

మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన కాయస్థ వంశస్థుల్లో ఆద్యుడు గంగయ సాహిణి(1239-1257). ఇతడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుడు, ఆప్తుడు, అశ్వసైన్యాధిపతి. ఇతడి సువిశాల రాజ్యంలో మార్జవాడి, పలనాడు, కడప మొదలైన ప్రాంతాలతో పాటు, నల్లగొండ జిల్లాలోని పానగల్లు కూడా ఉండేవి. ఇతడి రాజధాని కడప జిల్లా వల్లూరు. దేవగిరి యాదవ రాజు ఆజ్ఞ మేరకు అతడి సామంతుడైన దామోదరుడు కాకతీయ భూభాగాలను ఆక్రమించాడు. గణపతిదేవుడి ఆజ్ఞతో గంగయ సాహిణి దామోదరుణ్ని ఓడించాడు. దీంతో గణపతిదేవుడు అతడికి మహామండలేశ్వర పదవిని ఇచ్చాడు.

గంగయ సాహిణి తర్వాత అతడి మేనల్లుడైన జన్నిగదేవుడు గణపతిదేవుడు, రుద్రమదేవి వద్ద సామంతుడిగా పనిచేశాడు. ఇతడి రాజ్యంలో నల్లగొండ మండలం అంతర్భాగంగా ఉండేది. ఇతడి



సోదరుడు త్రిపురాంతకుడుకూడా సామంతుడే. తర్వాత ఇతడి సోదరుడు అంబదేవుడు (1275 - 1302) స్వతంత్రించి కాకతీయులకు శత్రువయ్యాడు. అంబదేవుడి రాజ్యంలో నల్లగొండ జిల్లాలోని కృష్ణానది ఉత్తర ప్రాంతాలు, దోర్నాల ఉండేవి. ఇతడి కుమారుడైన రెండో త్రిపురాంతకుడి కాలంలో ఈ రాజ్యం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది.

సమ్మక్క సారక్క

పగిడిద్దరాజు, సమ్మక్క-సారక్కల తిరుగుబాటు వృత్తాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. కానీ శతాబ్దాల నుంచి వీరి గాథలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం.. గోదావరి తీర ప్రాంతమైన మేడారం పరగణాను కోయ తెగకు చెందిన పగిడిద్దరాజు పాలించేవాడు. ఇతడు ప్రతాపరుద్రుడి సామంతుడు. కరీంనగర్ రాజధానిగా పాలించే మరో కోయ రాజైన మేడరాజు తన కుమార్తె సమ్మక్కను పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశాడు. సారలమ్మ, నాగులమ్మ,జంపన్నలు వారి సంతానం . కొన్నాళ్లకు మేడారం పరగణాలో నాలుగేళ్లపాటు తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు పన్నులు కట్టలేని దుస్థితి తలెత్తింది. దీంతో పగిడిద్దరాజు కూడా ప్రతాపరుద్రుడికి పన్నులు కట్టలేదు. దీన్ని ధిక్కారంగా భావించిన ప్రతాపరుద్రుడు మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో అతడిపైకి పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపాడు. మేడారం సమీపంలోని సంపెంగ వాగు వద్ద పగిడిద్దరాజు సైనికులు కాకతీయ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయుధ బలం, సంఖ్యాబలం ఉన్న కాకతీయ సైన్యాన్ని నిలువరించలేక పగిడిద్దరాజుతో సహా ఆయన బిడ్డలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు వీరమరణం పొందారు. ఈ పరాజయాన్ని భరించలేక పగిడిద్దరాజు కుమారుడైన జంపన్న వాగులోకి దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగుకు జంపన్న వాగు అని పేరొచ్చింది. పగిడిద్దరాజు భార్య సమ్మక్క కాకతీయ సేనతో పోరాడుతుండగా, ఒక సైనికుడు దొంగచాటుగా వచ్చి బల్లెంతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క ప్రస్తుతం జాతర జరుగుతున్న స్థలంలో నేలకొరిగింది.

లక్షలాది మంది పూజలందుకుంటున్న ఈ వీరుల గాథలు, కథనాల్లో చిన్న చిన్న తేడాలున్నాయి. కాకతీయులకు, ఆదివాసీలకు యుద్ధం జరగడానికి సహజవనరుల పంపకాల వివాదం కారణమని కొన్ని కథనాలు, కప్పం చెల్లించకపోవడం కారణమని ఇంకొన్ని కథనాలు చెబుతున్నాయి. వీరి నుంచి కాకతీయులు కప్పం వసూలు చేశారనడానికి ఆధారాల్లేవని చరిత్రకారులు తెలిపారు. కానీ ఎక్కువ కథలు అదే కారణమని చెబుతున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశం వారు కాదని పులింద జాతికి చెందిన వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ యుద్ధానికి పులింద, కోయజాతి వైరం కారణమా? కప్పమే కారణమా? అన్నది పరిశోధించి తేల్చాల్సి ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. రెండో బేతరాజు ఎవరి ద్వారా శైవమతాన్ని అవలంభించాడు?
   1) రామేశ్వర పండితుడు
   2) అప్పయాచార్యులు
   3) పాల్కురికి సోమన 4) బసవేశ్వరుడు
2. కాకతీయుల కాలంలో గ్రామరక్షణ బాధ్యత ఎవరిది?
   1) కరణం 2) పురోహితుడు
   3) రెడ్డి 4) తలారి
3. కాకతీయుల కాలంలో స్థూలంగా ఉన్న పన్నుల సంఖ్య?
   1) 5 2) 7 3) 6 4) 4
4. సెట్టి, కేసరి సముద్రాలను తవ్వించిన కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
5. పాకాల చెరువును తవ్వించింది?
   1) రుద్రదేవుడు 2) జాయపసేనాని
   3) రేచర్ల రుద్రుడు 4) ప్రతాపరుద్రుడు
6. 'రామప్పచెరువు'ను తవ్వించింది?
   1) రేచర్ల రుద్రుడు 2) రుద్రదేవుడు
   3) జాయపసేనాని 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు: 1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1.

కాకతీయ యుగ విశేషాలు

పాలనా విధానం: కాకతీయుల ప్రభుత్వం సంప్రదాయ రాచరికం. సాధారణంగా రాజ్యం తండ్రి నుంచి కుమారుడికి వారసత్వంగా సంక్రమిస్తుంది. కుమార్తెకు కూడా ఆ హక్కు కల్పించడం కాకతీయ వంశంలోనే జరిగింది. సిద్ధాంత రీత్యా అధికారం అంతా రాజుదే. కానీ ఆచరణలో రాజ్యాధికారానికి కొన్ని పరిమితులు ఉండేవి. పాలనలో రాజుకు సహకరించేందుకు మంత్రి పరిషత్తు ఉండేది. వర్ణధర్మం, కులధర్మం, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు రాజుకైనా అనుల్లంఘనీయాలు. నాటి శాసనాల్లో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనిపిస్తుంది. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వాలని రుద్రదేవుడి నీతిసారం తెలుపుతోంది. కాకతీయులు ఆరోగ్యశాలలు, ప్రసూతి ఆసుపత్రులు, కళాశాలలు, మఠాలు, సత్రాలు, చలివేంద్రాలను నెలకొల్పారు.

కాకతీయుల మంత్రులలో అన్ని కులాలవారు ఉండేవారు. కాకతీయులు కులాన్ని బట్టికాక వ్యక్తుల అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇచ్చారు. గణపతిదేవ చక్రవర్తికి రేచర్ల రుద్రారెడ్డి, మల్యాల హేమాద్రిరెడ్డి ప్రధానులు. ప్రతాపరుద్రుడికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. నాయంకరులు దుర్గాధ్యక్షులు. వారి మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీత సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు. ప్రతాపరుద్రుడు తన రాజ్యంలో నాలుగో వంతు భూమిని నాయంకరుల ఆధీనంలో ఉంచాడు. ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకరులున్నారు. కాకతీయరాజ్య పతనం తర్వాత విజయనగర రాజులు నాయంకర విధానాన్ని అనుసరించారు. ఆంగ్లేయులు పాలన చేపట్టే వరకూ ఈ విధానం కొనసాగింది. కాకతీయులకు పూర్వీకులైన చోళులు, చాళుక్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని అనుసరించారు. అందుకు భిన్నంగా కాకతీయులు వికేంద్రీకృత పాలనా వ్యవస్థను అమలు పరిచారు. అందుకే మాండలికులు, నాయంకరులకు సైనిక విషయాలు మినహా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. వారిపై అధికారాన్ని రుద్దలేదు. అణచి ఉంచే పద్ధతిని విడిచిపెట్టారు. వీరు తమను మహామండలేశ్వరులుగానే భావించారు తప్ప, రాజాధిరాజుగా, చక్రవర్తిగా భావించలేదు. ఒక రకంగా ఇది ప్రజాస్వామిక భావన.

నాయంకరుల్లో తెలంగాణకు సంబంధించిన కొందరి వివరాలు: యాదవ విశ్వనాథుడు గణపతిదేవుడి కాలంలో యుద్ధాల్లో పాల్గొన్నాడు. నల్లగొండ జిల్లాలో ఒక ప్రాంతాన్ని పరిపాలించాడు. అక్షయ చంద్రదేవుడు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించాడు. సారంగ పాణి దేవుడనే యాదవరాజు పానగల్లును పాలించాడు. సింద కుటుంబానికి చెందిన భైరవుడు రుద్రమ కాలంలో బీదర్ ప్రాంతాన్ని పాలించాడు.

పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని స్థలం, సీమ, వాడి, నాడు, పాడి, భూమి అనే ప్రాంతీయ విభాగాలుగా విభజించారు. 10 నుంచి 60 గ్రామాల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. కొన్ని స్థలాల సముదాయమే నాడు. ఉదాహరణ: అనుమకొండనాడు, కందూరు నాడు, సబ్బినాడు, అయిజనాడు.

ఆయగార్లు

గ్రామపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. గ్రామసేవ, రాజ్యసేవ చేసినందుకు పన్ను లేకుండా వీరు భూమిని పొందేవారు. ఆయం అంటే పొలం వైశాల్యం. సాధారణంగా ఆయగార్ల సంఖ్య పన్నెండు. వారు 1. కరణం, 2. రెడ్డి, 3. తలారి 4. పురోహితుడు, 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు. వీరిలో మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. మిగతా వారు గ్రామ సేవకులు. గ్రామ విస్తీర్ణం, అయకట్టు, పోరంబోకు భూమి, తోట భూమి, గడ్డిభూముల విస్తీర్ణం, వ్యక్తుల ఆస్తుల లెక్కలు, దేవాలయ ఆస్తుల లెక్కలు మొదలైన దస్తరం నిర్వహణ కరణం బాధ్యత. కరణం ఇచ్చే లెక్కల ఆధారంగా రాజ్యభాగం(పన్ను)ను వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యత రెడ్డి లేదా పెద కాపుది. గ్రామ రక్షణ బాధ్యత తలారిది. దొంగతనాలు జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడం, అపహరించిన సొత్తుని తెచ్చి ఇవ్వడం అతడి విధి. అష్టాదశవర్ణాల వారికి సంఘాలుండేవి. వీటిని సమయాలనేవారు.

Elections are essential for the..



BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Special programs of study (1)/ are tailored (2)/ to the needed (3)/ of specific groups. (4) No error (5)
2. Most travel agents (1)/ are prepared to (2)/ customize travel arrangements (3)/ to meet individual requirement. (4) No error (5)
3. The rise in inflation (1)/ was just one symptoms (2)/ of the poor state (3)/ of the economy. (4) No error (5)
4. Her arm was beginning (1)/ to swell up (2)/ where the bee (3)/ has stung her. (4) No error (5)
5. The next morning (1)/ the team surveyed (2)/ the damage (3)/ caused in the fire. (4) No error (5)

Directions (Q. 06-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Elections are essential for the ____ of parliamentary decisions.
   1) Continuous 2) monitoring
   3) vital 4) approval
   5) surveillance
7. Barons had to swear an oath of ____ to the king.
   1) Allegiance 2) administration
   3) silence 4) request
   5) promiscuous
8. Always chew food well before ____ it.
   1) Thrusting 2) putting
   3) eating 4) swallowing
   5) digesting
9. The ____ was released to await trial but had to ______ her passport.
   1) Defendant, surrender
   2) plaintiff, give in
   3) dependant, submit
   4) accused, give of
   5) convict, abide
10. When you first meet her, she gives a ______ impression of warmth and friendship.
    1) Supper 2) superfluous
    3) superficial 4) superlative
    5) superiority
11. His career was cut short when he ______ to cancer.
    1) Affect 2) effect
    3) diagnosed 4) succumbed
    5) suffered
12. The party suffered a ______ defeat in the general election.
    1) Vast 2) majority
    3) devastate 4) possible
    5) humiliating
13. Keep your answers as ______ as possible.
    1) Success 2) verbatim
    3) succinct 4) modulate
    5) length
14. I agreed ______ what she said in substance, though not ____ every detail.
    1) In, with 2) to, in
    3) with, with 4) for, at
    5) from, for
15. Climate change is still ____ much a subject ____ debate.
    1) Mostly, to 2) many, from
    3) much, form 4) very, for
    5) pretty, from

Directions: (Q. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. Millions faces starvation next year as a result of the drought.
    1) Are facing 2) had faced
    3) will face 4) will have faced
    5) No correction required
17. Leaving him out of the team may sound the alarm for our chances.
    1) Winning 2) ringing bell
    3) death knell 4) blowing off
    5) No correction required
18. The meeting ended on a turn around with several people walking out.
    1) Happy mood
    2) mixed reaction
    3) sordid 4) sour note
    5) No correction required
19. If you say you're sorry we would forgive you.
    1) We might 2) we will 3) we had
    4) we have 5) No correction required
20. They carry up research into the roles of men and women in today's society.
    1) Carried away 2) carried out
    3) carry forward 4) carry upon
    5) No correction required

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Finance minister Arun Jaitley on Saturday ______ (21) a Budget that put boosting growth before painful reforms, slowing the pace of fiscal deficit cuts and seeking to put ______ (22) and foreign capital to work. In his first full-year Budget since Prime Minister Narendra Modi's landslide election victory ______ (23) May, Jaitley said India's economy was about to take off. Modi tweeted that the Budget would "further reignite our growth engine".Billed as a test of the nationalist premier's willingness to ____ (24) a $2 trillion economy with a bloated public sector and weak private investment, the Budget was short on structural reforms and contained revenue targets some called unrealistic. It drew a__ (25) reception from economists, with some calling it a path to an investor-friendly India, but ______ (26) seeing a missed opportunity to tackle deep-seated structural problems. Jaitley promised higher investment in India's decrepit roads and railways, offered the ______ (27) of tax cuts to global companies and the stick of tighter-______(28) to get Indian tycoons to invest at home rather than stash wealth abroad. Tax evaders face ______ (29) sentences of up to 10 years, he warned.The tax changes and tougher enforcement would raise $2.5 billion next year, he said. Tax receipts overall would rise 15 percent and government asset sales would raise $11 billion - goals that past experience ______ (30) may be hard to meet.

21. 1) announced 2) proclaimed
    3) decree 4) stated
    5) publicize
22. 1) family 2) domestic
    3) familial 4) household
    5) domicile
23. 1) most recent 2) very last
    3) last 4) end 5) final
24. 1) improvement
    2) restructuring 3) reorganization
    4) reform 5) development
25. 1) uniform 2) assertive
    3) minor 4) magical
    5) mixed
26. 1) others 2) extra 3) further
    4) supplementary 5) spare
27. 1) bribe 2) carrot 3) lure
    4) candy 5) bite
28. 1) system 2) convention
    3) rules 4) laws
    5) policy
29. 1) penitent 2) dungeon
    3) confined 4) jail
    5) detaining
30. 1) showing 2) showed
    3) shown 4) show 5) shows

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) We only remember learning history on war, not of other types of historical subjects.
B) History, to some degree is important, but it is typically taught in a memorization manner.
C) But the reality is that history is so universal because nearly every country is interconnected whether it is through economics, culture, business, finances, goods and services, and ecological perspectives.
D) This is where we go wrong with learning history. There is no process of looking at it from a productive perspective.
E) Furthermore, we typically only learn history of our own country.
F) Never in any educational background was a student challenged to reflect or re-evaluate how history works, but rather how much one could retain.

31. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
34. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) E 5) F
35. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 36-38): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) garbage 2) delegeta 3) monitor
    4) commission 5) ensconce
37. 1) courageous 2) contagios
    3) commandeer 4) convulsion
    5) complement
38. 1) referre 2) explicit 3) sabotage 4) supplement
    5) surreptitious

Directions (Q. 39-40): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

39. **Apollo 11 is** (1) the first **manned** (2) mission **to land** (3) on **the moon.** (4)
40. The **cashere** (1) **gave** (2) me **two hundred** (3) and twenty **rupees.** (4)

Key

1) 3	2) 4	3) 2	4) 4	5) 2
6) 5	7) 1	8) 4	9) 1	10) 2
11) 4	12) 5	13) 3	14) 3	15) 4
16) 3	17) 3	18) 4	19) 2	20) 2
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 3	32) 1	33) 4	34) 1	35) 5
36) 2	37) 2	38) 1	39) 1	40) 1